ఆర్షవిద్యాతరంగిణి

Inspired by the teachings of

**SWAMI PARAMARTHANANDAJI**

# SRIMADBHAGAVADGITA - THIRD SHATKAM

# శ్రీమద్భగవద్గీత – మూడవ షట్కము

## స్వామి పరమార్థానంద



సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ ।
అహం త్వా సర్వపాపేభ్యో మోక్షయిష్యామి మా శుచః॥

## స్వామి పరమార్థానంద బోధనల స్ఫూర్తితో

## వారి ఆశీస్సులతో

## తెలుగు సేత – మద్దూరి / కస్తూరి రాజ్యశ్రీ

Second edition – Year 2025 1000 copies
Gita Jayanthi 2025

For Copies
Arsha Vidya Tarangini Trust
K V Raghava Rao
C - 804 Aparna Cyberzon
Nallagandla, Hyderabad 500019
Mobile: 98490 92368
Email: raghavkasturi@gmail.com
for softcopy: www.telugubhakti.com

Title – SRIMADBHAGAVADGITA – THIRD SHATKAM

Sanskrit Support – Sri Desu Chaitanya Krishna

DTP – Sri S Rajendra Kumar 98661 15622

Printed at
Sai Sri Printers
8-3-945, # 21 Pancom Business Centre
Ameerpet, Hyderabad - 500073
e-mail: saisriprinters@yahoo.com
Ph.No.040-23730222, Cell:9985530222

Price Rs. 900

# బ్రహ్మయజ్ఞం

**యది అపి అస్మై ఇమామ్ అద్భిః పరిగృహీతాం। ధనస్య పూర్ణాం దద్యాత్।**
**ఏతత్ ఏవ తతో భూయ ఇతి। ఏతత్ ఏవ తతో భూయ ఇతి॥** – ఛాందోగ్యమ్

శ్రద్ధలేని వ్యక్తి, ఒకవేళ చుట్టూ సముద్రం ఉండి, ధనంతో నిండి ఉన్న ఈ భూమండలాన్ని గురువుకు ఇచ్చినా, అతనికి బ్రహ్మవిద్యను బోధించకూడదు. ఎందుకంటే ఈ విద్యే దానికంటే గొప్పది.

ఇది శ్రద్ధలేని వ్యక్తి గురించి! కాని మా అదృష్టం ఏమిటో గాని అత్యంత శ్రద్ధాభక్తులు ఉన్న మూడు సత్సంగాలు లభించాయి. అవి దయాసత్సంగ్, ఆర్ష ఆనందకుటీర్, వేదాంత సీనియర్ సిటిజన్. గురుకృపవల్ల, దైవకృపవల్ల, శాస్త్రకృపవల్ల మొత్తం ప్రస్థానత్రయాన్ని నిర్విఘ్నంగా రెండు చోట్ల బోధించగలిగాము. బోధించగలగటమే ఒక అద్భుతం అనుకుంటే, ఆ ప్రస్థానత్రయ గ్రంథాలనే కాదు, మరికొన్ని అద్వైత వేదాంత గ్రంథాలను కూడ వారు చేస్తున్న బ్రహ్మయజ్ఞంవల్ల ప్రచురించగలగటం మరొక ఆసాధ్యాన్ని సుసాధ్యం చేసింది.

**ఆర్షవిద్యా తరంగిణి** పేరుకు తగ్గట్టుగానే తన నిరంతర ప్రవాహంలో కొత్త సభ్యులను, **ఆర్షవిద్యా తరంగిణి కుటుంబ సభ్యులుగా** కలుపుకుంటూ, మళ్ళీ మళ్ళీ ఉపనిషత్తులను బోధించే స్ఫూర్తినిస్తున్నది. అంతేకాదు, **ఆర్షవిద్యా తరంగిణిలో ప్రతి ఒక్క సత్సంగ్ సభ్యుడు/సభ్యురాలు కూడా మనసారా మాకు ఇచ్చిన గురుదక్షిణ శ్రీ మద్భగవద్గీత – మూడవ షట్కము పునర్ముద్రణకు బ్రహ్మయజ్ఞంగా రూపుదిద్దుకుంది.** ఈ సంస్థలో చేరినవారే కాక, ఇతోధికంగా గురుదక్షిణ ఇచ్చిన ప్రతి సాధకుని చేయి కూడా ఇందులో ఉంది.

దయాసత్సంగ్ సభ్యులు, ఆర్ష ఆనందకుటీర్ సభ్యులు, వేదాంత సీనియర్ సిటిజన్ సభ్యులు, అపర్ణా సెరీన్ పార్క్ అధ్యయన సరస్వతి సభ్యులు, ఆర్షవిద్యా తరంగిణి ట్రస్ట్ సభ్యులు ఇంకా మమ్మల్ని కలిసి గురుదక్షిణ ఇచ్చిన కొత్తవారికి – అందరికీ పేరుపేరునా మా శతకోటి వందనాలు. వారందరూ సదా బ్రహ్మనిష్ఠలో నిలవాలని ఆశిస్తున్నాము.

**ఆర్షవిద్యా తరంగిణి ట్రస్ట్ ద్వారా** విరాళాలు అందచేస్తున్న దాతలందరకూ, వారి పిల్లలకూ, మనవళ్ళకూ, మనవరాళ్ళకూ ఆయురారోగ్య ఐశ్వర్యాలను, ఆధ్యాత్మిక చింతనను వైదికజీవనాన్ని మరింత సమృద్ధిగా ఇవ్వమని భగవంతుణ్ణి మరీ మరీ వేడుకుంటున్నాము.

**– రాఘవ రావు, రాజ్యశ్రీ**



ఆర్ష సంస్కృతి - సంప్రదాయ - వేదాంత తత్త్వ
త్రివేణీ సంగమ సదృశులు

**శ్రీమతి మద్దూరి రాజ్యశ్రీ - శ్రీ కస్తూరి వీరరాఘవరావు**

పుణ్యదంపతులకు

## ప్రశంసన మాలిక

ఆర్ష విద్యా తరంగిణి సంస్థకు మూలభూతులై, దివ్యతత్త్వప్రతిపాదకమైన "ప్రస్థానత్రయము"లను శ్రీశ్రీశ్రీ పరమార్థానందస్వామి వారి బోధనలతో సమన్వయించి, స్వీయవాదమున తేట తెలుగులో ప్రకటిస్తూ ఆత్మ సంస్కారంతో జీవన పరమార్థాన్ని ఆకళింపు చేసుకొని నిరంతరం ఆధ్యాత్మిక చింతనలో పునీత చేతనులైన పుణ్యదంపతులు మీరు.

గురుకృపా కటాక్షంతో భగవద్గీత, దశోపనిషత్తులు, బ్రహ్మసూత్రాలు 8 సంవత్సరాల కాలంలో మీరు మీ సత్సంగ సభ్యులకు బోధించడము, పుస్తక రూపంలో వెలువరించడము అనితర సాధ్యము. శ్రుతి, స్మృతి విషయక ఆంధ్ర అనువాదములే గాక,కొన్ని భారతీయవైద్యవిధానములు,ఆరోగ్య సూత్ర గ్రంథములు తెలుగు నుండి ఆంగ్లభాషానువాదాలు, వ్యాసాలు, కథలు, కవితలు, శీర్షికలు, ఛలోక్తులు వంటివి. 'భావం పతిది - భాష సతిది' అన్నట్లు పుంఖానుపుంఖంగా స్వతంత్ర రచనలు చేశారు మీరు.

వృత్తిరీత్యా విదుషీమణి రాజ్యశ్రీగారు ఆంగ్లోపన్యాసకులు - మహోదయులు వీరరాఘవరావు గారు గణిత శాస్త్రోపన్యాసకులుగా జీవనయానం ప్రారంభించి అసంఖ్యాక విద్యార్థులకు, శిష్యగణాలకు నేడు ఆరాధ్యులైన ఆదర్శ గురుదంపతులు మీరు. మీ జీవన మార్గమే మీ రచనల అంతస్సారం.

పుణ్యాత్ములైన మీ కృషికి మీ ఉపజ్ఞకు, మీ ప్రజ్ఞా శేముషికి, నిరంతర ఆధ్యాత్మిక, సామాజిక పరివస్యకు ఉడతా భక్తిగా మా ఫౌండేషన్ అందిస్తున్న అక్షరార్చనము.

**యన్.టి.ఆర్.కళా ప్రాంగణము**
పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయము
**హైదరాబాదు**
**సోమవారము, 24.02.25**

బుధజన విధేయం
**అజో - విభొ - కందాళం ఫౌండేషన్**

అసతోమా సద్గమయ తమసోమా జ్యోతిర్గమయ
మృత్యోర్మా అమృతంగమయ ఓం శాంతిః శాంతిః శాంతిః

# ఎందరో మహానుభావులు

ఈ బ్రహ్మయజ్ఞానికి ఎందరో సహాయసహకారాలను అందించారు. **స్వామీజీల, స్వామినీల** ప్రోత్సాహం, **పాఠకుల** నిరంతర ఆదరణ చెప్పనలవి కాదు.

**చిన్మయమిషన్, ఒంగోలు; స్వామి సత్యాత్మానందగారు మమ్ము ప్రోత్సహించి సాంకేతిక సలహాలను ఇచ్చినందులకు ధన్యవాదములు.**

**శ్రీమతి చిలుకూరి మృదుల గారు ఆర్ష విద్యా తరంగిణి యూట్యూబ్ చానెల్‌కు** నాంది పలికి, ఓపికతో **ఆర్ష విద్యా తరంగిణి** ప్రసంగాలను ప్రపంచానికి అందుబాటులోకి తెచ్చారు.

**డా॥ మంచిరాజు రామానంద శర్మ గారు** అలుపెరుగక, ఎంతో సృజనాత్మకతను ప్రదర్శిస్తూ, **ఆర్ష విద్యా తరంగిణి** ప్రసంగాలను వీడియోలుగా మార్చి యూట్యూబ్‌లో పెడుతున్నారు.

**శ్రీ వీరమాచనేని వెంకట కృష్ణారావు గారు** ప్రింటింగ్‌కు సహాయపడుతున్నారు.

**శ్రీ సిరిపురపు రాజేంద్ర కుమార్ గారు** తప్పులు లేకుండా డీటీపి చేస్తున్నారు.

**శ్రీ తిరుమలశెట్టి వెంకట రామమోహన రావు గారు, డా. బోయినేపల్లి యాదగిరి రావు గారు** ఎం ఎస్ టీమ్స్ నిర్వహణ చాలా చాకచక్యంతో, నిర్విరామంగా, నిరాఘాటంగా, నిరంతరంగా చేయడమే కాక ప్రూఫ్–రీడింగ్‌లో కూడా తోడ్పడుతున్నారు.

మరి ఈ పుస్తకంలో అక్షర, భావదోషాలు లేకుండా దిద్దిపెట్టిన వారు –

1. **శ్రీ దేసు కృష్ణచైతన్య గారు**
2. **శ్రీ మూల్పూరి విష్ణుప్రసాదు గారు**
3. **శ్రీమతి దేవరకొండ అరుణా యశోద గారు**
4. **డా. గరిగిపాటి సత్యనారాయణ మూర్తి గారు**
5. **శ్రీ పిరాట్ల వెంకట సుబ్రహ్మణ్య సత్యనారాయణ శాస్త్రి గారు**
6. **శ్రీ కర్పూరపు శ్రీధర్ గారు**
7. **శ్రీ యనమండ్ర రామచంద్ర వాచస్పతి గారు**

**వీరందరికీ మా హృదయపూర్వక కృతజ్ఞతలు, అనంతకోటి వందనాలు**

**– రాఘవ రావు, రాజ్యశ్రీ**

## విషయసూచిక


| | | |
|---|---|---|
| 1. | బ్రహ్మయజ్ఞం | 3 |
| 2. | ఎందరో మహానుభావులు | 5 |
| 3. | పరమార్థానందస్వామివారి బోధలోని విశిష్ఠత | 7 |
| 4. | కృష్ణపరమాత్మ హృదయానికి దర్పణం పట్టిన స్వామీజీ | 9 |
| 5. | ఆయన మనస్సు మంచిగంధం | 12 |
| 6. | మాకు అమూల్యమైన దక్షిణ లభించింది | 14 |
| 7. | ఆర్ష విద్యా తరంగిణి సభ్యుల స్పందనలు | 15 |
| 8. | పదమూడవ అధ్యాయము - క్షేత్ర-క్షేత్రజ్ఞ విభాగయోగము | 23 |
| 9. | పదమూడవ అధ్యాయము - సారాంశము | 159 |
| 10. | పదునాల్గవ అధ్యాయము - గుణత్రయ విభాగయోగము | 168 |
| 11. | పదునాల్గవ అధ్యాయము - సారాంశము | 243 |
| 12. | పదునైదవ అధ్యాయము - పురుషోత్తమయోగము | 256 |
| 13. | పదునైదవ అధ్యాయము - సారాంశము | 329 |
| 14. | పదునాఱవ అధ్యాయము - దైవాసురసంపద్విభాగయోగము | 338 |
| 15. | పదునాఱవ అధ్యాయము -సారాంశము | 417 |
| 16. | పదునేడవ అధ్యాయము - శ్రద్ధాత్రయ విభాగయోగము | 428 |
| 17. | పదునేడవ అధ్యాయము - సారాంశము | 525 |
| 18. | పదునెనిమిదవ అధ్యాయము - మోక్షసన్న్యాసయోగము | 538 |
| 19. | పదునెనిమిదవ అధ్యాయము - సారాంశము | 798 |
| 20. | శ్రీమద్భగవద్గీత-అకారాది సూచిక | 815 |

# పరమార్థానందస్వామివారి బోధలోని విశిష్టత

పరమార్థానందస్వామివారి బోధలో నూతనత్వం ఉంది, స్పష్టత ఉంది, విజ్ఞత ఉంది, విశ్లేషణ ఉంది, విశిష్టత ఉంది. ప్రత్యేకించి శ్రీమద్భగవద్గీతను 240 గంటలు ఒక క్రమ పద్ధతిలో, చాలా విపులంగా, ఎంతో విస్తారంగా, మరెంతో విశేషంగా, ఒక శ్లోకంతో మరొక శ్లోకాన్ని కలుపుతూ, బోధించారు.

అదెలాగో స్వామీజీ మాటల్లో మీరే స్వయంగా చూడండి!

**సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ ।**
**అహం త్వా సర్వపాపేభ్యో మోక్షయిష్యామి మా శుచః॥** – గీత 18-66

ఈ శ్లోకం జ్ఞానయోగాన్ని సంక్షిప్తంగా వర్ణిస్తుంది. ఇక్కడితో గీతాబోధ కూడా ముగుస్తుంది కాబట్టి దీన్ని చరమశ్లోకం అనికూడా అంటారు.

నిజానికి ఈ శ్లోకం జ్ఞానయోగంయొక్క సారాంశం అయినా కూడా కృష్ణపరమాత్మ ఈ శ్లోకంలో ఎక్కడా జ్ఞానం పదాన్ని వెయ్యలేదు. జ్ఞానం, విచారణ, వేదాంతం – ఏ పదం కూడా వాడలేదు. అంటే ఈ శ్లోకంలో జ్ఞానయోగం అంతర్లీనంగా ఉంది. అలా కొన్నిచోట్ల కృష్ణపరమాత్మ తన చిలిపితనాన్ని చూపిస్తూనే వచ్చాడు. నర్మగర్భంగా చెబుతూ వచ్చాడు. ఇక్కడ చివరిసారిగా మళ్ళీ తన చిలిపితనాన్ని ప్రదర్శిస్తున్నాడు.

ఈ శ్లోకంలో జ్ఞానయోగం గురించి ప్రత్యక్షంగా లేకపోవటంవల్ల ఈ శ్లోకంయొక్క అర్థాన్ని యథాతథంగా అంటే ఉన్నదున్నట్టుగా తీసుకుంటే, అయోమయంలో పడవేస్తుంది కూడా. అందువల్ల ఈ శ్లోకానికి అనేక రకాల వివరణలు వచ్చాయి.

ఈ శ్లోకంలోని పదాలను అక్షరాలా తీసుకుంటే మొట్టమొదటి మాటే నమ్మలేని మాటగా ఉంటుంది. సర్వధర్మాన్ పరిత్యజ్య అన్నాడు. అంటే నీ ధర్మాలన్నీ త్యజించు అంటున్నాడు. ధర్మం అంటే విలువలు, నైతికధర్మం, పుణ్యకర్మ – ఏదైనా తీసుకోవచ్చు. అందువల్ల ఈ వాక్యంయొక్క వాచ్యార్థం తీసుకుంటే, నీ ధర్మాలన్నీ త్యజించు అని వస్తుంది.

నిజానికి ఇంతవరకూ భగవద్గీతలో కృష్ణపరమాత్మ ధర్మంయొక్క ప్రాముఖ్యతను గురించి చెప్పుకుంటూ వచ్చాడు. నిజానికి నేను అవతారం ఎత్తిందే ధర్మరక్షణకోసం అన్నాడు నాలుగవ అధ్యాయంలో.

**మామేకం శరణం వ్రజ** – నన్నే శరణు వేడు అంటున్నాడు కృష్ణపరమాత్మ. మామ్ అంటే నన్ను; శరణం వ్రజ అంటే శరణు వేడు; ఏకం అంటే నేను మాత్రమే. ఈ వాక్యం అర్థం – నన్ను శరణు వేడు, నేను మాత్రమే నీకు ఆధారం. ఈ వాక్యం కృష్ణ భక్తులకు, వైష్ణవులకు అమృతం తాగినట్టు ఉంటుంది. అదుగో కృష్ణపరమాత్మే నన్నే శరణు వేడు అన్నాడు అంటే వేరే దేవుళ్ళెవరూ నిన్ను రక్షించరు; కృష్ణుడే రక్షిస్తాడు అంటారు. నన్ను శరణు వేడితేనే మోక్షం వస్తుంది అన్నాడు అంటారు.

ఈ అయోమయాలు ఎందుకు వచ్చాయంటే, ఇందులో అంతర్లీనంగా ఉన్న జ్ఞానయోగాన్ని వెలికి తీసుకు రాకపోవటంవల్ల. అందువల్ల శంకరాచార్యులు మనను ఆదుకుంటున్నారు. ఇందులో జ్ఞానయోగం ఎలా దశలవారీగా నిండి నిబిడీకృతమై ఉందో విశ్లేషిస్తున్నారు. ఆ నేపథ్యంతో ఈ శ్లోకంయొక్క అర్థాన్ని చూద్దాము.

**సర్వధర్మాన్ పరిత్యజ్య** – ఇక్కడ ధర్మం అంటే అధర్మం కూడా తీసుకోవాలి అంటున్నారు శంకరాచార్యులవారు. ఈ సందర్భంలో కృష్ణపరమాత్మ అధర్మం కూడా అని ప్రత్యేకించి చెప్పలేదు; ఎందుకంటే అనేక సందర్భాలలో అంతకుముందు చెప్పాడు. అంతేకాదు, శాస్త్రం అధర్మాన్ని, అనైతిక విలువలను త్యజించాలని పదేపదే చెబుతుంది; పైగా అధర్మాన్ని పాటించకూడదనే విషయం ఎవరికైనా తెలుసు; ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. అందువల్ల సర్వధర్మాన్ పరిత్యజ్యను సర్వ ధర్మ–అధర్మాన్ పరిత్యజ్యగా తీసుకోవాలి.

సర్వధర్మాన్ పరిత్యజ్యయొక్క మూడు దశలను చూద్దాము.

1. సర్వకర్మలను త్యజించాలి.
2. కర్మత్యాగం చెయ్యాలంటే దేహాభిమానత్యాగం చెయ్యాలి.
3. దేహాభిమానత్యాగం చెయ్యాలంటే ఆత్మజ్ఞానం పొందాలి.

**మామేకం శరణం వ్రజ** – వ్రజ అంటే నా దగ్గరికి రా.

ఇప్పుడు కృష్ణపరమాత్మ నన్నే శరణు వేడు అంటే ఏ నేను గురించి చెబుతున్నాడు? ఏకరూప ఈశ్వరుడా, అనేకరూప ఈశ్వరుడా, అరూప ఈశ్వరుడా? ఇక్కడ అరూప ఈశ్వరుడని అర్థం చేసుకోవాలి.

ఇక్కడ మాం అంటే అరూప ఈశ్వరుడు. అది తెలియజేయటానికి '**ఏకమ్**' అనే విశేషణాన్ని వాడాడు కృష్ణపరమాత్మ. ఏకం అంటే ఉన్నదొకటే, అద్వితీయం బ్రహ్మ. అద్వితీయం అంటే రెండవది లేనిది.

**సజాతీయ విజాతీయ స్వగతభేద రహితం పరంబ్రహ్మ**

ఈ నిర్వచనాన్ని ఉపనిషత్తులలో చూస్తాము.

**మామేకం శరణం వ్రజ = అరూప ఈశ్వరుణ్ణి శరణు వేడు**

సరియైన జ్ఞానంతో తప్పుడు ఊహను పారద్రోలాలి. ఏమిటా సరియైన జ్ఞానం? భగవంతుడు నాకు భిన్నంగా లేడు – ఒక జ్ఞానం; భగవంతుడు నాకు దూరంగా ఎక్కడో లేడు – ఇది ఇంకొక జ్ఞానం. ఈ రెండింటినీ కలిపి **జీవాత్మ, పరమాత్మ ఐక్యజ్ఞానం** అంటారు.

శరణాగతి అంటే ఏమిటి? దీనికి అనేక అర్థాలు ఇస్తారు కాని, శరణాగతి అంతిమ అర్థం – జీవాత్మ పరమాత్మ ఐక్యజ్ఞానం పొంది, పరమాత్మను చేరుకోవాలనే అపోహను వదులుకోవటం. ఇప్పుడు ఇవన్నీ కలుపుకుంటే

**మామేకం శరణం వ్రజ = జీవాత్మ పరమాత్మ ఐక్యజ్ఞానం పొందటం**

జీవాత్మ, పరమాత్మ ఐక్యజ్ఞానాన్నే ఉపనిషత్తులు మహావాక్యజ్ఞానం అంటాయి. **– మద్దూరి రాజ్యశ్రీ**

# కృష్ణపరమాత్మ హృదయానికి దర్పణం పట్టిన స్వామీజీ

భగవద్గీతలో మూడు షట్కాలు ఉన్నాయి. ఒక్కొక్క షట్కంలో ఆరు అధ్యాయాలు ఉంటాయి.

మొదటి షట్కము - అధ్యాయాలు 01-06 **- త్వమ్ పద విశ్లేషణ**

రెండవ షట్కము - అధ్యాయాలు 07-12 **- తత్ పద విశ్లేషణ**

మూడవ షట్కము - అధ్యాయాలు 13-18 **- అసి పద విశ్లేషణ**

**మూడవ షట్కంలోని మూడు అంశాలు**

ఎ) జీవ ఈశ్వరస్వరూప ఐక్యము - అసి పదార్థ విశ్లేషణ

బి) జ్ఞానయోగ సాధన

సి) విలువలు

మూడవషట్కములోని అధ్యాయాలు: 13, 14, 15 అధ్యాయాలు - ఆత్మజ్ఞానం; 16, 17 అధ్యాయాలు- ధర్మశాస్త్రంనుంచి జీవనవిధానం; 18వ అధ్యాయం - గీతా సారాంశం.

17వ అధ్యాయాన్ని ప్రధానంగా మూడు భాగాలుగా విభజించవచ్చు. అవి -

1. శ్రద్ధాత్రయ విభాగః - శ్లోకాలు: 1-6
2. నాలుగు అంశాలు - శ్లోకాలు: 7-22
3. ఓం తత్సత్ - శ్లోకాలు: 23-28

**నాలుగు అంశాలు -** అవి ఆహారం, యజ్ఞం, తపస్సు, దానం. 14, 15, 16 శ్లోకాల్లో ఈ మూడురకాల తపస్సు గురించి చెప్పబోతున్నాడు కృష్ణపరమాత్మ. ఈ విధంగా విభజించుకుంటూ వస్తారు స్వామీజీ.

***

కృష్ణపరమాత్మ తన బోధను ఉపయోగించిన పద్ధతిని **సంక్షేప విస్తారబోధనమ్** అంటారు. ముందు తను చెప్పబోయేదాన్ని క్లుప్తంగా చెప్పటం. అంటే ఒక విహంగవీక్షణం ఇస్తారు దానికి. విద్యార్థికి తను వినబోయేదేమిటో ఒక అవగాహన ఉంటుంది. తర్వాత తను చెప్పదలుచుకున్నదాన్ని చాలా వివరంగా చెప్పుకుంటూ వస్తారు. ముగించేముందు మళ్ళీ క్లుప్తంగా, ఇంతవరకూ చెప్పిన దాని సారాంశాన్ని చెప్పి ముగిస్తారు.

ఉపక్రమ సంక్షేపః - మొదట్లో క్లుప్తంగా చెప్పటం

విస్తారః - వివరంగా చెప్పటం

ఉపసంహార సంక్షేపః - మళ్ళీ క్లుప్తంగా చెప్పి ముగించటం.

***

వేదాంతమే తన గురించి పరిచయం చేసుకుంటూ, ఇలా చెబుతుంది, 'నేనిక్కడ ఉన్నది మీకు ఇంద్రియాల ద్వారా అందనిదాని గురించి బోధ చెయ్యటానికి.' కాని మనం వింటేగా? ఒకపక్క వేదాంతం, ఆత్మ ఇంద్రియ అగోచరం అని చెబుతూవుంటే, 'ఏదీ ఆత్మను నా ఇంద్రియాలకు చూపించు,' అంటాము మనము. ఏం చెప్పాలి?

**ప్రత్యక్షేణానుమిత్యా వా యస్తూపయో న విద్యతే**
**ఏవం విదంతి వేదేన తస్మాత్ వేదస్య వేదతా**

వేదంయొక్క నిర్వచనమే అది ఆరవ ఇంద్రియం అని. వేదానికి అందుబాటులో ఉన్నది, తక్కిన ఇంద్రియాలకు అందుబాటులో ఉండదు. అంతదాకా ఎందుకు? కన్ను చూసినదాన్ని చెవి వినలేదు; చెవి విన్నదాన్ని కన్ను చూడలేదు.

***

ముందు ధ్యానంమీద ఏదో పుస్తకం చదువుతాడు. అది అతనికి బాగా నచ్చుతుంది. రోజుకి ఐదుగంటలు ధ్యానంలో కూర్చుంటాడు. అందులో బాగా ఆరితేరే సమయానికి, ఇంకేదో అతని కళ్ళబడుతుంది. అది ఆధ్యాత్మికత అంటే సమాజసేవ అంటుంది. వెంటనే ధ్యానాన్ని మానేసి, బాగా సమాజసేవలో హుషారుగా కూరుకుపోతాడు. ఇంతలో మరెవరో కుండలినీ ధ్యానం గురించి రాస్తారు. దాన్ని ప్రయత్నిస్తాడు. ఇంకొన్నాళ్ళకి కలియుగంలో నామజపం ఒక్కటి చేస్తే చాలు అని ఎక్కడో చూస్తాడు. ఇదేదో చాలా బాగుంది. నామజపం చేస్తే చాలు అనుకుంటాడు. అది మొదలుపెడతాడు. ఇంతలో ఎవరో 'అదుగో, అక్కడ గీతాబోధ జరుగుతోంది, బాగా చెబుతున్నారు,' అంటారు. దానికి వెళతాడు.

***

గీతాబోధవల్ల మనం ప్రయోజనం పొందుతున్నామంటే దానికి మనం వ్యాసాచార్యులకు ఋణపడివున్నాము. ఆయన దాన్ని లిఖించారు కాబట్టే, నేడు మనం నేర్చుకోగలుగుతున్నాము. అర్జునునికి ఋణపడివున్నాము. అర్జునుడు అడగకపోయివుంటే కృష్ణపరమాత్మ బోధించి ఉండేవాడు కాదు. కృష్ణపరమాత్మకు ఋణపడివున్నాము. కృష్ణపరమాత్మ అర్జునునికి మాత్రమే బోధించలేదు. అర్జునునిద్వారా మొత్తం మానవాళికి వేదాంతసారాన్ని బోధించాడు. ఉపనిషత్తులు నేర్చుకోలేనివారికి సూక్ష్మంలో మోక్షం. మన పితృదేవతలకు ఋణపడివున్నాము. వారు తరతరాలుగా, గురుశిష్యపరంపరగా గీతాబోధను అందించకపోయివుంటే ఇవాళ మనం ఇంత సుఖంగా, ఇంత తేలికగా గీతను నేర్చుకోగలిగి ఉండేవారము కాదు (పరమార్థానంద స్వామీజీ ఇంత తేలికగా, ఒక క్లాసురూమ్ టీచింగ్‌లా బోధ చెయ్యకపోయివుంటే, ఇంత భాండాగారాన్ని అందుకోగలిగి ఉండేవారము కాదు. అందువల్ల ఋషులకు ఋణపడివున్నాము).

***

నిజానికి మనిషి చెయ్యాల్సిన ముఖ్యమైన సాధనలు రెండే ఉన్నాయి. మనస్సును శుద్ధిచేసే ఏ సాధననైనా కర్మయోగం అంటారు. అది జపం, పూజ, యోగం, సమాజసేవ, తీర్థయాత్ర, దానం, భజన – ఏదైనా కావచ్చు. మనస్సును శుద్ధిచేసి, జ్ఞానయోగ్యతను ప్రసాదించేదాన్ని కర్మయోగం అంటారు. నేను నిత్యముక్తశుద్ధపురుషణ్ణి అని నేర్చుకోవటానికి చేసే సాధనను జ్ఞానయోగం అంటారు. వేదాంతబోధ వింటుంటే అది జ్ఞానయోగం. ఇంటికి వెళ్ళి, గురువు చెప్పింది మననం చేసుకుంటే అది జ్ఞానయోగం. బుద్ధికి పదునుపెట్టి జ్ఞానం పొందితే అది జ్ఞానయోగం. ఆ జ్ఞానం ఆత్మ గురించిన జ్ఞానాన్ని ఇస్తుంది. అది నేను అంతకుముందు, ఇప్పుడు, ఇకముందు కూడా ముక్తపురుషణ్ణే అనే జ్ఞానాన్ని కలుగజేస్తుంది. ఆ విధంగా మొత్తం ఆధ్యాత్మిక సాధనలో ఈ రెండే ఉంటాయి. చిత్తశుద్ధి పొందు, ఆత్మజ్ఞానం పొందు. చిత్తశుద్ధి పొంది, ఆత్మజ్ఞానం పొందితే మోక్షం పొందుతావు.

***

ఉపద్రష్టా – ఈ చైతన్యమే, సాక్షిగా నీ లోపల ఉండి, జరుగుతున్నదంతా సాక్షీభూతంగా చూస్తోంది. ఉపద్రష్టా పదం చాలా అద్భుతమైన పదం. చైతన్యం సూర్యునిలాగా, బల్బులాగా ప్రకాశింపజేస్తోందని చెబుతూ వస్తున్నాము. ఈ ఉదాహరణలలో అవి ప్రకాశింపజేసే వస్తువులకు దూరంగా ఉన్నాయి. సూర్యుడు కొన్ని కోట్ల మైళ్ళ దూరంలో ఉన్నాడు. అలా ఆత్మసాక్షి అంటే, ఆత్మ ఎక్కడో దూరంగా ఉండి చూస్తోందేమోనని పొరపాటుపడే అవకాశం ఉంది. ఆ పొరపాటు పడటానికి వీల్లేకుండా ఉపద్రష్టా అన్న పదం వేశాడు కృష్ణపరమాత్మ. ఉపద్రష్టా అంటే  చాలా దగ్గరగా ఉండి చూస్తున్నట్టు అర్థం.

***

సాధారణంగా సృష్టిలో అన్ని జీవరాసులకన్నా మనిషి గొప్ప అని చెప్పేటప్పుడు మనిషియొక్క బుద్ధి గురించి గొప్పగా చెబుతారు. మనిషిని బుద్ధిజీవి అంటారు. అంటే మనిషి ఒక్కడే బుద్ధిని ఉపయోగించగలడు. జంతువులలో గొరిల్లా, డాల్ఫిన్‌వంటి జంతువులకు బుద్ధి ఉంటుంది కాని, మనిషికున్న బుద్ధియొక్క స్థాయితో పోలిస్తే అది చాలా తక్కువ. అలా బుద్ధి గురించే ఎక్కువ మాట్లాడతాము కాని, నిజానికి బుద్ధి ఎంత గొప్పదో, వాక్కు కూడా అంత గొప్పది. వాగింద్రియంవల్లనే మనిషి జంతువులకన్నా అపారంగా భిన్నంగా ఉన్నాడు. జంతువులు కొన్ని శబ్దాలు మాత్రమే చెయ్యగలవు కాని మనిషికి ఎంతో మంచి భాష ఉంది; ఆ భాషను అర్థం చేసుకోవటానికి వ్యాకరణసూత్రాలు ఉన్నాయి. అందువల్ల బుద్ధి ఎంత ముఖ్యమో, వాక్కు కూడా అంతే ముఖ్యం. మన శాస్త్రంలో బుద్ధి లేదా జ్ఞానానికి అధిష్ఠానదేవత బ్రహ్మ; వాగింద్రియానికి అధిష్ఠానదేవత సరస్వతి. సరస్వతీదేవి బ్రహ్మగారి నాలుకమీద ఉంటుంది. అలా విశ్వంయొక్క ఉన్నతికి బ్రహ్మ, సరస్వతులు ఎలా కలిసివుంటారో; అలా మనయొక్క ఉన్నతికి బుద్ధి, వాక్కు కలిసివుండాలి.

***

– మద్దూరి రాజ్యశ్రీ

# ఆయన మనస్సు మంచి గంధం

ఎంపిక చేశారు అలనాడు ఎన్నో నవలలు ఎమెస్కోకి
ఏర్చికూర్చారు మరెన్నో కథలు పుస్తక ప్రపంచానికి
సంపాదకీయాలు రాశారు వేనవేల పుస్తక ప్రపంచాలకి
దుర్భిణీ వేసి చూశారు ముద్రారాక్షసాలు దొర్లకుండా పుస్తకాలలో
శ్రీకారం చుట్టారు ఎమెస్కో సాంప్రదాయ సాహితికి
ముద్రించారు లెక్కలేనన్ని నవలలు హిందు ప్రెస్‌లో
పునరుద్ధరించారు శిథిలాలయాలను, గోపురాలను
ఆయన మనస్సు మంచిగంధం, మాట అమృతం
చేత ఎదుటిమనిషికి చేయూత – వారే **శ్రీ మద్దూరి వెంకట సుబ్బారావు గారు**

చరిత్రకెక్కిన చరితార్థులెందరో ఉన్నారు. తను ఎంతటి ఉన్నతుడైనా నివురుగప్పిన నిప్పులా తెరవెనకే ఉండిపోయారు **శ్రీ మద్దూరి వెంకట సుబ్బారావు గారు**. శేషాచలం అండ్ కో స్థాపించిన శేషాచలంగారి రెండవ అబ్బాయి, ఎమెస్కో పాకెట్ బుక్స్‌ను తెలుగుదేశంలో వినూత్నంగా ప్రవేశపెట్టిన యం.యన్.రావు గారి తమ్ముడు, మా బాబాయి ఆయన. ఇంటింటా స్వంత గ్రంథాలయం (హెూమ్ లైబ్రరీ ప్లాన్) అంటే తెలియనివారు లేరు ఆ రోజుల్లో. దానికి సంబంధించిన పుస్తక ప్రపంచాన్ని అంగరంగ వైభవంగా తయారుచెయ్యటం, సభ్యులకు పుస్తకాల గురించిన వివరాలు చెప్పటం, సభ్యులు బద్ధకించకుండా సున్నితంగా గుర్తుచెయ్యటంవంటి పనులన్నిటికీ ఆయన గురుతరబాధ్యతను వహించేవారు.

మానవసేవే మాధవసేవ అన్న సత్యాన్ని మనసారా నమ్మి, ఆచరించిన వ్యక్తి సుబ్బారావు గారు. మానవసేవని ఎన్ని రకాలుగా చెయ్యవచ్చో చేసి చూపించారు. వాణిజ్యరంగం ద్వారా, విద్యారంగం ద్వారా, క్రీడారంగం ద్వారా, వైద్యరంగం ద్వారా, భక్తిమార్గం ద్వారా ఆయన చేసిన సేవలు వేనోళ్ళ కొనియాడదగినవి. ఎడ్యుకేషనల్ ఇండియా అనే పత్రికకు ఎడిటర్‌గా ఎన్నాళ్ళో చేశారు. సావిత్రీ హైస్కూలుకు కరస్పాండెంట్‌గా ఉన్నారు. భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్‌కు డిస్ట్రిక్ట్ చీఫ్ కమీషనర్‌గా, రోటరీ క్లబ్ ప్రెసిడెంట్‌గా చేశారు. కరగ్రహారం రామాలయం, వేణుగోపాలస్వామి గోపురం శిథిలావస్థలో ఉంటే వాటిని పునరుద్ధరించారు. 24 కోట్ల గాయత్రి మహాజపయజ్ఞాన్ని జనబాహుళ్యంచేత చేయించారు.

ఆయన భక్తి కూడా చాలా ప్రత్యేకమైన రీతిలో, ఆదర్శవంతంగా ఉంటుంది. విష్ణుమూర్తిని బాలకృష్ణుని రూపంనుంచి, వేంకటేశ్వరస్వామివరకూ అనేక ఊర్లలో ఉన్న ఆకారాలని తలచుకుని ధ్యానం చేసేవారు. మా బాబాయి పరమాత్మను తన హృదయంలో ప్రతిష్ఠించుకున్నారు. అందులోనూ ఆయన ప్రత్యేకతను చూస్తాము. హృదయంలో ఆలయాన్ని కట్టటానికి ఎన్ని ఇటుకలు కావాలో, ఎంత ఎత్తు గోడ కావాలో, ఒక్కొక్క ఇటుకకు ఎన్నిసార్లు భగవన్నామజపం చెయ్యాలో, మావారితో చర్చించి, ఒక పద్ధతిలో చేసి, పరమాత్మను ప్రతిష్ఠించుకున్నారు. శ్రీరామ రామ రామేతి శ్లోకాన్ని వెయ్యిసార్లు పఠించి నోరంతా తీయగా, మధురంగా అనిపించింది అన్నారు.

బందరు ఊరంతా ఆయనను చిన్నమామయ్య అని, అన్నపూర్ణలాంటి మా పిన్నిని చిన్నత్తయ్య అని పిలిచేవారు. అటువంటి గొప్పవ్యక్తులు ఆ ఆదర్శదంపతులు. మా బాబాయిలో ఇన్ని విశేషాలున్నా, ఎదుటివ్యక్తిలోని విశేషాన్ని గుర్తించి, వారిని ఇంకొకరికి పరిచయం చేస్తున్నప్పుడు ఆ గుణాన్ని కీర్తిస్తూ చెప్పేవారు. వారిని బాగా ఉత్తేజపరుస్తారు. నా పెళ్ళికి ముందే మా నాన్నగారు మరణించారు. మా బాబాయి నాతో నువ్వు రాజకుమారివే, నీకు రాజాలాంటి సంబంధం తెస్తానని తరచు చెప్పేవారు. అలాగే రాజాలాంటి సంబంధమే తెచ్చారు. మావారు పెళ్ళినాటికే శాంతమూర్తి, మంచివాడు, తెలివైనవాడు అని పేరు తెచ్చుకున్నారు. మావాళ్ళందరికీ ఆయన ఒక రోల్‌మోడల్‌గా ఉండేవారు.

అలా అప్పటికే ఆయన బంగారమే అయినా, మా బాబాయి ఆయనకు మరింత మెరుగుపెట్టి మిలమిలలాడే వజ్రంలా తీర్చిదిద్దారు. మా బాబాయి ఆయనను కాశీ తీసుకువెళ్ళి అక్కడ తొమ్మిదిరోజులు బస చేయించారు. అది ఆయన జీవితాన్ని ఒక మలుపు తిప్పింది. రైలులో వెళ్ళారు. రెండురాత్రులు ప్రయాణం. మా బాబాయి ఆయనకు శివపంచాక్షరీ మంత్రోపదేశం చేసి, కాశీ చేరేలోపు కొన్ని లక్షలసార్లు ఆ మంత్రం జపించాలని ఆదేశించారు. మా ఆడపడుచు లలిత కూడా వారితో వెళ్ళారు. తర్వాత అక్కడ ఉన్నన్నిరోజులూ వారు ఆలయానికి వెళ్ళని సమయంలో వారు ఉన్న ఆశ్రమంలో ఒక శివలింగాన్ని పెట్టుకుని, దానికి అభిషేకం, పూజలు, జపాలు చేస్తూనే ఉన్నారు. అప్పుడు వారికి కలిగిన విభూతులు ఎన్నో, ఎన్నెన్నో. ముగ్గురూ మరో లోకంలో ఉన్నట్టుగా ఉన్నారు. మాటలకు అందని అలౌకిక ఆనందాన్ని పొందారు.

అలా మొదలైన శివపంచాక్షరీ జపం అక్కడితో ఆగలేదు. కొన్ని కోట్లసార్లు చేస్తూనే ఉన్నారు తిరిగివచ్చాక కూడా. అప్పటినుంచీ మావారికి బాబాయి మంత్రదీక్ష ఇచ్చిన గురువైపోయారు. అన్ని కోట్లసార్లు శివనామం జపించి ఈయన పునీతుడయ్యారని, బాబాయి పునరుద్ధరించిన ఆలయాల్లో ఒకటైన బందరు కాశీ విశ్వేశ్వరాలయంలో మా దంపతులచేత శివలింగ ప్రతిష్ఠ చేయించారు. దానికి ఎందరో ఉత్రూతలూగినా, ఈయనే అర్హులని బాబాయి నిశ్చయం చేశారు.

మేమిద్దరమూ కలిసి ఇలా వేదాంతబోధను చేస్తున్నాము, మేము బోధ చేస్తున్న ప్రస్థానత్రయాన్ని పుస్తకరూపంలో ప్రచురిస్తున్నామని విని చాలా సంతోషించారు. మా గురించి అందరికీ గొప్పగా చెప్పేవారు. ఆయనకు ఎంతో ఇష్టమైన కాశీలో మేము వేదాంతశిబిరాన్ని నిర్వహించాము. ఆయన భక్తిపరాకాష్ఠ ఆయనను జ్ఞానిని చేసింది. బాబాయి ఒకసారి బయట ఊరు వెళ్ళినప్పుడు రెండు బస్సుల మధ్య ఇరుక్కుపోయినా, నేను శరీరాన్ని కాదు అని తనకు తాను చెప్పుకుని, ఆరోజంతా, నిర్విఘ్నంగా పనిచేసుకున్నారు. అంతకన్నా జ్ఞాననిష్ఠ వేరే ఏంకావాలి?

ఈ పుస్తకాలమీద నాపేరు మొదట్లో మద్దూరి రాజ్యశ్రీ అని రాస్తే, నువ్వు కస్తూరి వారి కోడలివి, కస్తూరి వారికి మంచిపేరు తేవాలని నాచేత కస్తూరి పేరు కూడా పెట్టించిన ఘనత ఆయనకే దక్కింది. మీరిద్దరూ భగవద్గీత బోధించాలని, ఆ బోధకు అక్షరరూపం ఇవ్వాలనీ మనసారా ఎన్నిసార్లో దీవించారు. మా బాబాయి కోరిక ఇవాళ సాకారం అయ్యేసరికి మన కళ్ళముందు లేరు కాని మా గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన **శ్రీ మద్దూరి వెంకట సుబ్బారావు గారికి** ఈ అక్షర నివాళులు అర్పించుకుంటున్నాను.

**– కస్తూరి రాజ్యశ్రీ**

# మాకు అమూల్యమైన దక్షిణ లభించింది

## గీతాగంగోదకం పీత్వా పునర్జన్మ న విద్యతే ॥

జూలై 24, 2021 శనివారం గురుపూర్ణిమ చాలా వైభవంగా జరుపుకున్నాము. ఆ రోజున మా సభ్యులకు ఒక అభ్యర్థన చేశాను. 'మీరు మాకు దక్షిణగా ధనం, బట్టలు ఇస్తున్నారు. ధనం మన ట్రస్టు అకౌంటులో వేస్తున్నాము. మేము మీనుంచి ఆశించే దక్షిణ ఒకటే ఉంది. మీరందరు ఇవ్వగలిగినదే. మీ దైనందిన జీవితంలో రోజూ కేవలం పది నిముషాలు మాకు దక్షిణగా ఇవ్వండి. ఆ పది నిముషాలూ పదిపేజీలు మన భగవద్గీత పారాయణం చేయండి.

'పారాయణం అంటే స్వామీజీ బోధించిన ఈ భగవద్గీతను క్రమం తప్పకుండా, ప్రతిరోజూ, అర్థం చేసుకుంటూ, శ్రద్ధగా, అధ్యయనం చేయటం. ఇలా చేయటంవల్ల మీ జీవనవిధానంలో మార్పువచ్చి, మీ ఆధ్యాత్మిక ప్రయాణం నిరాటంకంగా సాగి, ఈ మానవజన్మకు సార్థకత కలుగుతుంది. సార్థకత ఏమిటి? జీవన్ముక్తి! ఇది నేను ఆశించిన గురుదక్షిణలోని రహస్యం.'

దాదాపుగా అందరూ సహృదయంతో, సానుకూలంగా, రెట్టించిన ఉత్సాహంతో స్పందించి గీతా పారాయణం మొదలుపెట్టారు. చాలామంది అంతకుముందే చదివినా కూడా మళ్ళీ మాకోసం, మా దక్షిణకోసం పారాయణం చేయడం మొదలు పెట్టారు. మేము సైతం నడుం కట్టాం. వారితో పాటుగా పారాయణం చేస్తున్నాం.

**ఆర్ష విద్యా తరంగిణి** సభ్యులు వారివారి పారాయణం ప్రగతి, విశేషాలు, అనుభూతులు, ఆనందము తరుచూ మాతో పంచుకుంటున్నారు. మాకెంతో ఆనందంగా ఉంది. **మాకు అమూల్యమైన దక్షిణ లభించింది**. కొన్ని సంవత్సరాల క్రితం, నేను రామాయణం, ఇంకా సుందరకాండ పారాయణ చేస్తూండే వాడిని. ముఖ్యంగా సుందరకాండ చాలాసార్లు, చాలా సంవత్సరాలు పారాయణం చేశాను. సుందరకాండ పారాయణ పూర్తి చేసినప్పుడల్లా మాకు ప్రత్యేకించి ఒక విభూతి కలిగేది. అందులో కొన్ని ఆర్ష విద్యా తరంగిణి సత్సంగ్ సభ్యులతో ప్రస్తావించాను. ఇంక మేము పొందిన అలౌకిక ఆనందము చెప్పనలవికాదు. బహుశః ఆ పారాయణ బలమే కావచ్చు, మాకు శ్రోత్రియులు, బ్రహ్మనిష్ఠులైన, పూజ్యస్వామి దయానందజీ, పూజ్యస్వామి పరమార్థానందజీ సద్గురువులుగా లభించారు. వారి బోధలు మమ్మల్ని అద్వైతం లోతుల్లోకి తీసుకువెళ్ళి ఆ జ్ఞాననిష్ఠలో నిలబెడుతున్నాయి.

సభ్యులకు ఈ గీతాధ్యయనంవల్ల కలుగుతున్న ప్రయోజనాలు– చిత్తశుద్ధి, చిత్తైకాగ్రత, చిత్తవైశాల్యత ఏర్పడి. జ్ఞానయోగ్యత వచ్చి, ఆత్మజ్ఞానం కలుగుతోంది. నిత్యం దైవచింతన ఉంటోంది. దైవీసంపత్తి అలవడుతోంది. గీత మోక్షశాస్త్రము కాబట్టి అర్థయుక్తంగా గీతా శ్రవణ, మనన, నిదిధ్యాసనలు చేస్తున్న సభ్యులు జీవన్ముక్తిని చవిచూస్తున్నారు. ఇలా నిత్యం గీతాధ్యయనం కొనసాగిస్తూ అందరూ పరిపూర్ణత్వాన్ని ఆస్వాదించాలని ఆశిస్తూ

**– రాఘవ రావు**

# ఆర్ష విద్యా తరంగిణి సభ్యుల స్పందనలు

ప్రతి అధ్యాయానికి ఉపోద్ఘాతం, సారాంశం, వీటితో బాటు స్వామీజీ ఆణిముత్యాలు ఈ గ్రంథం ప్రత్యేకత. అవసరమైన చోట వేదాంత ప్రాథమిక అంశాలు, వివిధ ఉపనిషత్తులనుండి, భక్తి గ్రంథాలనుండి చెప్పి వివరించారు. మూడు ప్రమాణాలతో **జాతస్య హి ధ్రువో మృత్యుః** వివరణ బాగా వచ్చింది. అలాగే గ్రంథి-శ్లోకాల వివరణ తేలికగా అర్థమయేటట్టు ఉంది. గంభీరమైన విషయాలవల్ల పాఠకుడు ఇబ్బందిపడకుండా అక్కడక్కడ హాస్య గుళికలూ ఉన్నాయి. ఫ్రీవిల్లా లేక విధా అనే ప్రత్యేక విశ్లేషణ బాగుంది. సున్నితమైన, వివాదాస్పదమైన వర్ణాశ్రమధర్మాల వివరణ ఎంతో హృద్యంగా ఉంది. భగవద్గీత అంటే ఎవరో పండితులకే కాని మాలాంటి సామాన్యులకి కాదు అనే అపోహ ఈ గ్రంథం పోగొట్టింది. సాధకులకు ఇది కరదీపిక, చిరకాలం ప్రతీ ఇంట్లో ఉండదగినదీ భగవద్గీత. ప్రతిపుటలో మేడంగారి తపస్సు కనపడింది. స్వామీజీ బంగారం అయితే, మేడంగారు ఆభరణం. **– డా॥ జి. ఎస్. ఎన్. మూర్తి**

భగవద్గీత చదువుతుంటే గురువులు ఎదురుగుండా ఉండి చెపుతున్నట్టుగా ఉంది. అంత విపులంగా రాసారు గురువులు. ముందు చదవని వారికి కూడా చక్కగా అర్థమయ్యేటట్లుగా వివరించారు. **– సత్యవాణి**

ఉపనిషత్సింహావలోకనం, వేదాంత సాంకేతికపదపరిచయం, ఆచరణకు అనువైన వివరణా పద్ధతి, ఎవరైనా ఈ గ్రంథాన్ని ముందు పెట్టుకొని క్లాస్ తీసుకునే శైలిలో, సంస్కృత–తెలుగు భాషా నిఘంటువుగా, శ్లోకవిశ్లేషణపరంగా పదవిచ్ఛేదన, అన్వయం, పద అర్థం, తాత్పర్య విధానం, దానితోపాటు అద్భుతమైన వ్యాఖ్యతో పరిపూర్ణమైన గ్రంథంగా వెలువడి మాకు అందుబాటులో ఉండడం మా అదృష్టం.

**–జోగారావు**

విస్తృతమయిన వివరణ, సులభంగా అర్థమవటానికి నేటి సమాజంనుండి ఉదాహరణలు, ప్రత్యేకంగా పొందుపరచిన అన్వయంతో కూడిన ఈ గ్రంథం అద్భుతంగా రూపుదిద్దుకుంది. దీనిని చదవటంవలన నాలో మెల్లమెల్లగా ఈశ్వరార్పణబుద్ధి, ఈశ్వరప్రసాదబుద్ధి పెరుగుతున్నట్లు అనిపిస్తోంది. గురువులు కోరిన గురుదక్షిణ నాకు దినచర్యగా మారింది. **– డా॥ యాదగిరి రావు**

ఈ భగవద్గీత చదవటంవలన నేను 'ఏమిటి'నుంచి 'అయితే ఏమిటి' అన్న స్థాయికి ఎదిగాను. జీవితంలోని మంచిచెడులు వచ్చి పోయే మేఘాలని తెలుసుకొన్నాను. జగత్‌యొక్క మిథ్యాతత్త్వాన్ని గ్రహించగలిగాను. ఈ మార్పు నా మానసిక సమతుల్యతకి దోహదపడింది. **–సూర్యకుమారి**

అక్షరం(ముద్రణ) అద్భుతం. సారవంతం, అర్థతాత్పర్యం. అన్వయం సుస్పష్టం. పదవిచ్ఛేదం దోషరహిత ఉచ్చారణానుకూలం. వివరణ సులభగ్రాహ్యం, గీతాపారాయణానుభవం అనుభవైకవేద్యం. **–డా॥ జయంత్**

జనాకర్షణగా, మనోరంజకముగా, అత్యంత సరళమైన భాషలో విశ్లేషిస్తూ వ్రాసిన భగవద్గీతా గ్రంథము అత్యంత అభినందనీయం. రచయిత్రి గారు శ్లాఘనీయులు. **– రొక్కం కుమార్ రావు**

**శక్తిప్రదాత –** గంగానదిలో మునిగి స్నానం చేస్తే తాజాగా ఉన్నట్లు, కొత్తగా కొండంత శక్తి వచ్చినట్లు అనిపిస్తుంది. అలానే బ్రహవిద్యా బోధలో మునిగితే అంత తాజాగానూ, అంత శక్తి వచ్చినట్లూ అనిపిస్తుంది. అలానే మా ఆర్ష విద్యా తరంగిణి సభ్యులమందరమూ **'మీ బ్రహ్మవిద్యా బోధ అనే గురుఘాట్‌లో ' బ్రహ్మవిద్యా స్నానం చేస్తూ సంసారమలమోచనం** వదిలించుకుంటూ, మరింత పునీతులమవుతూ, ఆనందసాగరంలో అహరహం మునకలు వేస్తూ ఉన్నాము. **– శారదక్క**

గురువుగారు భగవద్గీతను రోజూ పదిపేజీలు చదవమని, అది తమకు గురుదక్షిణ అనగానే శ్రద్ధగా పఠనం ప్రారంభించాను. చదువుతుంటే ఎన్నోసార్లు గురుముఖత విన్నవే అయినా, మనస్సుకు ఎంతో తృప్తినీ, ఆనందాన్నీ కలుగచేస్తున్నాయి. శ్రవణం, మననం చాలా కాలంగా చేస్తున్నాను. ఇక బోధల ప్రభావంవలన, ఏమి జరిగినా ఈశ్వరప్రసాదంగా స్వీకరించాలని, ఏ పని చేస్తున్నా ఈశ్వరార్పణబుద్ధితో చేయాలని బుద్ధి హెచ్చరిస్తున్నది. నా కృషి లోపం లేకుండా ఆచరిస్తాను. **– రమాభారతి**

శ్రీ కృష్ణపరమాత్మకు భగవద్గీతను బోధించే గురువులంటే చాలా ఇష్టం, కాబట్టి ఆ గురువు గారైన పరమార్థానంద స్వామిని మీకు అందించి మీచే ఈ భగవద్గీతను వ్రాయించారు. దీనిలో ప్రత్యేకత– ప్రతి అధ్యాయానికి ఉపోద్ఘాతం, సారాంశము, ప్రత్యేక విశ్లేషణలు. సంస్కృతం కూడా అందరికీ అర్థమయ్యేలా ఉంది. చదివిన వారు వారి బంధువులకు, స్నేహితులకు, క్లాసులు చెప్పేటట్టుగా ఉంది. ఉపనిషత్తుల సారమంతా రంగరించి కూర్చినందువల్ల చాలా సులభంగా అర్థము చేసుకుని మధ్యమ అధికారులు కూడా ఉత్తమ అధికారిగా ఎదుగుతారు. ఇలాంటి భగవద్గీత గురించి ఎంత చెప్పినా తక్కువే. – **సి. రాజ్యలక్ష్మి**

గురువుగారు శ్రీమతి రాజ్యశ్రీ గారు రచించిన శ్రీ మద్భగవద్గీత గ్రంథము తేటతెలుగులో, సులభశైలిలో అందరికీ అర్థం అయ్యేలాగ ఉంది. ప్రతిమనిషికీ నిత్యజీవితంలో ఎదురయ్యే అనుభవాలను ఉదాహరణలుగా చెప్పడంవల్ల, భగవద్గీతలో శ్రీకృష్ణపరమాత్మ చెప్పిన అంశాలు ఆదర్శప్రాయాలు, ఆచరణీయసాధ్యాలు అని తెలిసింది. మలం, విక్షేపం, ఆవరణాలు ఎలా తొలగించుకోవాలి; రాగం, మోహం, శోకం ఎలా అధిగమించాలి; ఆత్మ, అనాత్మల మధ్య భేదం ఏమిటి; కర్మ యోగం అంటే ఏమిటి; చిత్తశుద్ధి, చిత్త ఏకాగ్రతలకు మార్గాలేమిటి; జ్ఞానయోగంవల్ల ఉపయోగాలు ఏమిటి అన్న అంశాల వివరణ చాలా బాగుంది. శాంతి, భద్రత, ఆనందం బయట లేవు, నీలోనే ఉన్నాయని నొక్కి వక్కాణించడం అందరికీ చాలా ఉపయోగకరం. ముఖ్యంగా తత్త్వమసి, అహం బ్రహ్మాస్మి అన్నది అర్థమవడానికి, కర్ణుడు – కుంతి దృష్టాంతం చూపి వివరించడం నాకు చాలా చాలా నచ్చింది. **– రేణుక**

తేట తెలుగు భాషలో సులభశైలిలో పండితపామరులకు అర్థం అయ్యేరీతిలో సాగింది. గ్రంథం పఠించుటవలన వ్యక్తిత్వవికాసము, స్థితప్రజ్ఞత నాలో పెంపొందాయని నమ్ముతున్నాను. నా ఆధ్యాత్మికచింతన కొనసాగుటకు దోహదకారి ఈ గ్రంథరాజము అని నా భావన **– సుమంగళి**

సమస్త వేదముల సారమైన జ్ఞానమే భగవద్గీత. దీనిని సరళమైన చక్కని వ్యాఖ్యానముతో ప్రతిపదార్థ సహితముగా సులభమైన సాహిత్యసౌరభముతో తెలుగులో మా పూజ్యగురుదంపతులు అనువదించిరి. మహనీయుల వాక్యములందు మిక్కిలి శ్రద్ధావిశ్వాసములను ఉంచుట ఆస్తికులమైన మనందరి కర్తవ్యము.

**–సిరిగిరి ప్రభాకర్**

రాజ్యశ్రీ అమ్మ వ్రాసిన భగవద్గీత చదువుతున్నప్పుడు భగవద్గీత ఉపనిషత్తుల సారమని బాగా అర్థమయింది. సందర్భోచితంగా ఉపనిషత్తుల మంత్రాలను భగవద్గీతకు అనుసంధానము చేస్తూ చాలా చక్కగా వివరించారు. భజగోవిందంవంటి ప్రకరణగ్రంథములోని శ్లోకాలనూ ఉటంకించారు. ఈ గ్రంథ పారాయణం ఆధ్యాత్మిక ఎదుగుదలకు ఎంతగానో ఉపయోగపడుతుంది. **– శోభ**

ఈ భగవద్గీతలోని ప్రతి అంశము సందర్భోచితమైన ఉదాహరణలతో, ఎంతో వివరణాత్మకంగా ఉండి, అద్వైతవేదాంతపరంగా నిస్సంశయజ్ఞానాన్ని కలిగించేదిగా ఉంది. ఫ్రీ విల్లా? విధా? దీనిపై చేసిన ప్రత్యేక విశ్లేషణ ముఖ్యంగా నాకు నచ్చిన అంశం. – **పి.వి.యస్.యస్. శాస్త్రి.**

భగవద్గీత సారాంశం – బాహ్యప్రపంచాన్ని మార్చటం కాదు. ఆంతరిక శక్తిని పెంపొందించటం. స్కూలు మన మేథస్సుకు పదును పెడితే, గీత భావోద్రేకాలను తీర్చుదిద్దుతుంది. తెలివితేటలనే ఇంటిలిజెంట్ కోషంట్(ఐక్యూ)కన్నా భావోద్రేకమనే ఎమోషనల్ కోషంట్(ఇక్యూ) చాలా ముఖ్యం. జ్ఞాని చూసేది – అద్వైత నిత్యజలం; అజ్ఞాని చూసేది– ద్వైత అనిత్య తరంగం. అద్వైతం నిత్యం–ద్వైతం అనిత్యం. ఈ వాక్యాలలో ఎంతటి అర్థం ఉంది! ఈ భగవద్గీతలో ప్రతి అధ్యాయం ఒక ఆణిముత్యం.– **రాజేశ్వరి**

భగవద్గీత, అరటిపండు ఒలిచి నోటిలో పెట్టిన చందంగా, తేలికగా నా మనసుకు హత్తుకుపోయింది. స్వామి పరమార్థానందజీ బోధనల ఆధారంగా రాజ్యశ్రీ గారు తెలుగులో అనువదించిన, ఈ గ్రంథము **"జ్ఞానమకరందము "** అంటాను నేను. ఎందుకంటే – వేదాంతభాగము – ఉపనిషద్భాగము– ఇందులో మనకు తన సరళమైన, మధురమైన, తెలుగునుడికారముతో మేళవించి, స్వయంగా మనచేత జ్ఞానామృతాన్ని గ్రోలించారు. శ్రోత్రియ బ్రహ్మనిష్ఠుడు అయిన గురువు లేనిదే ఆత్మజ్ఞానం పొందటం అసాధ్యం అంటారు. కాని రాజ్యశ్రీ గారి భగవద్గీతను మూడు షట్కములు, ఆసాంతం అధ్యయనం చేస్తే– మనకు గురువుగా మన స్వామి పరమార్థానందజీ ప్రత్యక్షంగా బోధించినంత అనుభూతి కలిగి జీవన్ముక్తి ఫలం లభిస్తుంది. ఇది ముమ్మాటికీ నిజం. **– విష్ణుప్రసాద్.**

మీరు రచించిన భగవద్గీత ధ్యానశ్లోకాలనుంచే వివరణ చాలా బాగుంది. యింత వివరణ నేను యింతకుముందు ఎక్కడా చదవలేదు. అలాగే యిది చదవక ముందు రాగ, శోక, మోహలలో మునిగి వున్నాను. ఇప్పుడు వాటి అర్థం తెలిసాక వాటినుంచి బయట పడటానికి ప్రయత్నిస్తున్నాను. సంసారం, బంధకత్వం అన్నీ మిథ్య అని అర్థం అయింది. ప్రపంచంమీద ఆధారపడడం సంసారం. దేవునిమీద ఆధారపడటం భక్తి. మనమీద మనం ఆధారపడటం జ్ఞానం. అజ్ఞానం దుఃఖహేతువు. జ్ఞానం సుఖహేతువు. **– నళిని**

**అద్భుతం రోమహర్షణమ్ –** మల్లెపువ్వు పూర్తిగా విచ్చుకున్నాకే దాని పరిమళం తెలుస్తుంది. మాకు భగవద్గీతలో మొదట్లో లౌకిక విషయాల విశ్లేషణ మాత్రమే అర్థమయింది. ఆత్మబోధ ఇంతకుముందు అవగాహన కాలేదు. ఇందులో లోతుగా వెళ్ళిన కొద్దీ నాకు కొత్తగా తెలిసిన అంశాలు – రాగం, శోకం, మోహం – అద్భుతవిశ్లేషణ; దుఃఖం అంటే సత్యాన్ని ఒప్పుకోక పోవటం; మనం పరిస్థితులను మార్చలేనప్పుడు వాటిని స్వీకరించగలగటం; కర్మయోగం, తరువాత ఉపాసనయోగం, తరువాత వేదాంత శ్రవణ, మనన, నిదిధ్యాసనల వరుస క్రమం ప్రాముఖ్యత ఇప్పుడు తెలిసింది. ఇంతకుముందు గందరగోళంగా ఉన్నది ఇప్పుడు స్పష్టంగా అర్థమైనది. **–రామమోహన రావు**

ఈ భవసాగరంలో అహంకారమమకారాలతో వచ్చిన అన్ని రకాల సమస్యలకు, ఈ భగవద్గీతే పరమౌషధము **–రమాదేవి**

నాకు విభూతియోగము చాలా బాగా నచ్చినది. విశ్వంలో ప్రతి అణువున, భగవంతుడు ఎలా ప్రకటితమవుతున్నాడో – అంటే జ్యోతులలో సూర్యునిగా, ఏనుగులలో ఐరావతంగా, జలరాశులలో సముద్రునిగా, ఆ పరమాత్మ విభూతులతో విశ్వరూపదర్శనం అయినట్లే అనుభూతి చెందాను. పారమార్థిక స్థాయిని బాగా అర్థం చేసుకున్నాను. నిర్గుణబ్రహ్మ గురించి బాగా అవగాహన అవుతున్నది. ఈ భగవద్గీత చదువుతుంటే సమయమే తెలియకున్నది. ఏదో అనిర్వచనీయమైన ఆనందం కలుగుతున్నది.

**– వి.సాయిలక్ష్మి**

ప్రతి పని ఈశ్వరార్పణబుద్ధితో చేస్తూ, ఈశ్వరసంకల్పము ప్రకారమే జరుగుతున్నది, అన్న స్పృహతో చేస్తూ ఉంటే ఏది కూడా కష్టముగా అనిపించక, శ్రద్ధగా చేయాలి అనిపిస్తుంది. ఇక నిషిద్ధకర్మలు చేసే అవకాశం లేదు. ఏమి జరిగినా ఈశ్వరప్రసాదంగా, భావిస్తూ, ఈశ్వరార్పణ చేస్తూ ఉంటే బంధకత్వానికి, రాగం, మోహం, శోకంకు కూడా తావు లేకుండా చాలా తేలికగా ఉంది. **– సరోజినీ దేవి**

గురుమాతగారు, మీరు రచించిన మొదటి షట్కము చూడగానే నా హృదయంలో ఆశ్చర్యానందాలు కలిగాయి. ఆ పరమాత్మే మీలో ఉండి, ప్రతిపదము వ్రాయించారు. అదీ మా గురువులే వ్రాయడం మేము చేసుకున్న సౌభాగ్యం. కర్మయోగంద్వారా చాలా మనస్సుకు హత్తుకుపోయి, ఆ మార్గంలోనే వెళ్ళేలాగ, మా మనస్సులను చాలా విస్తారంగా సిద్ధం చేస్తూ వస్తున్నారు. సనాతనంగా ఆ పరమాత్మ ఈ లోకానికి భగవద్గీత అందించారు. ఏ పని చేసినా మంచిబుద్ధితో అంటే ఆ కర్మను ఈశ్వరార్పణ బుద్ధితో చేస్తేనే అది కర్మయోగం అని ఇటువంటి చాలా మార్గదర్శకాలతో మా ముందు ఆ గీతామృతమును అందించారు. – **పి.యమున.**

ఈ భగవద్గీత రచన – ఆస్వాదన – అద్భుతం, అద్వితీయం, అమోఘం, అనిర్వచనీయం, ఆశ్రితవత్సలం, అభీష్టఫలప్రదం, అమదానందసందోహభరితం, అనుభవైకవేద్యం. నాకు బాగా నచ్చిన అంశం త్రైగుణ్య విశ్లేషణ **– మల్లాది శిరీష కుమారి**

భగవద్గీతలో నాకు నచ్చిన ముఖ్యాంశాలు– రాగ, శోక, మోహం గురించి; మనసుని ధ్యానంద్వారా ఎలా అదుపులో పెట్టుకోవాలి; మనసు మోహంవల్ల వివేకం ఎలా కోల్పోతుంది. సన్యాసం, అజ్ఞానం, జ్ఞానం, యోగా గురించి చాలా విపులీకరించి, జీవితసత్యాన్ని నిజమైన అక్షర రూపంలో తీర్చిదిద్దారు. కర్మ చేయి, జ్ఞానయోగ్యతను పొందు, జ్ఞానంతో మోక్షం పొందు అని చాలా చక్కగా వ్రాశారు. ఈ భగవద్గీత చదివి జీవరహస్యం తెలుసుకోవాలి. చాలా బాగుంది.– **తాతా కామేశ్వరి**

ఈ భగవద్గీత పుస్తకములో అర్థములు ఒక క్రమపద్ధతిలో వివరించుట జరిగినందువలన భగవద్గీత చదువుతున్నప్పుడు శ్లోకాలు కూడా తేలికగా చదవగలగటమేకాక కొన్ని ముఖ్యమైన శ్లోకాలను కంఠస్థము కూడా చేయగలుగుట నాకు ఎంతగానో సంతోషముగా వున్నది. **– శ్రీధర్ కర్పూరపు**

నాకు మానసిక పరిపక్వత ఈ గీతా బోధవలన వచ్చింది. ఆత్మ సాక్షిచైతన్యరూపంలో అందరి హృదయాలలో ఉన్నది అని, ఈ గీత ద్వారా గ్రహించాను. భగవద్గీత చదువుతుంటే ఇది అక్షరాలా మోక్షశాస్త్రమే అనిపించినది. ఈ జగత్‌లో అణువణువులోను భగవంతుని స్వరూపమే ఉంది అని అర్థం చేసుకున్నాను. చదివిన కొద్ది మాసాల్లోనే అమితానందం కలుగచేస్తుంది. సుస్పష్టంగా గీతలోని అద్వైతామృతవర్షిణి మాపై కురిపించి, నేను పూర్ణుడును, ఆనందము నా స్వరూపం, ఆ పరమాత్మను "నేనే" అనే నిశ్చయాత్మకబుద్ధిని కలుగచేసి, జీవన్ముక్తిని చవి చూపిస్తున్నారు **– జి విష్ణుప్రియా దేవి**

భగవద్గీత ప్రతి మనిషియొక్క జీవనయానానికి చుక్కాని లేక నిఘంటువులా ఉన్నది. అవసరమైన చోట సమానభావముగల ఉపనిషత్ మంత్రాల వివరణ చాలా బాగుంది. **– మీనాక్షి.**

ఈ భగవద్గీతనందు ఒక వరుస క్రమములో శ్లోకము, ప్రతిపదార్థము, అన్వయము, తాత్పర్యము, విశ్లేషణ, ఉదాహరణలతో చదువుతున్నప్పుడు ఒక దృశ్యమాలిక వలె గోచరించుచున్నది. మేము పారాయణము చేయుటకు ఎంతో ఆసక్తికరముగాను, సౌలభ్యముతోను ఉండి దివ్యానుభూతిని కలిగించుచున్నది. **– సంధ్యారాణి కర్పూరపు**

గురుదక్షిణగా గురువుగారు శ్రీ మద్భగవద్గీత పారాయణం చేయమని చెప్పిన తరువాత. నేను శోభగారు కలిసి చర్చించుకొంటూ చదువుచున్నాము. అమ్మగారు ఉదాహరణలతో చక్కగా వ్రాసినందువల్ల మొదటసారి చదువుతున్నా. బాగా అర్థమవుతూ ఉంది. ధ్యానంలో కూడా మనసుకు ఏకాగ్రత కలుగుతున్నది. **– సి. సరళ**

కృష్ణుని బోధ, మన వ్యవహరిక జీవితంలో ఇంత ఇంకిపోయేలా ఉండటంవల్ల, అతి సరళంగా చెప్పాలంటే మన నడవడికను ప్రతిక్షణం గమనించుకుంటూ సరిదిద్దుకోవటం, చాలా తేలిక అనిపిస్తుంది. ఈ బాట ఒకప్పుడు అమ్మో అనిపించవచ్చు. కానీ, ఇది చదువుతుంటే, చాలా ధైర్యంగా, నమ్మకంగా నడవగలం అనిపిస్తుంది.ఒక్కముక్కలో చెప్పాలంటే మనం "స్థితప్రజ్ఞత" సాధించటం తథ్యం అనే అభయాన్ని ఇచ్చారు. **– లక్ష్మి భాగవతుల**

వేదాంతం శ్రుతిప్రమాణము, భగవద్గీత అనుభవప్రమాణము. అందుకనే **'బ్రహ్మవిద్యాయామ్ యోగశాస్త్రే'** అన్నారు. గీత సంసారం దుఃఖసంయోగ, వియోగమని చెప్పుచున్నది కదా! **'సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ'** అన్నాడు భగవంతుడు. ఈ వాక్యాన్ని ఎంతో వివరంగా మనకు బోధించారు. ఉపనిషత్తులు, బ్రహ్మసూత్రాలు, వివేకచూడామణి, భాగవతం– వీటన్నిటి సారం భగవద్గీతలో ఉంది. అందువల్ల ఇది ఒక్కటీ రోజూ అధ్యయనం చేసుకుంటూ ఆచరణలో పెట్టుకున్న వారికి ఆనందమే ఆనందం. ఇది సత్యం – **సుభద్ర**

మనకు ఆస్తిపాస్తులు, వస్తువులు ఏమి ఉన్నా వాటిమీద అభిమానం పెంచుకోకూడదు. అవి భగవంతునికి చెందినవనుకోవాలి. నిజం చెప్పాలంటే మనల్ని ధర్మాధికారిగా నియమించాడాయన. వాటిని మన అవసరానికి వాడుకోవడానికి తాత్కాలికంగా ఇచ్చాడు. ఎప్పుడు కావాలంటే అప్పుడు వెనక్కు తీసుకునే హక్కు ఆయనకుంది. నేను భగవద్గీత చదవడము మొదలు పెట్టిన 14వ రోజున నాకొక సత్సంగంనుండి కబురొచ్చింది. వారు భగవద్గీత చెప్పవలసిందిగా నన్ను కోరారు. – **స్వర్ణలత**

ఈశ్వరార్పణ బుద్ధితో చేస్తే ఎంత చిన్న పనినైనా నిర్లక్ష్యం చేయము. ఈశ్వరునికి అర్పిస్తాము. కనుక వచ్చిన ఫలం ప్రసాదబుద్ధితో స్వీకరిస్తాము. ప్రకృతిసూత్రం భగవంతుడే కనిపెట్టాడు. మనం ఉన్నదాన్ని పట్టుకొంటాము. ఏదైనా కనిపెడితే ఆ బుద్ధి భగవంతుడే ఇచ్చాడని కృతజ్ఞత చెప్పాలి. – **తాయారు**

భగవద్గీత పుస్తకాలు గురువులద్వారా మనకు అందిన విలువైన కానుకలు. ఆంగ్లమాధ్యమం ద్వారా నేను వినని పరమార్థానంద స్వామిజీ గారి బోధనలను చక్కగా కూర్చి అందించారు – **మాధవి**

ఈ భగవద్గీతలో నాకు నచ్చిన అంశాలు – మార్చలేని పరిస్థితులను నీవు స్వీకరించవలసిందే. ఈ విషయము నాకు ప్రేరణనిచ్చింది. పరిస్థితులకు మనస్సును సిద్ధము చేసుకోగలననే భావిస్తున్నాను. ధ్యానం, శరణాగతి పాటించడంవలన పరిస్థితులను గొణుగుతూ, ఏడుస్తూ, ఏడ్పిస్తూ, ద్వేషంతో ఎదుర్కొనకుండా చిరునవ్వుతో స్వీకరించే సాధన చేయాలని చేప్పే స్వామీజీ బోధ ఎంతో ప్రశంసనీయము.

**– పి వేంకటాచార్యులు**

భగవద్గీత చదవటం నాకు చాలా ఆనందాన్నిస్తుంది. సత్త్వగుణం పెంచుకుని, ఆత్మనిష్ఠలో ఉండి శ్రవణ, మనన, నిదిధ్యాసనలతో జ్ఞానం పెంచుకోవాలనే కోరిక నాకు కలిగినది. విభూతియోగము, విశ్వరూపదర్శనయోగాలు గురువుగారు వివరించినవి చదువుతూ ఉంటే అలౌకిక ఆనందము కలుగుతున్నది. – **ఈశ్వరి**

ఈ భగవద్గీత చదువుతున్నప్పుడు ఇంకా ఇంకా చదవాలి అనిపిస్తుంది. గురువుగారు మా ముందు కూర్చుని మాకు బోధిస్తున్న ఆనందం కలుగుచున్నది. భగవద్గీత చదవటంవలన ద్వైతంనుండి అద్వైతజ్ఞానం పొందిన అనుభూతి పొందుతున్నాను. భగవద్గీత పారాయణం చేస్తున్నప్పుడు నాకు సమయం తెలియటం లేదు. **–గంగాయమ్మ**

మన గురువులు శ్రీమతి రాజ్యశ్రీగారు, వారి గురువులైన, పూజ్య స్వామి పరమార్థానందజీ బోధనల స్ఫూర్తితో మనకందించిన "శ్రీమద్భగవద్గీత" మిక్కిలి సులభమైన శైలిలో సర్వసుబోధములుగా వ్రాయబడింది. ప్రతిశ్లోకముయొక్క అర్థాన్ని, దాని వెనుకనున్న అంతరార్థాన్ని విశదీకరించి ఉదాహరణ సహితముగా వివరించుటయే గాక, సాధకులు నిత్యము మననము చేయవలసిన యెన్నో విషయాలను తేలికగా అర్థం చేసుకునే రీతిలో, ఈ అక్షరమాలలో పొందుపరిచారు. మంచిపనులు, మంచిరచనలు చేసేవారు అరుదైన ఈ రోజులలో, ఈ బృహత్కార్యాన్ని నిర్విఘ్నంగా కొనసాగించిన వారి దృఢసంకల్పం అభినందనీయం. ఇంతేకాక, అంతకంటే దృఢంగా, ఈ పుస్తకాలను చదవాలన్న ఆతృత ఉన్న ప్రతివారికి ఉచితంగా అందజేయటమే కాకుండా, వారిచే, నిత్యపారాయణ యజ్ఞం చేయిస్తూ దాన్ని ఒక గురుతర బాధ్యతగా స్వీకరిస్తున్నారు. **– నిర్మల**

నాకు భగవద్గీతలో బాగా నచ్చినవి: కుండ– మట్టి, చేయి – కాంతి, చీకటిగది–వెలుతురు ఉదాహరణలు; ఆత్మానాత్మల వివరణ; సిత్థప్రజ్ఞ లక్షణాలు; వాటిని పరీక్షించుకొనుటకు వివరించిన ఎఫ్ ఐ ఆర్ పరీక్ష; రాగం, శోకం, మోహాల వివరణ; జ్ఞాని చేయు కర్మలను అజ్ఞాని అనుకరించుట, దాని ప్రాముఖ్యము. **– విజయానంద్**

మన భగవద్గీత పారాయణం చేయడంవల్ల క్రమశిక్షణ, అంతర్గత ఎదుగుదల వచ్చింది. అంతర్గత ఎదుగుదలవల్ల సమస్యను చూసే దృక్కోణం మారింది **– ప్రసన్న**

ఏ పని చేస్తున్నా అది అశాశ్వతమనీ, అముఖ్యమనీ, అసలు లక్ష్యం దైవచింతన అనీ గుర్తుంచుకోవాలి. ఎన్నడూ వాదనలోకి దిగకూడదు. ఈ భగవద్గీతనుంచి మనం నేర్చుకున్న జ్ఞానం మన అణువణువులోనూ ప్రవేశించాలి. అప్పుడే అది మన జీవితాన్ని మార్చివేస్తుంది. **– ఆషారాణి**

**'ఈ భగవద్గీత'** అందరికీ అందుబాటులో ఉండే **'ద్రాక్ష పళ్ళ'** గుత్తి వంటిది. ఇది పామరుడికి, పండితుడికి, సమానమైన రసముతో అర్థమయ్యే రీతిలో సరళమైన భాషలో, రసరమ్యముగా ఆనందాన్ని అందిస్తోంది. **– గందవరపు మంజుల**

# శ్రీమద్భగవద్గీతా మాహాత్మ్యమ్

గీతాశాస్త్రమిదం పుణ్యం యః పఠేత్ ప్రయతః పుమాన్ ।
విష్ణోః పదమవాప్నోతి భయశోకాదివర్జితః ॥ 1

గీతాధ్యయనశీలస్య ప్రాణాయామ పరస్య చ ।
నైవ సంతి హి పాపాని పూర్వజన్మకృతాని చ ॥ 2

మలనిర్మోచనం పుంసాం జలస్నానం దినే దినే ।
సకృద్గీతాంభసి స్నానం సంసారమలనాశనమ్ ॥ 3

గీతా సుగీతా కర్తవ్యా కిమన్యైః శాస్త్రవిస్తరైః ।
యా స్వయం పద్మనాభస్య ముఖపద్మాద్వినిఃసృతా ॥ 4

భారతామృతసర్వస్వం విష్ణోర్వక్త్రాద్వినిఃసృతమ్ ।
గీతాగంగోదకం పీత్వా పునర్జన్మ న విద్యతే ॥ 5

సర్వోపనిషదో గావో దోగ్ధా గోపాలనందనః ।
పార్థో వత్సః సుధీర్భోక్తా దుగ్ధం గీతామృతం మహత్ ॥ 6

ఏకం శాస్త్రం దేవకీపుత్రగీతమ్ ఏకోదేవో దేవకీపుత్ర ఏవ ।
ఏకో మంత్రస్తస్య నామాని యాని కర్మాప్యేకం తస్య దేవస్య సేవా ॥ 7

॥ ఓం శ్రీపరమాత్మనే నమః ॥

# శ్రీమద్భగవద్గీత - మూడవ షట్కము

# అథ త్రయోదశోఽ ధ్యాయః - క్షేత్ర-క్షేత్రజ్ఞ విభాగయోగః

## (పదమూడవ అధ్యాయము - క్షేత్ర-క్షేత్రజ్ఞ విభాగయోగము)

భగవద్గీతలో మూడు షట్కాలు ఉన్నాయి. ఒక్కొక్క షట్కంలో ఆరు అధ్యాయాలు ఉంటాయి.

**మొదటి షట్కము - అధ్యాయాలు 01-06 - త్వమ్ పదవిశ్లేషణ**

**రెండవ షట్కము - అధ్యాయాలు 07-12 - తత్ పదవిశ్లేషణ**

**మూడవ షట్కము - అధ్యాయాలు 13-18 - అసి పదవిశ్లేషణ**

ఈ మూడు షట్కాలూ కలిపి **తత్త్వమసి** (తత్+త్వమ్ + అసి) మహావాక్యాన్ని విశ్లేషిస్తాయి. తత్ అంటే పరమాత్మ; త్వమ్ అంటే జీవాత్మ; అసి అంటే ఐక్యం. జీవాత్మ, పరమాత్మల ఐక్యాన్ని సూచిస్తుంది కాబట్టి ఈ వాక్యాన్ని మహావాక్యం అంటారు. భగవద్గీత ఈ మూడు షట్కాల్లోనూ, ఈ మూడు పదాలనూ విశ్లేషిస్తుంది. కాకపోతే ముందు త్వమ్ పదార్థ విశ్లేషణ వస్తుంది. రెండవ షట్కంలో తత్ పదార్థ విశ్లేషణ, మూడవ షట్కంలో అసి పదార్థ విశ్లేషణ వస్తాయి. అందువల్ల భగవద్గీత **మోక్షశాస్త్రము.**

ఒక్కొక్క షట్కంలోనూ మళ్ళీ మూడు అంశాలు చర్చించబడతాయి.

**మొదటి షట్కంలోని మూడు అంశాలు**

ఎ) జీవస్వరూపం - త్వమ్ పద విశ్లేషణ

బి) కర్మయోగసాధన

సి) పురుష ప్రయత్నం లేదా ఫ్రీవిల్

పురుషప్రయత్నంయొక్క ప్రాముఖ్యతను గురించి ఈ షట్కములో వివరించాడు కృష్ణపరమాత్మ. మీరు పూర్తిగా విధి చేతిలో కీలుబొమ్మలు కారు, భగవంతుడు ఆడే వింతనాటకంలో కేవలం పాత్రధారులు మాత్రమే కారు. దానికి తోడుగా మీ ఫ్రీవిల్ పాత్ర కూడా ఉంది. ఫ్రీవిల్లా, విధా? ఈ చర్చను సందర్భం వచ్చినప్పుడల్లా చూస్తూనే ఉన్నాము. మీ భవిష్యత్తును అటు పూర్తిగా విధీ నిర్ణయించదు, ఇటు పూర్తిగా ఫ్రీవిల్లూ నిర్ణయించదు.

పూర్తిగా విధిమీద ఆధారపడితే, మీరు కీలుబొమ్మలు అయినట్టు అవుతుంది. వేదాంతం ఆ సిద్ధాంతాన్ని అంగీకరించదు. జాతకంద్వారా, నాడీజోస్యంద్వారా, లేదా వేరే ఏదైనా పద్ధతిద్వారా, మీరు మీ భవిష్యత్తును తెలుసుకోగలరు కాని, మీరు గమనించాల్సిన విషయం ఒకటి ఉంది. మీ తలరాత ఎలా ఉంటే అలా అవుతుంది అనుకోకూడదు. మీ ఫ్రీవిల్ పాత్ర కూడా ఉంటుంది. ఫ్రీవిల్‌ను పురుషార్థం అనీ, ప్రయత్నం అనీ అంటారు. అందువల్ల నీ ప్రయత్నం నువ్వు చెయ్యాలి, నిన్ను నువ్వే ఉద్ధరించుకోవాలి అన్నాడు కృష్ణపరమాత్మ.

**ఉద్ధరేదాత్మనాత్మానం నాత్మానమవసాదయేత్ ।**
**ఆత్మైవ హ్యాత్మనో బంధుః ఆత్మైవ రిపురాత్మనః ॥** - 6.5

అందువల్ల మీరు వృద్ధిలోకి రావటానికి మీ ప్రయత్నం మీరు చెయ్యాలి. మీరు ప్రయత్నం చేస్తే, భగవంతుని సహాయం తప్పకుండా ఉంటుంది. నువ్వు సగం, దైవం సగం అంటారు పెద్దలు.

**రెండవ షట్కంలోని మూడు అంశాలు**

ఎ) ఈశ్వరస్వరూపం - తత్ పదవిశ్లేషణ

బి) ఈశ్వర ఉపాసన - యోగసాధన

ఈశ్వర ఉపాసన రెండు రకాలుగా చెయ్యవచ్చు - ఇష్టదేవతా ఉపాసన, విశ్వరూప ఉపాసన. ఇష్టదేవతా ఉపాసనను అభ్యాసయోగము అన్నాడు కృష్ణపరమాత్మ. విశ్వరూప ఉపాసనకు శిక్షణను పదకొండవ అధ్యాయంలో చూశాము.

**అనేకవక్త్రనయనమ్ అనేకాద్భుతదర్శనమ్ ।**
**అనేకదివ్యాభరణం దివ్యానేకోద్యతాయుధమ్ ॥** - 11.10

సి) ఈశ్వరకృప

మొదటి షట్కములో ఫ్రీవిల్‌యొక్క ప్రాధాన్యతను చర్చిస్తే, రెండవ షట్కములో ఈశ్వరకృపను కీర్తించాడు కృష్ణపరమాత్మ. మానవప్రయత్నం ముఖ్యమే కాని దానికి ఈశ్వర అనుగ్రహం కూడా తోడవ్వాలి. నిజానికి ఈశ్వరానుగ్రహం ఎప్పుడూ ఉంటుంది. దాన్ని మనం పొందే విధానం తెలుసుకోవాలి, అంతే. జలపాతంలో అవ్యక్తంగా విద్యుచ్ఛక్తి ఉంటుంది కాని, దాన్ని సరిగ్గా వినియోగించుకునే హైడ్రోఎలక్ట్రిక్ ప్రాజెక్ట్ ఉండాలి.

అదే విధంగా ఈశ్వరానుగ్రహం ఎలా పొందాలో నేర్చుకోవాలి. అద్వైతసిద్ధాంతులమీద ఒక అపోహ ఉంది. వారు బుద్ధిని నమ్ముతారు, వారికి భక్తి లేదు అనుకుంటారు. అది పొరపాటు. గొప్ప అద్వైతసిద్ధాంతులు కూడా ఈశ్వరానుగ్రహం ఉండితీరాలని నమ్ముతారు.

ఈ విధంగా మొదటి రెండు షట్కాలలోనూ ఆరు అంశాలను చూశాము. ఇప్పుడు మనం మూడవ షట్కంలోకి అడుగుపెడుతున్నాము. దీన్ని చరమషట్కము అని, అంతిమ షట్కము అని కూడా అంటారు. ఈ షట్కములో కూడా మూడు అంశాలు చర్చించబడతాయి.

**మూడవ షట్కంలోని మూడు అంశాలు**

ఎ) జీవ ఈశ్వరస్వరూప ఐక్యం - అసి పద విశ్లేషణ

బి) జ్ఞానయోగ సాధన

సి) విలువలు

ఎ) **జీవ-ఈశ్వర స్వరూప ఐక్యం** – జీవ-ఈశ్వర స్వరూప ఐక్యము అని చెప్పటంద్వారా పైపైన చూస్తే జీవునికీ, ఈశ్వరునికీ మధ్య భేదాలు ఉన్నాయని చెప్పకనే చెప్పినట్టయింది. బాహ్యంగా వీరి మధ్య భేదం ఉన్నా కూడా, స్వరూపరీత్యా రెండూ ఒక్కటే. ఈ విషయం అర్థం అవటానికి శాస్త్రంలో మనం చూసే ఉదాహరణ అల-సముద్రం.

అలకూ, సముద్రానికీ భేదం ఉందా, లేదా? పైపైన చూస్తే వాటికి చాలా పెద్ద భేదమే ఉంది. అందువల్లనే అలను అల అనీ, సముద్రాన్ని సముద్రం అనీ అంటారు. అల చాలా చిన్నది; సముద్రం చాలా పెద్దది; అల కార్యం, సముద్రం కారణం; అల జీవితం చాలా చిన్నది, సముద్రం జీవితం చాలా ఎక్కువ కాలం ఉంటుంది. కాని వాటి స్వరూపాన్ని లోతుగా విశ్లేషిస్తే రెండింటిలోనూ సమానంగా ఉన్నది ఒక్కటే – అది నీరు.

అలలో ఏం ఉంది? నీరు ఉంది. నీరు తప్ప ఏమీ లేదు. సముద్రంలో ఏం ఉంది? నీరే ఉంది. నీరు లేకుండా అలా లేదు, సముద్రమూ లేదు. అలలోనూ, సముద్రంలోనూ ఉన్నది ఒకే నీరు. ఒకే నీరుకు రెండు నామరూపాలు– అల, సముద్రం. ఇంతవరకూ నామరూపాలను చూస్తున్నాము, ఇప్పుడు మన దృష్టిని బాహ్యంగా ఉన్న నామరూపాలనుంచి, సమానంగా ఉన్న తత్త్వంవైపుకు దృష్టిని మళ్ళిస్తే అలలోనూ, సముద్రంలోనూ ఉన్నది ఒకే నీరు అని తెలుసుకుంటాము. నీరును అధిష్ఠానం అంటారు. అంటే అధిష్ఠానమైన నీటి దృష్ట్యా అల, సముద్రం రెండూ ఒకటే.

అదే విధంగా జీవాత్మ, పరమాత్మలను పైపైన చూస్తే అనేక భేదాలున్నాయి. కాని జీవాత్మ అంటే జీవ+ఆత్మ; పరమాత్మ అంటే పరమ+ఆత్మ. అంటే రెండింటిలోనూ సమానంగా ఉన్నది ఆత్మ. ఆత్మను చైతన్యతత్త్వం అంటారు. చైతన్యతత్త్వాన్ని అధిష్ఠానం అంటారు. అంటే అధిష్ఠానమైన చైతన్యం దృష్ట్యా జీవాత్మ, పరమాత్మ రెండూ ఒకటే. దీన్ని జీవాత్మ పరమాత్మ స్వరూప ఐక్యం అంటారు. దీన్నే అసి పదార్థ విశ్లేషణ అంటారు.

బి) **జ్ఞానయోగసాధన** – గురువు జీవాత్మ పరమాత్మ ఐక్యాన్ని తత్త్వమసి అనే మహావాక్యంద్వారా బోధిస్తే, శిష్యుడు అహం బ్రహ్మ అస్మి అని అర్థం చేసుకుంటాడు. నేను బ్రహ్మను అని చెప్పే మహావాక్యాన్ని అర్థం చేసుకోవటమే జ్ఞానయోగం.

జీవ-ఈశ్వర ఐక్యాన్ని బోధించే వాక్యాన్ని మహావాక్యం అంటారు. దీన్ని గ్రేట్ ఈక్వేషన్ అంటారు. ఈక్వేషన్‌ను సమీకరణం అంటారు. ఈ సమీకరణ సిద్ధాంతం అద్భుతంగా ఉంటుంది. సమీకరణం ఎప్పుడు చేస్తాము? అన్ని శాస్త్రాల్లోనూ ఈ ఈక్వేషను వస్తుంది.

ఉదాహరణకు గణితశాస్త్రంలో చూస్తే రెండు అంకెలు పూర్తిగా భిన్నంగా ఉంటే సమీకరణం చెయ్యలేము 8=9 అనలేము. అదే విధంగా రెండు అంకెలు అక్షరాలా ఒక్కలాగే ఉంటే సమీకరణం అవసరం లేదు. 8=8 లేదా 9=9 అని పనిగట్టుకుని చెప్పనవసరం లేదు. అంటే పూర్తిగా భిన్నంగా ఉంటే సమీకరణం చెయ్యలేము, పూర్తిగా ఒకదాన్ని ఒకటి పోలి ఉంటే సమీకరణం అవసరం లేదు. మరి ఎప్పుడు చెయ్యాలి? రెండు అంశాలు చూడటానికి భిన్నంగా ఉన్నా కూడా, వాటి సారం ఒకటే ఉన్నప్పుడు చెయ్యాలి.

$4+3 = 9-2$

ఈ అంకెలను పైపైన చూస్తే ఈక్వేషన్‌కు రెండువైపుల ఉన్న అంకెలు భిన్నంగా ఉన్నాయి. ఒకవైపు 4, 3 ఉంటే ఇంకొకవైపు 9, 2 ఉన్నాయి. ఒకవైపు ప్లస్ ఉంటే, ఇంకొకవైపు మైనస్ ఉంది. ఆ విధంగా ఎటు చూసినా ఈ రెండూ సరిపోవు అని కళ్ళు చెబుతున్నాయి; కాని బుద్ధి మాత్రం 'ఆగు అవి పైకి కనబడే భేదాలు, వాటి స్వరూపం ఒకటే,' అని చెబుతుంది. అది ఎలా?

$4 + 3 = 7 = 9 - 2$

4, 3 కూడితే 7 వస్తుంది; 9 లోంచి 2 తీసివేసినా కూడా 7 సంఖ్యే వస్తుంది. అందువల్ల స్వరూపదృష్ట్యా రెండూ ఒకటే.

అదే విధంగా జీవాత్మనూ, పరమాత్మనూ తీసుకుంటే చాలా భేదాలు ఉన్నాయి. జీవాత్మ అల్పజ్ఞుడు అయితే, పరమాత్మ సర్వజ్ఞుడు; జీవాత్మ అల్పశక్తిమంతుడు అయితే, పరమాత్మ సర్వశక్తిమంతుడు; జీవాత్మ అల్పగతుడు అయితే, పరమాత్మ సర్వగతుడు. అలా చెప్పుకుంటూపోతే, ఎన్నో భేదాలు ఉన్నాయి. నిజానికి భేదం పదం సరిపోదు. ఇద్దరూ ఒకరికి ఒకరు పూర్తి భిన్నంగా ఉన్నారు. జీవాత్మ సృష్టించబడిన జీవి అయితే, పరమాత్మ ఆ జీవిని సృష్టించిన సృష్టికర్త; జీవాత్మ భక్తుడు అయితే, పరమాత్మ భగవంతుడు.

కాని శాస్త్రం ఈ భేదం $4 + 3 = 9 - 2$ లాంటి భేదం అంటుంది. జీవాత్మలోనూ, పరమాత్మలోనూ ఐదు అంశాలు ఉన్నాయి.

| **జీవాత్మ** | **పరమాత్మ** |
|---|---|
| స్థూలశరీరం | స్థూలప్రపంచం |
| సూక్ష్మశరీరం | సూక్ష్మప్రపంచం |
| కారణశరీరం | కారణప్రపంచం |
| ప్రతిబింబచైతన్యం | ప్రతిబింబచైతన్యం |
| బింబచైతన్యం | బింబచైతన్యం |

మొదటి మూడింటిలో అల, సముద్రంలోలాగా చాలా వ్యత్యాసం ఉంది. వాటిలో ఉన్న వ్యత్యాసాలవల్ల వాటిలో ఉండే ప్రతిబింబ చైతన్యంలో కూడా చాలా భేదం ఉంది. కాని అంత చిన్న అలలోనూ, అంత పెద్ద సముద్రంలోనూ ఒకే నీరు అధిష్ఠానంగా ఉన్నట్టుగా అంత చిన్న జీవాత్మలోనూ, అంత పెద్ద పరమాత్మలోనూ అధిష్ఠానంగా ఉన్న ఆత్మ (బింబచైతన్యం) పరంగా ఇద్దరూ ఒకటే. స్వరూపదృష్ట్యా జీవాత్మ, పరమాత్మలు ఒక్కరే. దీన్ని జ్ఞానయోగం అంటారు. దీన్ని పొందటానికి వేదాంతశ్రవణ, మనన, నిదిధ్యాసనలు చెయ్యాలి. ఈ అంశాన్ని 13, 14, 15వ అధ్యాయాల్లో చూస్తాము.

సి) **విలువలు** – ఈ జ్ఞానయోగాన్ని జీర్ణించుకోవాలంటే ధార్మిక మనస్సు ఉండాలి.

**నావిరతో దుశ్చరితాన్నాశాన్తో నాసమాహితః ।**

**నాశాన్తమానసో వాపి ప్రజ్ఞానేనైనమాప్నుయాత్ ॥** – కఠోపనిషత్ 1.2.24

మనస్సు ధార్మికంగా లేకపోతే, మంచి విలువలు పెంపొందించుకోకపోతే, మనస్సు సంసిద్ధంగా లేకపోతే, వేదాంతబోధ నేర్చుకుని కూడా ప్రయోజనం ఉండదు. ఎడారిలోని ఇసుకలో ఎంత గొప్ప విత్తనాలు నాటినా కూడా అవి మొలకెత్తవు. అలాగే, మనస్సనే నేలలో జ్ఞానమనే విత్తనాలు నాటాలంటే ఆ మనస్సు అనువుగా ఉండాలి. దానికి మంచి విలువలు తోడ్పడుతాయి. ఏమిటా విలువలు? కృష్ణపరమాత్మే స్వయంగా చెబుతాడు ఆ విలువలు ఏమిటో. అన్ని అధ్యాయాల్లోనూ చెబుతాడు. 13, 14, 15, అధ్యాయాల్లో కొన్ని చెప్పి, 16,17 అధ్యాయాలను పూర్తిగా విలువలకే కేటాయిస్తాడు. ఈ విలువలను సద్గుణాలు అని అంటారు. ధర్మశాస్త్రంలో ఆత్మగుణాలు అంటారు. అదే వేదాంతపరిభాషలో చెప్పాలంటే సాధనచతుష్టయ సంపత్తి అంటారు. ఈ విలువలను మూడవ అంశంలో చర్చిస్తాడు కృష్ణపరమాత్మ. అంటే మూడవషట్కములో జీవఈశ్వర స్వరూపఐక్యం- అసి పదవిశ్లేషణ, జ్ఞానయోగసాధన, విలువల గురించిన బోధ ఉంటుంది. ఈ నేపథ్యంతో మూడవషట్కములోకి అడుగుపెడదాము.

పదమూడవ అధ్యాయముతో ఈ షట్కము మొదలవుతుంది. కొన్ని పుస్తకాలలో ఈ అధ్యాయం అర్జున ఉవాచతో మొదలవుతుంది; మరికొన్ని పుస్తకాలలో భగవాన్ ఉవాచతో మొదలవుతుంది. అంటే ఆ ప్రశ్న ముందు ఉండి ఉండకపోవచ్చు, తర్వాత ఎవరైనా కలిపి ఉండవచ్చు. ఆ వివరాలు మనకు అనవసరం. ఏది ఏమైనా ఆ ప్రశ్న మనకు ఉపయోగకరంగా ఉంటుంది. అందువల్ల మనం అర్జునుని ప్రశ్నతో మొదలుపెడదాము. అది తీసుకుంటే పదమూడవ అధ్యాయంలో 35 శ్లోకాలు అవుతాయి.

**అర్జున ఉవాచ**

శ్లో. 1 **ప్రకృతిం పురుషం చైవ క్షేత్రం క్షేత్రజ్ఞమేవ చ ।**
**ఏతద్వేదితుమిచ్ఛామి జ్ఞానం జ్ఞేయం చ కేశవ ॥**
ప్రకృతిమ్, పురుషమ్, చ, ఏవ, క్షేత్రమ్, క్షేత్రజ్ఞమ్, ఏవ, చ,
ఏతత్, వేదితుమ్, ఇచ్ఛామి, జ్ఞానమ్, జ్ఞేయమ్, చ కేశవ ॥

| | | | |
|---|---|---|---|
| కేశవ | = కృష్ణా! | జ్ఞానమ్ | = జ్ఞానాన్ని |
| ప్రకృతిమ్ | = ప్రకృతిని | జ్ఞేయం చ | = జ్ఞేయాన్ని |
| పురుషం చ ఏవ | = పురుషుణ్ణి | ఏతత్ | = దీనిని |
| క్షేత్రమ్ | = క్షేత్రాన్ని | వేదితుమ్ | = తెలుసుకోవటానికి |
| క్షేత్రజ్ఞమ్ ఏవచ | = క్షేత్రజ్ఞుణ్ణి | ఇచ్ఛామి | = కోరుతున్నాను |

**హే కేశవ! ప్రకృతిమ్ పురుషమ్ చ ఏవ క్షేత్రమ్ క్షేత్రజ్ఞమ్ చ**
**ఏవ జ్ఞానమ్ జ్ఞేయమ్ చ ఏతత్ వేదితుమ్ ఇచ్ఛామి ॥**

తా: ఓ కృష్ణా! ప్రకృతి, పురుషుడు, క్షేత్రము, క్షేత్రజ్ఞుడు, జ్ఞానము, జ్ఞేయముల గురించి చెప్పమని కోరుతున్నాను.

**1. ఉపోద్ఘాతం: శ్లోకం – 1**

అర్జునుడు అడుగుతాడు ఈ ప్రశ్నను. ఇందులో అర్జునుడు ఆరు సాంకేతిక పదాలను వాడతాడు. వాటిని సాధారణంగా వేదాంతంలో చూస్తాము. అలాంటి సాంకేతిక పదాలను **పారిభాషక శబ్దః** అంటారు. మన లౌకిక విద్యలో కూడా అలాంటి పరిభాష శబ్దాలు ఉంటాయి. ఆరు పదాలు వాడి, వాటి అర్థాలు చెప్పమంటాడు అర్జునుడు. అవి ప్రకృతి, పురుషః, క్షేత్రమ్, క్షేత్రజ్ఞః, జ్ఞానమ్, జ్ఞేయమ్. వీటిని జంటపదాలుగా చూడవచ్చు. అలా మూడు జంటలు అవుతాయి. అవి ప్రకృతి–పురుషః; క్షేత్రమ్–క్షేత్రజ్ఞః; జ్ఞానమ్–జ్ఞేయమ్.

**ఏతద్ వేదితుమ్ ఇచ్ఛామి** – ఆ పదాల అర్థం తెలుసుకోవాలని ఉంది.

**కేశవ** – ఓ కృష్ణా.

నిజానికి అర్జునుడు ఆరుపదాలను వాడినా కూడా, కొన్ని పదాలకు అర్థం ఒకటే. ప్రకృతి అన్నా క్షేత్రమ్ అన్నా ఒకటే. రెండింటి అర్థం భౌతికప్రపంచం. వాటిమధ్య సూక్ష్మమైన భేదాలు ఉన్నా కూడా, ప్రస్తుతానికి వాటిని ఒక పదంగా తీసుకోవచ్చు. భౌతికప్రపంచం అంటే స్థూల, సూక్ష్మప్రపంచాలు రెండూ వస్తాయి.

ప్రకృతిలోకి మనస్సు కూడా వస్తుంది. ఎందుకంటే మనస్సు కూడా పాంచభౌతికం అని శాస్త్రం చెబుతుంది. హార్మోన్లలో మార్పు వస్తే, దాని ప్రభావం మనస్సుమీద కూడా ఉంటుంది. అంటే రాగద్వేషాల్లో మార్పు వస్తుంది. దీన్నిబట్టి మనస్సు కూడా సూక్ష్మమైన పదార్థమే అవుతుంది. శరీరం కూడా పాంచభౌతికమే. అందువల్ల ప్రకృతి లేదా క్షేత్రం అంటే ప్రపంచం, మనస్సు, శరీరాలు కూడా వస్తాయి. కృష్ణపరమాత్మ ఈ విషయాన్ని తర్వాత వివరిస్తాడు. ఇప్పటికి మనం ప్రకృతి లేదా క్షేత్రం అంటే పదార్థం అని గుర్తుపెట్టుకుంటే చాలు.

పురుషుడు, క్షేత్రజ్ఞుడు, జ్ఞేయము ఈ మూడు పదాలను ఒకటిగా తీసుకోవచ్చు. వీటి మధ్య సూక్ష్మభేదాలు ఉన్నాయి కాని, ప్రస్తుతానికి ఒకటిగా భావించవచ్చు. మూడు పదాలు చైతన్యాన్ని సూచిస్తాయి. ఆ విధంగా ప్రకృతి, క్షేత్రం అచేతనతత్త్వాన్ని సూచిస్తే; పురుషుడు, క్షేత్రజ్ఞుడు, జ్ఞేయము చేతనతత్త్వాన్ని సూచిస్తాయి. అంటే జడం, చేతనం. ఈ విధంగా ఐదు పదాలను రెండుగా చేశాము.

ఇక మిగిలింది ఏమిటి? జ్ఞానము. జ్ఞానం పదానికి అనేక అర్థాలు ఉన్నాయి; బాగా ప్రాచుర్యం చెందిన అర్థం జ్ఞానమే, కాని ఇక్కడ ఈ అధ్యాయంలో దాని అర్థం వేరు. జ్ఞానం అంటే విలువలు లేదా సద్గుణాలు. ఇందులోనే కృష్ణపరమాత్మ 20 విలువల గురించి చెప్పబోతున్నాడు. అమానిత్వం, అదంభిత్వం, అహింస, శాంతిలాంటి విలువలను కలిపి జ్ఞానం అంటారని, ఇవి కాని వాటిని అజ్ఞానం అంటారని కృష్ణపరమాత్మ అంటాడు.

**ఏతద్‌జ్ఞానమితి ప్రోక్తమ్ అజ్ఞానం యదతోఽన్యథా** – 13.12

ఇవీ అర్జునుడు అడిగిన ప్రశ్నలు. వాటికి కృష్ణపరమాత్మ అద్భుతంగా జవాబు చెబుతాడు.

**శ్రీ భగవాన్ ఉవాచ**

శ్లో. 2 **ఇదం శరీరం కౌంతేయ క్షేత్రమిత్యభిధీయతే ।**
**ఏతద్యో వేత్తి తం ప్రాహుః క్షేత్రజ్ఞ ఇతి తద్విదః ॥**
ఇదమ్, శరీరమ్, కౌంతేయ, క్షేత్రమ్, ఇతి, అభిధీయతే,
ఏతత్, యః, వేత్తి, తమ్, ప్రాహుః, క్షేత్రజ్ఞః, ఇతి, తద్విదః ॥

| | | | |
|---|---|---|---|
| కౌంతేయ! | = ఓ అర్జునా! | యః, వేత్తి | = ఎవరు తెలుసుకుంటారో |
| ఇదమ్, శరీరమ్ | = ఈ శరీరము | తమ్ | = అతన్ని |
| క్షేత్రమ్, ఇతి | = క్షేత్రము అని | క్షేత్రజ్ఞః, ఇతి | = క్షేత్రజ్ఞుడు అని |
| అభిధీయతే | = పిలువబడును | తద్విదః | = తత్త్వజ్ఞానులైనవారు |
| ఏతత్ | = దీనిని గూర్చి | ప్రాహుః | = చెబుతారు |

**హే కౌన్తేయ! ఇదమ్ శరీరమ్ క్షేత్రమ్ ఇతి అభిధీయతే ।**
**యః ఏతత్ వేత్తి, తమ్ క్షేత్రజ్ఞః ఇతి తత్-విదః ప్రాహుః ॥**

తా: ఓ అర్జునా! ఈ శరీరము క్షేత్రము అని పిలువబడును. దీనిని గూర్చి ఎవరు తెలుసుకుంటారో అతన్ని క్షేత్రజ్ఞుడు అని తత్త్వజ్ఞానులైనవారు చెబుతారు.

అర్జునుడు అడిగిన వరుసక్రమం ప్రకృతి, పురుషుడు, క్షేత్రం, క్షేత్రజ్ఞుడు, జ్ఞానం, జ్ఞేయం. కాని కృష్ణపరమాత్మ అదే వరుసక్రమంలో జవాబు చెప్పడు. కృష్ణపరమాత్మ ముందుగా తీసుకున్న జంటపదాలు క్షేత్రం, క్షేత్రజ్ఞుడు.

**2. క్షేత్రం-క్షేత్రజ్ఞుల వివరణ: శ్లోకాలు 2-7**

**కౌంతేయ** - ఓ అర్జునా,

**ఇదం శరీరం క్షేత్రమిత్యభిధీయతే** - ఈ శరీరాన్ని క్షేత్రం అంటారు అంటున్నాడు కృష్ణపరమాత్మ.

శరీరాన్ని క్షేత్రం అని ఎందుకంటారు? దానికి శంకరాచార్యులవారు అనేక కారణాలు వివరించారు. అందులో రెండు కారణాలు చూద్దాము. చక్కటి విశ్లేషణ కనిపిస్తుంది వాటిలో.

**క్షీయతే ఇతి క్షేత్రమ్ క్షతత్వాత్ క్షయమాణత్వాత్ క్షేత్రమ్**

క్షి అంటే నశించి, చివరకి మరణించేది అని అర్థం. నిజానికి శరీరం పదానికి కూడా అర్థం అదే.

**శీర్యమాన స్వభావత్వాత్ శరీరమ్**

శీర్యతే అంటే ప్రతిక్షణమూ నశించేది. కణాలు ఎప్పటికప్పుడు మరణిస్తూ, కొత్తవి పుడుతూ ఉంటాయి. వృద్ధాప్యంలో, కొత్త కణాలు పుట్టటం తగ్గుతూ వస్తాయి, పాత కణాలు మరణించడం పెరుగుతూ వస్తాయి. చివరికి అవి జీవి మరణానికి కారణమౌతాయి. అందువల్ల శరీరం అంటే క్షీణించేది, నాశనమయ్యేది అని అర్థం. దేహం అన్నా కూడా మూడు తాపత్రయాలతో దహించబడేది అని అర్థం.

**త్రివిధా తాపైః దహ్యతే ఇతి దేహః**

దేహః అంటే దహించబడేది. దేనితో? మూడు తాపాలతో. అవి అధ్యాత్మిక, అధిభౌతిక, అధిదైవిక తాపత్రయాలు.

ఆధ్యాత్మికం అంటే మన శరీరంలో కలిగే బాధలు, అనారోగ్యాలు. మనం చేసుకున్న కర్మవల్ల వస్తాయి అవి. ఆధిభౌతికం అంటే పరిసరాలనుంచి వచ్చే కాలుష్యం. శబ్దకాలుష్యం, నీటికాలుష్యం. ఆధిదైవికం అంటే భగవంతుడు సృష్టించే ప్రకృతివైపరీత్యాలు. ఉరుములు, మెరుపులు, వరదలు. ఈ మూడు తాపత్రయాలు దేహాన్ని దహిస్తూ ఉంటాయి. బ్రతికి ఉండగా ఈ తాపత్రయాలు మనిషిని దహిస్తే, అతను మరణించాక, అగ్ని అతని శరీరాన్ని దహించివేస్తుంది. శంకరాచార్యులవారు ఇచ్చిన మొదటి అర్థం దహించబడేది.

**క్షేత్రత్వాత్ క్షేత్రమ్**

ఇది శంకరులవారు ఇచ్చిన రెండవ అర్థం.

క్షేత్రం అంటే ఇంకొక అర్థం పొలం. పంటలు పండించాలంటే, దానికొక పొలం ఉండాలి. మన దగ్గర కొన్ని విత్తనాలు ఉన్నాయనుకోండి, వాటిని భద్రంగా బీరువాలో దాచిపెట్టి ఆరునెలల తర్వాత బీరువా తీసి చూస్తే, అవి మొలకెత్తుతాయా? మొలకెత్తవు. వాటిని సరియైన భూమిలో పాతాలి. అప్పుడు అవి మొలకెత్తి మొక్కలుగా వస్తాయి. అంటే విత్తనాలు మొక్కలుగా మారి, పండ్లను ఇవ్వటానికి వాటికొక మాధ్యమం కావాలి.

అదే విధంగా మన చేతిలో పుణ్య, పాపాలు అనే విత్తనాలు ఉన్నాయి – అవి సుఖ, దుఃఖాలనే మొక్కలుగా పెరగాలంటే, వాటికి ఒక మాధ్యమం కావాలి. ఆ మాధ్యమమే ఈ శరీరం. అందువల్ల శంకరాచార్యులవారు ఈ శరీరాన్ని పొలంతో పోల్చారు.

ప్రస్తుతానికి కృష్ణపరమాత్మ క్షేత్రం అంటే శరీరం మాత్రమే పేర్కొన్నాడు. మనస్సు, ప్రపంచాలను తర్వాత చెబుతాడు. కాని మనం ఈ పదాన్ని అర్థం చేసుకోవటానికి వాటిని కూడా ఇక్కడ కలుపుకుందాము. క్షేత్రం అంటే శరీరం, మనస్సు, ప్రపంచం. ఇంకో విధంగా చెప్పాలంటే మనం అనుభవించే ప్రతిదీ క్షేత్రమే.

ఈ మూడూ మనం చూసే వస్తువులే అయినా, ప్రపంచం మనకు దూరంగా ఉంది కాబట్టి అది వస్తువుగా తెలుస్తున్నది. కాని శరీరం, మనస్సులు మనకు అతి సన్నిహితంగా ఉండటంవల్ల అవి మనలో ఒక భాగంగా అనిపిస్తాయి. నీ ముందు ఏమేమి వస్తువులు ఉన్నాయని అడిగితే ఒక పెద్ద పట్టిక చదువుతాము – పుస్తకము, కలము, గడియారము, బల్ల, బల్ల కింద ఉన్న తివాచీ, ఇలా అనర్గళంగా సాగిపోతుంది కాని ఒక్క విషయం మాత్రం మర్చిపోతాము. మనముందు ఉంది, మనకు భిన్నంగా ఉంది, ఆబ్జెక్టుగా ఉంది, అయినా మనం గమనించము. ఏమిటది? మన కళ్ళజోడు. కళ్ళజోడు కూడా వస్తువే. ఎందుకు? దాన్ని బజారులో కొన్నాము. కాని కళ్ళకు పెట్టుకునేసరికి, అది మనకు ఒక ప్రమాణంగా పనిచేస్తుంది. ప్రమాణం ప్రమాతతో కలిసిపోతుంది.

దీన్నించి ఒక ముఖ్యమైన సత్యాన్ని తెలుసుకుంటాము. అది 'ప్రమాణంగా పనిచేసే ఆబ్జెక్టును సబ్జెక్టుగా భావిస్తాము.' అందువల్ల కళ్ళజోడు మనకు ఆబ్జెక్టుగా అనిపించలేదు, కాని నిజానికి అది కూడా ఆబ్జెక్టే.

ఆ విధంగా శరీరం, మనస్సులు కూడా ప్రమాణాలే. అవి కూడా మనకు భిన్నంగా ఉన్నాయి. ఎందుకంటే పరికరం, పరికరాన్ని వాడే వ్యక్తికి భిన్నంగా ఉంటుంది. శరీరం, మనస్సులను ఉపయోగిస్తున్నప్పుడు మనం జాగ్రద్ ప్రపంచాన్నీ, స్వప్నప్రపంచాన్నీ చూస్తున్నాము కాని సుషుప్తిలో మనస్సు, శరీరం పనిచేయవు. ఎందుకు? అప్పుడు మనశ్శరీరాలు పడుకుంటాయి కాబట్టి. అంటే కళ్ళజోడులోని రెండు అద్దాలతో మనశ్శరీరాలను పోల్చవచ్చు. శరీరం ఒక అద్దం, మనస్సు ఇంకొక అద్దం. కాబట్టి అవి కూడా ఆబ్జెక్టులే.

ప్రపంచాన్ని అనుభవిస్తున్నాము, శరీరాన్ని అనుభవిస్తున్నాము, మనస్సును అనుభవిస్తున్నాము. శరీరానికి వచ్చే బాధలు మనకు తెలుస్తున్నాయి. మనస్సులో కలిగే ప్రతి ఒక్క భావనా అతి సమీపంగా తెలుస్తున్నది. ఒక మంచి ఆలోచన వచ్చివెళ్ళినా, ఒక ఆవేశం కలిగినా తెలుసున్నది.

ఈ మూడింటిలోనూ సమాన అంశం ఏమిటి? మూడూ మన అనుభవంలోకి వచ్చే వస్తువులు, మూడూ పంచభూతాలతో చేయబడిన పదార్థాలు; మూడూ బాహ్యవస్తువులు (ఆబ్జెక్టులు), మూడూ జడం; మూడూ నిరంతరం మార్పుకు లోనవుతూ ఉంటాయి. ప్రపంచంలో కొన్ని త్వరగా మార్పు చెందితే, కొన్ని ఆలశ్యంగా మార్పు చెందుతాయి. కాని ప్రకృతిలో మార్పు సహజం. శరీరం షడ్వికారాలకు లోనవుతుందని తెలుసు.

మనస్సు మారుతుందా లేదా? అన్నింటికన్నా త్వరగా మార్పు చెందుతుంది. మనస్సు మార్పు చెందకపోతే, మీరు వింటున్న ప్రసంగంనుంచి ఏమీ నేర్చుకోలేరు. మీరు విన్న ప్రతిపదమూ మీ మనస్సులో ఆలోచనను సృష్టిస్తుంది. ఈ విధంగా మూడూ సవికారమే.

ప్రపంచం, శరీరం, మనస్సు మూడూ మట్టిముద్దలే అయినా కూడా కృష్ణపరమాత్మ ముందు శరీరాన్ని పేర్కొన్నాడు. వీటిలో మనకు శరీరంతో ఉన్న అభిమానం ఇంకా ఎక్కువ. క్షేత్రం అంటే శరీరం. ఇది మొదటి అంశం.

**క్షేత్రజ్ఞః–** ఏదైతే క్షేత్రాన్ని చైతన్యవంతం చేస్తుందో అది క్షేత్రజ్ఞం. ఒక వస్తువు అనుభవించబడుతోందంటే దాన్ని అనుభవించే సబ్జెక్టు ఉన్నట్టు అర్థం. నేను నా ఎదురుగుండా ఉన్న వ్యక్తులను చూడగలుగుతున్నానంటే, నా కన్నులు వారిని చూస్తున్నట్టు అర్థం. నా కళ్ళను నేను చూడలేకపోవచ్చు కాని, అవి లేనిదే నేను రంగులను, రూపాలను చూడలేను.

**ఏతత్ యః వేత్తి తం క్షేత్రజ్ఞ ఇతి ప్రాహుః**

ఒక ఫోటో ఉంది అంటే దాన్ని తీసిన ఫోటోగ్రాఫర్ ఉన్నట్టే లెక్క. పోనీ ఇప్పటి సెల్‌ఫోన్లను తీసుకుంటే, దాన్ని తీసిన కెమెరా ఉన్నట్టే లెక్క. కెమెరా లేకపోతే ఫోటో రాదు. అలాగే ప్రపంచం, శరీరం, మనస్సులనే ఈ క్షేత్రం అనుభవంలోకి వచ్చే ఆబ్జెక్టులయితే, వాటిని చూసే, అనుభవించే, చైతన్యవంతం చేసే సబ్జెక్టు ఒకటి ఉందని అర్థం. దాన్ని చైతన్యం అంటారు. కృష్ణపరమాత్మ క్షేత్రజ్ఞుడు అంటున్నాడు.

**తద్విదః ప్రాహుః–** వాటి గురించి తెలిసిన గొప్ప జ్ఞానులు అలా అంటారు అంటున్నాడు. ఒక్కముక్కలో చెప్పాలంటే క్షేత్రజ్ఞుడు అంటే చైతన్యతత్త్వం. క్షేత్రం అంటే పదార్థం.

ఈ చైతన్యం గురించి చర్చ వచ్చినప్పుడు, తత్త్వబోధలో చైతన్యం గురించి నేర్చుకున్న ఐదు లక్షణాలను గుర్తు తెచ్చుకోవాలి. వాటిని మళ్ళీ ఒకసారి చూద్దాము.

**చైతన్యం లక్షణాలు:** చైతన్యాన్ని కాంతితో పోల్చవచ్చు. ఇప్పుడు అవే సూత్రాలను చైతన్యానికి అన్వయిస్తూ తిరిగి చెప్పవచ్చు.

- చైతన్యం శరీరంలో ఒక భాగం కాని, లక్షణం కాని, దానినుంచి ఉత్పత్తి అయిన వస్తువు కాని కాదు.
- చైతన్యం స్వతంత్ర వస్తువు. అది శరీరం అంతటా వ్యాపించి, శరీరాన్ని ప్రకాశింపచేస్తుంది.
- చైతన్యం శరీరం సరిహద్దులకే పరిమితమవలేదు.
- శరీరం నాశనమయినా చైతన్యం నాశనమవదు. శరీరం పతనానంతరం కూడా చైతన్యం ఉంటుంది.
- చైతన్యం శరీరం లేకపోయినా ఉంటుంది కాని తెలియదు. చైతన్యాన్ని ప్రతిబింబింపచేసే మాధ్యమం లేదు కాబట్టి చైతన్యం తెలియదు. అంతమాత్రాన చైతన్యం లేనట్టు కాదు.

ఎలాగైతే కంటికి కనబడని విద్యుచ్ఛక్తి ఫ్యాను తిరిగేలా, బల్బు వెలిగేలా, మైకు శబ్దాన్ని పెద్దది చేసి వినిపించేలా చేస్తుందో, అదే విధంగా కనబడే మనశ్శరీరాలను చైతన్యవంతం చేసేది కనబడని చైతన్యతత్త్వం. దాన్నే క్షేత్రజ్ఞుడు అంటారు. 'జ్ఞః' అంటే చైతన్యతత్త్వం.

వేదాంతశాస్త్రంలో నేర్చుకునే మొట్టమొదటి అంశం – ప్రతి వ్యక్తీ కూడా శరీరం, చైతన్యాల మేలుకలయిక. ఫ్యానులో రెండు అంశాలు ఉంటాయి. అవి కంటికి కనబడే తిరిగే ఫ్యాను, కనబడని విద్యుచ్ఛక్తి. కేవలం విద్యుచ్ఛక్తి గాలిని ఇవ్వలేదు; కేవలం ఫ్యాను కూడా గాలిని ఇవ్వలేదు. రెండింటి మేలుకలయిక ఉంటేనే ఫ్యానునుంచి గాలి వస్తుంది.

ఇదే సూత్రం మనకు కూడా వర్తిస్తుంది. శరీరం తనంతట తాను వ్యవహారం నడపలేదు; చైతన్యం తనంతట తాను వ్యవహారం నడపలేదు. జడశరీరానికి చైతన్యం తోడయితేనే వ్యవహారం నడపగలము. ఈ శరీరాన్ని క్షేత్రమనీ, చైతన్యాన్ని క్షేత్రజ్ఞుడనీ అంటున్నాడు కృష్ణపరమాత్మ. వీటినే రెండవ అధ్యాయములో దేహం, దేహీ అన్నాడు.

**దేహినోఽస్మిన్ యథా దేహే కౌమారం యౌవనం జరా ।**
**తథా దేహాంతరప్రాప్తిః ధీరస్తత్ర న ముహ్యతి ॥** – 2.13

**న జాయతే మ్రియతే వా కదాచిత్ నాయం భూత్వా భవితా వా న భూయః ।**
**అజో నిత్యః శాశ్వతోఽయం పురాణో న హన్యతే హన్యమానే శరీరే ॥** – 2.20

రెండవ అధ్యాయంలో 12–25 శ్లోకాలు చాలా ముఖ్యమైన శ్లోకాలు. వాటిని బాగా గుర్తు పెట్టుకోవాలి. ఇక్కడ క్షేత్రం, క్షేత్రజ్ఞుడు అంటే అక్కడ దేహం, దేహి అన్నాడు. వేదాంతపరిభాషలో అనాత్మ, ఆత్మ అంటారు. వేదాంతం 'ఆత్మ' పదం వాడటంలో ఒక అంతరార్థం కూడా ఉంది.

సాధారణంగా మనం శరీరంతో మమేకం చెందుతూ ఉంటాము. శరీరం పుట్టినరోజును, మన పుట్టినరోజుగా తీసుకుంటాము. శరీరం ఎదుగుతుంటే మనం ఎదుగుతున్నట్టుగా భావిస్తాము. వేదాంతానికి రాకముందు నిత్యచైతన్యం అనేది ఒకటి ఉందనే తెలియదు. నేను శరీరం అనే అనుకుంటాము. కాని వేదాంతానికి వచ్చాక, ఒక అడుగు ముందుకు వేస్తాము. 'నేను శరీరాన్ని, నాలో ఆత్మ ఉంది,' అంటాము. కాని అక్కడితో వేదాంతబోధ పూర్తికాలేదు.

'నేను శరీరాన్ని, నాలో ఆత్మ ఉంది,' స్థాయినుంచి ఇంకా పైకి ఎదగాలి. 'నేను ఆత్మను, ఆత్మనైన నాకు వ్యవహారం నడపటానికి శరీరం ఉంది,' అనగలగాలి. దానికి చాలా నిదిధ్యాసనం చెయ్యాలి.

అలా 'నేను శరీరాన్ని, నాకు ఆత్మ ఉంది,' స్థాయినుంచి 'నేను ఆత్మను, నాకు వ్యవహారం నడపటానికి శరీరం ఉంది,' అనే స్థాయికి రావాలి. 'ఈ శరీరం అనే క్షేత్రం ప్రపంచమనే క్షేత్రంలోకి ఎప్పుడైనా వెళ్ళిపోవచ్చు. నేను నా వ్యవహారాలకోసం తాత్కాలికంగా వాడుకునే మాధ్యమం ఇది. పంచభూతాలనుంచి వచ్చిన ఈ శరీరాన్ని అవసరమైనప్పుడు పంచభూతాలకు తిరిగి ఇచ్చేయాలి. ఈ క్షేత్రం తిరిగి వెళ్ళిపోయినా, క్షేత్రజ్ఞుడనయిన నేను, చైతన్యతత్త్వాన్ని అయిన నేను శాశ్వతంగా ఉంటాను.'

ఈ దృక్పథంలో మార్పును **అపరోక్షజ్ఞానం** అంటారు. నాకు ఆత్మ ఉంది అని చెప్పినన్నాళ్ళూ అది పరోక్షజ్ఞానమే అవుతుంది; ఎప్పుడైతే నేను ఆత్మను అని చెప్పగలుగుతానో, అప్పుడే అది అపరోక్షజ్ఞానం అవుతుంది. **నాకునుంచి నేనుకు మారితే ,** పరోక్షజ్ఞానంనుంచి అపరోక్షజ్ఞానానికి మారినట్టు అర్థం. ఈ రెండవ శ్లోకంయొక్క సారాంశం ఇది.

శ్లో. 3 **క్షేత్రజ్ఞం చాపి మాం విద్ధి సర్వక్షేత్రేషు భారత ।**
**క్షేత్రక్షేత్రజ్ఞయోః జ్ఞానం యత్తద్ జ్ఞానం మతం మమ ॥**
క్షేత్రజ్ఞమ్, చ, అపి, మామ్, విద్ధి, సర్వక్షేత్రేషు, భారత,
క్షేత్రక్షేత్రజ్ఞయోః, జ్ఞానమ్, యత్, తత్, జ్ఞానమ్, మతమ్, మమ ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| భారత! | = | ఓ అర్జునా! | చ | = | ఇంకా |
| సర్వక్షేత్రేషు | = | క్షేత్రములన్నిటా ఉన్న | క్షేత్ర–క్షేత్రజ్ఞయోః | = | క్షేత్ర క్షేత్రజ్ఞులయొక్క (ప్రకృతి పురుషులయొక్క) |
| క్షేత్రజ్ఞమ్ | = | క్షేత్రజ్ఞుడను అంటే | యత్, జ్ఞానమ్ | = | ఏతత్త్వజ్ఞానము గలదో |
| అపి | = | జీవాత్మను గూడ | తత్ | = | అది |
| మామ్ | = | నేనేయని | జ్ఞానమ్ | = | జ్ఞానము అని |
| విద్ధి | = | తెలుసుకొనుము | మమ, మతమ్ | = | నా అభిప్రాయము |

**హే భారత! సర్వ–క్షేత్రేషు మామ్ అపి చ క్షేత్రజ్ఞమ్ విద్ధి।**
**యత్ క్షేత్ర–క్షేత్రజ్ఞయోః జ్ఞానమ్, తత్ జ్ఞానమ్ (ఇతి) మమ మతమ్ (అస్తి) ॥**

తా: ఓ అర్జునా! క్షేత్రములన్నిటా ఉన్న క్షేత్రజ్ఞుడను అంటే జీవాత్మను గూడ నేనేయని తెలుసుకొనుము ఇంకా క్షేత్రక్షేత్రజ్ఞులయొక్క (ప్రకృతి,పురుషులయొక్క) ఏ తత్త్వజ్ఞానము గలదో అది జ్ఞానము అని నా అభిప్రాయము.

ఇప్పుడు కృష్ణపరమాత్మ ఇంకొక అడుగు ముందుకు వేయిస్తున్నాడు. వేదాంతజ్ఞానాన్ని ఐదు దశలుగా వర్ణించవచ్చు.

ఎ) నేను శరీరాన్ని,

బి) నేను శరీరాన్ని, నాలో ఆత్మ ఉంది.

సి) నేను ఆత్మను, నాకు ఆగంతుక శరీరం ఉంది.

డి) నేను సర్వవ్యాపకమైన ఆత్మను. నేను ఈ శరీరం సరిహద్దులకే పరిమితమవలేదు.

ఇ) నాలోనే అన్ని శరీరాలు ఉన్నాయి.

ఈ వాక్యాలన్నీ అర్థం చేసుకుని, జీర్ణించుకోవటానికి సమయం పడుతుంది. వినటానికి ఎంతోసేపు పట్టదు, కాని వాటిని లోతుగా విశ్లేషించాలి.

వేదాంతానికి రాకముందు నేను శరీరం అనుకుంటాము అని చూశాము. అక్కడనుంచి మొదలుపెడతాము. రెండవదశలో నేను శరీరాన్ని, నాలో ఆత్మ ఉంది అని, మూడవదశలో నేను ఆత్మ ఉన్న శరీరాన్ని కాదు, శరీరం ఉన్న ఆత్మను అని అర్థం చేసుకుంటాము. శరీరం మాట వచ్చినప్పుడల్లా ఆగంతుక శరీరం అని మననం చేసుకుంటే మంచిది. అంటే అది ఆత్మ అయిన నాకు, నేను వ్యవహారాలు నడపటానికి తాత్కాలికంగా ఇవ్వబడింది. భగవంతుడు ఇచ్చాడు కాబట్టి, ఎప్పుడు కావాలంటే అప్పుడు ఆయనకు వెనక్కు తీసుకునే హక్కు ఉంది. ఇంతవరకూ చూశాము.

ఇప్పుడు ఈ శ్లోకంలో నాలుగవదశను చూడబోతున్నాము. అది చాలా ముఖ్యమైన దశ. ఏమిటది? నేను ఈ శరీరం వెనుక ఉన్న ఆత్మను అనేసరికి ఒక పొరపాటు పడే అవకాశం ఉంది. ఏమిటది? నేను ఈ శరీరంలో ఉన్న క్షేత్రజ్ఞుడను. నేను నా శరీరంలో క్షేత్రజ్ఞుడను అయితే మీరు మీ శరీరంలో క్షేత్రజ్ఞుడు. క్షేత్రజ్ఞుడు అంటే చైతన్యం అని చూశాము. అంటే ఎన్ని శరీరాలు ఉంటే అన్ని చైతన్యాలు ఉన్నాయి అనుకునే అవకాశం ఉంది. రాముడు రామశరీరంలో ఉన్న చైతన్యం; కృష్ణుడు కృష్ణశరీరంలో ఉన్న చైతన్యం. ఆ విధంగా ఎన్ని శరీరాలు ఉంటే అన్ని చైతన్యాలు ఉన్నాయి అనుకుంటాము.

ఇలా మామూలు మనుష్యులే కాదు, కొంతమంది దార్శనికులు కూడా ఇలా భావిస్తున్నారు. సాంఖ్య దార్శనికులు ఎన్ని శరీరాలుంటే, అన్ని ఆత్మలు ఉన్నాయంటారు. ఆ అపోహను తొలగిస్తుంది ఈ శ్లోకం. ఇక్కడ నాలుగవ దశను నేర్చుకుంటాము. ఏమిటది?

**దేహాలు అనేకం, దేహి ఏకం**

క్షేత్రాలు ఎన్ని ఉన్నా, వాటిలో ఉన్న క్షేత్రజ్ఞుడు ఒకడే. ఇంకో విధంగా చెప్పాలంటే, శరీరాలు ఎన్ని ఉన్నా, చైతన్యం ఒకటే. అంతేకాదు, శరీరాల గురించి చెబుతున్నామంటే, శరీరాల మధ్యలో ఉన్న ఖాళీప్రదేశంలో చైతన్యం లేనట్టు కాదు. చైతన్యం సర్వవ్యాపకం. శరీరాలు ఉన్నా, లేకపోయినా చైతన్యం అంతటా ఉంటుంది. దాన్ని ప్రతిబింబచేసే మాధ్యమం లేదు కాబట్టి, చైతన్యం ఉన్నట్టు తెలియటం లేదు అంతే.

చెయ్యి, కాంతి ఉదాహరణ చాలాసార్లు చూశాము. చెయ్యి ఉంటే కాంతి తెలుస్తోంది. చెయ్యి తీసేస్తే కాంతి తెలియటం లేదు. చేతివేళ్ళను దూరంగా పెడితే ఆ వేళ్ళ మధ్య కూడా కాంతి తెలియటం లేదు కాని, అక్కడ కూడా కాంతి ఉంది. అలాగే మన తలపైన కూడా కాంతి ఉంది. కాని మనకు తెలియదు. మనకు తెలియనంత మాత్రాన కాంతి లేనట్టు కాదు. కాని కాంతి ప్రకటితమయినా, కాకపోయినా కూడా కాంతి **సర్వగతం**. ఇదే అంశాన్ని చైతన్యంయొక్క ఐదు లక్షణాలు చూసినప్పుడు చూశాము. అందులో ఐదవ లక్షణాన్ని మళ్ళీ చూద్దాము.

**చైతన్యం శరీరం లేకపోయినా ఉంటుంది కాని తెలియదు. చైతన్యాన్ని ప్రతిబింబింపచేసే మాధ్యమం లేదు కాబట్టి చైతన్యం తెలియదు. అంతమాత్రాన చైతన్యం లేనట్టు కాదు.**

చైతన్యం సర్వవ్యాపకమైనా కూడా, అది ఉన్న మాధ్యమంవల్ల దాని పేరు మారుతుంది. ఒకే వ్యక్తి తన పిల్లలకు తండ్రిగా, ఒక దేశానికి నేతగా వ్యవహరిస్తాడు. అంటే వ్యష్టిగా అతను తండ్రి, సమష్టిగా ప్రధాని. అదేవిధంగా చైతన్యం కూడా రెండుగా కనపడుతుంది. వ్యష్టిపరంగా చైతన్యాన్ని జీవాత్మ అంటే, సమష్టిపరంగా చైతన్యాన్ని పరమాత్మ అంటారు. ఉన్నది ఒకే చైతన్యం, మాధ్యమంలో ఉన్న భేదంవల్ల, ఆ భేదం కనబడతున్నది. వ్యష్టిదృష్ట్యా జీవాత్మ, సమష్టిదృష్ట్యా పరమాత్మ.

జీవాత్మలోని జీవ అనే విశేషణం, పరమాత్మలోని పరమ అనే విశేషణాన్ని తీసివేస్తే మిగిలేది ఏమిటి? ఆత్మ, శుద్ధచైతన్యం. జీవాత్మ కూడా ఆత్మే, పరమాత్మ కూడా ఆత్మే. ఈ గుర్తింపును జీవాత్మ-పరమాత్మ ఐక్యం అంటారు.

ఇప్పుడు మనం పొందాల్సిన జ్ఞానం ఏమిటి? నేను సర్వవ్యాపకమైన ఆత్మను. నేను వ్యష్టిపరంగా వ్యవహారం నడిపితే నేను జీవాత్మను; అదే నన్ను సమష్టిపరంగా చూస్తే నేను పరమాత్మను. వ్యష్టిపరంగా, సమష్టిపరంగా కూడా చూడకపోతే నేను నిర్గుణచైతన్యాన్ని. జీవ, పరమ అనే గుణాలు లేని నిర్గుణచైతన్యాన్ని, శుద్ధచైతన్యాన్ని; ఆత్మను. ఈ జ్ఞానాన్ని జీవాత్మ-పరమాత్మ ఐక్యజ్ఞానం అంటారు.

ఈ జీవాత్మ, పరమాత్మ ఐక్యజ్ఞానాన్ని పొందటానికి శాస్త్రం ఇచ్చే ఉదాహరణ - అల-సముద్రం.

అలను అలగా చూస్తే అది చాలా చిన్నది; సముద్రాన్ని సముద్రంగా చూస్తే అది చాలా పెద్దది. ఇప్పుడు అలకు ఉన్న అల నామరూపం తీసేసి, సముద్రానికి ఉన్న సముద్ర నామరూపం తీసేస్తే, రెండింటిలోనూ సమానంగా ఉన్నది ఏమిటి? నీరు. అంత చిన్న అలలో ఉన్నదీ నీరే, అంత పెద్ద సముద్రంలో ఉన్నదీ నీరే. అదే విధంగా అంత చిన్న జీవాత్మలో ఉన్నదీ ఆత్మే; అంత పెద్ద పరమాత్మలో ఉన్నదీ ఆత్మే. ఈ జ్ఞానాన్ని జీవాత్మ పరమాత్మ ఐక్యజ్ఞానం అనీ లేదా ఆత్మ ఏకత్వజ్ఞానం అనీ అంటారు.

ఈ మూడవ శ్లోకంలో కృష్ణపరమాత్మ ఈ ఏకత్వజ్ఞానాన్ని బోధిస్తున్నాడు కాబట్టి ఇది ఒక **మహావాక్యశ్లోకం** అయింది. అందువల్లనే చాలా ముఖ్యమైన శ్లోకం కూడా అయింది. శంకరాచార్యులవారు దీనిమీద ఎంతో విపులంగా భాష్యం రాశారు. అంటే జీవాత్మ, పరమాత్మ ఐక్యాన్ని సూచించే ఏ వాక్యాన్ని అయినా మహావాక్యం అంటారు.

**జీవాత్మ పరమాత్మ ఐక్యబోధకవాక్యం మహావాక్యమ్**

ఈ నేపథ్యంతో ఈ శ్లోకంలోకి అడుగుపెడదాము.

**క్షేత్రజ్ఞం మాం విద్ధి** – క్షేత్రజ్ఞుడు అంటే జీవాత్మ; మాం విద్ధి అంటే నన్నుగా తెలుసుకో అంటున్నాడు కృష్ణపరమాత్మ. నేను అంటే పరమాత్మ.

జీవాత్మను పరమాత్మగా తెలుసుకో. శరీరపరంగా చూస్తే జీవాత్మ శరీరం వేరు, పరమాత్మ శరీరం వేరు. పాత్రలు భిన్నంగా ఉన్నాయి కాని అందులో ఉన్న తత్త్వం ఒకటే. జీరోవాట్స్ బల్బులోనూ, హండ్రెడ్ వాట్స్ బల్బులోనూ ఉన్న విద్యుచ్ఛక్తి ఒకటే. అంటే వెంటనే ఆత్మ విద్యుచ్ఛక్తా అనకూడదు. పోలిక ఎంతమేరకు అవసరమో, అంతమేరకే తీసుకోవాలి. అందువల్ల మాం విద్ధి అంటే నన్ను పరమాత్మగా తెలుసుకో. ఈ పరమాత్మ ఎక్కడ ఉన్నాడు?

**సర్వక్షేత్రేషు భారత** – ఈ చైతన్యం అన్ని శరీరాల్లోనూ ఉంది.

ఇప్పుడు నన్ను ఇంకొక వ్యక్తితో పోలిస్తే, శరీరపరంగా చూస్తే నేను పొట్టి, అతను పొడుగు; నా వయస్సు వేరు, అతని వయస్సు వేరు; మనస్సుపరంగా చూస్తే నా ఆలోచనలు వేరు, అతని ఆలోచనలు వేరు; నా భావోద్రేకాలు వేరు, అతని భావోద్రేకాలు వేరు; బుద్ధిపరంగా చూస్తే నా జ్ఞానం వేరు, అతని జ్ఞానం వేరు; నా అజ్ఞానం వేరు, అతని అజ్ఞానం వేరు. కాని చైతన్యపరంగా చూస్తే నాలోని చైతన్యం, అతనిలోని చైతన్యం ఒకటే. అతనే నేను, నేనే అతను అనవచ్చు. సః అహం అస్మి, అహం సః అస్మి. ఇది ప్రసిద్ధి చెందిన సోఽహం మంత్రం.

**సోఽహమ్ అహం సః**

అందువల్ల దీనిని హంసమంత్రం అని కూడా అంటారు. హంస అంటే అహం సః. నేను ఆ పరమాత్మను. అహం బ్రహ్మ అస్మి జ్ఞానాన్ని కలగజేయటమే ఈ వాక్యం అర్థం.

ఈ జ్ఞానం ఎంతో ప్రయోజనకరమైనది. తక్కిన జ్ఞానాలు ఎన్ని పొందినా కూడా అవి పూర్తి ప్రయోజనాన్ని ఇవ్వలేవు. ఎందుకంటే అవి జీవితంలోని దుఃఖాన్ని పోగొట్టలేవు. బి.ఏ. చదివినా, ఎం.ఏ. చదివినా, ఆఖరికి పి.హెచ్.డి. చేసినా జీవితంలోని దుఃఖం మటుమాయమవదు. డిగ్రీలు పెరుగుతాయే కాని ఆనందం పెరగదు; అంతకుముందు చదువులేని సంసారి అయితే, ఇప్పుడు చదువుకున్న సంసారి అవుతారు; అంతే భేదం. అసలైన జ్ఞానం పొందితే జీవనవిధానమే మారిపోతుంది.

**క్షేత్రక్షేత్రజ్ఞయోః జ్ఞానమ్** – ఈ క్షేత్రం, క్షేత్రజ్ఞుల గురించిన జ్ఞానమే;

**యత్తద్ జ్ఞానం మతం మమ**– అసలైన జ్ఞానము. ముండకోపనిషత్తు ఆత్మవిద్యను పరావిద్య అనీ, తక్కిన జ్ఞానాలన్నిటినీ అపరావిద్య అనీ అంటుంది.

**అపరావిద్యా హి అవిద్యా**

అపరావిద్య అజ్ఞానంతో సమానం అంటారు శంకరాచార్యులవారు ఇంకొక సందర్భంలో. అంటే అపరావిద్యను పొందినా, పొందకపోయినా ఒకటే. పరావిద్య ఒక్కటే జీవితంలో మార్పు తెస్తుంది.

పరావిద్య మన జీవితంలో మార్పు ఎలా తెస్తుంది? మళ్ళీ మన అల-సముద్రం ఉదాహరణకే వెళదాము. ఒక సముద్రంలో రెండు అలలు ఉన్నాయనుకుందాము – ఒక అల జ్ఞానం పొందింది, ఇంకొక అల జ్ఞానం పొందలేదు అనుకుందాము. జ్ఞానం పొందని అలకు తనలోనూ, సముద్రంలోనూ ఉన్నది నీరే అని తెలియదు. తను చిన్న అల అనుకుంటుంది. తను సముద్రంలో పుట్టి, సముద్రంలో పెరిగి, సముద్రంలో లయమయిపోతాను అనుకుంటుంది. చిన్న బుడగలా మొదలై, చిన్న అలగా లేచి, పెద్ద అలగా ఎగసిపడుతుంది, నిజమే. కాని ఎగసిపడినంతసేపు ఉండదు ఆ మిడిసిపాటు. తీరం చేరగానే తన జీవితానికి చరమగీతం పాడాలని తెలుసు. అంటే తన జీవితం క్షణభంగురమని భావిస్తుంది. దానివల్ల అభద్రతా భావనకి లోనవుతుంది. అల తాను అల మాత్రమే అనుకున్నంతవరకూ ఈ అభద్రతా భావనను తప్పించుకోలేదు.

ఇదే సూత్రం మనకూ వర్తిస్తుంది. నేను శరీరాన్ని అనుకుని శరీరంతో మమేకం చెందితే, ఈ అభద్రతా భావనకు లోనుకాక తప్పదు. ఈ శరీరం కూడా ఎదుగుతుంది. యౌవనంలో పడిన మిడిసిపాటును కాలం నిర్దాక్షిణ్యంగా కాలరాసేస్తుంది. అనుక్షణం మృత్యుభయం వెన్నంటే ఉంటుంది. చిన్న వయస్సునుంచి భద్రత పొందటానికి అనేక విధాలుగా ప్రయత్నిస్తాము. మన పిల్లలు ఐదంకెల జీతం లేదా ఆరంకెల జీతం పొందాలని, చిన్నప్పటినుంచే తగు జాగ్రత్తలు తీసుకుంటాము. వారి ఇష్టాయిష్టాలేమిటో పట్టించుకోకుండా, బాగా ధనం సంపాదించటానికి తోడయ్యే చదువును చదివించటానికి చూస్తాము. ఎల్.కే.జీ.నుంచే దాని గురించిన ప్రణాళికలు వేసి, మంచిస్కూలులో వేసి, ఆటపాటల జోలికి పోనివ్వకుండా చదువే ధ్యేయంగా చేసి, మంచి ఉద్యోగం రావటానికి ఎన్నోపాట్లు పడతాము.

ఉద్యోగంలో చేరాక కూడా భద్రతాభావన పూర్తిగా రాదు. ఒక ఉద్యోగంలో బాగా నిలదొక్కుకుని, ఆ సంస్థలో మంచిపేరు తెచ్చుకున్నాక కూడా, అంతకన్నా మంచిహోదా, మంచిజీతం వచ్చే ఉద్యోగ అవకాశం రాగానే దానికి మారిపోతాము. జీతమే ముఖ్యం, అనుబంధాలు ముఖ్యం కాదు. ఇదంతా దేనికోసం అని బేరీజు వేస్తే భద్రతకోసం.

అందులో పిల్లలు కూడా వస్తారు. పిల్లలమీద తలకు మించిన ఖర్చుపెట్టి, కష్టపడి వారిని వృద్ధిలోకి తెస్తాము. ఎందుకంటే వృద్ధాప్యంలో వారు మనకు అండగా నిలబడతారనే ఆశతో. ఏం చేసినా భద్రతకోసం చేస్తాము. భద్రత ధనంలో ఉందనుకుంటాము. ఎంత ఎక్కువ ధనం ఉంటే, అంత ఎక్కువ భద్రత ఉంటుందని పొరపడతాము.

అజ్ఞానికి ధనము, భద్రత పర్యాయపదాలు. అజ్ఞాని అంటే వేదాంతపరంగా అజ్ఞాని. అటువంటి వ్యక్తిని వేదాంతం సంసారి అంటుంది. సంసారి అంటే ధనం ఉంటే భద్రత అనుకునే వ్యక్తి. ధనంవల్ల భద్రత వస్తుందని ఎందుకు అనుకుంటాడు? నేను శరీరం అనుకుంటున్నాడు కాబట్టి.

ఇప్పుడు అదే సముద్రంలో ఉన్న జ్ఞానం పొందిన అల విషయం చూద్దాము. జీవన్ముక్తి పొందిన అల అది. ఆ అలకు తను నామరూపాలున్న చిన్న అల కాదనీ, సముద్రాన్నుంచి పుట్టిన చిన్న అల కాదనీ, నీటిపరంగా సముద్రానికి కూడా అధిష్ఠానదేవతననీ తెలుసుకుంటుంది. అంటే నామరూపాలున్న అల మరణిస్తుంది కాని, అధిష్ఠానదేవత అయిన నీరుకు మరణం లేదు. నీరు అల పుట్టకుముందూ ఉంది, అలలోనూ ఉంది, అల జీవితం ముగిసిపోయినా కూడా ఉంటుంది. నీరుగా అలలోనూ, సముద్రంలోనూ, నదిలోనూ, కొలనులోనూ ఉంటుంది. ఎండాకాలంలో నీరు ఇంకిపోయి, మనుష్యులకు కనపడకపోయినా కూడా అవ్యక్తంగా ఉంటుంది. ఈ జ్ఞానం ఈ అలకు కలిగినందుకు, దానికి తాను మరణిస్తాననే భయం లేదు. ఈ జ్ఞానానికీ, అజ్ఞానానికీ మధ్య ఉన్న భేదం భద్రతకూ, అభద్రతకూ మధ్య ఉన్న భేదం.

ఈ జ్ఞానం ఒక్కటే భద్రతను ఇస్తుంది అంటుంది శాస్త్రం. వేరే ఏ జ్ఞానం పొందినా కూడా, అభద్రతా భావన పూర్తిగా తొలగదు. తక్కినవన్నీ భద్రతను ఇచ్చినట్టు కనిపిస్తాయి కాని, అవి శాశ్వతంగా ఇవ్వలేవు. ధనం, హోదా, ఆస్తులు, ఆత్మీయులు భద్రతను ఇస్తాయని మీరు భావిస్తే వేదాంతం మిమ్మల్ని ఖండించదు. నిక్షేపంగా వెళ్ళిరండి, వాటిని ప్రయత్నించండి, చివరికి మీరే వెనక్కు తిరిగివస్తారు అంటుంది వేదాంతం. కాకపోతే ఎన్నాళ్ళలో వెనక్కి వస్తారనేది మీమీ స్థాయినిబట్టి ఉంటుంది.

వేదాంతం మీకు సవాలు విసురుతుంది. ఎక్కడైనా మీరు భద్రత పొందుతారేమో చూడండి; అది సాధ్యం కాదు అంటుంది. నిజానికి అలా వేరే ఏదీ భద్రతను ఇవ్వదని తెలుసుకుని వేదాంతానికి వస్తే, మనస్సు పరిపక్వత చెందివుంటుంది కాబట్టి, అప్పుడు వేదాంతాన్ని తేలిగ్గా అర్థం చేసుకోవచ్చు.

ఇక్కడ ఒక సందేహం రావచ్చు. వేరే ఏదీ భద్రతను ఇవ్వదు అంటే, వేదాంతజ్ఞానం నాకు భద్రతను ఇస్తుందా? ఈ విషయాన్ని సరిగ్గా అర్థం చేసుకోవాలి. వేదాంతం కూడా భద్రతను ఇవ్వదు. వేదాంతం నీకు బాహ్యంగా అసలు భద్రత అవసరంలేదు, నువ్వు నిత్య, శుద్ధ, ముక్తపురుషుడివి అంటుంది. అంటే వేదాంతం భద్రతను ఇవ్వదు, మనలో ఉన్న అభద్రతాభావాన్ని పోగొడుతుంది. అందువల్లనే సన్న్యాసులు నిశ్చింతంగా ఉండగలుగుతున్నారు. మనం భద్రత ఇస్తాయి అనుకునే వస్తువులేవీ వారికి లేవు – ఇల్లు, కుటుంబం, ధనం, ఆస్తి. రాత్రికి భోజనం దొరుకుతుందో లేదో కూడా తెలియదు. మన లెక్క ప్రకారం వారే ఎక్కువ అభద్రతా భావనకు లోనుకావాలి, కాని వారే ఇవన్నీ ఉన్నవారికన్నా హాయిగా, నిశ్చింతంగా ఉన్నారు. నిజానికి ధనం ఎక్కువ ఉన్నకొద్దీ, దానిని కాపాడుకోవటానికి ఇంకా జాగ్రత్తలు తీసుకోవాలి. అందువల్ల కృష్ణపరమాత్మ క్షేత్రక్షేత్రజ్ఞయోః జ్ఞానం అన్నాడు. అంటే క్షేత్రం అంటే ఏమిటి, క్షేత్రజ్ఞుడు అంటే ఎవరు, ఈ విషయాల గురించిన జ్ఞానమే అసలైన జ్ఞానం. దీన్నే ఆత్మజ్ఞానం అన్నాడు కృష్ణపరమాత్మ.

శ్లో. 4 **తత్క్షేత్రం యచ్చ యాదృక్చ యద్వికారి యతశ్చ యత్ ।**
**స చ యో యత్ప్రభావశ్చ తత్సమాసేన మే శృణు ॥**
తత్, క్షేత్రమ్, యత్, చ, యాదృక్, చ, యద్వికారి, యతః, చ, యత్,
సః, చ, యః, యత్ప్రభావః, చ, తత్, సమాసేన, మే, శృణు ॥

| | | | |
|---|---|---|---|
| తత్, క్షేత్రమ్ | = ఆ క్షేత్రము | యః | = ఎవరో |
| యత్, చ | = ఏదో | యత్ప్రభావశ్చ | = ఎటువంటి ప్రభావము గలవాడో |
| యాదృక్, చ | = ఎటువంటిదో | తత్ | = ఆ విషయములన్నింటిని |
| యద్వికారి | = ఎటువంటి మార్పులు కలదో | సమాసేన | = సంక్షిప్తముగా |
| యతః, చ | = దేన్నుంచి | మే | = నానుంచి |
| యత్ | = ఉత్పన్నమౌతోందో | శృణు | = వినుము |
| సః, చ | = ఆ క్షేత్రజ్ఞుడు | | |

**తత్ క్షేత్రమ్ యత్ చ, యాదృక్ చ, యత్ వికారి (చ), యతః చ యత్,**
**సః చ యః, యత్ ప్రభావః చ (అస్తి) తత్, (త్వం) సమాసేన మే శృణు ॥**

తా: ఆ క్షేత్రము ఏదో, ఎటువంటిదో, ఎటువంటి మార్పులు కలదో, దేన్నుంచి ఉత్పన్నమౌతోందో ఆ క్షేత్రజ్ఞుడు ఎవరో, ఎటువంటి ప్రభావము గలవాడో ఆ విషయములన్నింటిని సంక్షిప్తముగా నానుంచి వినుము.

కృష్ణపరమాత్మ రెండు, మూడు శ్లోకాల్లో క్షేత్రం, క్షేత్రజ్ఞులను టూకీగా నిర్వచించాడు. ఇప్పుడు వాటి గురించి వివరంగా చెబుతాను, విను అంటున్నాడు.

**యత్ తత్ క్షేత్రమ్** – క్షేత్రమంటే ఏమిటో వివరంగా చెబుతాను. ఇంతకుముందు నిర్వచనంలో క్షేత్రం అంటే శరీరం అన్నాడు. ఇప్పుడు క్షేత్రంలో వచ్చేవన్నీ చెబుతాను అంటున్నాడు. ఏమిటవి?

ఎ) **తత్ క్షేత్రమ్**– క్షేత్రం అంటే ఏమిటో చెబుతాను.

బి) **యచ్చ యాదృక్చ** – దాని స్వరూపం ఏమిటో చెబుతాను.

సి) **యద్వికారి** – దానిలో ఉన్న అనేక కార్యాలు ఏమిటి?

డి) **యతశ్చ యత్** – ఏ కారణాలనుంచి ఏ కార్యాలు వచ్చాయి?

యద్వికారి కారణాన్ని సూచిస్తే, యతశ్చ యత్ కార్యాన్ని సూచిస్తుంది. మొత్తం బాహ్యప్రపంచం అంతా కార్యకారణసంబంధంతో ఉంది. ఇప్పుడు మిమ్మల్ని తీసుకుంటే మీరు కార్యం, మీ తల్లిదండ్రులు మీ పుట్టుకకు కారణం. వారిని వారి తల్లిదండ్రుల దృష్ట్యా చూస్తే, వారు కార్యం, వారి తల్లిదండ్రులు కారణం. అలా ప్రతి ఒక్కటీ ఒక కోణంలో కార్యం అయితే, ఇంకొక కోణంలో కారణం అవుతుంది.

క్షేత్రం గురించే కాదు, క్షేత్రజ్ఞుని గురించి కూడా ఇంకా చెప్పదలుచుకున్నాడు కృష్ణపరమాత్మ. అంతకుముందు ఏదైతే క్షేత్రాన్ని చైతన్యవంతం చేస్తుందో అది క్షేత్రజ్ఞుడు అన్నాడు.

**స చ యః** –క్షేత్రజ్ఞుడు గురించి చెబుతాను.

**యత్ప్రభావశ్చ** – దాని విభూతి ఏమిటి, స్వరూపం ఏమిటి, ఆ వివరాలు కూడా చెబుతాను.

ఒక శాస్త్రజ్ఞుడు చైతన్యాన్ని అద్భుతంగా వివరించాడు, 'చైతన్యానికి ప్రకృతి సూత్రాలు వర్తించవు. చైతన్యం దేశకాలాలకు అతీతం.'

**తత్సమాసేన మే శృణు। శ్రుత్వా అవధారయ॥** – ఆ వివరాలన్నీ సంక్షిప్తంగా చెబుతాను విను అంటున్నాడు కృష్ణపరమాత్మ.

ఇక్కడ మనం ఒక ఉపసిద్ధాంతాన్ని గ్రహించవచ్చు. క్షేత్రం అంటే ప్రపంచం అని చూశాము. అందులోని కార్యాలు ఏమిటో, కారణాలు ఏమిటో చెబుతాను అన్నాడు కృష్ణపరమాత్మ. కార్యకారణాలు రెండూ క్షేత్రంలోకి వస్తే క్షేత్రజ్ఞుడు ఎవరు?

**కార్యకారణ విలక్షణం క్షేత్రజ్ఞః** వీటి గురించి శ్రద్ధగా విను అని కూడా హెచ్చరిస్తున్నాడు. ఎందుకు?

**క్షేత్రక్షేత్రజ్ఞయోః జ్ఞానం యత్తద్ జ్ఞానం మతం మమ** – 13.3

వీటి గురించిన జ్ఞానమే గొప్ప జ్ఞానం అన్నాడు. ఈ ఆత్మజ్ఞానమే మోక్షాన్ని ఇస్తుంది. తర్వాత వచ్చే శ్లోకంలో కూడా ఈ ఆత్మజ్ఞానాన్ని స్తుతిస్తున్నాడు.

శ్లో. 5 **ఋషిభిర్బహుధా గీతం ఛందోభిర్వివిధైః పృథక్ ।**
**బ్రహ్మసూత్రపదైశ్చైవ హేతుమద్భిర్వినిశ్చితైః ॥**
ఋషిభిః, బహుధా, గీతమ్, ఛందోభిః, వివిధైః, పృథక్,
బ్రహ్మసూత్రపదైః, చ, ఏవ, హేతుమద్భిః, వినిశ్చితైః ॥

| | | | |
|---|---|---|---|
| ఋషిభిః | = ఈ క్షేత్రక్షేత్రజ్ఞుల తత్త్వము ఋషులచేత | (గీతమ్) | = (తెలుపబడినది) |
| | | చ | = అలాగే |
| బహుధా | = అనేక విధములుగా | వినిశ్చితైః | = నిశ్చయాత్మకములైన |
| గీతమ్ | = వివరింపబడినది | హేతుమద్భిః | = సహేతుకములైన |
| వివిధైః | = వివిధములైన | బ్రహ్మసూత్రపదైః | = బ్రహ్మసూత్ర పదముల |
| ఛందోభిః | = వేదమంత్రములద్వారా | ఏవ | = ద్వారా కూడా |
| పృథక్ | = వేర్వేరుగా | (గీతమ్) | = చెప్పబడినది |

**(ఇదం జ్ఞానం) ఋషిభిః బహుధా, (తథా) వివిధైః ఛన్దోభిః**
**పృథక్ హేతుమద్భిః వినిశ్చితైః బ్రహ్మ–సూత్ర–పదైః చ గీతమ్ ఏవ ॥**

తా: ఋషులచేత ఈ క్షేత్రక్షేత్రజ్ఞుల తత్త్వము అనేక విధములుగా వివరింపబడినది. వివిధములైన వేదమంత్రములద్వారా వేర్వేరుగా తెలుపబడినది. అలాగే నిశ్చయాత్మకములైన సహేతుకములైన బ్రహ్మసూత్ర పదములద్వారా కూడ చెప్పబడినది.

క్షేత్రం, క్షేత్రజ్ఞుడు విషయాలు ఎంత గొప్పవి అంటే వాటి గురించి మన శాస్త్రాలన్నీ విపులంగా చర్చిస్తాయి. క్షేత్రం అంటే పాంచభౌతిక ప్రపంచం; క్షేత్రజ్ఞుడు అంటే చైతన్యం. ఆ విధంగా సృష్టి మొత్తం జడతత్త్వం, చైతన్యతత్త్వాల మేలుకలయిక. అందువల్ల ఈ రెండింటి గురించి అర్థం చేసుకుంటే, మొత్తం సృష్టి గురించి అర్థమైనట్టే.

**ఋషిభిర్బహుధా గీతమ్** – ఋషులందరూ వారి శాస్త్రాల్లో ఈ జ్ఞానాన్నే కీర్తించారు. ఏ జ్ఞానం? క్షేత్రక్షేత్రజ్ఞ వివేకజ్ఞానం.

**ఛందోభిర్వివిధైః పృథక్ (ఇదమ్)** – ఛందః అంటే వేదమంత్రాలు. అనేక వేదమంత్రాల్లో కూడా ఈ రెండూ కీర్తించబడ్డాయి. ఇదమ్ అంటే ఈ రెండూ. అది మనం కలుపుకోవాలి.

లోకాల గురించి మాట్లాడినా, నక్షత్రాల గురించి మాట్లాడినా, విజ్ఞానశాస్త్రానికి సంబంధించిన ఏ అంశం గురించి మాట్లాడినా, మానసిక శాస్త్రం గురించి మాట్లాడినా – అన్నీ క్షేత్రం గురించే మాట్లాడినట్టు అవుతుంది. క్షేత్రజ్ఞుడు రాడు వాటిల్లో.

వేదాలు ఈ రెండింటి గురించీ మాట్లాడతాయి. ఎలా? పృథక్ – వేర్వేరుగా మాట్లాడతాయి. ఈ పదం చాలా ముఖ్యం. ఎందుకంటే విజ్ఞానశాస్త్రంలో ఈ రెండింటియొక్క సంబంధం గురించిన స్పష్టమైన అవగాహన లేదు. చైతన్యం, ద్రవ్యంకన్నా భిన్నంగా ఉందా, ద్రవ్యంలో ఒక భాగమా అనే విషయం ఇంకా కొరుకుడు పడలేదు. నిజానికి చైతన్యాన్ని విజ్ఞానశాస్త్రంలోని ఏ శాఖలో కలపాలో కూడా తెలియటం లేదు. కాని వేదాంతం ఎప్పుడో చైతన్యతత్త్వాన్ని, ద్రవ్యతత్త్వాన్ని విడిగా, స్పష్టంగా వివరించింది. ఏమని వివరించింది?

**బ్రహ్మ సత్యం, జగన్మిథ్యా జీవో బ్రహ్మైవ నాఽపరః**

చైతన్యాన్ని బ్రహ్మ అంటారు. ద్రవ్యతత్త్వాన్ని జగత్తుగా వ్యవహరించవచ్చు. చైతన్యం సత్యం, జగత్తు మిథ్య. కాని అక్కడితో ఆగకూడదు, ఆ చైతన్యాన్ని నేనే అని నేర్చుకుంటేనే ఆత్మజ్ఞానం పూర్తి అవుతుంది. ఈ ఆత్మజ్ఞానం వేదాల్లోనే కాదు, బ్రహ్మసూత్రాల్లో కూడా వస్తుంది.

**బ్రహ్మసూత్రపదైశ్చైవ** – బ్రహ్మసూత్రాలు కూడా ఈ రెండింటినీ చర్చిస్తాయి.

మన శాస్త్రాన్ని ప్రస్థానత్రయం అంటారు.

భగవద్గీత - స్మృతి ప్రస్థానం

ఉపనిషత్తులు - శ్రుతి ప్రస్థానం

బ్రహ్మసూత్రాలు - న్యాయ ప్రస్థానం

ఉపనిషత్తులు వేద అంతఃభాగంలో వస్తాయి. అవి అపౌరుషేయం. వేద అంతఃభాగంలో వస్తాయి కాబట్టి వాటిని వేదాంతం అని కూడా అంటారు. భగవద్గీత ఉపనిషత్తుల సారం. బ్రహ్మసూత్రాలను వ్యాసాచార్యులవారు రచించారు. వేదపూర్వభాగాన్ని జైమినీఋషి తార్కికంగా నిరూపించారు, దాన్ని ధర్మసూత్రాలు అంటారు.

బ్రహ్మసూత్రాల్లో వ్యాసాచార్యులవారు వేదాంత భాగమైన ఉపనిషత్తులను తార్కికంగా నిరూపించారు. అందుకని ఈ సూత్రాలను వేదాంతసూత్రాణి అనీ, వ్యాససూత్రాణి అనీ అంటారు. సూత్రం అంటే అతి తక్కువ పదాలతో ఎంతో లోతైన భావాన్ని పొందుపరిచేది అని అర్థం. బ్రహ్మసూత్రాల్లో మొదటి నాలుగు సూత్రాలు చాలా ప్రసిద్ధి చెందినవి. వాటిని చతుస్సూత్రీ అంటారు. అవి –

**అథాఽతో బ్రహ్మజిజ్ఞాసా** – 1

**జన్మాద్యస్య యతః** – 2

**శాస్త్రయోనిత్వాత్** – 3

**తత్తు సమన్వయాత్** – 4

అంత చిన్న సూత్రాల్లో ఎంతో లోతైన అర్థం ఇమిడివుంటుంది. ఈ సూత్రాల్లో వ్యాసాచార్యులవారు ఉపనిషత్తుల్లోని వాక్యాలను తీసుకుని, వాటిని విశ్లేషిస్తారు. చైతన్యం, ద్రవ్యం ఏకమా, భిన్నమా వివరిస్తారు. మనకు 12 దర్శనాలు ఉన్నాయి. పన్నెండవది అద్వైతదర్శనం లేదా అద్వైతవేదాంతం. తక్కిన దర్శనాలన్నీ ఒక్కొక్కటిగా తీసుకుని, వాటిని ఖండించుకుంటూ వస్తారు.

ఉదాహరణకు న్యాయదర్శనం చైతన్యం, ద్రవ్యంయొక్క గుణం అంటుంది. సాంఖ్య దర్శనం చైతన్యం వేరు, ద్రవ్యం వేరు అంటుంది. వీటన్నిటినీ తన సూత్రాల్లో ఖండించి, అద్వైత సిద్ధాంతాన్ని స్థాపిస్తారు వ్యాసాచార్యులవారు. అందువల్ల బ్రహ్మసూత్రాల్లో కూడా ఉంది అంటున్నాడు కృష్ణపరమాత్మ. బ్రహ్మసూత్రాలు ఎటువంటివి?

**హేతుమద్భిః** – తర్కంతో నిండి ఉన్నాయి.

**వినిశ్చితైః** – సంగ్రహంగా, నిశ్చయంగా, తార్కికంగా నిరూపించబడ్డాయి బ్రహ్మసూత్రాల్లో.

బ్రహ్మసూత్రాల్లో 555 సూత్రాలు ఉన్నాయి. ఆ 555 సూత్రాలకు 4 అధ్యాయాలు, 16 పాదాలు, 192 అంశాలు ఉన్నాయి. దానికి శంకరాచార్యులవారు భాష్యం రాశారు. అది చాలా పెద్ద భాష్యం. ఆయన భాష్యానికి ఉపభాష్యాలు; ఆ ఉపభాష్యాలకు ఉపభాష్యాలు ఉన్నాయి. ఇందాక చెప్పిన మొదటి నాలుగు సూత్రాలకు తొమ్మిది రకాల భాష్యాలు ఉన్న నాలుగు భాగాలు ఉన్న ఒక ఉద్గ్రంథం ఉంది. అంత లావు పుస్తకాల్లో, నాలుగవ భాగం చివరిపుట చూస్తే ఈ విధంగా నాలుగవ సూత్రం ముగిసింది అని ఉంటుంది. అంత విస్తారంగా ఉంటుంది మన శాస్త్రం. ఎంత చదివినా, మొత్తం శాస్త్రాన్ని అధ్యయనం చేసేశాను అని చెప్పలేము.

**అనంతశాస్త్రం బహు వేదితవ్యమ్ అల్పస్య కాలా బహవశ్చవిఘ్నాః**
**యత్సారభూతం తత్ ఉపాసితవ్యమ్ హంసో యథా క్షీరమివాంభు మిశ్రాత్**

శాస్త్రం ఎంతో విస్తారమైనది; కాలం చూస్తే చాలా తక్కువ ఉంది; అందులోనూ విఘ్నాలు అనేకం ఉంటాయి. అందువల్ల బ్రహ్మసూత్రాలు అధ్యయనం చేయాలనుకునేవారు కనీసం ఈ నాలుగు సూత్రాలను అధ్యయనం చేస్తారు.

శ్లో. 6 **మహాభూతాన్యహంకారో బుద్ధిరవ్యక్తమేవ చ ।**
**ఇంద్రియాణి దశైకం చ పంచ చేంద్రియగోచరాః ॥**
మహాభూతాని, అహంకారః, బుద్ధిః, అవ్యక్తమ్, ఏవ, చ,
ఇంద్రియాణి, దశ, ఏకమ్, చ, పంచ, చ, ఇంద్రియగోచరాః ॥

| | |
|---|---|
| మహాభూతాని = పంచమహాభూతములు | దశ, ఇంద్రియాణి = ఐదు జ్ఞానేంద్రియములు, ఐదు కర్మేంద్రియములు |
| అహంకారః = అహంకారము | ఏకమ్ = మనస్సు |
| బుద్ధిః = బుద్ధి | చ = ఇంకా |
| చ = ఇంకా | పంచ = ఐదు |
| అవ్యక్తమ్, ఏవ = మూలప్రకృతియు | ఇంద్రియగోచరాః = ఇంద్రియ విషయములు అంటే శబ్దస్పర్శరూపరసగంధములు |
| చ = అలాగే | |

**మహా-భూతాని అహఙ్కారః బుద్ధిః అవ్యక్తమ్ ఏవ చ ।**
**ఇన్ద్రియాణి దశ-ఏకమ్ చ పఞ్చ చ ఇన్ద్రియ-గోచరాః ॥**

తా: భూమి, నీరు, అగ్ని, వాయువు, ఆకాశము అనే పంచమహాభూతములు అహంకారము, బుద్ధి ఇంకా మూలప్రకృతియు. అలాగే ఐదు జ్ఞానేంద్రియములు, ఐదు కర్మేంద్రియములు, మనస్సు ఇంకా ఐదు ఇంద్రియ విషయములు అంటే శబ్దస్పర్శరూపరసగంధములు.

ముందుగా కృష్ణపరమాత్మ క్షేత్రాన్ని వివరించబోతున్నాడు. క్షేత్రాన్ని బాహ్యప్రపంచంగా చూడవచ్చు అని చూశాము. ఈ బాహ్యప్రపంచాన్ని అనేక దార్శనికులు అనేక రకాలుగా విభజించి వివరించారు. సంస్కృతంలో ఈ విభజనను తత్త్వాని అంటారు. ప్రతి సబ్జెక్టులోనూ కొన్ని విభజనలు ఉంటాయి. ఉదాహరణకు ఫిజిక్స్ తీసుకోండి. దానిలో భిన్న అంశాలను హీట్, ఎలక్ట్రిసిటీ, మాగ్నెటిజమ్ అంటూ విభజిస్తారు.

ఆ విధంగా మనకున్న 12 దార్శనికులు వారికి అనువుగా జగత్తును విభజించారు. వైశేషిక దార్శనికులు సృష్టిని 7 తత్త్వాలుగా విభజిస్తే; న్యాయదార్శనికులు సృష్టిని 17 తత్త్వాలుగా విభజిస్తే; సాంఖ్యదార్శనికులు సృష్టిని 24 తత్త్వాలుగా విభజించారు.

ఇప్పుడు ఈ భగవద్గీతలో సాంఖ్యనుంచి తాత్కాలికంగా తీసుకున్నారు వ్యాసాచార్యులవారు. అంటే 24 తత్త్వాలను తీసుకున్నారు.

**అథ చతుర్వింశతితత్త్వోత్పత్తిప్రకారం వక్ష్యామిః**

ఇదే పద్ధతిలో విభజించాలని నియమం లేదు. మన వీలుకు తగ్గట్టుగా విభజించవచ్చు. అంటే ఒక ప్రసంగానికి వెళ్ళిన భక్తులను రెండు మూడు రకాలుగా విభజించవచ్చు. స్త్రీ, పురుషులుగా విభజించటం ఒక పద్ధతి; వయస్సునుబట్టి నాలుగైదు తెగలుగా విభజించటం ఇంకొక పద్ధతి; చదువునుబట్టి విభజించటం ఇంకొక పద్ధతి. ఇక్కడ సాంఖ్య పద్ధతిని చూస్తున్నాము.

సాంఖ్య దర్శనంలోని 24 తత్త్వాలు.

1. **ప్రకృతి** – అవ్యక్తం. ప్రళయంలో, అంటే సృష్టి జరగక ముందు అది అవ్యక్తంలో ఉంది. దాన్ని ప్రకృతి అంటారు. ప్రకృతి అనాది.
2. **మహత్** – ప్రకృతినుంచి వచ్చిన మొట్టమొదటి అంశం మహత్. మహత్ అంటే సమష్టి బుద్ధి.
3. **అహంకారం** – అహంకారం అంటే సమష్టి అహంకారం; వ్యష్టి అహంకారం కాదు. అప్పటికి జీవి లేదు.
   ఈ అహంకారంనుంచి 16 తత్త్వాలు వచ్చాయి– అవి
4. **మనస్సు** – సమష్టి అహంకారంనుంచి సమష్టి మనస్సు వచ్చింది.
5. **దశ ఇంద్రియాలు** – పంచజ్ఞానేంద్రియాలు + పంచకర్మేంద్రియాలు.
6. **పంచసూక్ష్మభూతాలు**
7. **పంచస్థూలభూతాలు**

ఇప్పుడు వీటిని దశల వారీగా చూద్దాము.

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| అనాదిగా ఉన్నది | – ప్రకృతి | – | 1 | – | 1 |
| మొదటి దశ | – మహత్ | – | 1 | – | 1 |
| రెండవ దశ | – సమష్టి అహంకారం | – | 1 | – | 1 |
| మూడవ దశ | – సమష్టి మనస్సు | – | 1 | | |
| | – జ్ఞానేంద్రియాలు | – | 5 | | |
| | – కర్మేంద్రియాలు | – | 5 | | |
| | – సూక్ష్మభూతాలు | – | 5 | – | 16 |
| నాలుగవ దశ | – స్థూలభూతాలు | – | 5 | – | 5 |
| మొత్తం తత్త్వాలు | | | | | 24 |

ఈ 24 తత్త్వాలూ క్షేత్రానికి చెందినవే. క్షేత్రం అంటే బాహ్యప్రపంచమని చూశాము. ఇవన్నీ జడమే, వీటిలో చైతన్యం లేదు. ఇప్పుడు ఈ నేపథ్యంతో ఈ శ్లోకాన్ని చూద్దాము.

**అవ్యక్తమ్** – అవ్యక్తంగా ఉన్న ప్రకృతి – 1.

**బుద్ధిః** – మహత్ తత్త్వం, ఇది మొదటి దశ – 1.

**అహంకారః** – సమష్టి అహంకారం, ఇది రెండవ దశ – 1.

అహంకారంనుంచి 16 తత్త్వాలు వచ్చాయి. ఏమిటవి?

**మహాభూతాని** – ఆకాశం, వాయువు, అగ్ని, జలం, పృథివి. అంటే పంచభూతాలు – 5.

**దశ ఇంద్రియాణి** – పంచజ్ఞానేంద్రియాలు, పంచకర్మేంద్రియాలు – 10.

**ఏకమ్** – సమష్టి మనస్సు – 1.

ఇందులో 5+5+5+1=16 తత్త్వాలు వస్తాయి. ఇది మూడవ దశ – 16.

**పంచ చేంద్రియగోచరాః** – ఇంద్రియ గోచరమైనవి ఐదు. అంటే పంచస్థూలభూతాలు. ఇది నాలుగవదశ – 5.

ఇప్పుడివన్నీ కలిపితే 24 తత్త్వాలు అవుతాయి. ఇవన్నీ క్షేత్రం కిందకు వస్తాయి.

అంతేకాదు, ఈ 24 తత్త్వాలు నిరంతరం మార్పుకు లోనవుతూ ఉంటాయి. అవి ఒకదానితో ఒకటి కలవటంవల్ల, వాటికి మార్పు ఉండటంవల్ల, అనేక గుణాలు ఏర్పడతాయి. వీటిని వికారాలు అంటారు. ముందు శ్లోకంలో యద్వికారి యతశ్చయత్ అన్నాడు కృష్ణపరమాత్మ. ఇంతవరకు కారణాలు చూశాము, తర్వాత శ్లోకంలో కార్యాలు చూస్తాము.

శ్లో. 7 **ఇచ్ఛా ద్వేషః సుఖం దుఃఖం సంఘాతశ్చేతనా ధృతిః ।**
**ఏతత్ క్షేత్రం సమాసేన సవికారముదాహృతమ్ ॥**
ఇచ్ఛా, ద్వేషః, సుఖమ్, దుఃఖమ్, సంఘాతః, చేతనా, ధృతిః,
ఏతత్, క్షేత్రమ్, సమాసేన, సవికారమ్, ఉదాహృతమ్ ॥

| | | | |
|---|---|---|---|
| ఇచ్ఛా | = కోరిక | ధృతిః | = ధృతి |
| ద్వేషః | = ద్వేషము | సవికారమ్ | = వాటి మార్పులతో గూడినట్టి |
| సుఖమ్ | = సుఖము | ఏతత్ | = ఇదియే |
| దుఃఖమ్ | = దుఃఖము | క్షేత్రమ్ | = క్షేత్రస్వరూపమని |
| సంఘాతః | = కార్యకరణసంఘాతము | సమాసేన | = సంగ్రహముగా |
| చేతనా | = చిదాభాస | ఉదాహృతమ్ | = చెప్పబడినది. |

**ఇచ్ఛా, ద్వేషః, సుఖమ్, దుఃఖమ్, సంఘాతః, చేతనా, ధృతిః,**
**ఏతత్ సవికారమ్ క్షేత్రమ్ (మయా) సమాసేన ఉదాహృతమ్ ॥**

తా: కోరిక, ద్వేషము, సుఖము, దుఃఖము, కార్యకరణ సంఘాతము, చిదాభాస, ధృతి, వాటి మార్పులతో గూడినట్టి ఇదియే క్షేత్రస్వరూపమని సంగ్రహముగా చెప్పబడినది.

ఇప్పుడు 24తత్త్వాలు ఉన్న బాహ్యప్రపంచాన్ని చూస్తాము. ఆ బాహ్యప్రపంచంలో మన స్థూలశరీరం కూడా వస్తుంది. ఎందుకంటే స్థూలశరీరం పాంచభౌతికం; అలాగే మన మనస్సు కూడా వస్తుంది; మనస్సు సూక్ష్మపంచభూతాలనుంచి వచ్చింది. అంటే అంతకుముందు చూసినట్టుగా క్షేత్రంలోకి ఈ బాహ్యప్రపంచం, శరీరం, మనస్సు వస్తాయి.

ఈ మూడింటిలో మనస్సుకు ఒక ప్రత్యేకత ఉంది. ఏమిటా ప్రత్యేకత? మనస్సు జడం అయినా కూడా దానికి చైతన్యాన్ని ప్రతిబింబింపజేసే ప్రత్యేకమైన శక్తి ఉంది. అందువల్ల మనస్సు చైతన్యంగా ఉన్నట్టు కనబడుతుంది. ఉదాహరణకు విద్యుచ్ఛక్తి నీటిమీద ప్రసరించినా కాంతినివ్వదు; కాని ఒక బల్బుయొక్క ఫిలమెంటులో ప్రసరిస్తే, ఆ బల్బు వెలుగుతుంది. అంటే నీటికి వెలిగే శక్తి లేదు, బల్బుయొక్క ఫిలమెంటుకు ఉంది. ఆ విధంగా మనస్సు జడమే అయినా, దానికి చైతన్యాన్ని ప్రతిబింబంపజేసే శక్తి ఉంది. ఈ అరువు తెచ్చుకున్న చైతన్యాన్ని చేతనః అంటారు. ఇప్పుడు శ్లోకం చూద్దాము.

**సంఘాతః చేతనా** – బాడీ మైండ్ సెన్స్ కాంప్లెక్సును సంఘాతః అంటారు. అంటే శరీరం, మనస్సు, ఇంద్రియాలను కలిపి సంఘాతం లేదా కార్యకరణ సంఘాతం అంటారు. చేతనా అంటే అరువు తెచ్చుకున్న చైతన్యం.

దీనికి ఇంకొక ఉదాహరణ చూద్దాము. పైన ఆకాశంలో సూర్యుడు ఉన్నాడు, మీ చేతిలో అద్దం ఉంది. ఆ అద్దం పైన ఉన్న సూర్యునియొక్క ప్రతిబింబాన్ని ఒక గోడమీద చూపించగలదు. అద్దానికి స్వతహాగా ప్రకాశకత్వం లేదు. కాని అది ప్రకాశాన్ని సూర్యునినుంచి అరువు తెచ్చుకుని, ఆ అరువు తెచ్చుకున్న ప్రకాశకత్వంతో తాను మళ్ళీ ప్రతిబింబింపజేస్తోంది. అద్దానికున్న ప్రకాశకత్వం సహజం కాదు, ఆగంతుకం.

ఇప్పుడు ఈ ఉదాహరణను మనస్సుకు అన్వయిస్తే – చైతన్యం–సూర్యుడు; మనస్సు–అద్దం. అద్దం ఒక ప్రతిబింబాన్ని చూపినట్టుగా మనస్సు ఒక ప్రతిబింబాన్ని చూపిస్తుంది. అసలు చైతన్యాన్ని బింబచైతన్యం అంటే, మనస్సు ప్రతిబింబించిన చైతన్యాన్ని ప్రతిబింబ చైతన్యం అంటారు. ఇంకో విధంగా చెప్పాలంటే, చైతన్యాన్ని చిత్ అనీ, ప్రతిబింబ చైతన్యాన్ని చిదాభాస అనీ అంటారు.

ఈ ప్రతిబింబం ఎక్కడ ఏర్పడుతుంది? ప్రతిబింబ మాధ్యమం ఎక్కడ ఉంటే అక్కడ ఏర్పడుతుంది. ప్రతిబింబ మాధ్యమం అయిన మనస్సు క్షేత్రంలోకి వస్తుంది, అందువల్ల ప్రతిబింబం కూడా క్షేత్రంలోకే రావాలి. గుర్తుంచుకోండి, చైతన్యం క్షేత్రంలోకి రాదు; ప్రతిబింబ చైతన్యమే వస్తుంది. సంఘాతం అంటే శరీరం, మనస్సు, ఇంద్రియాల కలయిక. చేతనా అంటే చిదాభాస, అరువు తెచ్చుకున్న చైతన్యంవల్ల మనస్సు బాహ్యప్రపంచాన్ని అనుభవించి, ఆ ప్రపంచాన్ని రెండు తెగల కింద విభజిస్తుంది.

**ఇచ్ఛా ద్వేషః** – రాగద్వేషాలు. ఇచ్ఛ అంటే రాగం. ప్రపంచంలో ఒక భాగంమీద రాగం కలిగివుండటం. ఇది దేని పని? మనస్సు చేసే గారడి. మనస్సు ఎలా చేయగలదు? అరువు తెచ్చుకున్న చైతన్యంవల్ల.

నాణేనికి ఒకవైపు రాగం ఉంటే, ఇంకొకవైపు ద్వేషం ఉంటుంది. ప్రపంచాన్ని రెండుగా చేసి మనను ఒక ఆటాడిస్తుంది మనస్సు. కొంతమందిమీద రాగం పెంచితే, కొంతమందిమీద వారి ముఖం చూడటానికే ఇష్టపడనంత ద్వేషం పెంచుతుంది. ఈశ్వరసృష్టిని జీవసృష్టి చేస్తుంది. అంటే భగవంతుడు సృష్టించిన జగత్తును ఉన్నదున్నట్టుగా చూపించకుండా, రెండు తెగలుగా విభజించి చూపిస్తుంది.

**కామెర్ల రోగికి లోకమంతా పచ్చగా ఉంటుంది.** అదే విధంగా ప్రపంచాన్ని మనం పులుముకున్న రెండు రంగులతో చూస్తాము. ఉన్నదున్నట్టుగా చూడకుండా, మన కోణంలోంచి చూస్తాము.

**సుఖం దుఃఖమ్** – ఎప్పుడైతే ప్రపంచాన్ని రెండుగా విభజించి చూస్తామో, దాన్ని వెన్నంటి సుఖదుఃఖాలు కలుగుతాయి. మనం కోరుకున్న ప్రపంచం, మనం ద్వేషించే ప్రపంచం – రెండూ రెండింటినీ ఇస్తాయి. ముందే చూసినట్టుగా, వస్తువులకు స్వతహాగా సుఖం, దుఃఖం కలిగించే లక్షణం లేదు. వాటికి మనం పులిమిన రంగులు ఇస్తున్నాయి. ఎలా? మనం కోరుకున్న వస్తువు పొందితే ఆనందం కలుగుతుంది, అది మననుంచి దూరమైతే దుఃఖం కలుగుతుంది. అది సహజమే కదా. ఏదైతే మన దగ్గర ఉంటే సంతోషాన్ని ఇస్తుందో, అది దూరమైతే దుఃఖాన్ని తెస్తుంది.

అదే మనం ద్వేషించే విషయం తీసుకుంటే దీనికి భిన్నంగా జరుగుతుంది. అంటే మనం ద్వేషించే వస్తువు మనకు దగ్గరగా వస్తే దుఃఖం కలుగుతుంది, అది మననుంచి మాయమయితే ఆనందం కలుగుతుంది. అంటే రాగద్వేషాలు కలిగించే రెండూ సుఖదుఃఖాలు రెండింటినీ ఇస్తాయి. అందువల్లనే దీన్ని ఇలా వర్ణించారు ఎవరో, 'కొంతమంది మన దగ్గరికి వచ్చి ఆనందం కలిగిస్తే, కొంతమంది మన దగ్గరనుంచి వెళ్ళి ఆనందం కలిగిస్తారు. ఆ విధంగా అందరూ ఆనందాన్ని కలిగిస్తారు.'

ముందే చూసినట్టుగా ఈ ఆనందం, దుఃఖం అనేది వస్తువుల్లోనూ, మనుష్యుల్లోనూ లేదు. కాని మనం వాటికి రాగం, ద్వేషం అనే బిరుదులు అంటించేసరికి వాటికా శక్తి వస్తుంది. వేదాంతం ఈ భేదాన్ని రెండు పదాలతో సూచిస్తుంది. ఇప్పుడు నా చేతిలో ఒక పుస్తకం ఉంది. అది ఒక ఆబ్జెక్టు మాత్రమే. దాన్ని పదార్థం అంటారు. కాని ఆ పుస్తకంమీద నేను రాగద్వేషాలు పెంచుకుంటే, ఆ పుస్తకం నన్ను బాధించే అవకాశం ఉంది. ఆ పుస్తకంమీద నేను రాగం పెంచుకుంటే దానికి నన్ను ఆనందపరిచే లక్షణం వస్తుంది; లేదా ద్వేషం పెంచుకుంటే దానికి నన్ను బాధించే లక్షణం అలవడుతుంది. ఎప్పుడైతే ఆ వస్తువుకు అలాంటి లక్షణం ఏర్పడుతుందో, అప్పుడే వేదాంతం దానిని విషయః అంటుంది. విషయః అంటే నన్ను బంధించే శక్తి ఉన్న వస్తువు అని అర్థం. అంటే పదార్థం పేరున్న వస్తువు విషయం అయింది.

ఆ విధంగా మొత్తం ప్రపంచం ఒక పదార్థం, కాని నేను దాన్ని విషయంగా మార్చాను. ప్రపంచంలోని పదార్థాలను రాగద్వేషాలనే రంగులతో చూసి అవి నాకు సుఖదుఃఖాలను కలుగజేసేలా చేసుకున్నాను.

ఆ విధంగా క్షేత్రంలోకి సంఘాతః, చేతనా, ఇచ్ఛా, ద్వేషం, సుఖం, దుఃఖం వస్తాయి.

**ధృతిః** – ధృతిః అంటే దృఢనిశ్చయం. ఎప్పుడైతే ఒక విషయంమీద రాగం పెంచుకుంటానో దాన్ని ఎలాగోలా పొందటానికి ప్రయత్నిస్తాను. దాన్ని ప్రవృత్తిమార్గం అంటారు. అది కేవలం ఒక వస్తువుమీద కాదు, అనేక వస్తువులమీద రాగం ఉంటుంది. ఈ దృఢనిశ్చయంతో వాటిని పొందేదాకా వాటి వెంట పడతాను. అదే దృఢనిశ్చయంతో నేను ద్వేషించే వస్తువులనుంచి దూరం పారిపోవటానికి ప్రయత్నిస్తాను. దాన్ని నివృత్తిమార్గం అంటారు. అంటే కొన్నింటివైపు పరుగులు తీస్తే కొన్నింటినుంచి పరుగులు తీయటం.

**ప్రవృత్తి నివృత్తి హేతుభూతధృతిః**

జీవితమంతా నిర్ణయాలు తీసుకోవటంతోనే సరిపోతుంది. ఏది కావాలి, ఏది వద్దు అని నిర్ణయించుకుని, వాటికి తగ్గ ప్రయత్నాలు చెయ్యటమే. ఈ ధృతి కూడా క్షేత్రమే. 24 తత్త్వాలు క్షేత్రం అయితే, ఇవన్నీ క్షేత్రవికారాలు, అంటే క్షేత్రంనుంచి పుట్టిన లక్షణాలు.

**ఏతత్ క్షేత్రం** – ఏతత్ అంటే 24 తత్త్వాలు; (ఆరవ శ్లోకంలో చెప్పబడినవి) క్షేత్రం.

**సమాసేన సవికారముదాహృతమ్** – దానియొక్క మార్పులు సంగ్రహంగా చెప్పబడ్డాయి.

ఈ శ్లోకంతో కృష్ణపరమాత్మ క్షేత్రం–క్షేత్రజ్ఞుల విశ్లేషణ ముగించాడు (2–7). కాని మీరు గమనిస్తే కృష్ణపరమాత్మ నాలుగవ శ్లోకంలో తను క్షేత్రం గురించీ, క్షేత్రజ్ఞుని గురించీ చెబుతానని మాట ఇచ్చాడు. కాని ఇప్పటివరకూ వచ్చిన వివరణ క్షేత్రం గురించే, క్షేత్రజ్ఞుని గురించి రాలేదు. అంటే కృష్ణపరమాత్మ తన మాటను మర్చిపోయాడా?

**కృష్ణం వందే జగద్గురుమ్**

జగద్గురువు ఎలా మర్చిపోతాడు? అలా మనం పొరపాటు పడకుండా శంకరాచార్యులవారు వివరిస్తున్నారు. కృష్ణపరమాత్మ మాటంటే మాటే.

మీకు గుర్తుంటే క్షేత్రజ్ఞుడు, జ్ఞేయం, పురుషుడు – మూడూ పర్యాయపదాలని ముందే చూశాము. మూడింటి అర్థమూ చైతన్యతత్త్వం. అర్జునునికి ఆ విషయం తెలియక మూడూ మూడు భిన్నపదాలనుకుని వాటి గురించి చెప్పమని అడిగాడు. కొంతమంది అలా వాడుతూ ఉంటారు. నాకు వేదాంతం, ఉపనిషత్తులు నేర్చుకోవాలని ఉంది అంటారు. వేదాంతం అన్నా, ఉపనిషత్తు అన్నా ఒకటే. 'అంజనమంటే ఏమిటో నాకు తెలియదా, పసుపులా తెల్లగా ఉంటుంది,' అన్నారట ఎవరో. అంటే అతనికి ఈ మూడూ తెలియవన్నమాట.

కృష్ణపరమాత్మ క్షేత్రజ్ఞుని గురించి ఇప్పుడు వదిలేసి, తర్వాత జ్ఞేయం గురించి చెప్పినప్పుడూ, పురుషుని గురించి చెప్పినప్పుడూ చెబుతాడు. ఆ విధంగా క్షేత్రం–క్షేత్రజ్ఞుల విషయం ముగించి మూడవ అంశంలోకి అడుగుపెట్టబోతున్నాడు కృష్ణపరమాత్మ.

శ్లో. 8 **అమానిత్వమదంభిత్వమ్ అహింసా క్షాంతిరార్జవమ్ ।**
**ఆచార్యోపాసనం శౌచం స్థైర్యమాత్మవినిగ్రహః ॥**

అమానిత్వమ్, అదంభిత్వమ్, అహింసా, క్షాంతిః, ఆర్జవమ్,
ఆచార్యోపాసనమ్, శౌచమ్, స్థైర్యమ్, ఆత్మవినిగ్రహః ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| అమానిత్వమ్ | = | తానే శ్రేష్ఠుడనను భావము లేకుండుట | ఆర్జవమ్ | = | మనోవాక్కాయములందు సరళత్వము |
| అదంభిత్వమ్ | = | డాంబికము లేకుండుట | ఆచార్యోపాసనమ్ | = | భక్తిశ్రద్ధలతో గురువుల సేవ |
| అహింసా | = | ఏ ప్రాణినీ ఏ విధముగను హింసింప కుండుట | శౌచమ్ | = | బాహ్యాభ్యంతర శుద్ధి |
| | | | స్థైర్యమ్ | = | అంతఃకరణలందు స్థిరత్వము |
| క్షాంతిః | = | క్షమాగుణము | ఆత్మ వినిగ్రహః | = | మనస్సు, శరీరేంద్రియముల నిగ్రహము |

**అమానిత్వమ్, అదమ్భిత్వమ్, అహింసా, క్షాన్తిః, ఆర్జవమ్,**
**ఆచార్య-ఉపాసనమ్, శౌచమ్, స్థైర్యమ్, ఆత్మ-వినిగ్రహః ॥**

తా: తానే శ్రేష్ఠుడనను భావము లేకుండుట, డాంబికము లేకుండుట, ఏ ప్రాణినీ ఏ విధముగను హింసింప కుండుట, క్షమాగుణము, మనోవాక్కాయములందు సరళత్వము, భక్తిశ్రద్ధలతో గురువుల సేవ, బాహ్యాభ్యంతర శుద్ధి, అంతఃకరణలందు స్థిరత్వము మనస్సు, శరీరేంద్రియముల నిగ్రహము.

3. **జ్ఞానం: శ్లోకాలు 8-12**

ముందే చూసినట్టుగా ఇక్కడ జ్ఞానం పదం అర్థం వేరే ఉంది. మామూలుగా అయితే, జ్ఞానం అంటే ఒక వస్తువుకు సంబంధించిన జ్ఞానం; వేదాంతపరంగా చూస్తే జ్ఞానం అంటే బ్రహ్మజ్ఞానం. కాని ఇక్కడ జ్ఞానం అంటే సద్గుణాలు. 8-12 శ్లోకాల్లో అటువంటి 20 విలువలను పేర్కొంటాడు కృష్ణపరమాత్మ. కృష్ణపరమాత్మ విలువలను జ్ఞానం అని ఎందుకన్నాడో వివరిస్తున్నారు శంకరుల వారు. ఈ విలువలను పెంపొందించుకుంటే, జ్ఞానం పొందటం చాలా సులభం అవుతుంది. ఈ విలువలు జ్ఞానాన్ని పెంపొందిస్తాయి కాబట్టి వాటినే జ్ఞానం అన్నాడు కృష్ణపరమాత్మ.

**జ్ఞానకారణత్వాత్ జ్ఞానమ్ ఇతి ఉచ్యతే**

ఈ విలువలను పెంపొందించుకుంటే, మనస్సు సంసిద్ధమయి, జ్ఞానయోగ్యతాప్రాప్తిని కలుగజేస్తుంది. అంటే విలువలు లేకపోతే జ్ఞానానికి అయోగ్యులము అవుతాము.

మనస్సు సంసిద్ధంగా లేకపోతే, గురువు ఆత్మజ్ఞానాన్ని నేర్పించినా కూడా, మనం ఆ జ్ఞానాన్ని అందుకోలేము. ఒకవేళ అందుకున్నా దాన్ని జీర్ణించుకోలేము. జీర్ణించుకోని జ్ఞానం, అది ఏ రంగానికి చెందినదైనా సరే, విషంలాగా అవుతుంది. ఆహారం కూడా అంతే. అరిగించుకున్న ఆహారం ఆరోగ్యాన్నిస్తే, అరిగించుకోలేని ఆహారం విషతుల్యంగా మారుతుంది.

**అనభ్యాసే విషం శాస్త్రమ్, అజీర్ణే భోజనం విషమ్**

ఆ విధంగా జీర్ణంకాని శాస్త్రం వ్యతిరేక ఫలాలను ఇవ్వవచ్చు. అందువల్ల వేదాంతం నేర్చుకోవాలంటే, దానికి సహకారీ సాధనలైన విలువలను పెంపొందించుకోవాలి. ఆ విలువలను **ధర్మం** అని కూడా అంటారు.

అందువల్లనే మోక్షానికి తొలిమెట్టు ధర్మం అని పదేపదే చెబుతుంది శాస్త్రం. శాస్త్రం అనేక విలువలను అనేక సందర్భాలలో చెప్పింది. భగవద్గీతలో కూడా మళ్ళీ 16, 17 అధ్యాయాల్లో చూస్తాము. భర్తృహరి నీతిశతకం పేరిట ఈ విలువలను కీర్తిస్తూ రాశారు. ఇక్కడ ఈ అధ్యాయంలో కృష్ణపరమాత్మ 20 విలువలను పేర్కొన్నాడు. వాటిని ఒక్కొక్కటిగా చూద్దాము.

1. **అమానిత్వమ్** – గర్వం లేకపోవటం. మానిత్వం అంటే గర్వం ఉండటం, తానే గొప్పవాడు అనుకోవటం. **ఆత్మని పూజ్యత్వ భావన**. తనమీద తనకే పూజ్యభావన ఉండటం. అమానిత్వం అంటే ఈ గర్వం, ఈ గొప్పగా అనుకోవటం లేకపోవటం. ఇంకోవిధంగా చెప్పాలంటే వినయం, అణకువ. దీన్ని మొట్టమొదటి విలువగా పేర్కొన్నాడు కృష్ణపరమాత్మ.

వేదాంతం ఎందుకు గర్వాన్ని మొట్టమొదటి ఆటంకంగా పరిగణిస్తోందో చూడాలి మనం. మీరు ఏ రంగంలో రాణించినా, ఎందులో ప్రథమశ్రేణిలో ఉన్నా, సమాజంయొక్క ఉన్నతమైన లక్ష్యం మిమ్మల్ని గౌరవించి, సత్కరించటం. దేశపరంగా పద్మశ్రీ, పద్మవిభూషణ బిరుదులను ఇచ్చి సత్కరిస్తుంది. ఈ గుర్తింపు చిన్నగా మొదలవుతుంది. ముందుగా కుటుంబం గుర్తిస్తుంది. మీరు ఏం చేసినా, మీ తల్లిదండ్రులు మిమ్మల్ని అభినందిస్తారు. నెమ్మదిగా ఈ ప్రశంసలు బంధువులనుంచి, స్నేహితులనుంచి వస్తాయి. అలా అలా పెరుగుతూ వస్తుంది.

మీరు కూడా మీకు తెలియకుండానే ఈ ప్రశంసల వర్షంలో తడిసి ముద్దయిపోతుంటారు. మీకు తెలియకుండానే మీ గొప్పతనాన్ని మీరు కూడా కీర్తించుకుంటారు. ఆ విధంగా మిమ్మల్ని మీరు కీర్తించుకోవటం గర్వానికి తొలిమెట్టు.

నన్ను నేను గొప్పగా భావిస్తే, తప్పేముంది? నిజానికి ఆ దశకు చేరుకోగలగటం పుణ్యం కూడా. అభినందనల వర్షం ఆమోదదాయకం కదా అనిపిస్తుంది మీకు. కాని వేదాంతం దాన్ని ఒప్పుకోదు. ఆధ్యాత్మిక సాధకునికి అది ఒక పెద్దవల అంటుంది. ఆధ్యాత్మికంగా ఎదగకుండా ప్రశంసల వర్షం ఒక వలలాగా పట్టేస్తుంది. ఎందుకు ఆత్మప్రశంస ఆటంకం అంటుంది?

**వ్యసనమ్** – ప్రశంసల వర్షంలో మునిగి తేలటం కూడా ఒక వ్యసనమే. త్రాగుడు, సిగరెట్టులకు అలవాటు పడ్డవారు అవి లేకపోతే ఉండలేనట్టుగా, ప్రశంసలకు అలవాటుపడితే అవి రాకపోతే గిలగిలలాడి పోతారు. ఆ చెడు అలవాట్లకు ఎలా దూరమవ్వాలో, అలా ఈ వ్యసనానికి కూడా దూరమవ్వాలి.

**మోహమ్** – ఎప్పుడైతే ఈ ప్రశంసల వర్షంలో మునిగితేలుతుంటారో, అప్పుడే విచక్షణాశక్తిని కూడా కోల్పోతారు. మీ గొప్పలకు మీరు మురిసిపోవటమే కాక, నలుగురూ మెచ్చుకుంటూ ఉంటేనూ, వార్తాపత్రికలు కూడా మిమ్మల్ని ఆకాశానికెత్తేస్తూంటేనూ, ఇంక కళ్ళకు పొరలు కమ్మేస్తాయి. బుద్ధి సరిగా పనిచెయ్యదు. బుద్ధి సరిగా

పనిచెయ్యకపోయేసరికి, మోహంలో పడిపోతారు. మోహంలో పడేసరికి చాలా ముఖ్యమైన అంశాలను కూడా మర్చిపోతారు. ఏమిటవి?

మీరు సాధించిన ఏ విజయానికైతే మిమ్మల్ని వేనోళ్ళ కీర్తిస్తున్నారో, ఆ విజయం పూర్తిగా మీ ఒక్కరికే చెందదు. ఎందులోనైనా విజయం సాధించండి కాని దానివెనుక అనేక కారణాలు ఉంటాయి, అనేకమంది సహాయసహకారాలు ఉంటాయి. కాని ముందే చెప్పినట్టుగా విజయగర్వం మీ కళ్ళకు పొరలను కప్పేసి అసలు సత్యాన్ని చూడకుండా చేస్తుంది. ఒక్క విషయం గుర్తుంచుకోండి. మీకు ఎంత పేరుప్రఖ్యాతలు వచ్చినా కూడా దానిలో 99% మెప్పు తక్కిన అనేక అంశాలకు వెళుతుంది. మీకు ఒక్క శాతమే వస్తుంది. గర్వం ఏర్పడితే, అది మోహానికి దారితీసి ఈ నిజాన్ని గ్రహించనివ్వదు. ఇది ఒక సమస్య.

ఒకవేళ మీ రంగంలో మీరు రాణించటానికి నిజంగా మీ కృషి ఉన్నా కూడా, అది కూడా పూర్తిగా మీ గొప్పదనం కాదు. కృష్ణపరమాత్మే పదవ అధ్యాయంలో స్వయంగా చెప్పాడు -

**యద్యద్విభూతిమత్ సత్త్వం శ్రీమదూర్జితమేవ వా ।**
**తత్తదేవావగచ్ఛ త్వం మమ తేజోఽంశసంభవమ్ ॥** - 10.41

ఎవరిలో ఏ విభూతి ఉన్నా, అది నా తేజస్సుయొక్క అంశంనుంచే కలిగినదిగా తెలుసుకో అన్నాడు కృష్ణపరమాత్మ. అంటే మీలో ఏదైనా కళ ఉన్నా, శక్తి ఉన్నా, అది భగవంతుని విభూతే. అది మీద్వారా ప్రకటితమవుతున్నది. అందువల్ల ఆ విధంగా చూసినా అది మీ గొప్పతనం కాదు. కాని గర్వంతో కూడిన మోహం విచక్షణా శక్తిని కప్పేయటంవల్ల మీ విజయం వెనకనున్న తోటివారి సహాయసహకారాలనూ గుర్తించటం లేదు, దైవకృపనూ గుర్తించటం లేదు. గర్వం ఉన్న చోట భక్తికి చోటులేదు. గర్వం ఉన్న వ్యక్తి అంతా తన గొప్పతనమే అని విర్రవీగుతాడు. ఆ విజయానికి భగవంతుని కృప ఉందని గ్రహించడు. ఇది మోహంవల్ల వచ్చే రెండవ సమస్య.

మోహంవల్ల కలిగే ఇంకొక సమస్య, మీకన్నా మిన్నగా విజయం సాధించినవారు వేరేవారు ఉన్నారని గ్రహించరు. మీరు ఏ రంగంలో అన్నా రాణించండి, మీకన్నా గొప్పవారు మీ ముందూ ఉన్నారు, ఇప్పుడూ ఉన్నారు, ఇకముందూ ఉంటారు. దీన్ని సంస్కృతంలో **సాదిశయత్వం** అంటారు. సాదిశయత్వం అంటే దేన్నైనా ఇంకా మెరుగుపరచగలము అని అర్థం. మీ ముందు ఉన్నవారి రికార్డు మీరు బద్దలుకొడితే, మీ రికార్డు బద్దలుకొట్టేవారు ఇంకొకరు వస్తారు. గుర్తుంచుకోండి, ఎప్పటికీ మీరే ప్రథమశ్రేణిలో ఉండలేరు. మీ అంత గొప్పవారు కానీ, మీకన్నా గొప్పవారు కానీ ఉంటూనే ఉంటారు.

కాని మోహం మీ కళ్ళకు పొరలు కప్పేయటంవల్ల ఈ విచక్షణాశక్తిని కోల్పోతారు. మీ అంతటివారు, ఇంకా మాట్లాడితే మీకన్నా గొప్పవారు మీ రంగంలోనే ఉన్నారనే విషయాన్ని మీరు మర్చిపోతారు. నిజం చెప్పాలంటే, మర్చిపోవటానికి ఇష్టపడతారు. అది మర్చిపోతేనే మీ గొప్పతనాన్ని మీరు చాటిచెప్పుకోగలుగుతారు. ఆ మోహం ఎంతమేరకు దారితీస్తుందంటే, ఇంకొకరి గొప్పతనాన్ని మెచ్చుకోవటానికి మీ మనస్సు అంగీకరించదు.

మీకు మోహం ఆవరిస్తే, నలుగురి మధ్యలో మీరే ఒక వెలుగు వెలగాలనుకుంటారు. ఎవరైనా మీతో సమానంగా ఉన్నారంటే, భరించలేరు. వారిమీద ద్వేషంతో, కోపంతో రగిలిపోతారు. వారిని తప్పించుకు పోవటానికి చూస్తారు లేదా వారిమీద బురద చల్లటానికి చూస్తారు. ఇంకా మాట్లాడితే వారిని ఆ రంగంలోంచి తప్పించటానికి కూడా ప్రయత్నించవచ్చు. అది మోహంయొక్క తీవ్రతనుబట్టి ఉంటుంది.

మీకు మోహం ఉందో లేదో తెలియటానికి మీకు మీరే చిన్న పరీక్ష పెట్టుకోవచ్చు. తోటివారిని, ముఖ్యంగా మీ రంగంలో మీకు ధీటుగా నిలిచినవారిని, మీరు మనస్ఫూర్తిగా మెచ్చుకోగలుగుతున్నారా, లేదా? ఒక గొప్ప నాదస్వర విద్వాంసుణ్ణి, ఇంకో నాదస్వర విద్వాంసుడు ఎలా వాయిస్తాడు అని అడిగారుట ఎవరో. 'ఆ, అతనా, అతను గాలి ఊదుతాడు, అంతే,' అని చప్పరించేశాడుట ఈయన. అలా ఉంటుంది. ఎదుటివారి గొప్పతనాన్ని స్వీకరించటానికి మనకు గొప్ప హృదయం ఉండాలి. విశాల హృదయం ఉండాలంటే, గర్వం ఉండకూడదు. ఎప్పుడైతే గర్వం కలుగుతుందో, అప్పుడే భక్తిమార్గం మూసుకుపోతుంది. భక్తి లేనిదే, జ్ఞానం పొందటం అసాధ్యం.

అందువల్ల అమానిత్వాన్ని మొట్టమొదటి లక్షణంగా పేర్కొంది శాస్త్రం. దీన్నే సానుకూలంగా చెప్పాలంటే **వినయం** అంటారు. మన పురాణాల్లో, ఉపనిషత్తుల్లో అనేక గర్వభంగాల కథలు ఉన్నాయి. కేనోపనిషత్తులో దేవతల గర్వభంగం కథ చూస్తాము. పురాణాల్లో నారద గర్వభంగం, సత్యభామ గర్వభంగం చూస్తాము.

ఎక్కడ ఎవరిలో గర్వం పొంగి పొర్లుతున్నా, వెంటనే వారికి గర్వభంగం కలిగిస్తాడు భగవంతుడు. ఆ గర్వభంగంనుంచి పుట్టినదే వినయం. మన ఆచార్యులను తీసుకుంటే, వారు వినయానికి పెట్టింది పేరు. వారి రంగంలో వారు నిష్ణాతులు అయినా, కొంచెం కూడా గర్వం లేదు. కాళిదాసు సంస్కృతంలో ఉద్దండపండితుడు, మహామేధావి. ఆయన కలంనుంచి ఎన్నో కవితలు, నాటకాలు జాలువారాయి. అన్నింటిలోనూ ఆయన రాసిన ప్రార్థనా శ్లోకాల్లో ఆయనలో వినయం ఎంతగా ఉట్టిపడుతుందో తేటతెల్లమవుతుంది. ఆయన వినయం చూపించటమే కాదు, వినయాన్ని నేర్పిస్తారు మానవాళికి.

**మన్దః కవియశః ప్రార్థీ గమిష్యామ్యుపహాస్యతామ్ ।**
**ప్రాంశులభ్యే ఫలే లోభాదుద్బాహురివ వామనః ॥** – రఘువంశము 1.3

**మన్దః** – అంత గొప్ప సంస్కృత పండితుడు, నేను మంద అధికారిని అంటున్నాడు. అలాంటి ఆయనతో పోలిస్తే, మనమెక్కడ ఉంటాము?

**కవియశః ప్రార్థీ** – నేను ఈ రఘువంశము రచించి పేరు ప్రఖ్యాతులు పొందాలనుకుంటున్నాను.

**గమిష్యామి ఉపహాస్యతామ్** – ఈ ప్రపంచం నన్ను చూసి నవ్వుతుంది.

**ప్రాంశులభ్యే ఫలే లోభాదుద్బాహురివ వామనః** – పొడుగైన చెట్టుమీద ఉన్న ఫలాలను అందుకోవటానికి మరుగుజ్జు ఎగిరెగిరి పడుతున్నాడుట. అది ఎంత హాస్యాస్పదంగా ఉంటుందో, కవి యశస్సు అనే ఫలాలను అందుకోవటానికి మరుగుజ్జులాంటి నేను ఎగిరెగిరిపడటం కూడా అంతే హాస్యాస్పదం. కాళిదాసు

ఉపమాలంకారంలో అందెవేసిన చెయ్యి. అంటే పోలికలు చెబుతూ ఉంటారు. అందువల్ల కాళిదాసును ఉపమా కాళిదాసస్య అంటారు.

**క్వ సూర్యప్రభవో వంశః క్వ చాల్పవిషయా మతిః**

**తితీర్షుర్దుస్తరం మోహాదుడుపేనాస్మి సాగరమ్** – రఘువంశము 1.2

నేను రఘువంశచరిత్ర రాయటానికి పూనుకున్నాను. రఘువంశం ఎంత గొప్పది! అంత గొప్ప వంశం ముందు నేనెంత? అయినా ఆ గొప్పతనాన్ని వివరించటానికి కంకణం కట్టుకోవటం ఎంత సాహసం!

**మోహాదుడుపేనాస్మి సాగరమ్** – అనంత సాగరాన్ని చిన్న నావలో దాటటానికి సాహసించినట్టు ఉంది నా ప్రయత్నం అంటారు. నా చిన్ని మేధస్సు ఎక్కడ, రఘువంశంయొక్క గొప్పతనం ఎక్కడ అంటారు.

అదీ కాళిదాసు గొప్పతనం. అంత గొప్పవారు శంకరాచార్యులవారు, సురేశ్వరాచార్యులవారు, మధుసూదన సరస్వతులవారు కూడా. వీరంతా వీరికెంత బాగా శాస్త్రం తెలిసినా వినయ విధేయతలతో విరాజిల్లుతుంటారు.

**అవినయమ్ అపనయ విష్ణో!** – షట్పదీ స్తోత్రమ్

శంకరాచార్యులవారి మొట్టమొదటి ప్రార్థన ఇది. ఓ దేవా, నానుంచి గర్వం తొలగించు. నాకు వినయం కలిగేలా చెయ్యి. ఏ రంగంలో ఉన్నా వినయం ఉండాలి; ముఖ్యంగా వేదాంత అధ్యయనానికి తప్పనిసరిగా ఉండాలి. వినయం లేనిదే భక్తి కుదరదు, భక్తి లేకపోతే జ్ఞానం కలగదు. హిరణ్యకశిపుని రాజ్యంలో 'ఓం నమో నారాయణ' బదులు 'ఓం హిరణ్యకశపవే నమః' అనాలి ప్రజలు.

**మొదటి విలువ అమానిత్వం.**

2. **అదంభిత్వమ్** – దంభిత్వం అంటే మానిత్వంయొక్క బాహ్యప్రదర్శన. మానిత్వం ఒక అంతర్గత భావన. నేను గొప్పవాణ్ణి, నేను పండితుణ్ణి అని భావించటం మానిత్వం. దాన్ని బయటకు ప్రదర్శిస్తే అది దంభిత్వం.

**వ్యక్తమానిత్వం దంభిత్వమ్ అవ్యక్తదంభిత్వం మానిత్వమ్**

అంటే మీ గొప్పతనాన్ని వేషభాషల్లో ప్రదర్శించటానికి ప్రయత్నిస్తారు. మీరు మంచి వస్త్రాలంకరణ చేసుకుని వెళుతుంటే, నలుగురూ వెనక్కి తిరిగి మిమ్మల్ని చూడాలని ఆశపడతారు. ఇలా ఆకర్షణీయంగా కనబడాలనే కోరికను సొమ్ము చేసుకుంటున్నాయి అనేక బ్యూటీపార్లర్లు. ఏదైనా బహిరంగసభలో గమనించండి – ఎవరో ఒకరు హడావుడిగా వచ్చి, మైకు సరిగ్గా పనిచేస్తోందో లేదో పరీక్షించినట్టు చేసి వెళతాడు. అతను ఆ కార్యక్రమానికి చాలా ముఖ్యుడు కాబోలు, అన్ని ఏర్పాట్లూ స్వయంగా పర్యవేక్షిస్తున్నాడు అని ప్రేక్షకులు పొరపాటుపడే అవకాశం ఉంది. నిజం చెప్పాలంటే అతనికీ, ఆ కార్యక్రమానికీ ఏమీ సంబంధం ఉండదు. ముందురోజు దాకా అటువైపు తొంగిచూసి కూడా ఉండడు. కాని ఆరోజు మాత్రం ఎలాగో కష్టపడి, ఒక బ్యాడ్జ్ సంపాదించుకుని హడావుడిగా తిరిగేస్తూ ఉంటాడు. ఇదంతా నలుగురి దృష్టిలో పడటానికి చేసే హంగామా. దీన్ని దంభిత్వం అంటారు.

అదంభిత్వం అంటే దీనికి భిన్నమైన ప్రవర్తన. దీన్నే సానుకూలంగా చెప్పాలంటే **నిరాడంబరం** అంటారు. వేషభాషలు నిరాడంబరంగా ఉంటాయి. కొంతమంది ఎంత గొప్పవారైనా కూడా తెర వెనకే ఉండిపోవటానికి ఇష్టపడతారు. అందువల్లనే మన పెద్దవారు అంటారు, 'ఏమీ లేని ఆకు ఎగిరెగిరి పడుతుంది; అన్నీ ఉన్న ఆకు అణిగిమణిగి ఉంటుంది.'

**రెండవ విలువ అదంభిత్వం.**

3. **అహింస** – హింస అంటే హాని చెయ్యటం. మనుష్యులకే కాదు, జంతువులకు కూడా హాని చెయ్యకూడదు. ఇతరులను హింసించటానికి మనకు మూడు ఆయుధాలు ఉన్నాయి. అవేమిటి, నా చేతిలో ఏమీ ఆయుధాలు లేవే అంటే అవి అంతర్గతంగా ఉన్నాయి. అవి కాయిక, వాచిక, మానసిక ఆయుధాలు.

కాయిక అంటే శరీరం. తమ కాళ్ళుచేతులతో ఎదుటివారిని హింసిస్తారు కొందరు. భగవంతుడు ఈ ఆయుధాలను మన మంచికోసం ఇస్తే, ఇలా దుర్వినియోగం చేస్తారు కొందరు.

వాచిక అంటే వాక్కు. జంతువులకు వాక్కు లేదు. అందువల్ల అవి వాక్కుపరంగా ఎవరినీ హింసించలేవు. కాని మనిషి తన వాక్కులతో దుర్భాషలాడగలడు. మనిషికి అద్భుతమైన ఆయుధాలను భగవంతుడు ఇచ్చాడు. వాటిని దుర్వినియోగం చెయ్యటమో, సద్వినియోగం చెయ్యటమో మనిషి చేతిలో ఉంది. చేత్తో ఒక దెబ్బ వేసిన దానికి కలిగే బాధకన్నా మాటవల్ల కలిగే గాయం ఇంకా లోతుగా ఉంటుంది. అందువల్లనే మన పెద్దలు నోటిని ముఖ్యంగా అదుపులో పెట్టుకోవాలంటారు.

మానసిక అంటే మనస్సు లేదా అంతఃకరణం. ఎదుటి మనిషిని కొట్టి, తిట్టి, హింసించకపోయినా, కొంతమంది మనస్సులో తిట్టుకుంటారు. ఇంకా మాట్లాడితే శపిస్తారు. వారు నాశనమైపోవాలని శపిస్తారు. ఆలోచనలు కూడా శక్తివంతమైనవే. అహింస అంటే కాయిక, వాచిక, మానసిక హింసవర్జనలు.

అహింస ఎందుకింత విలువైన విలువ? పతంజలి అష్టాంగయోగంలో యమనియమాలు వస్తాయి. వాటిని మనం వివరంగా ఆరవ అధ్యాయంలో చూశాము. వీటిని మన ధర్మశాస్త్రం చెప్పిన టెన్ కమాండ్‌మెంట్స్‌గా తీసుకోవచ్చు. అహింస, సత్యం, అస్తేయం, బ్రహ్మచర్యం, అపరిగ్రహం, శౌచం, సంతోషం, తపస్సు, స్వాధ్యాయం, ఈశ్వరప్రణిధానం – వీటిని యమనియమాలు అంటారు.

అహింస ఎందుకు పాటించాలో, అనేక కారణాలు చెప్పవచ్చు.

**ప్రకృతి సూత్రం** – మొదటి కారణం తేలికగా అర్థం చేసుకోవచ్చు. ఇతరులు మనకు ఏమి చేయకూడదనుకుంటామో, అది మనం ఇతరులకు చేయకూడదు. మనకు దోమ కూడా హాని చేయకూడదని మనం అనుకుంటే మనం ఎవరికీ హాని చేయకూడదు. ఈ భావన అందరికీ ఉంటుంది కాబట్టి అది ప్రకృతి సూత్రం అవుతుంది. దయానందసరస్వతి స్వామీజీ అంటారు, 'మనకు ప్రశాంతత కావాలంటే మనం ప్రకృతి సూత్రాన్ని ఉల్లంఘించకూడదు.' ప్రకృతి సూత్రాన్ని ధర్మం అంటారు. ధర్మాన్ని అతిక్రమిస్తే, మనను మనమే హింసించుకున్నట్టు అవుతుంది.

ఆ విషయం అర్థం చేసుకోవటానికి దయానందసరస్వతి స్వామీజీ ఒక అద్భుతమైన ఉదాహరణ చెబుతుండేవారు. వేపచెట్టు బోదె చూస్తే అది చాలా గరుగ్గా ఉంటుంది. ఆ చెట్టు దగ్గరికి వెళ్ళి ఒంటిమీద షర్టు గానీ, బనియన్ గానీ లేకుండా దానికి వీపుపెట్టి గట్టిగా రుద్దుకుంటే ఏమవుతుంది? చెట్టుకేమీ అవదు, అది నిక్షేపంగా ఉంటుంది. మీరు వీపు రుద్దిన తీవ్రతనుబట్టి మీకే బాగా మంటపెడుతుంది. ధర్మం లేదా ప్రకృతి సూత్రం ఆ వేపచెట్టులాంటిది. మీరు ధర్మాన్ని ఉల్లంఘిస్తే, ధర్మానికి ఏమీ అవదు. దాన్ని ఉల్లఘించిన మీరే బాధపడతారు. అందువల్ల అహింసను పాటించటమంటే, ప్రకృతి సూత్రాన్ని పాటించినట్టు.

**జమ** – ఈ జగత్తు ఒక పెద్ద బ్యాంకులాంటిది. ఈ జగత్తుకు మీరు ఏంచేస్తే అది జగత్తు అనే బ్యాంకులో, మీరు చేసుకున్నది జమ అవుతుంది. మీరు ఏది జమచేస్తే, దానినే వెనక్కి తీసుకోగలరు. అంటే మీరు ప్రపంచానికి హింస ఇస్తే, మీకు వెనక్కి తిరిగివచ్చేది కూడా హింసే. మీరు ప్రపంచానికి దయ, జాలి, ప్రేమ, ఆప్యాయతలను పంచితే, మీకు తిరిగి దయ, జాలి, ప్రేమ, ఆప్యాయతలు వెనక్కి వస్తాయి.

ఈ జమ అనే సూత్రం ప్రకారం మీరు అహింసను జమచేస్తే, మీకు కూడా అహింస తిరిగివస్తుంది. **చేసుకున్నవారికి చేసుకున్నంత మహదేవా** అంటారు. ఆంగ్లసామెత ఇంకా ఎక్కువ చేసి చెబుతుంది. 'ఇఫ్ యు సో ఎ విండ్, యు రీప్ ఎ వర్ల్‌విండ్,' అంటుంది. మీరు ఒక గాలిని పాతితే, పెనుగాలి వస్తుందిట. అంటే ఫలితం ఒక్కోసారి పదింతలుగా వస్తుంది. అందువల్ల అహింస మీరు పాటించి తీరాల్సిన ఒక ముఖ్యమైన విలువ.

**రాగద్వేషాలు** – మూడవ కారణం వేదాంతపరంగా వస్తుంది. సైకాలజీ కూడా అదే చెబుతుంది. ఎదుటివారిని హింసించే మనస్థత్వం సహజంగా ఉంటుంది అందరిలోనూ. మీకు తెలియకుండానే చేస్తారు అది. ఎందుకు ఎదుటివారిని హింసిస్తున్నారు అని మనస్తత్వ విశ్లేషణ చేస్తే, తేలిన కారణం ఇదీ. మీరు మీ కుటుంబంనుంచీ, మీ స్నేహితులనుంచీ, ప్రభుత్వంనుంచీ కొన్ని విషయాలను ఆశిస్తారు. ఇంకో విధంగా చెప్పాలంటే, మీరు వారిమీద రాగద్వేషాలను పెంచుకుంటారు. మీరు ఆశించినట్టు వారు ఉంటే గొడవలేదు, మీరు సంతోషంగా ఉంటారు.

కాని సగంసేపు వారు మీరు ఆశించినట్టు ఉండరు. ఎందుకు? వారు కోరుకున్నట్టు, వారి ఇష్టానుసారం ఉంటారు వారు . ఇంగ్లీషులో ఒక తమాషా అయిన వాక్యం ఉంది – 'ఎవ్విరిబడీ హాజ్ ఎ రైట్ టు మై ఒపీనియన్.' నా అభిప్రాయాన్ని (వారి అభిప్రాయాన్ని కాదు) పాటించే హక్కు అందరికీ ఉంది అని దీని అర్థం. అందరూ నామాటే వినాలని మర్యాదగా చెప్పిన వాక్యం ఇది. దురదృష్టవశాత్తూ, వారికి కూడా ఫ్రీవిల్ ఉంది. భగవంతుడు మీ ఒక్కరికే ఫ్రీవిల్ ఇచ్చి, తక్కినవారికి ఇవ్వకుండా ఉంటే, అది బాగుండేది, కాని పాపం అలా చెయ్యలేదు భగవంతుడు. అందువల్ల మీరు ఎదుటివారినుంచి ఆశించినవి వారు నెరవేర్చరు. మీకేమో మీరు ఎదిగినకొద్దీ, మీరు ఆశించేవి కూడా మీతో పాటు పెరుగుతూ వస్తాయి. కొంతమందికి మరీ చిన్న విషయాల్లో కూడా చాలా పట్టింపు ఉంటుంది. ఆకుపచ్చరంగు కావాలంటే ఏదో ఒక ఆకుపచ్చ కాదు, అందులో కూడా ప్రత్యేకించి లేతాకుపచ్చో, ముదురు ఆకుపచ్చో కావాలి. అలా తీర్చకపోతే, పిచ్చికోపం వస్తుంది.

ఆశించిన ఫలం దక్కకపోతే సహజంగా మీరు బాధపడతారు. మీరు బాధపడితే, తక్షణం మీరు చేసే పని ఏమిటి? ఆ బాధకు కారణమైనవారిని దుయ్యబడతారు. సమాజం మిమ్మల్ని బాధిస్తే, మీరు సమాజాన్ని బాధిస్తారు. దెబ్బతిన్న వ్యక్తి దెబ్బ తియ్యటానికి చూస్తాడు. ఇది మానవనైజం. అది కూడా వెంటనే చేస్తారు. మీ బాబు తప్పుగా ప్రవర్తిస్తే, మరుక్షణం అతన్ని తిట్టటమో, కొట్టటమో చేస్తారు. అలా ఇది సహజమైన ప్రతిస్పందన. ఇలా హింస చూపకుండా ఉండాలంటే ఏం చెయ్యాలి?

**పరిష్కారం** – ఎవరైనా మిమ్మల్ని బాధిస్తే, మీరు వారిని తిరిగి బాధించటం సహజం అన్నప్పుడు, ఈ సహజగుణాన్ని ఎలా పోగొట్టుకోవాలి? దానికి పరిష్కారమార్గం ఒక్కటే ఉంది. మీరు చాలా సున్నిత హృదయులు కావాలి. ఎంత సున్నితం అవాలంటే, మీరు ఎదుటివారిని హింసిస్తే వారు పడే బాధ మీరు కూడా అనుభవించాలి. అంటే ఆ బాధ మీలో ప్రతిబింబించాలి. వారితో పాటు మీరు కూడా బాధపడాలి.

ఈ విషయం కన్నతల్లిని చూస్తే అర్థమవుతుంది. తల్లి హృదయం చాలా సున్నితంగా ఉంటుంది. తన కన్నబిడ్డ తప్పు చేస్తే అతన్ని తీవ్రంగా దండిస్తుంది; కాని దండించిన మరుక్షణం అతన్ని వాటేసుకుని భోరున విలపిస్తుంది. ఇంకా మాట్లాడితే దెబ్బతిన్న బాబు బాధకన్నా, దెబ్బ కొట్టిన తల్లి బాధ ఎక్కువగా ఉంటుంది.

అదీ సున్నిత మనస్కుల మనస్తత్వం. సున్నితమైన మనస్సు ఉన్నవారు, ఎవరినైనా బాధిస్తే, వారు తమను తాము బాధించుకున్నంతగా బాధపడిపోతారు. ఎవరికీ తమను తాము బాధించుకోవాలని ఉండదు. చూసారా, దీని వెనక ఉన్న మనస్తత్వం? ఎప్పుడైతే మీరు సున్నిత మనస్సు ఉన్నవారు అవుతారో, అప్పుడే మీరు ఎవరికీ హింస తలపెట్టలేరు. ఒకవేళ పొరపాటుగా చేస్తే, ఎన్నో రాత్రులు నిద్రపోకుండా బాధపడతారు. 'అయ్యో, అతనేమనుకున్నాడో,' అని మీరు తెగ బాధపడిపోతారు. ఒక్కోసారి దెబ్బతిన్న వ్యక్తి, 'ఫర్వాలేదు, నేనేం అనుకోలేదు,' అన్నా కూడా మీ బాధ తగ్గదు. అందువల్ల అహింస పాటించాలంటే మనస్సును సున్నితంగా చేసుకోవాలి. ఈ సున్నితమైన మనస్సుతో సూక్ష్మమైన వేదాంతబోధను తేలికగా అర్థం చేసుకోవచ్చు.

అందువల్ల అహింస అంటే సున్నిత మనస్కులు అవటం. మీ మనస్సు ఎంత సున్నితంగా ఉండాలంటే, వార్తాపత్రికలో ఎక్కడో ఎవరికో ఏదో కష్టం వచ్చిందని మీరు చదివితే, వారి గురించి మీ మనస్సు స్పందించాలి. అలా మనస్సు స్పందించకపోతే, మనస్సు బండబారిపోయిందని అర్థం. ఏ స్పందనా లేని హృదయమే ఇతరుల బాధను లెక్కచెయ్యదు. అదే మీ మనస్సు సున్నితంగా ఉంటే వారికన్నా మీరే ఎక్కువ బాధపడతారు. పశ్చాత్తాపాన్ని మించిన శిక్షే లేదు అన్నారు పెద్దలు. కృంగదీసే మనస్సు అతన్ని శిక్షిస్తుంది.

**అహింసో పరమో ధర్మః. మూడవ విలువ అహింస.**

4. **క్షాంతి** – క్షాంతికి అనేక అర్థాలున్నాయి. వాటిలో కొన్ని చూద్దాము. ఒక అర్థం మానసిక నిరోధకశక్తి. మీరు ఆశించిన ఫలితాలు రాకపోయినా, తట్టుకుని నిలబడగలిగే శక్తి. నిజానికి, ఇది అహింసయొక్క తర్వాత దశ. ఆశించిన ఫలితాలు రాకపోతే బాధపడతామని, అది రాకపోవటానికి కారణమైన వారిని హింసిస్తామనీ ఇంతకుముందు అహింసలో చూశాము.

క్షాంతి అంటే అలా ఆశాభంగం కలిగినా కూడా, చలించకుండా ఉండగలగటం. మనష్యులు మారుతూ ఉంటారు, వాతావరణం మారుతూ ఉంటుంది, ఆర్థిక వ్యవస్థ మారుతూ ఉంటుంది, పరిస్థితులు మారుతూ ఉంటాయి. వేటికీ చలించకపోవటం మానసిక రోగనిరోధకశక్తి.

శారీరక రోగనిరోధకశక్తి ఉంటే ఏమవుతుంది? దేశంలో ఎన్ని రోగాలు రాజ్యం ఏలుతున్నా, ఎన్ని బ్యాక్టీరియాలు, ఎన్ని వైరసులు అనారోగ్యాన్ని కలుగజేస్తున్నా, టి.బీ. ఎంతమందికి ఉన్నా, మీకు రోగనిరోధక శక్తి ఉంటే, మీకేమీ అవదు. ఈ విషయాన్ని ఒక డాక్టరు సుస్పష్టం చేశారు ఒక సెమినార్‌లో. మామూలుగా మన అపోహ ఏమిటి? క్షయవ్యాధి ఉన్న వ్యక్తి తుమ్మినా, దగ్గినా అతని పక్కన ఉన్నవారికి కూడా ఆ రోగం సోకుతుంది అనుకుంటాము.

'క్షయవ్యాధి లేని 20 మంది ఆరోగ్యవంతులని తీసుకోండి, క్షయవ్యాధి, బాగా ముదిరిపోయిన ఒక రోగిని తీసుకురండి, ఈ రోగిని సరాసరి వారి నోటిలోకి గాలి వదలమనండి. కాని వారికేమీ అనారోగ్యం రాదు. అలా అతను తుమ్మినా, దగ్గినా వారికేమీ కాదంటే భగవంతుడు ఆరోగ్యవంతులకిచ్చిన గొప్ప వరమది. అదే రోగనిరోధకశక్తి.' ఇది రోగనిరోధకశక్తి గొప్పతనం చూపటానికి చెప్పిన ఒక ఊహాజనితమైన విషయం. నిజంగా ప్రయత్నించటానికి చూడకండి. ఇంత గొప్ప రోగనిరోధకశక్తి మానసికంగా ఉంటే, దాన్ని క్షాంతి అంటారు. ఈ క్షాంతికి రెండు అంశాలు ఉన్నాయి. అవి తితిక్ష, క్షమ.

**తితిక్ష** – మీరు మార్చలేని పరిస్థితులను ఉన్నదున్నట్టుగా స్వీకరించటం తితిక్ష. వాటికి ఎదురుతిరగకుండా స్వీకరించటం. మనిషిగా మీకు ఫ్రీవిల్ ఉంది, ఎన్నో విషయాలను మీరు అదుపులో పెట్టగలరు నిజమే. కాని దురదృష్టవశాత్తూ, మీరు అదుపులో పెట్టలేని విషయాలు మరెన్నో ఉన్నాయి. మీరు ఆ విషయంలో నిస్సహాయులు. అలా మీ చేతిలో లేని పరిస్థితులను ఎన్నుకునేందుకు వీలులేని పరిస్థితులు అంటారు. దీనికి కృష్ణపరమాత్మ అపరిహార్య అర్థః అన్నాడు రెండవ అధ్యాయంలో. అర్థః అంటే పరిస్థితి; అపరిహార్య అంటే మీరు అదుపులో పెట్టలేనిది. అలా మీరు అదుపులో పెట్టలేని పరిస్థితిమీద మీకేమీ అధికారం ఉండదు కాబట్టి, మిమ్మల్ని మీరే మార్చుకోవాలి. మార్చలేని పరిస్థితిని ఉన్నదున్నట్టుగా స్వీకరించటాన్ని తితిక్ష అంటారు.

ఒకసారి వెనక్కి తిరిగి చూసుకుంటే, ఇంతవరకూ జరిగిపోయిన మీ జీవితం గతంలోకి జారుకుంది. జరిగిపోయిన కాలాన్ని మీరు వెనక్కి తీసుకురాలేరు. జరిగిపోయిన కాలంలో, గడిచిపోయిన సంఘటలను తలుచుకుని బాధపడినా, వాటినేమీ చెయ్యలేరు మీరు. భగవంతుడు కూడా గతాన్ని మార్చలేడు. అందువల్ల గతం ఎన్నుకునే వీలులేని పరిస్థితుల్లోకి వస్తుంది; అందువల్ల దానిని ఉన్నది ఉన్నట్టుగా స్వీకరించగలిగేటట్టు మనస్సును సంసిద్ధం చేసుకోవాలి. ఉదాహరణకు మీ తల్లిదండ్రులు, మీ విద్య, మీ వయస్సు, వీటిలో దేన్నీ మీరు మార్చలేరు. మీ పుట్టినరోజు తారీఖును మార్చినంత మాత్రాన మీ వయస్సును మార్చలేరు. మొహంలో ముడతలు కనపడకుండా మేకప్ వేసుకున్నంత మాత్రాన మీ వయస్సును వెనక్కి తీసుకువెళ్ళలేరు. వయస్సు మీదపడితే స్వీకరించండి; జుట్టు తెల్లబడినా, ఊడిపోయినా బాధపడకండి. దాన్నేమీ చెయ్యలేరు. అందువల్ల గతాన్ని తితిక్షతో స్వీకరించండి.

గతంమీదే కాదు, వర్తమానంమీద కూడా మీకు అధికారం లేదు. వర్తమానం అంటే వచ్చేసిన క్షణం, వస్తున్న క్షణం కాదు. వస్తున్న క్షణం అయితే, ఇప్పుడే రాకు సుమా అని మీరు టెలిగ్రామ్ ఇవ్వటానికి ప్రయత్నించవచ్చు; కాని చూస్తూ చూస్తుండగానే వర్తమానం కూడా వచ్చేసింది. దాన్ని కూడా మీరు ఎన్నుకునే హక్కు లేదు. దాన్ని స్వీకరించక తప్పదు. ఇలా పరిస్థితులను, మనుష్యులను స్వీకరించటాన్ని తితిక్ష అంటారు.

**సహనం సర్వదుఃఖానామ్ అప్రతీకార పూర్వకమ్**

ఎదురు తిరగకుండా సహనంతో స్వీకరించటం. ఎదురు తిరిగినకొద్దీ ఆవేశం పెరుగుతుంది.

ఈ స్వీకరించటం కూడా రెండు రకాలుగా ఉంటుంది. ఒకటి – నయం చెయ్యలేని దానిని భరించు అంటారు పెద్దలు. ఆ భరించటంలో ఉంది భేదమంతా. దానిని నవ్వుతూ స్వీకరించాలా, కోపంగా స్వీకరించాలా?

కోపంగా స్వీకరించినచోట బాధ ఉంటుంది; నిరాశానిస్పృహలకు లోనవుతారు. మీమీద మీకు జాలి, అటువంటి పరిస్థితులను కలుగజేసిన భగవంతునిమీద, సమాజంమీద కోపం తన్నుకువస్తాయి. ఇటువంటి భావనను తితిక్ష అనరు. ద్వేషంతోనో, నిస్సహాయస్థితిలోనో పరిస్థితులను స్వీకరిస్తే, సానుకూల కృషికి ఆస్కారం ఉండదు. కోపం, నిస్సహాయత, నిరాశలు రాజ్యమేలుతుంటే, 'నాకే ఎందుకు జరిగింది,' అని వాపోతూ కూర్చుంటారే కాని, దాన్నించి బయటపడే మార్గం చూడరు. పైపెచ్చు చాలా ఉదారంగా దానం చేస్తారు. దానం ఏమిటంటారా? మీ దుఃఖాన్ని నలుగురికీ ఆప్యాయంగా పంచుతారు. అసలైన దానం చేస్తారో లేదో తెలియదు కాని, దీనికేం లోటు ఉండదు. కనిపించిన ప్రతి మనిషికీ మీ బాధను చెప్పుకుని తెగ బాధపడిపోతారు. అలాంటప్పుడు కొత్తగా ఆలోచించటానికి తీరికేది?

ఇక్కడ చెప్పేది అలాంటి స్వీకరించటం గురించి కాదు, ఇక్కడ చెప్పేది అలా మీ చేతిలో లేని పరిస్థితులు ఎదురైతే నవ్వుతూ స్వీకరించగలిగే మనస్థైర్యం గురించి. ఎటువంటి పరిస్థితులు ఎదురైనా, బెంబేలెత్తిపోకుండా, నిస్సహాయస్థితికి లోనుగాకుండా, దాన్నించి బయటపడటానికి ఏదైనా మార్గముందా అని సానుకూలంగా ప్రయత్నించటం. నిజానికి అలాంటి పరిస్థితిని ఎదుర్కొని నిలవటం కష్టమే కాని, అసాధ్యం మాత్రం కాదు. వాటిని దాటి ముందుకు సాగితే, ఎన్నో సాధించవచ్చు.

ఈ విషయంలో మీకేమైనా అనుమానం ఉంటే అంగవైకల్యం ఉన్నవారి జీవితచరిత్రలను చదవండి. నిజంగా వారు ఎన్నో అద్భుతాలను సాధించారు! ఇంకా చెప్పాలంటే అంగవైకల్యం లేని, అన్ని సౌకర్యాలు ఉన్నవారు సాధించలేని ఘనవిజయాలను సాధించారు. స్టీఫెన్ హాకిన్స్ గారికి మెదడు తప్ప వేరే ఏ అవయవమూ పని చెయ్యదు; అయినా అద్భుతాలు సాధించారు. తనను తాను నిందించుకుని, నిరాశలో మునిగిపోలేదు. అలా ఎటువంటి పరిస్థితి ఎదురైనా దానికి బెంబేలెత్తిపోకుండా, నవ్వుతూ స్వీకరించగలగటాన్ని తితిక్ష అంటారు. ఇది క్షాంతికి ఒక అర్థం.

**క్షమ** –గడచిన గతాన్ని తిరిగి తీసుకురాలేరు; వచ్చేసిన వర్తమానాన్నీ ఏమీ చెయ్యలేరు. అందువల్ల వాటిని ఏమీ మార్చలేరు. జరిగిందేదో జరిగిపోయింది, దాన్ని నవ్వుతూ స్వీకరించండి. అది తితిక్ష. కాని కానున్నది కాకమానదు అని చేతులు ముడుచుకు కూర్చోకండి. భవిష్యత్తును మార్చవచ్చు. అది మీ చేతిలో ఉంది.

జ్యోతిష్యం జరిగిపోయిన దానిని చక్కగా చెబుతుంది, కాని రానున్నది అక్షరాలా చెప్పలేదు. ఎందుకు? రాబోయేదాన్ని మార్చుకోగల ఫ్రీవిల్ ఉంది మీకు వరంగా. అందువల్లనే జ్యోతిష్యశాస్త్రమే మీకు కొన్ని ప్రాయశ్చిత్తకర్మలను నిర్దేశించింది. దానిద్వారా రాబోయే కర్మను మీరు మార్చుకోగలరు. గతాన్ని స్వీకరించండి, దాన్ని మీరు మార్చలేరు; వర్తమానాన్ని స్వీకరించండి, మీరు దాన్ని మార్చలేరు; భవిష్యత్తును స్వీకరించకండి, దాన్ని మార్చే శక్తి మీకు ఉంది. మీ ఫ్రీవిల్‌ను, మీకున్న వనరులను ఉపయోగించండి.

**ఉద్ధరేదాత్మనాత్మానం నాత్మానమవసాదయేత్।**

**ఆత్మైవ హ్యాత్మనో బంధుః ఆత్మైవ రిపురాత్మనః ॥** – 6.5

మీ భవిష్యత్తును మీరే తీర్చిదిద్దుకోగలరు. కాని ఇక్కడ కూడా ఒక విషయాన్ని గ్రహించాలి. ఏదైనా మార్పు రావాలంటే క్షణాలమీద జరిగిపోదు. దానికి కావాల్సినంత సమయం పడుతుంది. ఏ ఎదుగుదలను తీసుకున్నా, ఏ మార్పును తీసుకున్నా దానికి తగిన సమయం పడుతుంది. మీకు ఏదైనా అనారోగ్యం వస్తే, దాన్ని నవ్వుతూ స్వీకరించమని చెప్పటం లేదు. వైద్యశాస్త్రం చాలా అభివృద్ధి చెందింది నేడు; దానికి తగ్గ మందులు తీసుకుని నయం చేయించుకోవచ్చు. కాని అక్కడ కూడా ఆగాలి. మందులు తీసుకున్నా కూడా అది నయం అవటానికి వారం రోజులు పట్టవచ్చు, నెల రోజులు పట్టవచ్చు, కొన్ని సందర్భాలలో సంవత్సరాలు కూడా పట్టవచ్చు. ఓపిగ్గా వేచిచూడాలి.

మనుష్యులను మార్చే విషయం తీసుకుంటే, అది దాదాపుగా అసాధ్యం. వారు మారాలనే భావన వారికి ఉంటేగాని మీరు వారిని మార్చలేరు. ఒకవేళ మారాలని వారికీ శ్రద్ధ ఉంది, మీకూ మార్చేశక్తి ఉంది అనుకుందాము, అయినా కూడా ఆ మార్పు రాత్రికి రాత్రి జరిగిపోదు. అంటే భవిష్యత్తుకొచ్చేసరికి ఓపిక కావాలి. రావాల్సిన సమయం వచ్చేదాకా వేచివుండే ఓర్పు కావాలి. ఈ ఓర్పును క్షమ అంటారు. క్షాంతి రెండవ అర్థం ఇది.

ఈ క్షమ ట్రాఫిక్ లైట్ల దగ్గర మొదలవ్వాలి. ఎర్రలైటు పడింది, మళ్ళీ గ్రీన్ సిగ్నలు రావటానికి ఒకటి రెండు నిముషాలు పట్టవచ్చు. కాని ఆ ఒకటి రెండు నిముషాలు కూడా ఆగే ఓపిక ఎవరికీ ఉండదు. నెమ్మది, నెమ్మదిగా ముందుకు సాగుతూనే ఉంటారు. గ్రీన్‌సిగ్నల్ పడ్డాక కూడా, మీరు ఎక్కడో వెనకవున్నారు; మీ ముందు అనేక కార్లు ఉన్నాయి. అవన్నీ కదలటానికి ఇంకొంచెం అదనపు సమయం పడతుంది మీకు. కాని మీరు కదిలేలోపు వెనకనుంచి బొయ్ బొయ్‌మని హారన్ల రొద మారుమ్రోగిపోతుంది.

క్షాంతి రెండవ అర్థం క్షమ. క్షమ అంటే ఏది ఎప్పుడు రావాలో, అది అప్పుడే వస్తుందని తెలుసుకుని, దానికోసం ఓపిగ్గా ఎదురుచూడటం. తల్లి నవమాసాలూ మోసి కనాల్సిందే పిల్లవాణ్ణి. భర్తృహరి సుభాషితాల్లో చూస్తాము ఈ ఓపిక గురించి –

**పరిభ్రమసి కిం ముధా క్వచన చిత్త విశ్రామ్యతాం**

**స్వయం భవతి యద్యథా భవతి తత్తథా నాన్యథా।**

**అతీతమననుస్మరన్నపి చ భావ్యసంకల్పయన్**

**నతర్కితసమాగమాననుభవామి భోగానహమ్ ॥** – భర్తృహరి వైరాగ్య శతకమ్ 62

**పరిభ్రమసి కిం ముధా క్వచన చిత్త విశ్రామ్యతామ్** – ఓ మనసా, ఎందుకు నువ్వు ఎప్పుడూ పరుగులు తీస్తావు? రేపనే రోజు ఇవాళే రావాలి, వచ్చే సంవత్సరం, ఈ సంవత్సరంలోనే రావాలి అనుకుంటారు కొందరు. త్వరపడకు మనసా అంటున్నాడు భర్తృహరి.

**స్వయం భవతి యద్యథా భవతి తత్తథా నాన్యథా** – భవిష్యత్తు వర్తమానంగా మారటానికి సమయం పడుతుంది. దానికి కావాల్సిన సమయాన్ని అది తీసుకోనివ్వండి. బ్రిడ్జ్ వచ్చినప్పుడే దాటుదురుగాని, తొందరెందుకు?

**అతీతమననుస్మరన్నపి చ భావ్యసంకల్పయన్** – గడచిపోయిన దాని గురించి వాపోకూడదు; రాబోయే దాని గురించి దిగులు పడకూడదు.

**నతర్కితసమాగమాననుభవామి భోగానహమ్** – వర్తమానంలో ఓపిక వహించు.

వర్తమానం విషయంలో తితిక్ష లేకపోతేనూ, భవిష్యత్తు విషయంలో క్షమ లేకపోతేనూ, మనిషి ఒత్తిడి, ఆందోళనకు లోనవుతాడు. నేటి పరుగుపందెంలో ఇవి రెండూ ప్రతి ఒక్కరినీ కబళించివేస్తున్నాయి. వీటిని పోగొట్టటానికి కొన్ని సెమినార్లను ఏర్పాట్లు చేస్తున్నారు కొందరు. వారికి తగ్గ ఒత్తిడీ, ఆందోళనా వారికీ ఉంటాయి. వారు ఆశించినంత జనం వస్తారో, లేదోనని వారి బెంగ.

ఆందోళన లేకపోవటాన్ని **అనాయాసః** అంటుంది శాస్త్రం. కాసేపు విశ్రాంతిగా కూర్చోవాలి. అలా విశ్రాంతిగా కూర్చోవటం అలవాటు చెయ్యటానికి శాస్త్రం సంధ్యావందనం పొందుపరిచింది నిత్యజీవితంలో. డాక్టర్లు రెండు రకాల ఒత్తిడులు ఉంటాయంటారు; శారీరక ఒత్తిడి, మానసిక ఆందోళన. శరీరపరంగా నరాలు బిగుసుకుపోతాయి; మనస్సుపరంగా అది ఆందోళన చెందుతూ ఉంటుంది. ఇలా ఈ రెండూ కొన్నాళ్ళు సాగితే, ఎప్పుడూ చిరాకుపడుతూ ఉంటారు. ఒత్తిడి, ఆందోళన ఉందని చూపించే మార్గాలు, చిన్న విషయానికి కూడా తన్నుకొచ్చే కోపం.

కొంతమందికి ముక్కుమీదే ఉంటుంది కోపం. అలా ముక్కోపి అయిన తండ్రి ఇంటికి రాగానే పిల్లలు వారి గదుల్లోకి పారిపోయి బుద్ధిగా చదువుతున్నట్టు కూర్చుంటారు. పాపం భార్యామణికి మాత్రం ఆయన కోపాన్ని ఎదుర్కోక తప్పదు. కాని ఇప్పుడు భార్య కూడా ఉద్యోగం చెయ్యటంవల్ల, పిల్లలు ఆయనకు ఎదురుపడక తప్పదు. ఇంట్లో వాతావరణం ఎప్పుడూ వేడిగా, వాడిగా ఉంటూనే ఉంటుంది. అలా బితుకుబితుకుమంటూ కాలం గడిపే పిల్లలు, వారు పెరిగి పెద్దయ్యాక, వారికంటూ భార్య, పిల్లలు వచ్చాక, ఇన్నాళ్ళూ వారు పళ్ళబిగువున అణిచిపెట్టుకున్న కోపాన్ని ఆ అమాయక జీవులమీద చూపిస్తారు. పూర్వం ఉమ్మడి కుటుంబాల్లో ఇలాంటి పరిస్థితుల్లో పిల్లలకు తాతయ్య లాలనలోనో, బామ్మ ఒడిలోనో, బాబాయి భుజంమీదో ఓదార్పు దొరికేది. ఇప్పుడు ఒంటరికాపురాలు పెరిగిపోయాక, పిల్లలకు ఒంటరితనం పెరిగిపోతున్నది.

క్షాంతి అనే విలువ పెంచుకుంటే ఈ ఒత్తిడులను తప్పించుకోవచ్చు. ఒత్తిడికి లోనయితే, మీరు మిమ్మల్ని హింసించుకుంటారు, ఇతరులనీ హింసిస్తారు. అందువల్ల అహింస పాటించాలంటే, క్షాంతిని పెంచుకోవాలి. అహింసను పెంపొందించుకోవటానికి క్షాంతి ఒక్కటే మార్గం. క్షాంతిని అనాయాసమని కూడా అంటారు.

**నాలుగవ విలువ క్షాంతి.**

5. **ఆర్జవమ్** – ఆర్జవం అంటే ఒక పనిని మనోవాక్కాయ కర్మలద్వారా చెయ్యటం. త్రికరణశుద్ధి అని కూడా అంటారు. మనకు మూడు స్థాయిల్లో అంగాలు ఉన్నాయి. అవి మనస్సు, వాక్కు, కర్మ. ఈ మూడూ ఒక్క త్రాటిమీద నడవాలి. లేకపోతే మీరు ఆలోచించేది ఒకటీ, చెప్పేది మరొకటీ, చేసేది ఇంకొకటీ అవుతాయి.

**మనస్యేకం వచస్యేకం కర్మణ్యేకం మహాత్మానామ్**

**మనసి అన్యత్ వచసి అన్యత్ కర్మణి అన్యత్ దురాత్మనామ్**

మహాత్ములకు మనస్సు, వాక్కు, కర్మ ఒక్క త్రాటిమీద నడుస్తాయి. దురాత్ములకు మనసుకూ, వాక్కుకూ, కర్మకూ పొత్తు కుదరదు. ఒక పెద్ద యంత్రాన్ని వాడాలంటే దాని అన్ని భాగాలూ ఒకదానితో ఒకటి కలిసివుండాలి. ముందుగా మెకానిక్ వచ్చి దాన్ని పరీక్షించి చూస్తాడు. అలాగే మీరు ఒక గంటసేపు ఒక ప్రసంగం వినాలంటే మీ చెవులతో మీ మనస్సు ఏకం అయివుండాలి. లేకపోతే ప్రసంగం అయ్యాక ఏం విన్నారని ఎవరైనా అడిగితే, 'బాగుంది కాని, నేను చెప్పలేను,' అంటారు.

మనోవాక్కాయకర్మలు ఒక త్రాటిమీద నడవకపోతే, దాని దారుణ ఫలితం మీకు వెంటనే తెలియకపోవచ్చు. కాని అది నెమ్మదిగా మిమ్మల్ని తినేస్తుంది. ఎప్పుడైతే వీటి మధ్యలో అనుసంధానం లేదో అప్పుడే నాశనం తప్పదు. మీ అంగాల మధ్య అనుసంధానం లేకపోతే మీరు అవస్థపడక తప్పదు.

ఒక సంగీతకచేరీకి వెళ్ళి చూడండి. అక్కడ ఎన్ని వాయిద్యాలో ఉంటాయి. కచేరీ మొదలుపెట్టే ముందు, అన్ని వాయిద్యాలను ఒక్క శ్రుతిలో మీటి ఉంచుకుంటారు. ఒక్కోసారి ఆ శ్రుతిని తీసుకురావటానికి ఆ విద్వాంసుడు చాలా శ్రమపడతాడు. కాని అన్ని వాయిద్యాల మధ్య ఏకశ్రుతి ఉండకపోతే, ఆ సంగీతం వీనులవిందుగా ఉండదు. అలా మీలో కూడా అపశ్రుతి ఉండకూడదు. అంటే మీ మనస్సు, వాక్కు, కర్మ ఏకశ్రుతిలో ఉండాలి. ఈ సూత్రాన్ని ఉపనిషత్తుల్లో చెప్పే శాంతిపాఠం అద్భుతంగా చెబుతుంది.

**వాఙ్మే మనసి ప్రతిష్ఠితం మనో మే వాచి ప్రతిష్ఠితః**

వాక్కు మనస్సులో; మనస్సు వాక్కులో ప్రతిష్ఠించబడి ఉండుగాక. దీనిలో కర్మను కూడా కలుపుకోవాలి.

రావణాసురుని అంగాల మధ్య ఏకత్వం లేదని చూపించటానికే అతనికి పదితలలు ఉన్నట్టుగా వర్ణిస్తారు అంటారు దయానందస్వామీజీ. అందువల్ల ఆర్జవం పెంపొందించుకోవాలి. దానికి మొట్టమొదటి లక్షణం సమయపాలన చెయ్యటం. అదే కొరవడుతుంది మన దేశంలో. ఎవరైనా ప్రసంగం ఇవ్వటానికి వెళితే, పిలిచినవారూ సమయానికి రారు, వినేవారూ సమయానికి రారు. వక్త అందరికన్నా ముందే వెళ్ళి కూర్చుంటాడు. అతనే ఆ స్థలాన్ని శుభ్రం చేయాలా అన్నట్టుగా ఉంటుంది అక్కడ. అలా చెయ్యకూడదు, సమయపాలన చాలా ముఖ్యం.

ఒకవేళ ఏ కారణంవల్లనైనా అనుకున్న సమయానికి అనుకున్నచోటికి చేరలేకపోతే, వారికి ఫోను చేసి ఆ విషయం చెప్పాలి. ఆ కనీస మర్యాద పాటించరు చాలామంది. మీరు నిజంగానే సమయానికి వెళదామనుకున్నారు కానీ తీరా మీరు బయలుదేరబోయే సమయానికి ఎవరో వచ్చారు, లేదా ఏ ఫోనో వచ్చింది. అప్పుడు మీరు వెంటనే ఎక్కడికి వెళ్ళాలో అక్కడికి ఫోను చేసి, 'నాకిలా ఆలశ్యమవుతుంది, నేను ఫలానా సమయానికి వస్తాను,' చెప్పటం కనీసధర్మం. కాని దీన్ని ఎవరూ పాటించరు. మనం ఫోను చేసి అడిగేదాకా చెప్పరు.

ఆర్జవం అంటే సమయానికి వెళ్ళటం మొదటిమెట్టు. సమయానికి వెళ్ళలేకపోతే, అది చెప్పటం రెండవమెట్టు. ఈ రెండుమెట్లు ఎక్కితేనే చాలు, క్రమేపీ తక్కినమెట్లు కూడా ఎక్కగలుగుతారు ఆర్జవంలో. ఒక్కోసారి మీరు ఎవరికో రేపు పొద్దున్న తొమ్మిదికల్లా ఏ విషయమూ చెబుతానని చెబుతారు. ఎదుటివ్యక్తి ఆ సమాచారంకోసం ఆశగా ఎదురుచూస్తూ ఉంటాడు. మీరు మాట ఇస్తే, ఎట్టి పరిస్థితుల్లోనూ నిలబెట్టుకోవాలి. ఒకవేళ ఏ కారణం వల్లనైనా, మీరు ఇస్తానన్న సమాచారం ఇవ్వలేకపోతే, కనీసం నేను అనుకున్నాను కాని అది కుదరలేదని అయినా ఆ సమయానికి ఆ కబురు అందజేయాలి. కాని ఇప్పుడు అలాంటి సున్నితత్వం తగ్గిపోతోంది; పరిస్థితులు మనుష్యులను వాటికి దూరంగా చేసేస్తున్నాయి. అందువల్ల ఆర్జవం అంటే చిన్నగా సమయపాలనతో మొదలుపెట్టి పెద్ద విషయాలకు ఎదగాలి. సత్యం పలకటం కూడా అందులో ఒక భాగం కిందికే వస్తుంది.

**ఐదవ విలువ ఆర్జవం.**

6. **ఆచార్యోపాసనమ్** – వేదాంత విద్యనభ్యసించే విద్యార్థికి ఈ విలువ చాలా విలువైనది. ఆచార్య ఉపాసనను అక్షరాలా చూస్తే గురువును గౌరవించి, పూజించటం. మనం ఒక విషయం గుర్తుంచుకోవాలి. మనం గురువును పూజిస్తున్నామంటే, ఆ పూజ గురువుకు మాత్రమే చెందదు. ఒక వ్యక్తిగా చూస్తే గురువు కూడా తక్కిన మనుష్యులలాగా పరిమితి ఉన్న జీవే. అయితే, గురువును ఎందుకు ఆరాధించాలి? గురువు తనకున్న శాస్త్రజ్ఞానానికి ప్రతీక. అందువల్ల మీరు గురువుకు నమస్కారం చేసినా, మీరు వేదాలకు నమస్కారం చేసినట్టు అవుతుంది. శాస్త్రం ఈశ్వరునికి ప్రతీక; ఆ శాస్త్రాన్ని అధ్యయనం చేసిన గురువు అటువంటి ఈశ్వరుడు నెలకొనివున్న ఆలయం. అందువల్ల గురువుద్వారా శాస్త్రాన్ని, శాస్త్రంద్వారా ఈ శాస్త్రాన్ని మనకందజేసిన ఈశ్వరుణ్ణి కొలుస్తున్నారు మీరు.

శాస్త్రాన్ని ఎందుకు కొలవాలి? ఇది ఇంకొక ప్రశ్న. దీనికి జవాబు తెలుసుకుని తీరాలి. మీరు శాస్త్రంద్వారా పొందగలిగే జ్ఞానాన్ని శాస్త్రంద్వారానే పొందగలరు. వేరే ఏ ప్రమాణంద్వారా కూడా ఈ జ్ఞానాన్ని పొందలేరు. మీకు పంచజ్ఞానేంద్రియాలు ఉన్నాయి కదా. శాస్త్రాన్ని ఆరవ జ్ఞానేంద్రియంగా అర్థం చేసుకోవాలి.

పంచజ్ఞానేంద్రియాల విషయం తీసుకుంటే, ఒక ఇంద్రియం ఇచ్చే జ్ఞానాన్ని ఇంకొక ఇంద్రియం ఇవ్వలేదు. ఉదాహరణకు కన్ను రూపు, రంగు చూపిస్తుంది; చెవి శబ్దాన్ని వినిపిస్తుంది. కన్ను చూపించే రూపును చెవితో వినలేరు; చెవి వినిపించే శబ్దాన్ని కంటితో చూడలేరు. ఒక గులాబీయొక్క అందాన్ని ఆస్వాదించాలంటే దాన్ని కంటితోనే ఆస్వాదించాలి కాని; 'నా చెవులు నా కన్నులకన్నా శక్తివంతమైనవి, నేను చెవులతో వింటాను,' అనకూడదు. వినలేరు కూడా. అదే సూత్రం వేదాంతానికి వర్తిస్తుంది.

వేదాంతం అందించే ఆత్మజ్ఞానం తక్కిన పంచేంద్రియాలకు అందదు. అంటే పంచజ్ఞానేంద్రియాలు వేదాంతం చెప్పిన జ్ఞానాన్ని అవుననీ నిరూపించలేవు, కాదనీ ఖండించలేవు. ఒక వస్తువును చూపించి ఇది ఆకుపచ్చరంగులో ఉందని ఎవరైనా అంటే, మీరు దాన్ని అవుననో, కాదనో చెప్పటానికి మీ కన్నునే వాడాలి కాని చెవితో చెప్పలేరు. కన్ను చూసినదాన్ని కన్నే అవుననో, కాదనో చెప్పాలి. ఇదీ ప్రమాణంయొక్క నిర్వచనం. ఒక ప్రమాణం పరిధిలోకి ఇంకొక ప్రమాణం రాలేదు. శాస్త్రం ఇంకొక ప్రమాణం. అలాగే శాస్త్రం చూపినదాన్ని ఇంకొక ప్రమాణంతో ఖండించకూడదు.

శాస్త్రం చేసిన బోధను స్వీకరించగలగాలి. దాన్ని శ్రద్ధ అంటారు. శ్రద్ధ అంటే వేదాలు శబ్దప్రమాణమనీ, వేదం అనే ప్రమాణం చెప్పిన జ్ఞానం ప్రత్యేకమైన జ్ఞానమనీ, అది వేరే ప్రమాణానికి అందదనీ అర్థం చేసుకోవాలి. ఇటువంటి శ్రద్ధ పెంచుకోవటం చాలా కష్టం. శ్రద్ధ పెంచుకోవటానికి ఒక మార్గం దాన్ని ఉపాసన చెయ్యటం.

ఉదాహరణకు ఒక గుడ్డివాని విషయం తీసుకోండి. ఒకతను పుట్టుగుడ్డి అనుకుందాము. అతను నాలుగు ఇంద్రియాలతోనే ప్రపంచంతో వ్యవహారం నడుపుతూ వస్తున్నాడు. అతను యాభయ్యోపడిలో పడ్డాక, ఏ వైద్యమో జరిగి అతనికి కంటిచూపు వచ్చిందనుకుందాము. అతనికి, 'ఇదుగో, నీకు కన్ను అనే ప్రమాణం కొత్తగా వచ్చింది, కన్ను చూపించే విషయం సత్యం,' అని చెపితే, అతను 'లేదు, నాకు నాలుగు ఇంద్రియాలే తెలుసు. నేను ఈ కంటితో చూసినదాన్ని తక్కినవాటితో పోల్చిచూసి అప్పుడు అది నిజమో, కాదో చెబుతాను,' అనగలడా? ఇందాక చూసినట్టుగా కన్ను చెప్పిన రంగును అవుననీ చెప్పలేదు చెవి, కాదనీ చెప్పలేదు చెవి. అంటే ఏ ప్రమాణం విలువ దానిదే. ఒక ప్రమాణం చెప్పినదాన్ని ఇంకొక ప్రమాణం అవుననలేదు, కాదనలేదు. శాస్త్రం ఆరవ ప్రమాణం.

మనం శాస్త్రాన్ని ఆరవ ప్రమాణంగా స్వీకరించటానికి మన సాంప్రదాయం మనకు చిన్నప్పటినుంచి శాస్త్రంమీద శ్రద్ధను అలవాటు చేసింది. ఇందాక చెప్పిన గుడ్డివ్యక్తి విషయమే తీసుకుంటే, అతను నేను కన్ను చూసినదాన్ని నమ్మను అంటే నష్టపోయేది ఎవరు? అతనే. అతను కన్నును నమ్మకపోతే, ఒక ప్రమాణం అందించే జ్ఞానాన్ని కోల్పోతున్నాడు. అలాగే నేను శాస్త్రాన్ని నమ్మను అని మీరంటే మీరు శాస్త్రం అందించే అపురూపమైన జ్ఞానాన్ని కోల్పోతారు. భగవంతుని గురించి తెలుసుకోవాలంటే శాస్త్రం ఒక్కటే మార్గం. ప్రత్యక్ష ప్రమాణం అయిన కన్నుమీద మీకెంత శ్రద్ధ ఉందో, శబ్దప్రమాణం అయిన శాస్త్రంమీద కూడా మీకంత శ్రద్ధ ఉండాలి. దాన్ని పెంపొందించటానికి ఆచార్య ఉపాసన ఏర్పాటు చేసింది శాస్త్రం. ఆచార్యుడు వేదచక్షువుద్వారా ఆత్మజ్ఞానాన్ని కలుగజేస్తాడు.

**ఆరవ విలువ ఆచార్యోపాసనం.**

7. **శౌచమ్** – శౌచమ్ అంటే శుద్ధి. బాహ్యశుద్ధి, ఆంతరశుద్ధి కూడా వస్తాయి. ఇల్లు, ఇంటిముందు ఉన్న వీధి కూడా బాహ్యశుద్ధిలోకి వస్తాయి. అంతేకాదు, మీరు చేసుకునే వస్త్రాలంకరణ కూడా దానిలోకే వస్తుంది. నిరాడంబరంగా ఉండాలంటే అశుభ్రంగా ఉండాలి అనుకుంటారు కొంతమంది. నిరాడంబరం వేరు, అశుభ్రం వేరు. తర్వాత బాహ్యశరీర శుభ్రత. ఇవన్నీ తేలికగా పాటించవచ్చు కాని కొంతమందికి ఇవి కూడా కష్టమే.

తర్వాత అంశం అంతరశౌచమ్; వాక్కు పరంగా శుభ్రత పాటించాలి. అంటే మంచిమాటలే మాట్లాడాలి. ఈ విషయాన్ని వాచికతపస్సుగా 17వ అధ్యాయంలో కృష్ణపరమాత్మే వివరిస్తాడు. అప్పుడు చూద్దాము. తర్వాత మానసికస్థాయిలో శుభ్రత. అంటే మనస్సును ఆరోగ్యకరంగా ఉంచే మంచి ఆలోచనలే చెయ్యాలి. మనస్సును ఆరోగ్యంగా ఉంచే మంచి ఆలోచనలు ఏమిటి? ఇంతవరకూ చూస్తూ వస్తున్న విలువలు– అమానిత్వం, అదంభిత్వం, అహింస, క్షాంతి, ఆర్జవంలాంటివి.

ఈ విలువలకు ఉన్న భిన్న లక్షణాలు – మానిత్వం, దంభిత్వం, హింస మొదలైనవి. ఆ ఆలోచనలు మనస్సును కలుషితం చేస్తాయి. అలాంటి కలుషితమైన ఆలోచనలు ఉంటే, మనస్సు అనారోగ్యంగా ఉంటుంది. అందువల్ల మానసిక శుద్ధిని పెంపొందించే విలువలను అలవరచుకోవాలి. దీన్ని శౌచం అంటారు.

**ఏడవ విలువ శౌచం.**

8. **స్థైర్యమ్** – స్థైర్యం అంటే స్థిరత్వం. స్థిరత్వం అంటే పట్టుదల, దీక్ష, అంకితభావం. ఏదైనా పని మొదలుపెడితే ఖచ్చితంగా ఆటంకాలు ఎదురవుతాయి. కొన్ని ఆటంకాలు నిజంగా ఎదురయితే, మరికొన్ని మనం ఊహించుకున్నవై ఉంటాయి. అలా ఏ కాస్త ఆటంకం ఎదురైనా వెనుకంజ వెయ్యటాన్ని అస్థిరత్వం అంటారు. స్థిరత్వం అంటే పట్టుదలతో ముందుకు సాగటం.

**ప్రారభ్యతే న ఖలు విఘ్నభయేన నీచైః**
**ప్రారభ్య విఘ్నవిహతాః విరమన్తి మధ్యాః**
**విఘ్నైః పునః పునరపి ప్రతిహన్యమానాః**
**ప్రారబ్ధముత్తమజనాః న పరిత్యజన్తి** – భర్తృహరి నీతి శతకం 27

భర్తృహరి తన నీతిశతకంలో మూడు రకాల మనుష్యుల గురించి మాట్లాడారు. మొదటిరకంవారు నీచమానవులు. వారు అసలేమీ మొదలుపెట్టరు. ఎందుకంటే ఓడిపోతామేమోననే భయం వారికి. వారు గొప్పగా అందరికీ చాటి చెప్పుకుంటారు, 'నేను జీవితంలో ఎన్నడూ ఓడిపోలేదు.' వారు ఏదైనా చేస్తేనే కదా ఓడిపోయేది.

రెండవరకంవారు మధ్యమరకం. వారు చాలా ఉత్సాహంగా ప్రారంభిస్తారు కాని, చిన్న ఆటంకం ఎదురైతే చాలు, బెంబేలెత్తిపోయి, చేపట్టిన పనిని ఆపేస్తారు.

మూడవరకంవారు ఉత్తమపురుషులు. వారు చేపట్టిన పనికి ఎన్ని ఆటంకాలు ఎదురైనా సరే ఆత్మస్థైర్యాన్ని కోల్పోరు. ఎన్నిసార్లు కిందపడినా, లేచి నిలబడి, పట్టుదలతో ముందుకు సాగుతారు. వారు పరిస్థితులకు బానిసలు కారు, పరిస్థితులను తమకు బానిసలుగా చేసుకుంటారు.

ఇటువంటి గట్టి పట్టుదలకు ఆదర్శంగా నిలిచింది భగీరథుడు. భగీరథుడు ఎన్ని ఆటంకాలు ఎదురైనా ఎలా మొక్కవోని ధైర్యంతో ముందుకుసాగి, గంగాదేవిని భువినుంచి దివికి తెచ్చాడో పదవ అధ్యాయంలో చూశాము. క్షీరసాగర మథనం కూడా స్థైర్యం అనే ఈ విలువకు ఉదాహరణ. ఎన్ని ప్రలోభాలు ఎదురైనా, ఎన్ని భయాలు

కలిగినా, దేవదానవులు వారు ఆశించిన అమృతం పొందేవరకూ వారి ప్రయత్నాన్ని ఆపలేదు. ఉత్తమగుణం ఉన్నవారే ఇటువంటి విలువను పాటించగలరు.

**ఎనిమిద విలువ స్థైర్యం.**

9. **ఆత్మవినిగ్రహః** – ఆత్మవినిగ్రహః అంటే మనస్సు, శరీరేంద్రియాల నిగ్రహము. మీరు ప్రపంచంతో వ్యవహారం నడపటానికి మీకు పదిహేడు అంగాలు ఉన్నాయి. అవి పంచజ్ఞానేంద్రియాలు, పంచకర్మేంద్రియాలు, పంచప్రాణాలు, మనస్సు, బుద్ధి. (ఒక్కోచోట మనస్సు, బుద్ధితో పాటు చిత్తం, అహంకారం కూడా చెప్పి చత్వారి అంతఃకరణాని అంటారు. అప్పుడు 19 అంగాలు అవుతాయి.) ఈ అంగాలద్వారానే మీరు జీవితంలో ఏ రంగంలోనైనా రాణించగలరు. ఏదైనా పరికరం వాడేముందు, ఆ పరికరం సరిగ్గా ఉండాలి. అది మీరు చెప్పినమాట వినాలి.

అనేకసార్లు రథకల్పన ఉదాహరణ చూశాము. కఠోపనిషత్తులో శరీరం రథమని, ఇంద్రియాలు గుర్రాలనీ, మనస్సు పగ్గాలనీ, బుద్ధి రథసారధి అనీ వస్తుంది. రథసారధికి తన గమ్యం ఏమిటో తెలిసివుండాలి; గుర్రాలను పగ్గాలతో అదుపులో పెట్టగలిగే నేర్పు ఉండాలి. గుర్రాలు కూడా బుద్ధిగా రథసారధి చెప్పినట్టుగా వెళ్ళాలి. అప్పుడే ఏ ఇబ్బందీ లేకుండా గమ్యాన్ని చేరవచ్చు.

ఇదే సూత్రాన్ని మీకు అన్వయిస్తే మీ మనస్సు, మీ ఇంద్రియాలు, మీ బుద్ధి చెప్పినట్టు బుద్ధిగా వినాలి. ఇవి మీకు ఉపయోగపడే పరికరాలు. మనస్సు, ఇంద్రియాలు మీ అదుపులో ఉండాలి కాని మీరు వాటి అధీనంలో ఉండకూడదు. మిమ్మల్ని మీరు సరిగ్గా నడిపించుకోలేకపోతే, ఒక పెద్ద సంస్థను ఎలా నడిపిస్తారు?

మేనేజ్‌మెంట్ సైన్స్‌లో నేర్చుకునే మొట్టమొదటి పాఠం – మనను మనం అదుపులో పెట్టుకోవాలి. మన నోరును మనం నియంత్రించగలమా? నోరు అంటే మాట్లాడే నోరు, తినే నోరు రెండూ వస్తాయి. మన ఇంద్రియాలను మనం నియంత్రించగలమా? మన రాగద్వేషాలను మనం నియంత్రించుకోగలమా? మనను మనమే అదుపులో పెట్టుకోలేకపోతే, వేరేవారిని ఎలా అదుపులో పెడతాము? అందువల్ల ముందు నిన్ను నువ్వు ఉద్ధరించుకో అంటుంది శాస్త్రం. ఈ నియంత్రణను ఆత్మవినిగ్రహః అంటారు. ఆత్మ అంటే ఇక్కడ సచ్చిదానంద ఆత్మ కాదు; ఆత్మ అంటే స్థూల, సూక్ష్మశరీరం; వినిగ్రహః అంటే నిగ్రహం. ఆత్మ వినిగ్రహః అంటే స్థూల, సూక్ష్మశరీరాల నిగ్రహం.

ఆ ఆత్మవినిగ్రహానికి తోడ్పడుతుంది పతంజలియొక్క అష్టాంగయోగం.

**ఆసనమ్** – అష్టాంగయోగంలో ఆసనం అన్నమయకోశాన్ని అదుపులో పెట్టటానికి తోడ్పడుతుంది. శరీరం మనకు సహకరిస్తుందో లేదో చూపిస్తుంది. శరీరాన్ని కింద కూర్చో అంటే అది కూర్చోవాలి. కింద కూర్చోమనగానే, మోకాలునొప్పి, 'నేను ఉన్నాను,' అంటూ ముందుకు దూసుకువచ్చేస్తుంది. అది రాకపోతే నడుంనొప్పి ముందుకు వస్తుంది. వీటిని అధిగమించటానికి తోడ్పడుతుంది ఆసనం. మన శరీరం మన చెప్పుచేతల్లో ఉండాలంటే, మనం చెయ్యాల్సిన ప్రాథమిక కర్తవ్యం ఆసనాలు వెయ్యటం. కొంతమంది అపోహ పడతారు, 'అవి మనకు

కాదు, ఏదో అసాధారణ ఆసనాలు వేసేవారికి.' గీతాబోధలో ఒక గంటసేపు కుదురుగా కూర్చోగలగటానికే ఆరోగ్యకరమైన శరీరం కావాలి. దానికి ఈ ఆసనం అనే అంశం తోడ్పడుతుంది.

**ప్రాణాయామః** – అష్టాంగయోగంలో ప్రాణాయామం ప్రాణమయకోశాన్ని అదుపులో పెట్టటానికి తోడ్పడుతుంది.

**ప్రత్యాహారః** – అష్టాంగయోగంలోని ప్రత్యాహారం ఇంద్రియాలను అదుపులో పెట్టటానికి తోడ్పడుతుంది.

**ధారణా, ధ్యానం, సమాధి** – ఈ మూడూ కలిసి మనస్సును అదుపులో పెట్టటానికి తోడ్పడతాయి. ఇవి చిత్త ఏకాగ్రతకు తోడ్పడతాయి.

చిన్మయానందస్వామి ఎప్పుడూ చెబుతారు, 'మిన్ను విరిగిమీద పడ్డా తెలియనంత ఏకాగ్రతతో బోధను వినాలి.' కాని మనమేం చేస్తాము? ఏదైనా బోధకు వెళితే, బోధ వింటూండగా ఎవరైనా ఆలశ్యంగా వస్తే, వెంటనే మన దృష్టి అతనివైపుకు వెళ్ళిపోతుంది. ఆ వచ్చిన వ్యక్తిని నఖశిఖపర్యంతం గమనిస్తాము. అతను ఏ దుస్తులు వేసుకున్నాడో, ఎలా నడుస్తున్నాడో చూస్తాము. ఏకాగ్రత చెదిరిపోతుంది. సమాధి అంటే ఇంక బాహ్యప్రపంచ దృష్టి ఉండకూడదు.

సమాధి అంటే అది ఒక సిద్ధి కాదు; సమాధి అంటే ఏ పని చేపట్టినా, దానిమీద చిత్తఏకాగ్రత చూపటం. ఆ విధంగా అష్టాంగయోగంలో పేర్కొనబడిన ఎనిమిదీ – యమ, నియమ, ఆసన, ప్రాణాయామ, ప్రత్యాహార, ధారణ, ధ్యాన, సమాధి – జ్ఞానయోగ్యతాప్రాప్తిని ఇస్తాయి కాని, జ్ఞానాన్ని ఇవ్వవు. యోగం ఎన్నడూ జ్ఞానాన్ని కాని, మోక్షాన్ని కాని ఇవ్వదు. యోగం ఆత్మవినిగ్రహాన్ని ఇస్తుంది. అది పొంది వేదాంతానికి వచ్చి, గురువుద్వారా శాస్త్రాన్ని అధ్యయనం చెయ్యాలి.

**తొమ్మిదవ విలువ ఆత్మవినిగ్రహం.**

ఇంతవరకూ కొన్ని విలువలను చూశాము. శారీరక ఆరోగ్యం బాగుందని ఎప్పుడు చెప్పగలరు? బి.పి., షుగర్, కొలెస్ట్రాల్ లేకపోతే చెప్పగలరు. అలాగే మానసిక ఆరోగ్యం బాగుందని చెప్పటానికి కూడా మానసికశాంతి ఉండాలి. ముఖ్యంగా వేదాంతం నేర్చుకునే వ్యక్తికి ఈ మానసికశాంతి చాలా ముఖ్యం. మనస్సు బాగుంటేనే, బుద్ధి పదునుగా పనిచేస్తుంది. మనస్సు ప్రశాంతంగా లేకపోతే, మీరు చదువుతున్న పుస్తకంలో అక్షరాల వెంట కళ్ళు పరుగులు తీస్తాయేకాని, బుద్ధికి ఏమీ ఎక్కదు. ప్రసంగానికి వెళ్ళినా అంతే. ప్రసంగం బుద్ధిలోకి ఎక్కదు. బుద్ధి పదునుగా ఉండాలంటే మనస్సు ప్రశాంతంగా ఉండాలి. మనస్సు ప్రశాంతంగా ఉండాలంటే మనస్సు ఆరోగ్యకరంగా ఉండాలి. మనస్సు ఆరోగ్యకరంగా ఉండాలంటే పైన చెప్పిన విలువలను పాటించాలి.

శ్లో. 9 **ఇంద్రియార్థేషు వైరాగ్యమ్ అనహంకార ఏవ చ ।**
**జన్మమృత్యుజరావ్యాధిదుఃఖదోషానుదర్శనమ్ ॥**
ఇంద్రియార్థేషు, వైరాగ్యమ్, అనహంకారః, ఏవ, చ,
జన్మమృత్యుజరావ్యాధిదుఃఖదోషానుదర్శనమ్ ॥

| | | | |
|---|---|---|---|
| ఇంద్రియార్థేషు వైరాగ్యమ్ | = ఇంద్రియ నిగ్రహము | జన్మమృత్యు | = పుట్టుక చావు |
| చ | = ఇంకా | జరావ్యాధి | ముసలితనం, రోగాదులందు |
| అనహంకారః ఏవ | = అహంకారరాహిత్యము | దుఃఖదోషాను దర్శనమ్ | = దుఃఖదోషములను గూర్చి పదేపదే తలంచుట |

**ఇన్ద్రియ-అర్థేషు వైరాగ్యమ్, అనహంకారః ఏవ చ,**
**జన్మ-మృత్యు-జరా-వ్యాధి-దుఃఖ-దోష-అనుదర్శనమ్ ॥**

తా: ఇంద్రియ నిగ్రహము ఇంకా అహంకార రాహిత్యము, పుట్టుక చావు, ముసలితనం, రోగాదులందు, దుఃఖదోషములను గూర్చి పదేపదే తలంచుట.

10. **ఇంద్రియార్థేషు వైరాగ్యమ్** – ఇంద్రియార్థేషు వైరాగ్యమ్ అంటే ఇంద్రియనిగ్రహం. ఇంద్రియాలు మనకు భగవంతుడిచ్చిన గొప్ప వరాలు. వాటిద్వారానే మనం ప్రపంచంతో వ్యవహారం నడపగలము. మనకు రెండురకాల ఇంద్రియాలు ఉన్నాయి – పంచజ్ఞానేంద్రియాలు, పంచకర్మేంద్రియాలు. పంచజ్ఞానేంద్రియాలు బాహ్యప్రపంచంలోని విషయాలను మనస్సుకు చేరవేస్తాయి. వాటికి భిన్నంగా పంచకర్మేంద్రియాలు బాహ్యప్రపంచంతో వ్యవహారం నడపటానికి తోడ్పడతాయి. అంటే ఒకటి లోపలికి మార్గం అయితే, ఇంకొకటి బయటకు మార్గం.

బాహ్యప్రపంచంతో వ్యవహారం నడపటానికి మాత్రమే కాదు, ఆధ్యాత్మిక సాధనకు కూడా ఇంద్రియాలు ఎంతో తోడ్పడతాయి. ఆ విధంగా మనకు తోడ్పడటానికి ఇవ్వబడిన ఈ పరికరాలు మన అధీనంలో ఉండాలి కాని, మనం వాటి మాయలో పడిపోకూడదు. ఇంద్రియాలు మనకు బానిసలుగా ఉండాలి కాని, మనం వాటికి బానిసలు కాకూడదు.

ఈ ఇంద్రియాలను అదుపులో పెట్టుకోవాలంటే, మనం చాలా జాగరూకతతో వ్యవహరించాలి. ఏ మాత్రం ఏమారినా, మన చెయ్యి దాటిపోతాయి అవి. మన పంచజ్ఞానేంద్రియాలను తీసుకుంటే అవి కన్ను, చెవి, ముక్కు నోరు, చర్మం. అవి ప్రపంచాన్ని ఐదుగా విభజించి, వాటి విషయాలు మనసుకి చేరవేస్తాయి. పంచ అంటే ఐదు. ప్రపంచంలోని శబ్ద, స్పర్శ, రస, రూప, గంధాలను చూపిస్తాయి మనకు.

ఇంద్రియాలు పదేపదే ఒక వస్తువును చూస్తుంటే, వాటికి తెలియకుండానే అవి ఆ వస్తువుమీద అభిమానం పెంచుకుంటాయి. అలా ప్రతిఒక్క ఇంద్రియమూ అది చూసే ఏదో ఒక విషయవస్తువుమీద అభిమానం పెంచుకుంటుంది. క్రమంగా దానికి అలవాటు పడిపోతుంది. ఉదాహరణకు ఒక టీవీ సీరియల్‌ను మన కళ్ళు చూడటం మొదలుపెట్టాయి అనుకుందాము. మొదట్లో అవి ఆ సీరియల్ బాగుంది అంటాయి, తర్వాత అద్భుతంగా ఉంది అంటాయి, తర్వాత ఇంక ఆ సీరియల్ చూడకపోతే నిలవలేని స్థితికి వస్తాయి. ఇంక అక్కడనుంచీ మనను ఆ సీరియల్ చూస్తావా లేదా అని వేధిస్తాయి. అలా వేధించినప్పుడు ఆ ఇంద్రియం మాట వినాలా, లేదా అన్నది మన అధీనంలో ఉంది.

ఇంద్రియనిగ్రహం, చిన్నపిల్లల పెంపకంలాంటిది. పిల్లలకు ముందు ప్రేమకొద్దీ ఏదో ఇస్తాము. ఉదాహరణకు ఒక చాక్లెట్టును ఇస్తాము. కొన్నాళ్ళు ఏదో సరదాగా అప్పుడప్పుడూ ఇచ్చిన చాక్లెట్లకు పిల్లలు బానిస అయిపోతారు.

ఇంక ఆ చాక్లెట్లు తినందే ఉండలేని పరిస్థితికి వస్తారు. అవి ఇవ్వకపోతే కిందపడి ఏడ్చి, రాగాలు పెట్టే పిల్లలు కూడా ఉంటారు. ఆ ఆగడం భరించలేక చాక్లెట్లు వారి చేతిలో పెడతాము. 'ఇదే ఆఖరిసారి, మళ్ళీ ఇవ్వము,' అని బెదిరించి మరీ ఇస్తాము. కాని ఆ ఆఖరిసారిని ఎన్నిసార్లైనా తీసుకురాగల నేర్పు ఉంటుంది పిల్లలకు.

ఇంద్రియాలు కూడా ఏమీ తక్కువ తినలేదు. పిల్లలను మించి మనను సతాయిస్తాయి. మొదట్లో అమాయకంగా మీరు వాటిని ముద్దు చేస్తే, అవి మీకు తెలియకుండానే మీ నెత్తికెక్కి కూర్చుంటాయి. కొంతమందిని కాఫీగత ప్రాణులు అంటారు. వారు కాఫీకి ఎంతగా బానిస అయిపోతారంటే అది లేకపోతే వారికి పిచ్చెక్కినట్టు ఉంటుంది. అలాంటివారు పొరపాటున ఒకరోజు కాఫీ త్రాగకుండా ఉండి చూద్దామనుకున్నా, వారి ప్రయత్నం సాగనివ్వదు. వారికి తలనొప్పి కూడా తెప్పించేస్తుంది ఆ ఇంద్రియం. ఏ పనిచేసినా, దానిమీద ఏకాగ్రత చూపనివ్వకుండా కాఫీజపం చేయిస్తుంది. అందువల్లనే ఇంద్రియాలు విషయవస్తువుల వైపుకు మనను బలవంతంగా లాక్కుపోతాయని కృష్ణపరమాత్మ రెండవ అధ్యాయంలోనే చెప్పాడు.

**యతతో హ్యపి కౌంతేయ పురుషస్య విపశ్చితః ।**

**ఇంద్రియాణి ప్రమాథీని హరంతి ప్రసభం మనః ॥** – 2.60

అంతేకాదు, ఇంద్రియాలు ఎంత శక్తివంతమైనవంటే వాటికి జతగా మనస్సును కూడా కలుపుకుంటాయి. ఇప్పుడు బుద్ధి ఒక్కటే మిగిలింది. అసలైతే, ఇంతకుముందు చెప్పిన రథకల్పనలో చూసినట్టుగా బుద్ధి అధీనంలో మనస్సు, ఇంద్రియాలు ఉండాలి. కాని బుద్ధి ఒకవైపు, మనస్సు, ఇంద్రియాలు ఒకవైపు అయ్యాయి ఇప్పుడు. వీటిమధ్యలో అంతర్యుద్ధం మొదలవుతుంది. బుద్ధి పదేపదే చెబుతుంది, 'మీరు చేస్తున్నది తప్పు. ఇలా టీ.వీ.కి, కాఫీకి బానిస అవకూడదు. నేను మోక్షం పొందాలనుకుంటున్నాను. మీరు నన్ను ఈ చిన్న విషయాలకే కట్టిపడేస్తే, పెద్ద విజయాన్ని ఎలా పొందుతాను నేను?'

కొన్నిరోజులు బుద్ధి వేసిన చివాట్లకు బుద్ధిగా లొంగినట్టే లొంగి, మళ్ళీ విజృంభిస్తాయి ఇంద్రియాలు, మనస్సుతో కూడిన బలంవల్ల. ఒక గొప్పకవి అన్నాడు, 'పొగత్రాగటం మానటం కష్టమని ఎవరన్నారు? నేను ఇప్పటికి ఎన్నిసార్లో మానేశాను.' ఆస్కార్‌వైల్డ్ అద్భుతంగా అన్నారు, 'ఐ కెన్ రెసిస్ట్ ఎవ్విరిథింగ్ ఎక్సెప్ట్ టెంప్టేషన్.' ప్రలోభాన్ని తప్ప దేన్నైనా నిగ్రహించుకోగలను అని దాని అర్థం. తమాషా ఏమిటంటే నిగ్రహించుకోవటం పదాన్ని ప్రలోభాన్ని అరికట్టటానికే వాడతారు. బుద్ధి మొదట్లో నేను గీత నేర్చుకుంటున్నాను, నేను ఇలా ఇంద్రియాలకు బానిస అవకూడదని గట్టి నిర్ణయం తీసుకుంటుంది. ఇంద్రియాలు కూడా విన్నట్టే విని, మళ్ళీ మొరాయిస్తాయి.

ఇలా ప్రచ్ఛన్నయుద్ధం సాగుతున్నప్పుడు అంతర్మథనం సాగుతుంది. ఒకపక్క ఇంద్రియాలు ముందుకు లాగితే, ఇంకొకపక్క బుద్ధి వెనక్కు లాగుతుంది. రెండింటి మధ్యా టగ్ ఆఫ్ వార్ సాగుతుంది. కొన్నిసార్లు గెలిచిన బుద్ధి, చివరకి తానే పడిపోతుంది. **అణగద్రొక్కి చూడు, లేదా నువ్వే అణగిపో** అంటారు. బుద్ధి అదే చేస్తుంది. అణగద్రొక్కటానికి ప్రయత్నిస్తుంది. కాని కొన్ని ప్రయత్నాలు చేశాక శక్తివిహీనం అయిపోతుంది. బుద్ధి కూడా ఇంద్రియాలతో జతకలుస్తుంది. జత కలవటమే కాదు, ఇప్పుడు తన శక్తిని తన చెడుపనికి సమర్థించుకోవటానికి

ఉపయోగిస్తుంది. 'నేను సిగరెట్టు కొనకపోతే, సిగరెట్టు అమ్మేవారు ఏమైపోతారు?' అంటుంది. ఆ సమర్థింపు ఎలా ఉంటుందో ఈ జోక్ చూస్తే తెలుస్తుంది.

ఒక వ్యక్తి, ఒక త్రాగుబోతుకు మందు తాగితే ఎంత హానికరమో చూపించాలనుకున్నాడు. అందువల్ల అతని ముందు ఒక గ్లాసులో మందుపోసి, అందులో ఒక క్రిమిని వేశాడు. ఆ క్రిమి ఆ మందులో మరణించింది. దీనివల్ల నీకేమర్థమయిందని అడిగాడు ఆ వ్యక్తి. ఆ త్రాగుబోతు తడుముకోకుండా చెప్పాడు, 'చూశావా, మందు ఎలా మేలు చేస్తుందో? ఆ క్రిమిని నిముషంలో చంపేసింది. అలా నేను మందు త్రాగటంవల్ల నాలో ఉన్న క్రిములు అన్నీ మరణిస్తాయి. దానివల్ల నా కడుపు శుద్ధి అవుతుంది.' అదీ బుద్ధి చేసేపని. ఏ తప్పుపని చేసినా, దాన్ని సమర్థించుకునే తెలివితేటలు ఉంటాయి దానికి.

పూజ్యస్వామీజీ అంటారు, 'ఏ వ్యసనం తీసుకున్నా మొదటిసారి మాత్రమే మీకు 'నో' అనగలిగే హక్కు ఉంటుంది.' తాగుడు, సిగరెట్టు కూడా రుచి చూడకుండా ఉన్నంతవరకూ వాటిని తప్పించుకోగలరు కాని, పొరపాటున ఎలా ఉంటుందో చూద్దామని ఒక్కసారి ప్రయత్నించారో, అంతే సంగతులు. వాటికి మీరు బానిస కావాల్సిందే. అందువల్లనే ఇంద్రియాల విషయంలో ఎప్పుడూ అప్రమత్తతతో ఉండాలి. అందువల్లనే మీరు క్రమం తప్పకుండా చేసే పనులకు, ఒక్కరోజన్నా 'నో' అనటం నేర్చుకోవాలి. అలా నో అనగలగటం నేర్పించటానికి మన శాస్త్రం అనేక విధాలైన తపస్సులను, వ్రతాలను, ఉపవాసాలను అలవాటు చేసింది.

ఈ ఇంద్రియనిగ్రహాన్ని ప్రత్యాహారం అని పతంజలి తన యోగశాస్త్రంలో పేర్కొంటే, వేదాంతశాస్త్రం దమము అంది. సాధనచతుష్టయ సంపత్తిలో శమదమాదిషట్క సంపత్తి అని వస్తుంది. దమము అంటే ఇంద్రియనిగ్రహం. దీనినే కృష్ణపరమాత్మ ఇంద్రియార్థేషు వైరాగ్యం అన్నాడు. ఇంద్రియార్థేషు అంటే దమము; వైరాగ్యం అంటే ద్వేషం పెంచుకోవటం కాదు, బంధకత్వం లేకపోవటం. ఆనందం అనుభవించవచ్చు కాని, దానికి బానిస అవకూడదు. ఎలా తెలుస్తుంది? దేన్నించి ఆనందం పొందాలో మీరు నిర్ణయించుకోవాలి కాని, ఇంద్రియాలు నిర్ణయించకూడదు. అందువల్ల ఇంద్రియనిగ్రహం చాలా ముఖ్యమైన విలువ.

**పదవ విలువ ఇంద్రియార్థేషు వైరాగ్యమ్.**

11. **అనహంకారః** – అనహంకారః అంటే అహంకారం లేకపోవటం. అహంకారం అంటే గర్వం, పొగరు. అనహంకారం అంటే గర్వం, పొగరు లేకపోవటం.

అమానిత్వం అంటే కూడా గర్వం లేకపోవటం అని చూశాము. మళ్ళీ ఎందుకు కృష్ణపరమాత్మ అదే లక్షణాన్ని ఇంకొకమాటలో చెప్పాడు? మామూలుగా అమానిత్వం, అనహంకారం పదాల అర్థం ఒకటే అయినా, ఈ సందర్భంలో వాటిమధ్య ఉన్న సూక్ష్మభేదాన్ని గమనించాలి. అమానిత్వం అంటే ఆలోచనస్థాయిలో గర్వం లేకపోవటం. మననం అంటే ఆలోచనస్థాయి. అంటే ఆలోచనలో కూడా నేను ఇంతవాణ్ణి, అంతవాణ్ణి అనుకోకపోవటం. దీన్ని అమానిత్వం అంటారు.

అనహంకారం అంటే వాచికస్థాయిలో గర్వం లేకపోవటం.

**అహమ్ ఇతి కారణమ్ అహంకారః**

కొంతమంది ఎంతసేపూ నేను, నాది, నావారు అంటారు. మీరు ఏ విషయం చెప్పండి వారికి, దాన్ని పూర్తిగా తమవైపు తిప్పేసుకుంటారు వారు. 'అమెరికాలో బాగా మంచు పడుతోందిట,' అని మీరు చెప్పారనుకోండి; వెంటనే వారు, 'నేను వెళ్ళినప్పుడు అస్సలు పడలేదు,' అంటూ ఏవో వారి అనుభవాల వైపుకు ప్రసంగాన్ని తిప్పేస్తారు. అలా మీరు ఈ భూమ్మీద ఏ విషయం చెప్పినా, ఇదే తంతు. స్వంతడబ్బా వచ్చేస్తుంది. ఎంతసేపూ ఆత్మస్తుతే ఉంటుంది.

అయితే ఇది అదంభిత్వం విలువలోకి వస్తుందా అంటే దానికీ దీనికీ కూడా సూక్ష్మభేదం ఉంది. దంభిత్వం అంటే గొప్ప ప్రదర్శించుకోవటం. వేషంలో, ప్రవర్తనలో అహంకారం చూపించుకోవటం. అహంకారం అంటే మాటలు కోటలు దాటటం. తన గురించి గొప్పగా చెప్పుకోవటం.

అమానిత్వం, అనహంకారం, అదంభిత్వం మూడూ మూడు స్థాయిల్లో గర్వం లేకపోవటాన్ని చూపిస్తాయి. అమానిత్వం అంటే మానసికస్థాయిలో గర్వం లేకపోవటం; అనహంకారం అంటే వాచికస్థాయిలో గర్వం లేకపోవటం; అదంభిత్వం అంటే కాయికస్థాయిలో గర్వం లేకపోవటం. అంటే మనోవాక్కాయకర్మలలో ఎక్కడా గర్వం ఉండకూడదు.

**పదకొండవ విలువ అనహంకారం.**

12. **జన్మమృత్యుజరావ్యాధిదుఃఖదోషానుదర్శనమ్** – అంటే శరీరంతో బంధం పెంచుకోకూడదు. జీవితం అంటే శరీరపరంగా జీవించటం మాత్రమే కాదు. మీరు శరీరంకన్నా భిన్నంగా ఉన్నారు, శరీరంకన్నా ఉన్నతస్థాయి మీది. శరీరంమీద అభిమానం పెంచుకుంటే, అది మీ ఉన్నత ప్రగతికి అడ్డుపడటమే కాకుండా, అనేక సమస్యలకు దారితీస్తుంది కూడా.

శరీరంమీద అభిమానం పెంచుకుంటే వచ్చే సమస్యలు ఏమిటి? ముఖ్యంగా ఈ రోజుల్లో జుట్టునుంచి, కాలి గోర్లవరకూ వాటిని అందంగా ఉంచుకోవటానికి అనేక సాధనాలు వచ్చాయి. కనుబొమలు దిద్దేటందుకు అనేక బ్యూటీపార్లర్లు వచ్చాయి. శరీరపోషణకు, ముఖం అందంగా కనబడటానికి పడేపాట్లు ఎన్నో ఉన్నాయి. కాని శరీరంమీద ఈ మక్కువ, ఈ శరీరపోషణ బాధాకరం కావచ్చు. ఈ విషయాన్ని సరిగ్గా అర్థం చేసుకోవాలి.

వేదాంతం మీ శరీరాన్ని అశ్రద్ధ చెయ్యమని ఎన్నడూ చెప్పదు. నిజానికి శరీరం ఆరోగ్యకరంగా ఉంటేనే, అటు మీ ఆధ్యాత్మిక సాధనగానీ, ఇటు మీ లౌకికసాధన గానీ కొనసాగగలుగుతుంది. కాని వేదాంతం చెప్పేది ఒక్కటే. ఇంకొక సాధ్యం పొందటానికి శరీరాన్ని సాధనగా చూడాలి కాని, దాన్నే సాధ్యంగా భావించకూడదు. మీది పంచకోశాలున్న శరీరం అయితే, శరీరం అందులో అత్యంతబాహ్యంగా ఉన్న అన్నమయకోశం. అయితే ఈ శరీరంమీద అభిమానాన్ని వదల్చుకోవటం ఎలా? కృష్ణపరమాత్మ అందులోని దోషాలను దర్శించండి అంటున్నాడు.

**దోష అనుదర్శనమ్** – అనుదర్శనమ్ అంటే ఒకదాని గురించి పదేపదే తలుచుకోవటం. దేని గురించి పదేపదే తలుచుకోవాలి? దోషాల గురించి. దేహాభిమానం ఉంటే కలిగే దోషాలేమిటో తెలుసుకోవాలి. ఏమిటా దోషాలు?

**జన్మమృత్యుజరావ్యాధిదుఃఖః** – ఈ శరీరానికి ఐదు దోషాలు ఉన్నాయి.

జన్మ – అదృష్టవశాత్తూ జన్మ ఎత్తేశాము. తొమ్మిది నెలలు తల్లిగర్భంలో వంటరిగా అవస్థలు పడి, ఖైదీగా జీవితం గడిపి, బయటకు రావటానికి కూడా అవస్థలు పడి, ఎలాగైతేనేం బయటకు వచ్చేశాము. ఆ బాధ అయిపోయింది.

జరా – జరా అంటే వృద్ధాప్యం. వృద్ధాప్యం అంటే నిస్సహాయస్థితిలో ఉంటాము. చిన్నప్పుడు ఉన్న గుండెధైర్యం నీరుకారిపోతుంది. ఎవరిమీదో శారీరకంగా ఆధారపడాలి. వయస్సు మీదపడ్డ కొద్దీ నిస్సహాయత అంతకంతకూ పెరిగిపోతుంటుంది.

వ్యాధి – అనారోగ్యం. అనేకరకాల అనారోగ్యాలు కలుగుతుంటాయి.

మృత్యుః – మృత్యువు అంటే మరణం. నా అన్నవారినందరినీ వదిలి మృత్యుబారిన పడాలి.

దుఃఖమ్ – ఇవన్నీ దుఃఖానికి దారితీస్తాయి. ఇవన్నీ దేహాభిమానం పెంచుకోవటంవల్ల కలిగే దుఃఖాలు. ఆత్మజ్ఞానం పొందాలంటే దేహాభిమానదోషదర్శనం చెయ్యాలి. అప్పుడు ఈ దేహాభిమానం పోతుంది.

**పన్నెండవ విలువ జన్మమృత్యుజరావ్యాధిదుఃఖదోషానుదర్శనమ్.**

శ్లో. 10 **అసక్తిరనభిష్వంగః పుత్రదారగృహాదిషు ।**
**నిత్యం చ సమచిత్తత్వమ్ ఇష్టానిష్టోపపత్తిషు ॥**

అసక్తిః, అనభిష్వంగః, పుత్రదారగృహాదిషు, నిత్యమ్, చ, సమచిత్తత్వమ్, ఇష్టానిష్టోపపత్తిషు ॥

పుత్రదార = భార్య, పిల్లలు
గృహాదిషు = ఇల్లు మొదలగు వానియందు
అసక్తిః = ఆసక్తి లేకుండుట
అనభిష్వంగః = మమతారాహిత్యము
చ = ఇంకా

**అసక్తిః, పుత్ర–దార–గృహ–ఆదిషు అనభిష్వఙ్గః,**
**ఇష్ట–అనిష్ట–ఉపపత్తిషు నిత్యమ్ సమ–చిత్తత్వమ్ చ ॥**

తా: భార్య, పిల్లలు, ఇల్లు మొదలగు వానియందు ఆసక్తి లేకుండుట. మమతారాహిత్యము ఇంకా ఇష్టానిష్ట వస్తుప్రాప్తియందు నిరంతరము సమభావముతో ఉండుట.

ఇష్టానిష్టోపపత్తిషు = ఇష్టానిష్ట వస్తుప్రాప్తియందు
నిత్యమ్ = నిరంతరము
సమచిత్తత్వమ్ = సమభావముతో ఉండుట

13. **అసక్తిః** – అసక్తిః అంటే మనోనిగ్రహం. బాహ్యవస్తువులకు, వ్యక్తులకు, పరిస్థితులకు బానిస కాకుండా ఉండగలగటం. ఇంతకుముందు చూసిన విలువల్లో ఒక విలువగా ఇంద్రియార్థేషు వైరాగ్యమ్ చూశాము. అది ఇంద్రియనిగ్రహాన్ని సూచిస్తే అసక్తిః మనోనిగ్రహాన్ని సూచిస్తుంది. ఇంద్రియనిగ్రహాన్ని దమము అంటే, మనోనిగ్రహాన్ని శమము అంటారు. కృష్ణపరమాత్మ ఈ రెండింటి గురించీ ఎందుకు చెప్పాడు?

ఇంద్రియనిగ్రహంతో పోలిస్తే మనోనిగ్రహం చాలా కష్టం. ఇంద్రియనిగ్రహం కూడా కష్టమే కాని కొంతమేరకు దాన్ని సాధించవచ్చు. ఇంద్రియాలు బాహ్యంగా ఉంటాయి, స్థూలపరికరాలు; కాని మనస్సు సూక్ష్మశరీరంలో ఉంటుంది. ఏ వస్తువైతే మిమ్మల్ని అతిగా ఆకర్షిస్తుందో, ఆ వస్తువునుంచి దూరంగా పారిపోవటంద్వారా ఇంద్రియనిగ్రహాన్ని సాధించవచ్చు. కాని ఎక్కడికి వెళ్ళినా మనస్సు మీ వెన్నంటే వస్తుంది. మనస్సుకు దూరంగా పారిపోగలగే అవకాశం లేదు. తాగుడులాంటి చెడు అలవాటును పారద్రోలటానికి ప్రత్యేకించి కొన్ని కేంద్రాలు ఉంటాయి. అక్కడ మందుసీసాలు వారికి అందుబాటులో లేకుండా చేస్తారు. అవి అందనంతవరకు కొంత అదుపులో పెట్టుకోగలడు. కాని మనస్సు అంత తేలిగ్గా వాటిని మర్చిపోలేదు. వాటిమీదే ధ్యాస ఉంటుంది. మనస్సు మందును మర్చిపోలేకపోతే మళ్ళీ ఆ వ్యసనం బారినపడే అవకాశం ఉంది.

**కర్మేంద్రియాణి సంయమ్య య ఆస్తే మనసా స్మరన్ ।**
**ఇంద్రియార్థాన్ విమూఢాత్మా మిథ్యాచారః స ఉచ్యతే ॥** – 3.6

ఇంద్రియాలను మాత్రం నిగ్రహించి లాభంలేదు. మనస్సులో ఆ వాసనలు ఇంకా చోటుచేసుకుంటాయి. అందువల్ల మనోనిగ్రహం కూడా ఉండాలి. మనోనిగ్రహం ఏర్పడాలంటే, ఆ వ్యసనంవల్ల కలిగే నష్టాలు ఏమిటో అర్థం చేసుకోవాలి. ఎప్పుడైతే, దానియొక్క అనర్థం కళ్ళకు కట్టినట్టు అర్థమవుతుందో, అప్పుడే ఆ మందు కళ్ళకు ఎదురుగా కనబడుతున్నా, దానిమీద వ్యామోహం కలగదు. ఇది తాగుడు, సిగరెట్టులాంటి ఏ వ్యసనానికైనా వర్తిస్తుంది. ఇటువంటి నిగ్రహం వివేకశక్తివల్ల ఏర్పడుతుంది. ఎవరో చెప్పారని బలవంతంగా మానితే అది మనస్సును బలవంతంగా అదుపులోకి పెట్టటమవుతుంది. దాని బదులు వివేకంవల్ల ఏర్పడిన వైరాగ్యం అయితే తేలిగ్గా మనస్సును నిగ్రహిస్తుంది. ఆ విధంగా మనస్సును బలవంతంగా అణిచే స్థాయినుంచి వివేక వైరాగ్యాలతో వ్యామోహానికి అతీతంగా ఎదిగే స్థాయికి రావాలి. అలా ఎదిగితే, వస్తువు ఎదురుగా ఉన్నా కూడా, దానివైపు ఆకర్షణ ఉండదు. రాగద్వేషవియుక్తైస్తు. ఈ విషయాన్ని రెండవ అధ్యాయంలో అద్భుతంగా చెప్పాడు కృష్ణపరమాత్మ.

**రాగద్వేషవియుక్తైస్తు విషయానింద్రియైశ్చరన్ ।**
**ఆత్మవశ్యైర్విధేయాత్మా ప్రసాదమధిగచ్ఛతి ॥** – 2.64

మనోనిగ్రహం ఉంటే ఇంద్రియాలు ఆ వస్తువును చూస్తున్నా కూడా చలించదు. కాని ఆ మనోనిగ్రహం

పెంపొందించుకునేవరకూ విషయవస్తువులకు దూరంగా ఉండాలి.

**పదమూడవ విలువ అసక్తిః**

14. **పుత్రదారగృహాదిషు అనభిష్వంగః** – రెండు పదాలనూ కలిపి చూడాలి. ఇదంతా ఒకటే విలువ. పుత్రదారగృహాదిషు ఒక విలువ, అనభిష్వంగ ఇంకొక విలువ కాదు. అభిష్వంగః అంటే తీవ్రరాగం. అంటే విపరీతమైన మమకారం. అనభిష్వంగః అంటే ఈ తీవ్రమమకారం లేకపోవటం. ఎవరిమీద ఇలాంటి తీవ్రమమకారం ఉండకూడదు? కృష్ణపరమాత్మ కొంతమందిని పేర్కొంటున్నాడు.

**పుత్రదారగృహాదిషు – పుత్ర** అంటే అబ్బాయి. పుత్రలో పుత్రిని కూడా కలుపుకోవాలి. అంటే పిల్లలమీద మమకారం. అలాగే **దార** అంటే భార్య. భర్తపరంగా చూస్తే, భార్య; భార్యపరంగా చూస్తే భర్త. అంటే జీవిత భాగస్వామిమీద మమకారం. **గృహమ్** అంటే ఇల్లు. ఇంటిమీద మమకారం. **ఆది** అంటే మొదలైనవి. వాటిలో ఏదైనా కలుపుకోవచ్చు. మనం పడుకునే మంచం అవచ్చు; మనం పెంచుకునే కుక్కపిల్ల అవచ్చు; మనకు ఇష్టమైన వస్తువులు కావచ్చు; మనకు ఆత్మీయులైన మనుష్యులు కావచ్చు. మనతో చనువుగా సంవత్సరాల తరబడి ఉండేవారిమీద పెంచుకున్న మమకారం కావచ్చు. అలా కొంతమంది మనుష్యులతో, కొన్ని వస్తువులతో బంధం పెంచుకుంటాము. ఆ బంధాన్ని అంత తేలిగ్గా ఒదులుకోలేము కూడా. నిజమే, అలాంటి బంధంనుంచి అంత తేలిగ్గా బయటపడలేమని కృష్ణపరమాత్మకు కూడా తెలుసు.

అందువల్ల కృష్ణపరమాత్మ అసలు మమకారం ఉండకూడదనటం లేదు, తీవ్రమైన మమకారం ఉండకూడదు అంటున్నాడు. అసలు మమకారం లేకుండా ఉండాలంటే, దానికి ఒక్కటే మార్గముంది. మనం పరమహంస పరివ్రాజకులము అవ్వాలి. ఒకచోట, ఒకరితో, ఎక్కువకాలం ఉండకపోతే బంధం ఏర్పడే అవకాశమే లేదు. కాని మనం సమాజంలో గృహస్థుగా జీవిస్తున్నప్పుడు, కొంతమందితో, కొన్ని వస్తువులతో బంధం ఏర్పడక తప్పదు; వారిమీద మమకారం పెరగకా తప్పదు. కాని మమకారం శ్రుతిమించి ఉండకూడదు అంటున్నాడు కృష్ణపరమాత్మ.

కొంతమేరకు మమకారం ఉండవచ్చు అని గృహస్థుకు చెబుతున్నాడు. కాని ఒక సన్యాసి దీన్ని చదివి, 'కృష్ణపరమాత్మ ఇరవై విలువలు పెంపొందించుకోమన్నాడు, అందులో ఒక విలువ భార్యా పిల్లలమీద మమకారం పెంచుకోకూడదు అన్నాడు. ఆ విలువను నేను పాటించాలంటే ముందు నేను పెళ్ళి చేసుకుని, భార్యా పిల్లలు వచ్చాక, వారిమీద వైరాగ్యం పెంచుకోవాలి,' అన్నాడుట. అది కాదు దాని అర్థం. గృహస్థులు బంధాల్లో ఉండాలి, కాని బంధాల్లో కూరుకుపోకూడదు. అంటే మమకారం ఉండవచ్చు కాని, దానితో తాదాత్మ్యం చెందకూడదు.

మమకారానికీ, తాదాత్మ్యానికీ మధ్య భేదం తెలుసుకోవటం ఎలా? థర్మామీటర్‌లాగా దాన్ని తెలుసుకునేందుకు ఏదైనా పరికరం ఉందా? దీనికి అద్భుతమైన మార్గాన్ని సూచిస్తున్నారు ఆనందగిరి. శంకరచార్యులవారి భాష్యానికి ఉపభాష్యం రాశారు ఆనందగిరి. ఆయన బంధాన్ని మమకారం అనీ, తీవ్రమైన బంధాన్ని తాదాత్మ్యమనీ అభివర్ణించారు.

మమకారం అంటే ఒక వ్యక్తిని నావారు అనుకోవటం లేదా ఒక వస్తువును నా వస్తువు అనుకోవటం. ఎవరో వివాహాన్ని రెండు మాటల్లో విశ్లేషించారు, 'మేరామేరీ, మారామారి.' మేరామేరి అంటే నీకు నేను, నాకు నువ్వు. ఆ మమకారంతో వివాహంలోకి అడుగుపెడతారు. తర్వాత మొదలవుతుంది మారామారి; మన భాషలో చెప్పాలంటే, హోరాహోరి యుద్ధం మొదలవుతుంది. మమకారంలోని మమ అంటే నాది, నావారు.

నాది, నావారు అనుకునేవేవీ మనతో శాశ్వతంగా నిలవవు. కేవలం మమకారం ఉంటే ఈ విషయం మర్చిపోము. మనం ప్రేమించే వస్తువులు మనతో శాశ్వతంగా ఉండవు; అలాగే నావారు అనుకునేవారు ఎప్పుడో ఒకప్పుడు మన కళ్ళముందునుంచో, ఈ లోకంనుంచో వెళ్ళిపోవచ్చు. కాని మనం ఉంటాము, మనం ముందుకు సాగాలి. అందువల్ల వారు ఉన్నా, లేకపోయినా ఈ జీవితగమనం కొనసాగక తప్పదు. ఇది గ్రహిస్తే మనకు మితిమీరిన మమకారం లేదని అర్థం.

మనం ప్రేమించిన వ్యక్తి మననుంచి దూరమైతే, ఇంక మన జీవితం స్థంభించి పోయిందనుకోవటం తాదాత్మ్యము. ఎందుకంటే ఎవరి జీవితం వారిదే. ఎవరి జీవితానికున్న ప్రత్యేకత వారికి ఉంది. మనం ఈ భూమ్మీదకు ఒక లక్ష్యం నిర్దేశింపబడి వచ్చాము. ఆ విషయం తెలుసుకుని ఆధ్యాత్మికంగా ఎదగాలి. ఈ భూమ్మీదకు ఒంటరిగా వచ్చాము, ఒంటరిగా వెళతాము. ఎవరితోనూ కలిసిరాలేదు; ఎవరితోనూ కలిసి వెళ్ళలేము. చిన్మయానందస్వామి ఈ విషయాన్ని అమోఘంగా చెబుతారు, 'ఎలోన్ టు ఎలోన్ ఆల్ ఎలోన్.' ఒంటరిగా వచ్చి, ఒంటరిగా వెళ్ళే మన జీవనపయనం ఒంటరిగా సాగాలి.

మనం ఈ భూమ్మీదకు వచ్చింది ఆధ్యాత్మికంగా ఎదగటానికి. ఆ ఆధ్యాత్మిక ఎదుగుదలకు తోడ్పడటానికి మన జీవితంలో కొందరిని కలుపుతాడు భగవంతుడు; వారి అవసరం మనకు తీరింది అనుకోగానే, వారిని తీసుకెళ్ళిపోతాడు. వారు మనకు ఎంతమేరకు తోడ్పడాలో అంతమేరకు తోడ్పడతారు. దాని తర్వాత మనం ఆగకుండా ముందుకు సాగాలి.

జీవితం ఒక రైలుప్రయాణంలాంటిది. మనం మొదటి స్టేషనులో రైలు ఎక్కి, చివర్లో దిగుతాము. మధ్యలో అనేక స్టేషన్లలో రైలు ఆగుతుంది. ఎవరో మధ్యలో ఎక్కుతారు, మధ్యలోనే దిగిపోతారు. ఆ ఉన్న కాసేపట్లో మనకు పరిచయం అవుతారు; అవసరమైతే కష్టసుఖాలు కూడా పంచుకుంటాము; ఎంతో ఆత్మీయంగా మాట్లాడుకుంటాము, కాని అంతవరకే. వారి గమ్యం వస్తే వారు దిగిపోతారు. మనకోసం ఆగరు. జీవితం కూడా అంతే. ఈ భూమ్మీద మన జీవనం ఒక రైలుపెట్టెలో ప్రయాణం లాంటిది. ఎందరో అతిసన్నిహితంగా వస్తారు; విడదీయరాని బంధం ఏర్పడినట్టే ఉంటుంది; ఎప్పుడో ఆశించని విధంగా ఆ బంధం విడిపోతుంది.

ఆ బంధం విడిపోయినా, మనం ముందుకు సాగకతప్పదు. ఇక్కడ మనను మనం బేరీజు వేసుకోవాలి. ఆ వ్యక్తి లేకపోతే జీవితం శూన్యం అనిపించినా, అసలు నేను ఇంక బ్రతకలేను, విషం తాగి చచ్చిపోతాను అనిపించినా అది తీవ్రమైన బంధం అంటే తాదాత్మ్యం అవుతుంది. కాని వారు ఉన్నా, లేకపోయినా, నా ఒంటరి ప్రయాణం కొనసాగక తప్పదని అర్థం చేసుకోగలిగితే అది హద్దులో ఉన్న మమకారం అవుతుంది.

కృష్ణపరమాత్మ, మన వారు దూరమైనా, మరణించినా, వారికోసం ఏడవవద్దు అనటం లేదు. ఏడవవచ్చు, తప్పేంలేదు. కాని వారి మరణంతో మన జీవితం స్థంభించిపోయింది అనుకోకూడదు. అంటే మమకారం ఉండవచ్చు తప్పులేదు కాని దానితో తాదాత్మ్యం చెందకూడదు. అంటే భార్యాపిల్లలు, గృహంలాంటి వాటిమీద తీవ్రంగా తాదాత్మ్యం చెందకూడదు.

**పద్నాలుగవ విలువ పుత్రదారగృహాదిషు అనభిష్వంగః.**

15. **నిత్యం సమచిత్తత్వం చ ఇష్టానిష్టోపపత్తిషు** – ఎటువంటి పరిస్థితి ఎదురైనా కూడా సమత్వం పాటించాలి. ఇది కర్మయోగంయొక్క సారం.

> **యోగస్థః కురు కర్మాణి సంగం త్యక్త్వా ధనంజయ ।**
> **సిద్ధ్యసిద్ధ్యోః సమో భూత్వా సమత్వం యోగ ఉచ్యతే ॥** – 2.48

ఈ సమత్వభావననే యోగం అంటారు. అదే ఇక్కడ మళ్ళీ చెబుతున్నాడు కృష్ణపరమాత్మ. ఇక్కడ సమత్వం బదులు సమచిత్తత్వం అంటున్నాడు. ఎందులో ఉండాలి సమభావన?

**ఇష్ట** అంటే ఇష్టమైన పరిస్థితుల్లో; **అనిష్ట** అంటే ఇష్టం లేని పరిస్థితుల్లో కూడా. **ఉపపత్తి** అంటే ప్రాప్తి అంటే వచ్చినప్పుడు. ఇష్టమైన పరిస్థితి వచ్చినా, ఇష్టంలేని పరిస్థితి వచ్చినా, ఎలా ఉండాలి? **సమచిత్తత్వమ్** – సమభావనతో ఉండాలి. అంటే పొంగిపోకూడదు, కృంగిపోకూడదు. ఇష్టమైనది జరిగినప్పుడు ఆకాశంలోకి ఎగరకూడదు; ఆశించినది జరగనప్పుడు పాతాళంలోకి కృంగిపోకూడదు. ఎందుకు? **ఈవెన్ దిస్ విల్ పాస్ ఎవే** అంటారు. ఈ సంఘటన కూడా వెళ్ళిపోతుంది. మనను ఆకాశం అంచులదాకా తీసుకెళ్ళిన ఆనందకర సంఘటనా వెళ్ళిపోతుంది; అగాధం లోతులదాకా తీసుకువెళ్ళిన దుఃఖపూరితమైన సంఘటనా వెళ్ళిపోతుంది. ఏదీ శాశ్వతంగా ఉండదు. శనిదశ కూడా కొన్ని సంవత్సరాలు మాత్రమే ఉంటుంది.

ఎటువంటి క్లిష్టపరిస్థితిని కూడా మనం ఒక ఏడాది, రెండేళ్ళపాటు ఓపికతో భరించగలిగితే, దానికి తేలికగా అలవాటుపడిపోతాము. గతుకుల రోడ్డుమీద వెళ్ళాల్సి వచ్చినప్పుడు మొదట్లో అవస్థ పడతాము, తర్వాత వాటికి అలవాటుపడిపోతాము. ఇంకా చెప్పాలంటే, హఠాత్తుగా ఆ రోడ్లను బాగుచేస్తే మనకు ఇబ్బందిగా ఉంటుందేమో కూడా. అలాగే ఎటువంటి పరిస్థితి వచ్చినా సమభావన కలిగివుండగలగాలి. అసలు ఏమీ స్పందించవద్దని చెప్పటంలేదు. మనస్సు అనేది సున్నితమైనది, అది బండరాయి కాదు, యంత్రం అసలే కాదు. అందువల్ల దానికున్న సహజగుణం స్పందించటం; కాకపోతే ఆ స్పందన మితిమీరి ఉండకూడదు. హద్దుల్లో ఉండాలి. అదెలాగో కృష్ణపరమాత్మ ఇక్కడ చెప్పడు కాని, కర్మయోగంలో చెప్పినది మనం గుర్తు తెచ్చుకోవాలి.

అసలు ఇష్టాయిష్ట పరిస్థితుల్లో సమచిత్తం ఉండాలని కృష్ణపరమాత్మ చెబుతున్నాడు అంటేనే దానిలో ఉన్న గూఢార్థం సుస్పష్టమవుతున్నది. ఏమిటది? ఎవరైనా సరే ఇష్టమైన పరిస్థితులనూ, అయిష్టమైన పరిస్థితులనూ ఎదుర్కోకతప్పదు. ఏ శాస్త్రం కూడా అన్ని పరిస్థితులనూ మనకు అనుకూలంగా ఎలా మలచుకోవాలో చెప్పదు. శాస్త్రం ప్రాయశ్చితకర్మలను చెప్పినా కూడా, అవి కూడా క్లిష్టపరిస్థితులను కొంతమేరకు మాత్రమే సానుకూలం

చెయ్యగలవు కాని, పూర్తిగా అనుకూల పరిస్థితులుగా మార్చలేవు. ఎవరి జీవితం కూడా నూటికి నూరుపాళ్ళు సాఫీగా సాగిపోదు; ఒడిదుడుకులు ఎదురవుతూనే ఉంటాయి.

ఈ విషయం అర్థమవటానికే మనకు అన్ని పురాణగాథలు ఉన్నాయి. ధర్మానికి మారుపేరైన ధర్మరాజు అష్టకష్టాలు పడ్డాడు; సత్యహరిశ్చంద్రుదనిగా పేరుపొందిన హరిశ్చంద్రుడు ఎన్నో బాధలను ఎదుర్కొన్నాడు. అవతారాలుగా కిందికి దిగివచ్చిన రాముడు, కృష్ణుడు కూడా జీవితంలోని ఆటుపోట్లను ఎదుర్కొన్నారు. అవతారాలకే తప్పనప్పుడు మానవమాత్రులమైన మనమెంత!

**అవశ్యంభావిభావానాం ప్రతీకారో భవేద్ యది।**

**తదా దుఃఖైర్న లిప్యేరన్ నలరామయుధిష్ఠరాః॥**

జీవితంలో ఎదురయ్యే సమస్యలన్నిటికీ పరిష్కారం ఉండి ఉంటే, నలమహారాజు అవస్థపడి ఉండేవాడు కాదు; రాముడు బాధపడి ఉండేవాడు కాదు; యుధిష్ఠిరుడు కష్టాలుపడి ఉండేవాడు కాదు. అలాంటి గొప్పవారు కూడా అవస్థపడ్డారు అంటేనే, దాని అర్థం జీవితం అనేది సుఖదుఃఖాల మేలుకలయిక అని.

భగవంతుడు జీవితాన్ని ఎందుకు సుఖదుఃఖాల మేలుకలయిక చెయ్యాలి? ఎందుకంటే భగవంతుడూ, శాస్త్రమూ చెప్పేది ఒక్కటే. ఆధ్యాత్మిక ఎదుగుదల పొందాలంటే కష్టాలు ఉండాలి. నిజానికి కష్టం వచ్చినప్పుడే ఆధ్యాత్మిక ఎదుగుదల ఎక్కువవుతుంది కూడా. ఎందుకంటే కష్టం వచ్చినప్పుడే మనకు భగవంతుడు గుర్తుకు వస్తాడు. అందువల్ల ద్వంద్వాలు జీవితంలో ఉండి తీరుతాయి. కాని వేదాంతం మనమీ ద్వంద్వాలకు అతీతంగా ఎలా ఎదగాలో నేర్పిస్తుంది.

ద్వంద్వాలకు అతీతంగా ఎలా ఎదగాలి? దానికి రెండు మార్గాలున్నాయి. అవి కర్మయోగం, జ్ఞానయోగం. కర్మయోగం ఫస్ట్ఎయిడ్‌లాంటిదైతే, జ్ఞానయోగం అంతిమవైద్యం. ఎవరికైనా రోడ్డు ప్రమాదం జరిగితే, అతనికి అక్కడే, అప్పుడే ఫస్ట్ఎయిడ్ ఇవ్వాలి. ధారగా రక్తం కారిపోతుంటే దాన్ని ఆపాలి. అక్కడ ఫస్ట్ఎయిడ్ ఇచ్చాము కదా అని అక్కడే ఆగిపోకూడదు; వెంటనే ఆసుపత్రికి తీసుకెళ్ళి తదనుగుణమైన వైద్యం చేయించాలి. అలాగని, ఎలాగూ ఆసుపత్రికి తీసుకెళతాము కదా అని, ఫస్ట్ఎయిడ్ మానకూడదు. రెండూ ముఖ్యమే.

అదేవిధంగా కర్మయోగం ఫస్ట్ఎయిడ్ లాంటిది. అది తాత్కాలికంగా ఉపశమనం ఇస్తుంది. కాని శాశ్వతమైన శాంతి కావాలంటే జ్ఞానయోగానికి వచ్చి తీరాలి. కర్మయోగం అంటే ఏమిటో చాలా వివరంగా మూడవ అధ్యాయంలో చూశాము. ఒక్కమాటలో చెప్పాలంటే –

**కర్మయోగం = ఈశ్వరార్పణబుద్ధి + ఈశ్వరప్రసాదబుద్ధి**

ఏ పనిచేసినా ఈశ్వరునికి అంకితం చేస్తున్నామనే అంకితభావంతో చెయ్యాలి. ఆ పనికి ఏ ఫలం వచ్చినా, అది సాక్షాత్తూ భగవంతునినుంచే వచ్చిందనే ప్రసాదబుద్ధితో స్వీకరించాలి. అలా స్వీకరించగలిగితే సమత్వం వస్తుంది. ఈ సమత్వాన్ని ఎప్పుడు పాటించాలి?

**నిత్యమ్** – ఎప్పుడూ పాటించాలి. గాఢనిద్రలో ఏ అనుభవమూ ఉండదు కాబట్టి అప్పుడు దాని గురించి ఆలోచించనవసరం లేదు; కాని జాగ్రదావస్థలో సమచిత్తత్వం పాటించాలి. ఇష్టాయిష్టవస్తుప్రాప్తిలో సమత్వం పాటించాలి.

**పదిహేనవ విలువ నిత్యం సమచిత్తత్వమ్ చ ఇష్టానిష్టోపపత్తిషు.**

శ్లో. 11 **మయి చానన్యయోగేన భక్తిరవ్యభిచారిణీ ।**
**వివిక్తదేశసేవిత్వమ్ అరతిర్జనసంసది ॥**
మయి, చ, అనన్యయోగేన, భక్తిః, అవ్యభిచారిణీ,
వివిక్తదేశసేవిత్వమ్, అరతిః, జనసంసది ॥

| | | | |
|---|---|---|---|
| మయి | = పరమాత్మనైన నాయందు | వివిక్తదేశసేవిత్వమ్ | = ఏకాంతమైన పవిత్ర ప్రదేశమునందు నివసించుట |
| అనన్యయోగేన | = అనన్యయోగముద్వారా అంటే అంతా భగవంతుడే అని భావించుటద్వారా | జనసంసది | = విషయాసక్తులైన మనుష్య సముదాయమునందు |
| అవ్యభిచారిణీ, భక్తిః | = దృఢమైన నిశ్చలభక్తి | | |
| చ | = ఇంకా | అరతిః | = ఆసక్తి లేకుండుట |

**మయి చ అనన్య-యోగేన అవ్యభిచారిణీ భక్తిః,**
**వివిక్త-దేశ-సేవిత్వమ్, జన-సంసది అరతిః ॥**

తా: పరమాత్మనైన నాయందు అనన్యయోగముద్వారా అంటే అంతా భగవంతుడే అని భావించుటద్వారా దృఢమైన నిశ్చలభక్తి ఇంకా ఏకాంతమైన పవిత్ర ప్రదేశమునందు నివసించుట, విషయాసక్తులైన మనుష్య సముదాయమునందు ఆసక్తి లేకుండుట.

ముందు శ్లోకంలో కృష్ణపరమాత్మ సమత్వం పాటించాలని చెప్పాడు కాని ఎలా పాటించాలో చెప్పలేదు. అది మనం మూడవ అధ్యాయంలోంచి ఇక్కడకు తెచ్చుకున్నాము. కర్మఫలాన్ని ప్రసాదభావనతో స్వీకరించాలి. ప్రసాదభావన అంటే సాక్షాత్తూ భగవంతునినుంచి వచ్చిన కానుకగా స్వీకరించాలి.

దాన్ని ఎందుకు ప్రసాదం అంటారు? ఈ కారణం ఇంతకుముందు కూడా చూశాము. ప్రసాదః అంటే ప్రశాంతచిత్తం అని అర్థం. ఏది వచ్చినా అది భగవంతునినుంచి వచ్చిన కానుకగా భావిస్తే, అది ప్రశాంత చిత్తాన్ని ఇస్తుంది. అందువల్ల ఆ వచ్చినదాన్ని ప్రసాదం అంటారు.

అందువల్ల ప్రతిదాన్నీ భగవంతుని ప్రసాదంగా స్వీకరించాలి. అలా స్వీకరించగలగాలంటే భగవంతుని మీద భక్తి ఉండాలి. అందువల్లనే దయానందస్వామీజీ పదేపదే చెబుతారు, 'కర్మయోగానికి భిన్నంగా భక్తియోగం లేదు, భక్తియోగానికి భిన్నంగా కర్మయోగం లేదు.' అందువల్ల నాస్తికుణ్ణి కర్మయోగి అనలేము.

కర్మయోగంలో భగవంతునిమీద భక్తి ఉండితీరాలి. కాని కర్మయోగికి భగవంతునియొక్క నిర్గుణతత్త్వం గురించి తెలియదు. తెలిస్తే అతను జ్ఞాని అవుతాడు. పన్నెండవ అధ్యాయంలో భక్తియోగం గురించి చూసినప్పుడు ఐదుదశల భక్తిగా చూశాము. దాన్నే మూడు దశల్లో చెప్పాలంటే -

**కర్మయోగము + ఉపాసనయోగము + జ్ఞానయోగము = భక్తియోగము**

అందువల్ల ఈ మూడింటిలో ఏది పాటించినా భక్తి ఉండాలి.

16. **అనన్యయోగభక్తి - మయిభక్తిః** - నామీద భక్తి అంటున్నాడు కృష్ణపరమాత్మ. నామీద అంటే అక్షరాలా కృష్ణపరమాత్మ మాత్రమే కాదు. పరమాత్మ అని అర్థం తీసుకోవాలి.

**యో యో యాం యాం తనుం భక్తః శ్రద్ధయార్చితుమిచ్ఛతి ।**
**తస్య తస్యాచలాం శ్రద్ధాం తామేవ విదధామ్యహమ్ ॥** - 7.21

కృష్ణపరమాత్మే స్వయంగా చెప్పాడు, భగవంతునికి ఒకరూపం ఉండదు, మీరు ఏ రూపంలో కొలిచినా పలుకుతాడు. అందువల్ల నన్ను కొలవండి అంటే కృష్ణుడు మాత్రమే మోక్షాన్ని ఇస్తాడు, రాముడు, గణపతి ఇవ్వరని అర్థం తీసుకోకూడదు. అలాగే భక్తి చూపించండి అని కృష్ణపరమాత్మ చెపితే అది ఎటువంటి భక్తి? కృష్ణపరమాత్మ నాలుగురకాల భక్తిని గురించి చెప్పాడు ఏడవ అధ్యాయంలో. అవి ఆర్తభక్తి, అర్థార్థీభక్తి, జిజ్ఞాసుభక్తి, జ్ఞానీభక్తి. వీటిలో ఏ భక్తి ఉండాలి?

ఖచ్చితంగా జ్ఞానీభక్తి అయితే కాదు, ఎందుకంటే ఇప్పుడు కృష్ణపరమాత్మ చెప్పుకొస్తున్న విలువలు జ్ఞానయోగ్యతా ప్రాప్తికి చెందినవి. ఈ విలువలను జ్ఞానం అన్నాడు, కాని దాని అర్థం అవి జ్ఞానం పొందటానికి తోడ్పడేవి అని. **జ్ఞానసహాయక గుణః.** కాబట్టి ఈ విలువలను పాటించాల్సింది జ్ఞాని కాదు అజ్ఞాని. ఇకపోతే మిగిలింది ఆర్తభక్తి, అర్థార్థీభక్తి, జిజ్ఞాసుభక్తి.

ఆర్తభక్తి, అర్థార్థీభక్తిలో కూడా సాధకుడు జ్ఞానం వైపు మొగ్గుచూపడు. ఆ పేర్లలోనే ఉన్నాయి వారి భక్తి దేనిమీద ఉందో. ఆర్తభక్తిలో భక్తునికి ఏదైనా ప్రమాదం ముంచుకువస్తేనే భక్తి ముంచుకువస్తుంది. కాబట్టి అతను కోరేది జ్ఞానం, తద్వారా మోక్షం కాదు; అతను కోరేది ప్రస్తుత సమస్యనుంచి మోక్షం. అలా సమస్యను గురించే ఆలోచించేవ్యక్తి, వేదాంతానికి వచ్చినా సరిగ్గా అధ్యయనం చెయ్యలేడు. లౌకిక సమస్యలు చుట్టుముట్టితే, ఆధ్యాత్మిక చింతనకు చోటేది?

అర్థార్థీభక్తిలో ధనంకోసం పరుగులు తీస్తాడు భక్తుడు. అతనికి భగవంతుడు సాధ్యం కాదు, సాధన. భగవంతునిద్వారా తనకు కావాల్సిన సాధ్యాలను అంటే డబ్బు, పదవి, హోదా పొందటానికి ప్రయత్నిస్తాడు. కాబట్టి ఈ భక్తి కూడా కాదు. ఉన్న నాలుగింటిలో మూడు తీసేస్తే మిగిలింది జిజ్ఞాసుభక్తి. దాన్ని పారిశేష్యన్యాయం అంటారు.

జిజ్ఞాసుభక్తిలో భక్తుడు భగవంతుణ్ణి సాధనగా కాదు, సాధ్యంగా చూస్తాడు. అలా చూడగలగాలంటే దానికి మానసిక పరిపక్వత కావాలి. దానికి వివేక, వైరాగ్యాలు ఉండాలి. ఈ ప్రపంచంలో ఏదీ శాశ్వతం కాదని తెలుసుకోగలగాలి. దాన్ని నిత్యానిత్యవస్తువివేకం అంటారు. ఆ వివేకంనుంచి వైరాగ్యం పుడుతుంది. ప్రపంచంమీద ఆధారపడే స్థాయినుంచి భగవంతునిమీద ఆధారపడే స్థాయికి ఎదుగుతారు. దాన్ని వైరాగ్యం అంటారు.

**అవ్యభిచారిణీ భక్తిః** – ఇలా భగవంతునిమీద ఆధారపడే భక్తిని అవ్యభిచారిణీభక్తి అంటున్నాడు కృష్ణపరమాత్మ. భగవంతునిమీద పూర్తి నమ్మకం.

**అనన్యయోగేన** – చెక్కుచెదరని ఏకాగ్రతతో పూజించటం. లౌకిక వ్యవహారాలలో మునిగితేలుతున్నా, బాధ్యతలు చుట్టుముట్టినా, మీ అంతిమలక్ష్యం ఏమిటో మర్చిపోకూడదు. మీ అంతిమలక్ష్యం పూర్ణత్వప్రాప్తి. తరచు ఈ ప్రశ్న అందరికీ కలుగుతూ ఉంటుంది. నా అంతిమలక్ష్యం ఏమిటి? మీ అంతిమలక్ష్యం పూర్ణత్వప్రాప్తి అని గ్రహించి, ఆ పూర్ణత్వం పొందేదాకా శ్రమిస్తూనే ఉండాలి. దాన్ని తరచు గుర్తు చేసుకోవటాన్ని అనన్యయోగభక్తి అంటారు. అది చాలా ముఖ్యం.

**పదహారవ విలువ అనన్యయోగభక్తి.**

17. **వివిక్తదేశసేవిత్వమ్** – ఏకాంతమైన ప్రదేశంలో ఉండటం కూడా ఒక ముఖ్యమైన విలువ అంటున్నాడు కృష్ణపరమాత్మ.

అప్పుడప్పుడూ ఒంటరిగా ఎక్కడికైనా వెళ్ళాలి. స్నేహితునితో వెళ్ళకూడదు. స్నేహితునితో వెళితే అది ఏకాంతం అవదు. చివరికి మీతో వాక్‌మాన్‌ని కూడా తీసుకెళ్ళకూడదు. మిమ్మల్ని మీరు ఆత్మపరీక్ష చేసుకునేందుకు ఒంటరితనం కోరుకోవాలి. ఎదుటివారిని ఎదుర్కోవటం మాత్రమే కాదు, మిమ్మల్ని మీరు ఎదుర్కోగలరో లేదో కూడా చూసుకోవాలి. ఈ ఆత్మవిమర్శ చేసుకోవాలంటే ఏకాంతం కావాలి.

ఏకాంతం మిమ్మల్ని మీకు పరిచయం చేస్తుంది. ఆమాటకొస్తే, నిజానికి సంసారంయొక్క ప్రాథమిక సమస్యను కూడా పరిచయం చేస్తుంది. మామూలుగా ఆ సమస్యను విశ్లేషించకుండా, సమస్యనుంచి పారిపోవటానికి ప్రయత్నిస్తారు. పైగా ఈ ఆధునికయుగంలో సమస్యనుంచి తప్పించుకోవటానికి అనేక ప్రలోభాలు ఉన్నాయి. వాటిల్లో పడిపోతే, అంతకంతకూ సమస్యకు దూరమైపోతారు. సమస్య ఏమిటో కూర్చుని విశ్లేషిస్తేనే కదా, దానికి పరిష్కారం దొరికేది? ఏకాంతం మీరు మిమ్మల్నీ, మీ సమస్యలనూ తెలుసుకోవటానికి తోడ్పడుతుంది.

సంసారాన్ని అనేకరకాలుగా నిర్వచించవచ్చు. సంసారం అంటే ఆందోళన, భయం, అభద్రతాభావన – అలా ఏదైనా చెప్పవచ్చు. వాటిల్లో ఒకటి ఒంటరితనం. ప్రతి ఒక్కరి జీవితంలోనూ ఈ ఒంటరితనం ఎప్పుడో ఒకప్పుడు పట్టి కుదిపివేస్తుంది. అది కొందరికి త్వరగా వస్తే, మరికొందరికి వృద్ధాప్యంలో వస్తుంది. పిల్లలు ఎదిగినకొద్దీ రెక్కలొచ్చిన పక్షుల్లా దూరతీరాలకు ఎగిరివెళ్ళిపోతారు. చదువుకోసం అబ్బాయి వెళ్ళిపోతే, పెళ్ళి

చేసుకుని అత్తారింటికి వెళ్ళిపోతుంది అమ్మాయి. ఇది నడివయస్సులో కలిగే బాధ. వృద్ధాప్యంలో ఒకరొకరూ దూరమవుతూ వస్తారు. నోరారా పలకరించే దిక్కు ఉండదు. ఆప్యాయంగా అక్కున చేర్చుకునేవారు కరువవుతారు. అలా ఎప్పుడో ఒకప్పుడు ఒంటరితనాన్ని ఎదుర్కోకతప్పదు.

ఆ ఒంటరితనాన్ని ఎలా ఎదుర్కోవాలి? ఆ సమస్య ఎదురైనప్పుడు నేర్చుకుంటానంటే, ఇల్లు కాలినప్పుడు నీరుకోసం బావి తవ్వినట్టు ఉంటుంది. అందువల్ల ఇప్పుడే, నలుగురూ చుట్టుముట్టినప్పుడే, ఆప్యాయతలు పొందుతున్నప్పుడే, ఏకాంతాన్ని అనుభవించటం నేర్చుకోవాలి. మీరు కోరి వెతుక్కుంటూ వెళితే దాన్ని ఏకాంతం అంటారు; మిమ్మల్ని వారు వదిలేసి వెళితే దాన్ని ఒంటరితనం అంటారు.

అందువల్ల ఈ ఏకాంతాన్ని ఆస్వాదించటం ఇప్పటినుంచే నేర్చుకోండి. మీరు ఒక్కరే ఏ సముద్రపుటొడ్డుకో నడుచుకుంటూ వెళ్ళండి. ఇప్పటి ఏకాంతం, వృద్ధాప్యపు ఒంటరితనాన్ని అలవాటు చేస్తుంది. వృద్ధాప్యంలో ఏదైనా చెయ్యాలంటే శరీరం సహకరించదు. ఎవరైనా మిమ్మల్ని దగ్గరుండి తీసుకెళ్ళాలంటే వారికి తీరిక ఉండదు. వారికి మాట్లాడే తీరికే ఉండదు, ఇంక బయటకు తీసుకువెళ్ళే ప్రసక్తి ఎక్కడ? పైగా వృద్ధాప్యం పైబడ్డాక, మీకు తెలియకుండానే మీకు చాదస్తం వచ్చేస్తుంది. ఎవరైనా పలకరించటం పాపం, కామాలూ, ఫుల్‌స్టాప్‌లు లేకుండా అనర్గళంగా మాట్లాడటం మొదలుపెడతారు. వారు మీనుంచి పారిపోలేక, ఎక్కువసేపు ఉండలేక, నిస్సహాయంగా గడియారం వైపు చూస్తూ, వింటున్నట్టు నటిస్తూ, కాలక్షేపం చేస్తారు. అందువల్ల ముందే జాగ్రత్తపడి, మీ దరిదాపుల్లోకి రాకుండా పారిపోతారు మరికొందరు. ఇదంతా మిమ్మల్ని భయపెట్టటానికి వర్ణించటంలేదు. ఇది ప్రతిఒక్కరూ ఎప్పుడో ఒకప్పుడు ఎదుర్కొని తీరాల్సిన నగ్నసత్యం.

ఇటువంటి సమస్యను తప్పించుకోవాలంటే, ఇప్పటినుంచే సాధన చెయ్యాలి. అప్పుడప్పుడూ ఏకాంతాన్ని వరించాలి. ఎప్పుడూ ఏకాంతంగా ఉండిపోనవసరం లేదు; ఎప్పుడైనా ఏకాంతాన్ని వెతుక్కుంటూ వెళ్ళాలి. అప్పుడు ఒంటరితనాన్ని రెండుచేతులా ఆహ్వానించగలుగుతారు. అంతేకాదు, అది వేదాంత నిదిధ్యాసనకు కూడా తోడ్పడుతుంది.

వివిక్తదేశసేవిత్వమ్ అన్నాడు కృష్ణపరమాత్మ. వివిక్తదేశ అంటే ఏకాంతప్రదేశం; సేవిత్వమ్ అంటే తరచు వెళ్ళటం. బయటకు వెళ్ళలేకపోతే కనీసం మీ మేడమీదకు వెళ్ళండి. అసలు మీ డాబామీదకు మీరు ఎప్పుడైనా ఒంటరిగా వెళ్ళారా? ఒంటరిగా వెళ్ళి, అక్కడనుంచి ప్రకృతి అందాలను ఆస్వాదించండి.

**పదిహేడవ విలువ వివిక్తదేశసేవిత్వం.**

18. **అరతిర్జనసంసది** – జనసమూహంనుంచి దూరంగా వెళ్ళండి అంటున్నాడు కృష్ణపరమాత్మ. అంటే మనుష్యులతో అసలు కలవకూడదా? మనుష్యులను ద్వేషించమనటం లేదు, కాని వారు మీకు వ్యసనంగా మారకూడదు. జనసంసది అంటే మీ బంధువులు, స్నేహితులతో మీ సందడి; అరతిః అంటే మైకంలో పడకపోవటం. మీ చుట్టూ మనుష్యులు ఉంటే మీరు మీ సమస్యలను తేలిగ్గా మర్చిపోగలరు. అందువల్ల ముందు అవసరం కొద్దీ నలుగురితో తిరగటం మొదలుపెడతారు. తర్వాత అది అలవాటుగా, ఇంకా మాట్లాడితే వ్యసనంగా మారుతుంది.

పూర్వం పల్లెటూర్లలో చీకటిపడితే బయటకు తిరగనిచ్చేవారు కాదు. ఇప్పుడు అర్ధరాత్రీ, అపరాత్రీ కూడా తిరుగుతూనే ఉన్నారు; వారిని ఆకర్షించటానికి ఫాస్ట్‌ఫుడ్స్, పిజ్జా కార్నర్‌లు తెరిచే ఉంటున్నాయి. దానివల్ల ఆనందం పొందుతారేమో కాని, మీకు మీరు అంతకంతకూ దూరమయిపోతున్నారు. అందువల్ల తోటివారితో సాంగత్యానికి బానిసలు కాకండి, తద్వారా మీనుంచి మీరు పారిపోకండి అని గట్టిగా హెచ్చరిస్తున్నాడు కృష్ణపరమాత్మ.

**పద్దెనిమిదవ విలువ అరతిర్జనసంసది.** నిజానికి ఈ రెండు విలువలను కలిపి ఒకటిగా తీసుకోవచ్చు.

శ్లో. 12 **అధ్యాత్మజ్ఞాననిత్యత్వం తత్త్వజ్ఞానార్థదర్శనమ్ ।**
**ఏతద్‌జ్ఞానమితి ప్రోక్తమ్ అజ్ఞానం యదతోఽన్యథా ॥**
అధ్యాత్మజ్ఞాననిత్యత్వమ్ తత్త్వజ్ఞానార్థదర్శనమ్,
ఏతత్, జ్ఞానమ్, ఇతి, ప్రోక్తమ్, అజ్ఞానమ్, యత్, అతః, అన్యథా ॥

| | | | |
|---|---|---|---|
| అధ్యాత్మ జ్ఞాన | = ఆధ్యాత్మిక జ్ఞానమునందు | జ్ఞానమ్ | = జ్ఞానము అంటే ఇక్కడ జ్ఞానప్రాప్తికి సాధనములు |
| నిత్యత్వమ్ | = నిత్యస్థితుడై యుండుట | అతః | = దీనికన్నా |
| తత్త్వజ్ఞానార్థ దర్శనమ్ | = తత్త్వజ్ఞానమును పొందితే కలిగే ఫలమేమిటో తెలుసుకొనుట | అన్యథా | = వేరుగా |
| | | యత్ | = ఏది ఉందో |
| ఏతత్ | = ఇదియంతయును - అమానిత్వము మొదలుకొని తత్త్వజ్ఞానార్థ దర్శనమువరకు గల దంతయును | (తత్) | = (అది) |
| | | అజ్ఞానమ్ | = అజ్ఞానము |
| | | ఇతి | = అని |
| | | ప్రోక్తమ్ | = చెప్పబడినది |

**అధ్యాత్మ-జ్ఞాన-నిత్యత్వమ్, తత్త్వ-జ్ఞాన-అర్థ-దర్శనమ్,**
**ఏతత్ జ్ఞానమ్ ఇతి ప్రోక్తమ్, యత్ అతః అన్యథా (తత్) అజ్ఞానమ్ (ఇతి ప్రోక్తమ్) ॥**

తా: ఆధ్యాత్మిక జ్ఞానమునందు నిత్యస్థితుడై యుండుట, తత్త్వజ్ఞానమును పొందితే కలిగే ఫలమేమిటో తెలుసుకొనుట, ఇదియంతయును -అమానిత్వము మొదలుకొని తత్త్వజ్ఞానార్థ దర్శనమువరకు గల దంతయును జ్ఞానము అంటే జ్ఞానప్రాప్తికి సాధనములు, దీనికన్నా వేరుగా ఏది ఉందో అది అజ్ఞానము అని చెప్పబడినది.

19. **తత్త్వజ్ఞానార్థదర్శనమ్** - తత్త్వజ్ఞానం పొందితే కలిగే ఫలమేమిటో తెలుసుకోవాలి అంటున్నాడు కృష్ణపరమాత్మ.

ఈ విలువలను ఎందుకు చెబుతున్నాడు కృష్ణపరమాత్మ? జ్ఞానయోగ్యతాప్రాప్తికోసం. జ్ఞానయోగ్యతాప్రాప్తి కలిగితే పొందే ఫలం ఏమిటి? జ్ఞానం పొందుతారు. జీమాట్, టోఫెల్ పరీక్షలకు ఎప్పుడు విలువను ఇస్తారు?

వాటివల్ల వచ్చే ఫలితాలకు విలువను ఇచ్చినప్పుడు. అంటే అమెరికాలోని యూనివర్సిటీలో సీటు రావాలంటే ఈ పరీక్షల్లో మంచి మార్కులు రావాలని తెలుసుకాబట్టి, వాటికి విలువను ఇస్తారు. పైగా, ఎంత గొప్ప యూనివర్సిటీలో రావాలనుకుంటే అంత ఎక్కువ మార్కులు రావాలని తెలుసు మీకు! దానికి తగ్గట్టుగా అంత ఎక్కువగా ఈ పరీక్షలకు విలువను ఇచ్చి, అంత ఎక్కువగా శ్రమపడతారు. అంటే సాధ్యానికి ఎంత ఎక్కువ విలువను ఇస్తే, సాధనకు అంత ఎక్కువ విలువను ఇస్తారు.

అంటే మీకు సాధ్యంమీద ఎంత మక్కువ ఉంటే, సాధనమీద అంత మక్కువ ఉంటుంది. జ్ఞానానికి ఎంత ఎక్కువ విలువను ఇస్తే, జ్ఞానయోగ్యతకు అంత ఎక్కువ విలువను ఇస్తారు. తత్త్వజ్ఞానం అంటే ఆత్మజ్ఞానం; అర్థ అంటే ప్రయోజనం. తత్త్వజ్ఞానార్థః అంటే ఆత్మజ్ఞానఫలం. జ్ఞానఫలం తెలియాలి. అది తెలియకపోతే, ఇంత కష్టపడి జ్ఞానం పొందడం ఎందుకు అనుకునే అవకాశం ఉంది. అందువల్ల కృష్ణపరమాత్మ సందర్భం వచ్చినప్పుడల్లా జ్ఞానఫలం చెబుతూనే ఉన్నాడు. స్థితప్రజ్ఞలక్షణాలు చెప్పినప్పుడు, పరాభక్తి లక్షణాలు చెప్పినప్పుడు చెప్పాడు.

అన్నింటిలోకి ముఖ్యమైన ప్రయోజనం ఏమిటి?

**ఆత్మన్యేవాత్మనాతుష్టః** – బాహ్యపరిస్థితులు ఎలా ఉన్నా కూడా ఆత్మలోనే రమిస్తాడు.

> **దుఃఖేష్వనుద్విగ్నమనాః సుఖేషు విగతస్పృహః ।**
> **వీతరాగభయక్రోధః స్థితధీర్మునిరుచ్యతే ॥** – 2.56

అనుకూల పరిస్థితులు ఎదురైనా, ప్రతికూల పరిస్థితులు ఎదురైనా చెక్కుచెదరదు జ్ఞాని. కొంతమందికి మనస్సు క్షణక్షణమూ మారిపోతుంటుంది. రోజూ వెళ్ళే గీతాబోధకు కూడా ఒకరోజు వెళ్ళాలనిపించదు. కాని జ్ఞానికి అలా మనస్సు మారదు. ఎటువంటి రాగద్వేషాలకు లోనుకాడు. దుఃఖం వస్తే కృంగిపోడు; సుఖం వస్తే పొంగిపోడు. ఇలా రాగద్వేషాల తాకిడికి చలించకుండా ఉండాలంటే దానికి మందు జ్ఞానం మాత్రమే. ఈ సత్యాన్ని మీరు ఎంత ఎక్కువగా జీర్ణించుకుంటే, అంత ఎక్కువగా విలువను ఇస్తారు జ్ఞానానికి. జ్ఞానానికి ఎంత ఎక్కువ విలువను ఇస్తే, జ్ఞానయోగ్యతకు అంత ఎక్కువ విలువను ఇస్తారు. అంటే మీ ప్రయాణం జ్ఞానయోగ్యతనుంచి జ్ఞానానికి, జ్ఞానంనుంచి జీవన్ముక్తికి సాగాలి.

అందువల్ల మీరు ఈ జ్ఞానఫలాన్ని తరచు గుర్తుచేసుకోవాలి. జ్ఞానం అంతర్గతస్వేచ్ఛను ఇస్తుంది. ఎవరెలా ప్రవర్తించినా బాధపడడు జ్ఞాని. ఎప్పుడైతే జ్ఞానానికి మీరు విలువను ఇస్తారో, అప్పుడే తక్కిన విలువలన్నిటికీ విలువను ఇస్తారు.

**పందొమ్మిదవ విలువ తత్త్వజ్ఞానార్థదర్శనం.**

20. **అధ్యాత్మజ్ఞాననిత్యత్వమ్** – అధ్యాత్మ అంటే ఆత్మ; జ్ఞానం అంటే ఇక్కడ విచారణ; అంటే ఆత్మజ్ఞానాన్ని విచారణద్వారా పొందాలి. విచారణ అంటే శ్రవణ, మనన, నిదిధ్యాసనలు చెయ్యాలి. దీన్నే మీమాంస అని కూడా అంటారు.

శ్రవణం అంటే క్రమం తప్పకుండా, ఒక క్రమపద్ధతిలో కొన్ని సంవత్సరాలపాటు ఒక సమర్థవంతమైన ఆచార్యుని వద్ద వేదాంతశాస్త్ర అధ్యయనం చెయ్యటం. క్రమం తప్పకుండా, ఒక క్రమపద్ధతిలో అని ఎందుకన్నామంటే, అది లేకపోతే ఇక్కడ కొన్ని, అక్కడ కొన్ని చెదురుమదురుగా భావాలను సేకరించుకొంటారు కొందరు.

ఈ ఉదాహరణను నాలుగవ అధ్యాయంలో కూడా చూశాము. మీరు ఒక లారీనిండా ఇటుకలు తెప్పించి, మీ ఇంటివెనుక వాటిని రాశిగా పోశారు. అలా రాశిగా పోస్తే, వాటివల్ల మీకేమీ ప్రయోజనం ఉండదు. దాని బదులు, ఆ ఇటుకలను ఒకదాని పక్కన ఒకటి చక్కగా పేర్చి, సిమెంటు పూస్తే అది ఒక అందమైన గదిలా రూపుదిద్దుకుటుంది. అందులో మీరు హాయిగా ఉండవచ్చు. రెండు సందర్భాలలోనూ ఇటుకలు ఉన్నాయి; ఒకచోట రాశిగా పోసివుంటే, ఇంకొకచోట గదిగా అమర్చబడ్డాయి.

అదేవిధంగా వేదాంతాన్ని ఒక క్లాసులో చెప్పే బోధలా నేర్చుకుంటే, ఒక క్రమపద్ధతిలో జ్ఞానంతో ఒక్కొక్క మెట్టూ ఎదుగుతూ వస్తారు.

**కర్మయోగము + ఉపాసనయోగము + జ్ఞానయోగము = మోక్షము**

ఈ సత్యాన్ని ఒక క్రమపద్ధతిలో నేర్చుకుంటారు. అటువంటి జ్ఞానం ఒక గదిలాగా మిమ్మల్ని సంరక్షిస్తుంది. దానిబదులుగా 1975లో ఒక రచయిత కర్మ గురించి చెప్పినది చదివి, 1982లో మరో రచయిత చెదురుమదురుగా చెప్పినవి చదివి, ఆ తర్వాత 1985లో జ్ఞానం గురించి అరకొరగా చదివితే, వాటికి ఒక సరైన ఆకారం ఉండదు. ఇవికాక కొంత జపం గురించి, మరికొంత భక్తి గురించి ఏవో వింటారు. ఇవన్నీ మీ మనస్సులో నిండివుంటాయి. ఎలా? ఇందాక చెప్పిన ఇటుకలరాశిలా. వాటివల్ల ఏమీ ప్రయోజనం ఉండదు. నిజంగా జ్ఞానం ప్రయోజనకరంగా ఉండాలంటే దాన్ని ఒక క్రమపద్ధతిలో నేర్చుకోవాలి. ఎవరు చెబుతున్నారు ఇది? సాక్షాత్తూ కృష్ణపరమాత్మే.

జ్ఞానం అంటే ఇక్కడ విచారణ అని చూశాము. శ్రవణం చెయ్యకుండా, స్వంతంగా విచారణ చేస్తే, సత్యం తెలియదు. అందువల్ల విచారణ అంటే వేదాంత శ్రవణ, మనన, నిదిధ్యాసనలు. నిజానికి శ్రవణం అంటేనే దానికి ఒక గురువు ఉండితీరాలని అర్థం. ఎలా చెప్పగలరు? శ్రవణం అంటే వినటం. మీరు వినాలంటే, ఎవరో ఏదైనా చెప్పాలి కదా! అందువల్ల శ్రవణం అంటే ఒక సమర్థవంతమైన గురువు దగ్గర వేదాంత అధ్యయనం చెయ్యాలని చెప్పకనే చెప్పినట్టవుతుంది.

ఈ విలువలు చెప్పుకొస్తున్నప్పుడు కృష్ణపరమాత్మ ఆరవ విలువగా ఆచార్య ఉపాసన గురించి చెప్పాడు. దీన్నిబట్టి మీరు గ్రహించాల్సిన విషయం ఏమిటి? గురువుకూ, శాస్త్రానికీ మధ్య అవినాభావ సంబంధం ఉంది. ఎవరైనా గురువు శాస్త్రప్రమేయం లేకుండా, తనకు తోచినట్టుగా బోధచేస్తే ఆయన దగ్గరకు వెళ్ళకపోవటమే ఉత్తమం. ఎందుకంటే ఆయన తన స్వంత అభిప్రాయాలను మీమీద రుద్దుతాడు. శ్రోత్రియ బ్రహ్మనిష్ఠ అయిన గురువు మాత్రమే గురువు. అంటే శాస్త్రాన్ని అధ్యయనం చేసి, ఆ నిష్ఠలో నిలబడగలిగిన వ్యక్తే గురువు.

శాస్త్రంనుంచి చెప్పని గురువు దగ్గరకు ఎలా వెళ్ళకూడదో, అలాగే గురువు లేకుండా స్వంతంగా శాస్త్రాన్ని అధ్యయనం కూడా చెయ్యకూడదు.

గురుస్తోత్రం గురువును వికసిస్తున్న తామరపువ్వును సూర్యుడని స్తుతిస్తుంది. గురువు దగ్గరకు వెళ్ళకుండా, స్వంతంగా నేర్చుకోవటానికి ప్రయత్నించే వ్యక్తికి శాస్త్రం ముడుచుకుపోయిన తామరపువ్వులా ఉంటుంది. గురువనే సూర్యుడు తన జ్ఞానకిరణాలను ప్రసరింపజేస్తే, శాస్త్రమనే తామరపువ్వు నెమ్మదిగా రేకులు విచ్చుకుంటుంది. అందువల్ల ఆచార్య ఉపాసన, ఆధ్యాత్మజ్ఞాననిత్యత్వం రెండింటినీ కలిపి శాస్త్రవిచారణగా తీసుకోవాలి.

తక్కిన విలువలన్నీ మనస్సును సంసిద్ధం చేస్తే, ఇవి జ్ఞానాన్ని కలుగజేస్తాయి. రెండూ ఉండాలి. ఇంకో సందర్భంలో శంకరాచార్యులు వీటిని పథ్యం, ఔషధం అన్నారు. చక్కెరవ్యాధి ఉన్న రోగి ఈ రెండింటినీ పాటించాలి. పథ్యం అంటే ఆహారనియమాలు పాటించటం, ఔషధం అంటే వైద్యుడు చెప్పిన మాత్రలు వేసుకోవటం. కేవలం ఆహారనియమాలు పాటించి, మాత్రలు వేసుకోకపోయినా లాభం లేదు. అలాగని కేవలం మాత్రలు వేసుకొని, కిలోలకొద్దీ తీపి తినుబండారాలు తిన్నా లాభంలేదు. అందువల్ల పథ్యం సహకారీ సాధన, ఔషధం సాక్షాత్ సాధన, అనారోగ్యాన్ని నయం చేస్తుంది కాబట్టి. అలాగే శాస్త్ర అధ్యయనం ఔషధం అయితే, తక్కిన విలువలు సహకారీ సాధనలు అవుతాయి. కేవలం విలువలు పాటించి, శాస్త్రఅధ్యయనం చెయ్యకపోతే ఔషధం తీసుకోనట్టు అవుతుంది. ఔషధం లేని పథ్యం పైత్యం కింద వస్తుంది.

అందువల్ల శాస్త్రఅధ్యయనం చాలా ముఖ్యమైనది. కాని దురదృష్టవశాత్తూ ఈ విలువకు విలువనివ్వటం లేదు నేడు. శాస్త్రాన్ని ఎంత ఎక్కువ అధ్యయనం చేస్తే, దాని ప్రత్యేకత అంత ఎక్కువగా తెలుస్తుంది మీకు. ఈ విలువలన్నింటినీ పాటిస్తే, మీరు వద్దనుకున్నా మీకు జ్ఞానం వచ్చితీరుతుంది.

**ఇరవయ్యోవ విలువ అధ్యాత్మజ్ఞాననిత్యత్వం.**

**ఏతత్‌జ్ఞానమితి ప్రోక్తమ్** – ఈ ఇరవై విలువలనూ, శాస్త్ర అధ్యయనంతో సహా, జ్ఞానం అంటారు.

**అజ్ఞానం యత్ అతః అన్యథా** – వీటికి భిన్నంగా ఉన్నవాటిని అన్నింటినీ అజ్ఞానం అంటారు అంటున్నాడు కృష్ణపరమాత్మ. ఉదాహరణకు ముందు చెప్పిన వాటిల్లో 'అ' తీసేస్తే వాటికి భిన్నంగా వస్తుంది. అంటే అమానిత్వం, అదంభిత్వం, అహింస, అనహంకారాలకు భిన్నంగా మానిత్వం, దంభిత్వం, హింస, అహంకారాలు పాటించకూడదు. ఇవన్నీ అజ్ఞానంలోకి వస్తాయి. అజ్ఞానంలో అంతకంతకూ మీరు కూరుకుపోయి, దానిలోంచి బయటకు రావటం ఇంకా ఇంకా కష్టమవుతుంది. వీటినే పదహారవ అధ్యాయంలో దైవీసంపత్తి, అసురీసంపత్తులుగా పేర్కొంటాడు కృష్ణపరమాత్మ.

శ్లో. 13 **జ్ఞేయం యత్తత్ ప్రవక్ష్యామి యద్ జ్ఞాత్వామృతమశ్నుతే ।**
**అనాదిమత్పరం బ్రహ్మ న సత్తన్నాసదుచ్యతే ॥**

జ్ఞేయమ్, యత్, తత్, ప్రవక్ష్యామి, యత్, జ్ఞాత్వా, అమృతమ్, అశ్నుతే,
అనాదిమత్, పరమ్, బ్రహ్మ, న, సత్, తత్, న, అసత్, ఉచ్యతే ॥

| | | | |
|---|---|---|---|
| యత్ | = ఏదైతే | తత్ | = ఆ పరమాత్మతత్త్వం |
| జ్ఞేయమ్ | = తెలిసికొనదగినదో | అనాదిమత్ | = సనాతనమైనది |
| యత్ | = దేనిని | పరమ్, బ్రహ్మ | = పరబ్రహ్మము |
| జ్ఞాత్వా | = తెలిసికొని జిజ్ఞాసువు | న, సత్ | = సత్తు కాదు |
| అమృతమ్ | = పరమానందమును | న, అసత్ | = అసత్తు కూడా కాదు సదసత్తులకు అతీతము |
| అశ్నుతే | = పొందునో | (ఇతి) ఉచ్యతే | = అని చెప్పబడును |
| తత్ | = దానిని | | |
| ప్రవక్ష్యామి | = చక్కగా తెల్పెదను | | |

**యత్ జ్ఞేయమ్, యత్ జ్ఞాత్వా (జీవః) అమృతమ్ అశ్నుతే, తత్ ప్రవక్ష్యామి ।**
**తత్ అనాదిమత్ పరమ్ బ్రహ్మ సత్ న, అసత్ (చ) న (ఇతి) ఉచ్యతే ॥**

తా: ఏదైతే తెలిసికొనదగినదో, దేనిని తెలిసికొని జిజ్ఞాసువు పరమానందమును పొందునో దానిని చక్కగా తెల్పెదను. అది అంటే ఆ పరమాత్మతత్త్వం సనాతనమైనది, పరబ్రహ్మము, సత్తు కాదు, అసత్తు కూడా కాదు. సదసత్తులకు అతీతము అని చెప్పబడును.

### 4. జ్ఞేయమ్: శ్లోకాలు 13-19

ఇంతకుముందు శ్లోకంతో జ్ఞానం అనే అంశం ముగిసింది. అర్జునుడు ఆరు అంశాల గురించి చెప్పమన్నాడు కృష్ణపరమాత్మను. అవి క్షేత్రం, క్షేత్రజ్ఞుడు, జ్ఞానం, జ్ఞేయం, ప్రకృతి, పురుషుడు. వాటిలో ఇప్పటిదాకా మూడు చెప్పాడు కృష్ణపరమాత్మ. అవి క్షేత్రం, క్షేత్రజ్ఞుడు, జ్ఞానం. ఇప్పుడు నాలుగవ అంశం అయిన జ్ఞేయం గురించి చెప్పబోతున్నాడు.

ఇంతకుముందే చూశాము. జ్ఞేయం, క్షేత్రజ్ఞుడు, పురుషుడు - మూడు పదాల అర్థం ఒకటే అని. చిన్న సూక్ష్మభేదాలు ఉన్నాయి అంతే. ఈ శ్లోకంలో జ్ఞేయం పదాన్ని పరిచయం చేస్తున్నాడు.

**యత్ తత్ ప్రవక్ష్యామి** - ఇప్పుడు నేను దేని గురించి అయితే అందరూ తెలుసుకోవాలో దాని గురించి చెబుతాను అంటున్నాడు కృష్ణపరమాత్మ. తక్కిన జ్ఞానాలన్నిటినీ నేర్చుకోవచ్చు లేదా మానవచ్చు. అది మీ ఇష్టం. ఆ జ్ఞానం లేకపోయినా పర్వాలేదు. నిజానికి ఆ జ్ఞానం లేకపోతేనే హాయిగా ఉండవచ్చు కూడా. అలా కొంతమందికి ఫిజిక్స్ తెలియదు, మరికొంతమందికి ఎకనామిక్స్ తెలియదు కాని వారి జీవితం హాయిగానే ఉంది. కాని ఇప్పుడు కృష్ణపరమాత్మ చెప్పబోయే విషయాన్ని మాత్రం అందరూ తెలుసుకుని తీరాలి. ఏం, ఎందుకని తెలుసుకుని తీరాలి?

**యత్ జ్ఞాత్వా అమృతమ్ అశ్నుతే** – ఈ జ్ఞానం పొందితే అమృతం పొందుతారు. ఈ జ్ఞానం ప్రతి ఒక్కరూ ఎదుర్కొనే ప్రాథమిక సమస్యకు పరిష్కారం చూపిస్తుంది.

ఏమిటా ప్రాథమిక సమస్య? అభద్రతా భావన. నిజానికి మృత్యుభయం మనిషికి ఈ భూమ్మీదకు వచ్చినప్పటినుంచీ ఉంటుంది. మనిషికే కాదు, జంతువులకు కూడా ఈ ప్రాణభయం వెన్నంటే ఉంటుంది. మనిషి ఏంచేసినా ఈ అభద్రతా భావనవల్లనే చేస్తాడు. ధనం పోగేసినా, అదనంగా ఇల్లు కొనుక్కున్నా, అనుబంధం పెంచుకున్నా, వాటివల్ల భద్రత వస్తుందనే ఆశతోనే. కొంతమంది – పిల్లలు వారికి భద్రతను ఇస్తారని ఆశిస్తారు. ఇప్పుడు చిన్నతనంలో వారిని సాకితే, పెద్దయ్యాక వారి నీడలో వీరు ఆశ్రయం పొందవచ్చు అనే ఆశతో జీవితం గడుపుతారు. ఇలా అభద్రతాభావన కాని, మృత్యుభయం కాని కబళించివేసేది ఏ ఒక్కరినో కాదు, అందరినీ సమానంగా కబళించివేస్తుంది. దానికి జాతి, కుల, మత, వర్ణభేదాలు లేవు. పైగా అది మనిషితో పాటు అంతకంతకూ పెరుగుతూ వస్తుంది.

హిందూపేపర్‌లో ఒక కథ వచ్చింది. ఒక వృద్ధురాలు రోజూ ప్రార్థన చేసేదిట, 'ఓ భగవంతుడా, నన్నెందుకు ఇంకా ఉంచావు? నా ఆయుష్షు తీసుకుని ఆ బాలికకు ఇవ్వు. ఆ అమ్మాయి ఇంకా జీవితంలోని తొలిమెట్టుమీదే ఉంది. ఇంకా ఎన్నోమెట్లు ఎక్కాలి. కాని ఆమెను అనారోగ్యం చుట్టివేసింది. రేపోమాపో అన్నట్టుగా ఉంది ఆమె జీవితం. ఇదేమి అన్యాయం స్వామీ? ముక్కుపచ్చలారని అమ్మాయి అలా అవస్థలు పడటం ఏమిటి? కాటికి కాళ్ళు చాచుకుని కూర్చున్న నన్ను ఇంకా ఉంచటం ఏమిటి?'

ఆమె రోజూ చేసే ఈ ప్రార్థనను విన్నట్టుగా, భగవంతుడు ఒకరోజు ఆమెను మృత్యువు కోరల్లోకి తీసుకువెళ్ళాడు. ఎద్దు గుద్దితే, మరణం అంచుదాకా వెళ్ళింది. అప్పుడామె చేసిన ప్రార్థన ఏమిటో తెలుసా? 'ఓ దేవా, నా మాటలను అంతగా పట్టించుకోకు. ఆ అమ్మాయి ఎలాగూ చావుబతుకుల్లో ఉంది. రేపోమాపో అన్నట్టుగా ఉన్న అమ్మాయికోసం నిక్షేపంగా ఉన్న నా ప్రాణం తీయటం నీకేమైనా న్యాయంగా ఉందా?'

ఇలా ఉంటుంది మృత్యుభయం ఎవరికైనా. మృత్యుభయంనుంచి బయటపడాలని ఎవరికి ఉందని మీరు అడిగితే అందరూ చేతులెత్తుతారు. అయితే మృత్యుభయం పోవాలంటే దానికి ఒక్కటే ఔషధం ఉంది. అది బ్రహ్మజ్ఞానం పొందటం.

**బ్రహ్మవిత్ ఆప్నోతి పరమ్**

అందువల్ల యత్‌జ్ఞాత్వా – ఆ జ్ఞానాన్ని పొందితే; అమృతమ్ అశ్నుతే – అమృతాన్ని పొందుతాడు. అంటే అభద్రతాభావన తొలుగుతుంది.

**జ్ఞేయమ్** – అందువల్ల ఈ జ్ఞానం గురించి జాగ్రత్తగా వినాలి. ఏమిటా జ్ఞేయం?

**పరం బ్రహ్మ** – పొందాల్సిన జ్ఞానం బ్రహ్మజ్ఞానం.

**సత్యం జ్ఞానమ్ అనంతం బ్రహ్మ** – తైత్తిరీయమ్

అనంతం బ్రహ్మ అంటే దేశకాలవస్తు పరిచ్ఛేదశూన్యం బ్రహ్మ అని అర్థం. అంటే మూడు పరిమితులు లేవు. అవి దేశపరిమితి, కాలపరిమితి, వస్తుపరిమితి. దేశపరిమితి అంటే మీరు ఇంట్లో ఉంటే, అదే సమయంలో బయట ఉండలేరు. అలాగే కాలపరిమితి అంటే పుట్టిన ప్రతిదానికీ కాలపరిమితి ఉంటుంది. పుట్టిన ప్రతిదీ మరణించక తప్పదు. వస్తుపరిమితి అంటే ఒకటి ఒక వస్తువు అయితే, అది తక్కిన వస్తువులు కాలేదు. ఒకదాన్ని చూపించి దీన్ని కుర్చీ అంటే అది బల్లకాదు, కలంకాదు, పుస్తకం కాదు; అలా చెప్పుకుంటూ పోవచ్చు. అలాగే ఇది ఎరుపురంగులో ఉంది అని అంటే, తక్కిన రంగులేవీ కావు అని అర్థం; అలాగే మీరు మనిషి అయితే మీరు జంతువు కాదు, చెట్టు కాదు అని అర్థం. బ్రహ్మకు ఈ మూడు పరిమితులూ లేవు. అందువల్లనే పరబ్రహ్మ అంటారు. మృత్యుభయాన్ని అధిగమించాలంటే ఈ పరబ్రహ్మను గురించి తెలుసుకోవాలి.

పడవలో నది దాటుతున్న ఒక పండితుని కథ మీకు తెలిసిందే. ఆ పండితుడు ఆ పడవ నడిపే వ్యక్తికి వ్యాకరణం, తర్కం, మీమాంస తెలియకపోతే అతని జీవితంలో మూడువంతులు వృథా అన్నాడు. ఇంకాసేపటికి నీటిమీద వెళ్ళాల్సిన పడవలోకి నీళ్ళు వచ్చేసాయి. అప్పుడు పడవ నడిపేవ్యక్తి స్వామీ మీకు ఈతకొట్టటం రాకపోతే, మీ జీవితం మొత్తం వృథా అన్నాడు.

అలా జీవితంలో ఎన్ని డిగ్రీలు ఉన్నా లాభం లేదు. మొత్తం జీవితాన్నే మార్చగలిగే జ్ఞానం ఉండాలి. అది పరబ్రహ్మ గురించిన జ్ఞానం మాత్రమే. ఆ పరబ్రహ్మ స్వరూపం ఏమిటి?

**అనాదిమత్పరం బ్రహ్మ** – అనాదిమత్ అంటే ఆది లేనిది. ఆది అంటే మొదలు. అనాది అంటే ఆరంభం లేనిది అంటే దేశపరంగా, కాలపరంగా కూడా చెప్పవచ్చు. దేశకాలపరిమితులు లేకపోతే అనంతం బ్రహ్మ.

**న సత్ న అసత్ ఉచ్యతే** – ఈ సందర్భంలో అసత్ అంటే కారణం; సత్ అంటే కార్యం. కారణాన్ని అసత్ అని ఎందుకన్నారంటే, ఏ కారణం అయినా కూడా అవ్యక్తరూపంలో ఉంటుంది; అవ్యక్తంలో ఉన్నదాన్ని మనం వాడుకోలేము. గింజల్లో నూనె అవ్యక్తంగా ఉంది; పాలలో వెన్న అవ్యక్తంగా ఉంది; కాని అవ్యక్తంగా ఉన్నవాటిని మనం వాడుకోలేము. అలా అవ్యక్తంగా ఉంది కాబట్టి కారణాన్ని అసత్ అన్నాడు కృష్ణపరమాత్మ. సత్ అంటే కార్యం అని చూశాము. సత్ అంటే ఉనికి ఉన్నది. కార్యం వ్యవహారానికి అందుతుంది. బ్రహ్మ ఏమిటి?

**కార్యకారణవిలక్షణం బ్రహ్మ**

ఇది అంత తేలికగా జీర్ణించుకోలేరు. ఎందుకంటే మీరు చూస్తున్న జగత్తు మొత్తం కార్యకారణ సంబంధం ఉన్నదే. నిన్న, ఇవాళ పుట్టటానికి కారణం. ఇవాళ, రేపనేరోజు పుట్టటానికి కారణం. అలా ఈ జగత్తు ఎటుచూసినా కారణంనుంచి పుడుతున్న కార్యం. కాని కృష్ణపరమాత్మ బ్రహ్మను కార్యకారణవిలక్షణం అంటున్నాడు. అదెలా సాధ్యం? కార్యకారణ విలక్షణం అంటే కాలాతీతం. ఎందుకంటే కార్య, కారణాలు కాలంలోకి వస్తాయి. ఒక కారణం, కార్యంగా మారిందని కాలపరంగానే చెబుతాము. నిన్న కారణం, నేడు కార్యం. కాని బ్రహ్మకు రూపులేదు, గుణాలు లేవు, కాలం లేదు.

**అశబ్దమస్పర్శమరూపమవ్యయమ్ తథారసం నిత్యమగంధవచ్చ యత్** – కఠ

బ్రహ్మ శబ్దానికి, స్పర్శకు, రూపానికి, రుచికి, వాసనకు అందదు. అంటే పంచజ్ఞానేంద్రియాలకు అందదు. పంచజ్ఞానేంద్రియాలకు అందని బ్రహ్మ గురించి తెలుసుకోవటమెలా? రాబోయే శ్లోకాల్లో చూస్తాము. అవి చాలా ముఖ్యమైన శ్లోకాలు. ఎందుకంటే అవి ఉపనిషత్తుల సారం.

శ్లో. 14 **సర్వతః పాణిపాదం తత్ సర్వతోఽక్షిశిరోముఖమ్ ।**
**సర్వతః శ్రుతిమల్లోకే సర్వమావృత్య తిష్ఠతి ॥**
సర్వతః, పాణిపాదమ్, తత్, సర్వతః, అక్షిశిరోముఖమ్,
సర్వతః, శ్రుతిమత్, లోకే, సర్వమ్, ఆవృత్య, తిష్ఠతి ॥

| | | | |
|---|---|---|---|
| తత్ | = ఆ పరమాత్మ | శ్రుతిమత్ | = చెవులు గలవాడు |
| సర్వతః | = అంతటను | యతః | = ఎందువల్ల అంటే పరమాత్మ |
| పాణిపాదమ్ | = చేతులును, పాదములును కల్గియున్నవాడు | లోకే | = లోకమునందు |
| సర్వతో**ఽ**క్షి | = అంతటను నేత్రములు | సర్వమ్ | = అంతటను |
| శిరోముఖమ్ | = శిరస్సులు, ముఖములు గలవాడు | ఆవృత్య | = వ్యాపించి |
| సర్వతః | = అంతటను | తిష్ఠతి | = స్థితమైయున్నాడు |

**లోకే తత్ సర్వతః పాణి-పాదమ్, సర్వతః అక్షి-శిరః-ముఖమ్, సర్వతః శ్రుతిమత్ (అస్తి), సర్వమ్ (చ) ఆవృత్య తిష్ఠతి ॥**

తా: ఆ పరమాత్మ అంతటను చేతులును, పాదములును కల్గియున్నవాడు, అంతటను నేత్రములు, శిరస్సులు, ముఖములు గలవాడు, అంతటను చెవులు గలవాడు. ఎందువల్ల అంటే పరమాత్మ లోకమునందు అంతటను వ్యాపించి స్థితమైయున్నాడు.

ఉపనిషత్తులు బ్రహ్మను జగత్కారణబ్రహ్మగా అభివర్ణిస్తాయి. మన విజ్ఞానశాస్త్రం కూడా ఈ జగత్తుకు కారణమేమిటో పరిశోధించి చూస్తోంది. అణువులు, పరమాణువుల గురించి పరిశోధన జరుగుతున్నది. కాని ఇంకా అసలు సృష్టికర్త ఎవరో కనుక్కోలేకపోతున్నది.

వేదాంతం జగత్తుకు ముందు ఉన్నది నిర్గుణబ్రహ్మ అని చెప్పింది. ఆ బ్రహ్మ పంచజ్ఞానేంద్రియాలకు అందదు అని కూడా చెప్పేసింది. అందువల్ల ప్రత్యక్షప్రమాణానికి అందని బ్రహ్మ గురించి, మనస్సుకు, వాక్కుకు అందని బ్రహ్మ గురించి ఎలా తెలుసుకోవాలి? మొదట్లో అర్థం కానట్టు అనిపించినా, లోతుగా తరచిచూస్తే, నెమ్మదిగా అర్థమవుతుంది. దానికి బుద్ధి చాలా పదునుగా, చాలా సూక్ష్మంగా ఉండాలి. క్షురకుని కత్తి అంచులాగా ఉండాలంటుంది కఠోపనిషత్తు.

మీరు ఎర్రటిఎండలో బయటకు వెళ్ళి కాసేపు తిరిగి ఇంట్లోకి వస్తే, రాగానే ఇంట్లో ఏమీ కనపడదు. ఆ చీకటికి మీ కళ్ళు కాస్త అలవాటుపడ్డాక, అప్పుడు ఆ గదిలో ఉన్నవన్నీ స్పష్టంగా తెలుస్తాయి. వేదాంతంలోకి ఇప్పుడిప్పుడే తప్పటడుగులు వేస్తున్నవారి పరిస్థితి కూడా అలాగే ఉంటుంది. ముందు అంతా మాటలగారడీగానూ, అయోమయంగానూ ఉంటుంది. కాని పట్టువదలకుండా, ముందుకు సాగితే, అందులోని లోతులు కొలవటం మొదలుపెడతారు.

బ్రహ్మ గురించి ఎలా తెలుసుకుంటాము? బ్రహ్మ దగ్గరకు వెళ్ళేముందు కొంత నామవాచకం గురించి, విశేషణం గురించి తెలుసుకుందాము. నామవాచకం అంటే మనిషి, ఊరు, జంతువు, వస్తువుల పేర్లు తెలుపునది. ఉదా– రాముడు, బందరు, కుక్క, చెట్టు. విశేషణం అంటే నామవాచకంయొక్క గుణాన్ని తెలుపునది. ఉదా– పొట్టిమనిషి, తెల్లబంతి, పెద్దచెట్టు. పొట్టి, తెల్ల, పెద్ద పదాలు ఆయా నామవాచకాల గుణాలను లేదా లక్షణాలను వర్ణిస్తున్నాయి. ఇది మామూలుగా మనకు నామవాచకం గురించి, విశేషణం గురించి తెలిసిన వివరణ. అంటే నామవాచకం వస్తువును సూచిస్తే, విశేషణం ఆ వస్తువుయొక్క గుణాన్ని సూచిస్తుంది. అవునా?

ఇప్పుడు మరికొన్ని పదాలు చూద్దాము. బంగారుగాజు, చెక్కబల్ల. మన సూత్రం ప్రకారం వీటిని ఎలా చెప్పాలి? గాజు నామవాచకం, బల్ల నామవాచకం; బంగారు విశేషణం, చెక్క విశేషణం. కాని లోతుగా విశ్లేషిస్తే, ఈ పదాల్లో బంగారు అనే పదం గుణాన్ని తెలపటం లేదు. వస్తువును తెలుపుతున్నది; అలాగే చెక్క అనే పదం గుణాన్ని తెలపటం లేదు, వస్తువును తెలుపుతున్నది. అంటే దీన్నిబట్టి మనకు తెలుస్తున్న విషయం ఏమిటి? విశేషణాలు గుణాన్ని తెలుపవచ్చు లేదా వస్తువును తెలుపవచ్చు. పొట్టిమనిషి ఉదాహరణలో గుణాన్ని తెలిపితే, బంగారుగాజు ఉదాహరణలో వస్తువును తెలుపుతున్నది.

సూత్రం 1 – విశేషణం గుణాన్ని లేదా వస్తువును తెలుపుతుంది.

ఇప్పుడు నామవాచకం పరంగా చూద్దాము. ఇప్పుడు బంగారుగాజులో గాజు నామవాచకం. నామవాచకం వస్తువును తెలపాలి. కాని వేదాంతపరంగా చూస్తే గాజుకి విడిగా ఉనికి లేదు. గాజు అనే వస్తువే లేదు. మరి ఉన్నది ఏమిటి అంటే బంగారం మాత్రమే. అంటే గాజు నామవాచకమే అయినా అది వస్తువును సూచించటం లేదు.

గాజు వస్తువు కాకపోతే మరి అది దేన్ని సూచిస్తుంది? దాన్ని విశ్లేషిస్తే, మనకు తెలిసేది ఏమిటి? అసలు వస్తువు బంగారం, కాని బంగారానికున్న రూపం గాజు. అలాగే బంగారపుటుంగరం అంటే అసలు వస్తువు బంగారం, దాని రూపం ఉంగరం; అలాగే చెక్కబల్ల అంటే అసలు వస్తువు చెక్క, దాని రూపం బల్ల. అందువల్ల ఈ వాక్యాల్లో బంగారు, చెక్క–వస్తువులను సూచిస్తే, గాజు, ఉంగరం, బల్ల వాటి లక్షణాలను సూచిస్తాయి. రూపం మారితే, గాజు మాయమైపోతుంది. అందువల్ల గాజు లక్షణాన్ని సూచిస్తుంది అంటాము. అంతకుముందు చూసిన ఉదాహరణల్లో అంటే పొట్టిమనిషి, పెద్దచెట్టుల్లో మనిషి, చెట్టు వస్తువులను సూచిస్తాయి.

సూత్రం 2 – నామవాచకం వస్తువును లేదా గుణాన్ని తెలుపుతుంది.

ఇప్పుడు ఈ వాక్యాలను మళ్ళీ చూద్దాము.

| | | |
|---|---|---|
| **పెద్దచెట్టు** | – పెద్ద | – గుణాన్ని తెలిపే విశేషణం. |
| **బంగారుగాజు** | – గాజు | – వస్తువును తెలిపే విశేషణం. |
| **పెద్దచెట్టు** | – చెట్టు | – వస్తువును తెలిపే నామవాచకం. |
| **బంగారుగాజు** | – బంగారం | – గుణాన్ని తెలిపే నామవాచకం. |

ఇప్పుడు ఈ ఉదాహరణలను జగత్తు, బ్రహ్మకు అన్వయించి చూద్దాము. ఇదంతా వేదాంతం కొన్ని వేల సంవత్సరాల ముందు చేసింది. ఈ జగత్తులో కొన్ని వస్తువులను చూద్దాము. పుస్తకం ఉంది, బల్ల ఉంది, గోడ ఉంది, చెట్టు ఉంది. ఈ వాక్యాలన్నిటిలోనూ సమానంగా ఉన్న పదం ఏమిటి? **ఉంది.** ఉంది అంటే దాని అర్థం– ఉనికి ఉంది అని. వీటినే ఇంగ్లీషులో దేర్ ఈజ్ ఎ బుక్, దేర్ ఈజ్ ఎ టేబుల్, దేర్ ఈజ్ ఎ వాల్, దేర్ ఈజ్ ఎ ట్రీ అంటారు. **ఈజ్** అనే పదం ఉనికిని సూచిస్తుంది.

ఇప్పుడు ఈ వాక్యాలనే తిరగరాస్తే, ఉనికి ఉన్న పుస్తకం, ఉనికి ఉన్న బల్ల, ఉనికి ఉన్న గోడ, ఉనికి ఉన్న చెట్టు అని రాస్తారు. అంటే మీ అనుభవంలోకి వచ్చిన ప్రతివస్తువుకూ ఉనికి ఉంటుంది. దానికి ఉనికి లేకపోతే, మీ అనుభవంలోకి రాదు. మీ ఎదురుగా ఉన్న వ్యక్తికి కొమ్ములు ఉన్నాయా అని అడిగితే, మీరేం అంటారు? లేవు అంటారు. ఎందుకు? కొమ్ములు లేవు కాబట్టి. కాని అతని తల కనిపిస్తోందా అంటే ఏమంటారు? కనిపిస్తోంది అంటారు. ఎందుకు? దానికి ఉనికి ఉంది కాబట్టి. సంస్కృతంలో ఉనికిని సత్ అంటారు.

ఇప్పుడు పైన చెప్పిన వాక్యాలను మళ్ళీ చూద్దాము. ఉనికి ఉన్న పుస్తకం, ఉనికి ఉన్న బల్ల, ఉనికి ఉన్న గోడ, ఉనికి ఉన్న చెట్టు. ఈ వాక్యాల్లో నామవాచకం ఏది, విశేషణం ఏది? మనకు తెలిసిన సాధారణసూత్రం ప్రకారం ఏమంటాము? ఉనికి విశేషణం; చెట్టు, బల్లలాంటివి నామవాచకం అంటాము. కాని ఈ విషయాలను వేదాంతం, తర్కశాస్త్రం లోతుగా విశ్లేషించాయి. అందువల్ల, 'సరే ఉనికిని మీరు విశేషణం అనీ, చెట్టుని నామవాచకం అనీ అంటే, అవి ఎటువంటి విశేషణం, నామవాచకాలో చెప్పండి,' అంటుంది వేదాంతం.

ఎందుకీ ప్రశ్న ఉదయిస్తుంది? ఇంతకుముందే మనం రెండు సూత్రాలు చూశాము. వాటి ప్రకారం విశేషణం వస్తువునూ, నామవాచకం దాని గుణాన్నీ సూచించవచ్చని చూశాము. దానికి ఉదాహరణలు బంగారుగాజు, చెక్కబల్ల అని కూడా చూశాము. ఇప్పుడు ఉనికి అనే పదం గుణాన్ని సూచిస్తోందా, వస్తువును సూచిస్తోందా?

వేదాంతానికి రాకముందు ఉనికి ఉన్న ప్రపంచం అని చెపితే ప్రపంచం వస్తువు; ఉనికి దాని లక్షణాన్ని సూచించే విశేషణం అంటారు. కాని వేదాంతం అది మీకు కప్పిన మాయ అంటుంది. మాయాశక్తి మిమ్మల్ని పెద్ద పొరపాటు చేసేలాగా చేస్తున్నది అంటుంది. ఏమిటా పొరపాటు? ఉనికిని విశేషణం, జగత్తును వస్తువు అనుకోవటం పొరపాటు.

అది పొరపాటయితే, మరి ఏది సత్యం? విశేషణం గుణాన్ని సూచించటం లేదు అంటే రెండవసూత్రం ప్రకారం దేన్ని సూచించాలి? వస్తువును సూచించాలి. ఎలాగైతే బంగారుగాజులో బంగారం వస్తువును సూచిస్తుందో అలాగే ఉనికి ఉన్న ప్రపంచంలో ఉనికి కూడా వస్తువునే సూచిస్తుంది. వస్తువును ఉనికి అంటారు – వేదాంతం ప్రకారం దాన్ని సత్‌బ్రహ్మ అంటారు. ఛాందోగ్యోపనిషత్తు ఆరంభించటమే ఈ సత్‌బ్రహ్మతో ఆరంభిస్తుంది.

**సదేవ సోమ్యేదమగ్ర ఆసీదేకమేవాద్వితీయమ్**

వేదాంతం ప్రకారం ప్రాథమిక వస్తువు లేదా పదార్థం సత్ (ఉనికి). ఆ ఉనికి అనేది ఆ వస్తువుయొక్క గుణం కాదు, అది ప్రాథమిక అంతిమపదార్థం. అంటే అది వస్తువును లేదా పదార్థాన్ని సూచిస్తున్నది అంటే ఇక్కడ విశేషణం పదార్థాన్ని సూచిస్తున్నది. ఇది మొదటిభాగం. ఇప్పుడు రెండవదశలోకి అడుగుపెడదాము.

రెండవదశలో ప్రపంచం పదాన్ని విశ్లేషిద్దాము. మామూలుగా అయితే, అంటే వేదాంతానికి రాకముందు, ప్రపంచం నామవాచకం అంటాము. అంటే వస్తువును లేదా పదార్థాన్ని సూచిస్తుంది అంటాము. అవునా? కాని ఇక్కడ విశేషణం పదార్థాన్ని సూచిస్తుందని నిరూపించాము. కాబట్టి ప్రపంచం దేన్ని సూచించాలి? దాని గుణాన్ని సూచించాలి. బంగారుగాజు ఉదాహరణ గుర్తు పెట్టుకోండి. అందులో గాజు దాని రూపాన్ని అంటే దాని గుణాన్ని సూచిస్తుంది అన్నాము. బంగారుగాజు, బంగారుగొలుసు, బంగారపుటుంగరం పదాలలో గాజు, గొలుసు, ఉంగరాల పదాలు బంగారంయొక్క ఆకారాన్ని చూపిస్తాయి అంతే. అవి మారుతూ ఉంటాయి. కాని ఆ మారేవాటిలో మారని సత్యవస్తువు ఏమిటి? బంగారం. బంగారం ఎక్కడ ఉంది? గాజు అంతటా ఉంది, గొలుసు అంతటా ఉంది, ఉంగరం అంతటా ఉంది. అంటే వస్తువు నిత్యంగా ఉంది; లక్షణం మారుతోంది. అందువల్ల దయానందస్వామీజీ 'బంగారుగాజు అనకూడదు, గాజుగా ఉన్న బంగారం; మట్టికుండ అనకూడదు, కుండగా ఉన్న మట్టి; చెక్కబల్ల అనకూడదు, బల్లగా ఉన్న చెక్క అనాలి' అంటారు. అంటే ఇక్కడ నామవాచకం గుణాన్ని తెలుపుతున్నది.

ఎందుకు కుండను కాని, గాజును కాని పదార్థం కాదు అన్నాము? ఎందుకంటే వేదాంతం ప్రకారం మీరు ముట్టుకుంటున్నది కుండను కాదు, కుండ అంతటా ఉన్న మట్టిని; మీరు ముట్టుకుంటున్నది గాజును కాదు, గాజు అంతటా ఉన్న బంగారాన్ని. అలాగే జగత్తును చూస్తుంటే మీరు చూస్తున్నది జగత్తును కాదు, జగత్తు అంతటా ఉన్న ఉనికిని. వేదాంతం జగత్తును నామరూపాత్మకం అంటుంది.

**త్రయం వా ఇదం నామరూపం కర్మ జగత్** – బృహదారణ్యకం

నిజంగా చూస్తే జగత్తు అనే పదార్థం లేదు; దానికి అనేక నామాలు, రూపాలు, కర్మలు ఉన్నాయి. కర్మ అంటే అది చేసే పనులు. ఉనికి ఉన్న గాజు అంటే గాజు చేసే కర్మ ఏమిటి? చేతిని అలంకరిస్తుంది; అలాగే ఉనికి ఉన్న గొలుసు అంటే అది చేసే కర్మ ఏమిటి? మెడను అలంకరిస్తుంది. ఉనికి ఉన్న ఉంగరం అంటే అది చేసే కర్మ ఏమిటి? వేలిని అలంకరిస్తుంది. కాని నిజంగా చూస్తే గాజు, గొలుసు, ఉంగరం అంటూ విడిగా మూడు వస్తువులు లేవు, ఉన్నదొక్కటే వస్తువు; అదే బంగారం. ఎందుకు? వాటిని చూస్తున్నా మీరు అనుభవిస్తున్నది ఒక్క

బంగారాన్నే. అలాగే మీరు జగత్తును చూస్తున్నా, దానికి ఉన్నది ఉనికి ఒకటే; అది భిన్ననామాలు, భిన్నరూపాలు, భిన్నకర్మలతో కనబడుతోంది అని చూశాము.

**యస్యైవ స్ఫురణం సదాత్మకమసత్కల్పార్థకం భాసతే** – శంకరాచార్యులు

భిన్న ఆభరణాలలో ఎలా ఒకటే బంగారాన్ని చూస్తామో, అలాగే జగత్తులో నానాత్వాన్ని అనుభవిస్తున్నా కూడా ఉన్నది ఒకటే ఉనికి. దాన్నే **సత్** అంటారని చూశాము. ఇది రెండవదశ.

ఇప్పుడు మూడవదశలోకి అడుగుపెడదాము. ఆ శుద్ధసత్‌ను అనుభవించటమెలా? ఇది మూడవదశ. ఇంతవరకూ ఏమన్నాము? ఏ ఆభరణాన్ని చూసినా, బంగారాన్నే చూస్తున్నాము అన్నాము. అంటే బంగారం దర్శనం కావాలంటే ఎక్కడ దొరుతుకుంది? అభరణాలన్నింటిలోనూ దొరుకుతుంది. అలాగే సత్ మాత్రమే జగత్తంతా ఉంది అన్నాము. అది ఎక్కడ దొరుకుతుంది? జగత్తు అంతటా ఉంది. ఆ సత్తును బ్రహ్మ అన్నాము. అలా బ్రహ్మ జగత్తు అంతటా ఉంది.

కాని ఇందులో చిన్న సమస్య ఉంది. ఏమిటది? నేను సత్‌నే అంతటా అనుభవిస్తున్నా కూడా దాన్ని విడిగా అనుభవించలేకపోతున్నాను. దాన్ని అనేక నామరూపాలతో పాటు అనుభవిస్తున్నాను. బల్ల, కుర్చీ, చెట్టు, మనిషి– ఇలా అనేక నామరూపాలతో ఉనికి ఉంది. అంటే నేను చూస్తున్నది **నామరూపసహితసత్**. ఇంద్రియాలు నామరూపసహితసత్‌నే చూపించగలవు.

ఇప్పుడు ప్రశ్న ఏమిటి? నామరూపరహితసత్‌ను ఎలా అనుభవించాలి? అంటే నామరూపాలు లేని శుద్ధ సత్‌ను ఎలా అనుభవించాలి? నామరూపసహితసత్‌లోంచి నామరూపాలు తీసేస్తే ఏం మిగలాలి? శుద్ధసత్ మిగలాలి. కాని వచ్చిన చిక్కేమిటంటే, నామరూపాలను తీసేస్తే, ఇంద్రియాలు శుద్ధసత్‌ను అనుభవించలేవు. ఇంద్రియాలు శబ్దస్పర్శరూపరసగంధాలను మాత్రమే ఆస్వాదించగలవని చూశాము. అంటే అవి నామరూపాలతో కూడిన సత్‌ను మాత్రమే అనుభవించగలవు.

నామరూపాలను తీసేస్తే ఏమవుతుంది? ఉదాహరణకు కళ్ళు మూసుకుంటే రంగులు, రూపాలు మాయమవుతాయి; చెవులు మూసుకుంటే శబ్దప్రపంచం మాయమవుతుంది; ముక్కు మూసుకుంటే గంధప్రపంచం మాయమవుతుంది; అలా అన్ని ఇంద్రియాలను మూసుకోగలిగితే అన్ని నామరూపాలు మాయమవుతాయి. నామరూపాత్మక జగత్తు మాయమయితే, శుద్ధసత్ మిగలాలి కదా! ఆ శుద్ధసత్‌ను అనుభవించటమెలా?

కళ్ళు తెరచి చూశారా! కళ్ళు తెరిచి చూసిన మరుక్షణం అది శుద్ధసత్ అవదు. రూపంతో కూడిన సత్ అవుతుంది; చెవులు ఉపయోగించిన మరుక్షణం శబ్దంతో కూడిన సత్ అవుతుంది.

ఇంతకుముందు కూడా చూశాము – ఛాందోగ్యోపనిషత్తులో సృష్టికి ముందు సత్ మాత్రమే ఉందని వస్తుంది. మొత్తం ఉపనిషత్తులకే ఆణిముత్యంలాంటిది ఈ ఉపనిషత్తు. ఆ మాట వినగానే శిష్యుడు అయితే, ఆ సత్‌ను అనుభవించటం ఎలా అంటాడు. గురువు, 'నువ్వు ఎన్నటికీ శుద్ధసత్‌ను అనుభవించలేవు, ఎందుకంటే అది ఎన్నటికీ అనుభవించబడే వస్తువు కాదు,' అని చెబుతాడు.

అది అనుభవించబడే వస్తువు కాకపోతే, అలాంటిది ఒకటి అసలు ఉందా అనే సందేహం కలుగకతప్పదు. అప్పుడు ఉపనిషత్తు బోధలోని కీలక అంశం వస్తుంది –

**ఐతదాత్మ్యమిదగ్ం సర్వం తత్సత్యగ్ం స ఆత్మా తత్త్వమసి శ్వేతకేతో**

**అనుభవించే నేనే అది ఎప్పటికీ, అనుభవించబడే వస్తువు కాదు ఎన్నటికీ**

శుద్ధసత్‌ను ఎన్నడూ ఆబ్జెక్టుగా చూడలేవు. ఎందుకంటే అది చూసే నువ్వే కాబట్టి. నువ్వు ఎవరు? సాక్షిచైతన్యం. అంతటా ఉన్న సత్తే, నీలో చిత్‌గా ఉంది. వేదాంతం అలా సత్‌తో మొదలుపెట్టి చిత్‌తో ముగిస్తుంది. సత్ = చిత్.

తత్ త్వమ్ అసి – ఆ సత్తే ఈ చిత్ అయిన నువ్వు. శుద్ధసత్ ఏమిటి? శుద్ధచిత్. శుద్ధచిత్ ఏమిటి? నేనే. అహం బ్రహ్మ అస్మి. నా స్వరూపం ఏమిటి? సత్, చిత్.

**సత్ చిత్ ఆత్మ ఏవ బ్రహ్మ అస్మి**

ఇది వేదాంతబోధ సారాంశం. నేను సత్‌రూపాన్ని, నేను చిత్‌రూపాన్ని; ఈ జగత్తు మొత్తం నాలో ఉన్న నామరూపాలు.

**మయ్యేవ సకలం జాతం। మయి సర్వం ప్రతిష్ఠితమ్।**
**మయి సర్వం లయం యాతి। తద్బ్రహ్మాద్వయమస్మ్యహమ్॥** – కైవల్యం 1.19

అహం బ్రహ్మ అస్మి అనే సత్యం జీర్ణించుకోవటం చాలా కష్టం.

**బ్రహ్మకోసం వెతుకుతున్న నువ్వే బ్రహ్మవు** అంటుంది ఉపనిషత్తు. ఈ సత్యాన్ని జీర్ణించుకోవటానికి స్వప్నదృష్టాంతాన్ని ఇస్తుంది.

స్వప్నంలో మీరు ఏం చూస్తారు? అనేక వస్తువులను చూస్తారు. కొన్ని ఆనందాన్ని కలుగజేస్తే, కొన్ని దుఃఖాన్నో, భయాన్నో కలుగజేస్తాయి. కొంతమంది పీడకలలు రాకుండా ఉండటానికి ఆంజనేయదండకం చదువుకుని మరీ పడుకుంటారు. సరే, మీరు కలలో దేన్నో చూసి భయపడుతున్నప్పుడు, కలలోనే మీ దగ్గరకు ఒక గురువు వచ్చాడనుకుందాము. ఆ గురువు ఏమని చెబుతాడు? 'నాయనా, ఆ పులిని చూసి భయపడకు. అది నిజం పులి కాదు; ఈ స్వప్నప్రపంచం నీనుంచే వచ్చింది. నువ్వే పులిని సృష్టించావు, నువ్వు సృష్టించిన పులిని చూసి నువ్వు భయపడుతున్నావు. పులే కాదు మొత్తం స్వప్నప్రపంచమే నీనుంచి వచ్చింది, నీలోనే స్థితి పొందుతుంది, నువ్వు నిద్రనుంచి లేస్తే నీలోనే లయమవుతుంది.'

ఆ మాట స్వప్నంలో ఉండగా నమ్ముతారా మీరు? అది అంత స్పష్టంగా కంటికి కనబడుతుంటే నిజంకాదని ఎలా చెప్పగలరు అనుకుంటారు. కాని మీరు స్వయంగా, మీ నిద్రనుంచి లేచాక, అది నిజంకాదు, మీరు సృష్టించిందే అని మీకు అర్థమవుతుంది. మీరు కలలో చూసిన మనిషి, పులి, నది తక్కిన వస్తువులు అన్నీ మీ మనస్సునుంచి వచ్చినవే అని తెలుస్తుంది మీకు. అవి మీకు భిన్నంగా లేవు. మీలోనే అవ్యక్తంగా ఉన్నాయి.

వేదాంతం ఇదే సూత్రం జాగ్రద్ ప్రపంచానికి కూడా వర్తిస్తుంది అంటుంది. ఈ జాగ్రద్ ప్రపంచం కూడా స్వప్నప్రపంచంలాంటిదే, అది మొదటి స్వప్నం అయితే ఇది రెండవ స్వప్నం అంటుంది. ఈ జాగ్రద్ ప్రపంచంలో గురువు వచ్చి చెబుతాడు, 'స్వప్నప్రపంచాన్ని ఎలాగైతే నువ్వు నీ నిద్రాశక్తితో సృష్టించావో, అలా ఈ జాగ్రద్ ప్రపంచాన్ని నువ్వు నీ మాయాశక్తితో సృష్టించావు. నువ్వు నిజంగా ఉంది అనుకున్న ఈ జగత్తు మిథ్య, నువ్వు నీ ఉన్నతస్థాయికి లేస్తే, ఈ జాగ్రద్ ప్రపంచం కూడా నీ స్వప్నప్రపంచంలాగా మిథ్య అయిపోతుంది.' స్వప్నంలో ఉండగా, స్వప్నగురువు చెపితే ఎలా నమ్మలేరో, అలాగే ఈ జాగ్రద్ ప్రపంచంలో కూడా అజ్ఞానంలో ఉండగా నీకు ఇంకొక స్థాయి ఉంది, ఇది నువ్వు సృష్టించిన స్వప్నప్రపంచంలాంటిది అంటే నమ్మలేరు. కాకపోతే ఆ 'నేను' ఎవరో తెలుసుకోవాలి. నేను అంటే శరీరం కాదు, ఇంద్రియాలు కాదు, మనస్సు కాదు. వీటన్నిటినీ మీకు భిన్నంగా మీరు చూడగలుగుతున్నారు; వీటన్నిటినీ సాక్షిచైతన్యంగా చూసేది ఒకటి ఉంది. అదే మీరు.

**బ్రహ్మ సత్యం జగన్మిథ్యా**

బ్రహ్మ అయిన నానుంచే ఈ నామరూపాత్మక జగత్తు వచ్చింది. అందువల్లనే ఈ జగత్తును విశ్వరూప ఈశ్వరః అంటారు. విశ్వరూప ఈశ్వరుడు ఎవరు? నామరూపకర్మలతో కూడిన బ్రహ్మ.

**సహస్రశీర్షా పురుషః సహస్రాక్షః సహస్రపాత్** – పురుషసూక్తం

బ్రహ్మ ఏకం, జగత్తు అనేకం. అదే వేదాంతసారం.

బ్రహ్మను ఇక్కడ జ్ఞేయం అంటున్నాడు. మాండూక్యోపనిషత్తులో విజ్ఞేయః అని వస్తుంది.

**చతుర్థం మన్యన్తే స ఆత్మా స విజ్ఞేయః** – మాండూక్యం 7

13–19 శ్లోకాల్లో కృష్ణపరమాత్మ బ్రహ్మను సత్‌గానూ, చిత్‌గానూ వర్ణిస్తాడు.

**సత్యం జ్ఞానమ్ అనంతం బ్రహ్మ**
**సత్ చిత్ ఆనందం బ్రహ్మ**

ఈ నిర్వచనాలను ఉపనిషత్తుల్లో చూస్తాము. ఇప్పుడు మనం సత్‌ను చూస్తున్నాము. సత్ అంటే ఉనికి అని చూశాము. మనం చైతన్యం గురించి వచ్చినప్పుడల్లా ఐదు సూత్రాలను చూస్తూ వస్తున్నాము. అవే సూత్రాలను సత్‌కు కూడా అన్వయించవచ్చు. నిజానికి చైతన్యానికి ఈ సూత్రాలను చెప్పేముందు కాంతి ఉదాహరణ చూశాము. ముందు కాంతికి ఐదు లక్షణాలను చూసి, అవే లక్షణాలను చైతన్యానికి అన్వయించాము. ఇప్పుడు మళ్ళీ అవే లక్షణాలను సత్‌కు అన్వయించవచ్చు. వాటిని వరుసగా చూద్దాము.

**సత్ లక్షణాలు**

ఇప్పుడు చైతన్య లక్షణాలను సత్‌కు అన్వయిస్తూ తిరిగి చెప్పవచ్చు. సత్ అంటే ఆత్యంతికమైన ఉనికి.

- సత్, శరీరంలో ఒక భాగం కాని, లక్షణం కాని, దానినుంచి ఉత్పత్తి అయినది కాని కాదు.

- సత్, స్వతంత్రమైనది. అదీ శరీరమంతటా వ్యాపించి, శరీరానికి ఉనికిని ప్రసాదిస్తుంది.
- సత్, శరీరం సరిహద్దులకే పరిమితమవలేదు.
- సత్, శరీరం నాశనమయితే నాశనమవదు. శరీర పతనానంతరం కూడా శుద్ధసత్ ఉంటుంది.
- సత్, శరీరం లేకపోయినా ఉంటుంది కాని తెలియదు. సత్‌ను తెలియజేసే శరీరం లేదు కాబట్టి సత్ తెలియదు. అంతమాత్రాన సత్ లేనట్టు కాదు.

ఆ విధంగా సత్తే చిత్. చిత్తే సత్. ఆ సత్ చిత్ బ్రహ్మవు నువ్వే అర్జునా అంటున్నాడు కృష్ణపరమాత్మ. తత్త్వమసి మహావాక్యం అర్థం వస్తుంది ఈ శ్లోకాల్లో.

మనం ఒక సుదీర్ఘప్రయాణం చెయ్యాలి. ముందు శుద్ధసత్‌ను అర్థం చేసుకోవాలి. తర్వాత ఆ శుద్ధసత్తే శుద్ధచిత్ అని అర్థం చేసుకోవాలి. దాని తర్వాత ఆ సత్ చిత్ ఆనంద బ్రహ్మను నేనే అని అర్థం చేసుకోవాలి. తత్త్వమసిలోని సారాంశం అది. అది అంతతేలిగ్గా అర్థం కాదు. అందువల్ల అది తేలిగ్గా అర్థం కావటానికి వేదాంతం ఒక ప్రత్యేక పద్ధతిని వాడుతుంది. దాన్ని అధ్యారోప అపవాద పద్ధతి అంటారు.

## అధ్యారోప అపవాద పద్ధతి

1. చెయ్యి చూపించి ఇక్కడేముంది అంటే చెయ్యి ఉంది అంటారు.
2. చెయ్యితో పాటు చెయ్యిని ప్రకాశింపజేసే కాంతి ఉంది (చెయ్యి + కాంతి) అంటారు. ఇది అధ్యారోపం.
3. కాంతి లేకపోతే చెయ్యికి విడిగా ఉనికి లేదు. చెయ్యి నామరూపం.
4. చెయ్యి + కాంతిలోనుంచి చెయ్యి తీసేస్తే మిగిలేది శుద్ధకాంతి మాత్రమే. అది అపవాదం.

ఈ పద్ధతిని కృష్ణపరమాత్మ తన బోధలో ఉపయోగిస్తున్నాడు. ఈ నేపథ్యంతో ఈ శ్లోకాలను అర్థం చేసుకోవటానికి ప్రయత్నిద్దాము. ఇవి సత్‌తో మొదలై, చిత్‌తో ముగుస్తాయి.

**తత్** – తత్ అంటే ఆ బ్రహ్మ, సత్. సత్ అంటే ఉనికి అని చూశాము. అంతటా ఉనికి ఉన్న జగత్తులో ఉనికి గుణం కాదు, పదార్థం అని చూశాము. దీనికి బంగారుగాజు ఉదాహరణను మర్చిపోకూడదు. ఆ ఉనికి ఎలా ఉంది?

**సర్వతః పాణిపాదమ్** – ఆ ఉనికి అంతటా ఉంది. బంగారం ఎలాగైతే ఆభరణాలన్నింటిలోనూ ఉందో, అలా ఉనికి జగత్తు అంతటా ఉంది.

ఉనికి అంతటా ఉందని ఎలా చెప్పగలరు? ఉనికి లేని వస్తువును గూర్చి ఎన్నడూ చెప్పలేరు. ఒక వస్తువుకు ఉనికి లేకపోతే, ఆ వస్తువు లేదని చెప్పవచ్చు. అందువల్ల ఉనికి అంతటా ఉంది. మీలో, ఆ బల్లలో, ఇంకా చెప్పాలంటే మీకూ, ఆ బల్ల మధ్యలోనూ ఉనికి ఉంది. మీరు 'నాకూ, బల్లకూ మధ్యలో ఏమీ లేదు, శూన్యమే ఉంది,' అన్నారనుకోండి. ఏముంది అని రెట్టిస్తాము. 'శూన్యం ఉంది,' అంటారు మీరు. ఉంది అంటే అది ఉనికే. అందువల్ల ఉనికి లేకుండా దేనిగురించీ మాట్లాడలేరు. అందువల్ల సర్వతః పాణిపాదమ్. సత్‌బ్రహ్మ చేతులు, కాళ్ళు అంతటా ఉన్నాయి.

**సర్వతోఽక్షిశిరోముఖమ్** – ఈ సత్‌బ్రహ్మకు అంతటా కళ్ళు, శిరస్సులు, ముఖాలు ఉన్నాయి. అంతటా విశ్వరూపంగా విరాజిల్లుతున్నాడు.

**సర్వతః శ్రుతిమల్లోకే** – ఆ బ్రహ్మే అంతటా చెవులతో ఉన్నాడు. శ్రుతి అంటే ఇక్కడ చెవులు; లోకే అంటే ఈ విశ్వంలో; అందువల్ల బ్రహ్మకు విశ్వం అంతటా చెవులు ఉన్నాయి.

**సర్వమావృత్య తిష్ఠతి** – ఆ బ్రహ్మ సర్వవ్యాపకంగా అంతటా ఉన్నాడు.

శ్లో. 15 **సర్వేంద్రియగుణాభాసం సర్వేంద్రియవివర్జితమ్ ।**
**అసక్తం సర్వభృచ్చైవ నిర్గుణం గుణభోక్తృ చ ॥**
సర్వేంద్రియగుణాభాసమ్, సర్వేంద్రియవివర్జితమ్,
అసక్తమ్, సర్వభృత్, చ, ఏవ, నిర్గుణమ్, గుణభోక్తృ, చ ॥

| | | | |
|---|---|---|---|
| సర్వేంద్రియ | = ఇంద్రియగ్రాహ్య | అసక్తమ్, ఏవ | = ఆసక్తిరహితుడైనను |
| గుణాభాసమ్ | = విషయములనన్నింటిని తెలిసినవాడు | సర్వభృత్ | = సర్వజగత్తును ధరించి పోషించువాడు |
| సర్వేంద్రియ | = కాని వాస్తవముగా | చ | = అలాగే |
| వివర్జితమ్ | = ఇంద్రియరహితుడు | నిర్గుణమ్ | = గుణరహితుడైనను |
| చ | = ఇంకా | గుణభోక్తృ, చ | = గుణములను అనుభవించువాడు |

**(తత్) సర్వ–ఇన్ద్రియ–గుణ–ఆభాసమ్, సర్వ–ఇన్ద్రియ–వివర్జితమ్,**
**అసక్తమ్, సర్వ–భృత్ చ ఏవ, నిర్గుణమ్, గుణ–భోక్తృ చ (అస్తి) ॥**

తా: ఇంద్రియగ్రాహ్యవిషయములనన్నింటిని తెలిసినవాడు, కాని వాస్తవముగా ఇంద్రియరహితుడు ఇంకా ఆసక్తి రహితుడైనను సర్వజగత్తును ధరించి పోషించువాడు. అలాగే గుణరహితుడైనను గుణములను అనుభవించువాడు.

ఈ శ్లోకంలో కృష్ణపరమాత్మ అధ్యారోప అపవాద పద్ధతిని ఉపయోగిస్తున్నాడు. అధ్యారోప అపవాద పద్ధతిలో చెయ్యిని చూపించి, చెయ్యిద్వారా కాంతిని పరిచయం చేసి, చెయ్యిని తీసేసి శుద్ధకాంతిని చూపిస్తాము.

నిజానికి ఈ అధ్యారోప అపవాదాన్ని మీ నిజజీవితంలో మీకు తెలియకుండానే ఉపయోగిస్తారు. ఉదాహరణకు మీకు దాహం వేసింది అనుకుందాము. మీరు 'నాకు మంచినీళ్ళు తెచ్చిపెట్టు,' అని మీ చెల్లిని అడిగారనుకుందాము. మీ చెల్లి ఒక గ్లాసులో నీళ్ళు తీసుకువస్తుంది. 'నీళ్ళు తెమ్మన్నాను కాని, గ్లాసులో తెమ్మన్నానా?' అని అరుస్తారా మీరు? అలా అరిస్తే మీకేదో అయింది అనుకుంటుంది మీ చెల్లెలు. తను గ్లాసులో తెచ్చిన నీళ్ళను మీరు త్రాగుతారు. గ్లాసును తాగరు, నీళ్ళను మాత్రమే త్రాగుతారు. గ్లాసు మీరు నీరు త్రాగటానికి ఉపయోగపడే మాధ్యమం మాత్రమే. మీరు నీరును తీసుకుని, గ్లాసును వదిలేస్తారు.

అదేవిధంగా శుద్ధ ఉనికిని అర్థం చేసుకోవటం కష్టం. అందువల్ల ఒక వస్తువును పరిచయం చేసి, ఆ వస్తువును + ఉనికిని చూపించాలి. ఆ వస్తువు నామరూపాలు మాత్రమే. బల్ల ఉంది, మైకు ఉంది పదాల్లో ఉంది పదం సమానంగా ఉంది. తర్వాత ఉంది పదాన్ని ఉంచి బల్ల, మైకు పదాలను తీసివేయాలి. అదే పద్ధతిని కృష్ణపరమాత్మ ఉపయోగిస్తున్నాడు ఇక్కడ.

**సర్వేంద్రియ గుణాభాసమ్** – ఇంద్రియాలు అన్నీ బ్రహ్మను ఎప్పుడూ చూపిస్తూనే ఉన్నాయి. ఉదాహరణకు కళ్ళు రంగులను మాత్రమే చూపగలవు; శబ్దాన్ని వినిపించలేవు. అలాగే చెవులు శబ్దాన్ని మాత్రమే వినిపించగలవు; కాని రంగులను చూపించలేవు. అందువల్ల ఏ ఇంద్రియం చేసేపని ఆ ఇంద్రియమే చేస్తుంది. కన్ను చూపించిన దాన్ని చెవి అవునని నిరూపించలేదు; కాదని ఖండించనూ లేదు.

కాని అన్ని ఇంద్రియాలూ ఒకదాన్ని మాత్రం సమానంగా అనుభవిస్తాయి. ఏమిటది? **ఉనికిని.** రంగు **ఉంది**, శబ్దం **ఉంది**, రుచి **ఉంది**. ఆ విధంగా ఐదు ఇంద్రియాలు ఐదు రకాలుగా శబ్దస్పర్శరూపరసగంధాలను చూపించినా, అన్నింటిలోనూ సమానంగా ఉన్నది ఉనికి.

కాని మనమేం చేస్తున్నాము? నామరూపాలలో పడిపోయి, దానితోపాటు ఉన్న బ్రహ్మను తెలుసుకోలేక పోతున్నాము. ఇది తెలుసుకోవటానికి సూక్ష్మమైన బుద్ధి ఉండాలి. సర్వ ఇంద్రియ గుణాః అంటే అన్ని ఇంద్రియాలను వాడటం. ఆభాసమ్ అంటే ప్రకటితమవటం. ఉనికి ప్రతి ఒక్క ఇంద్రియ వ్యాపారంలోనూ ప్రకటితమవుతున్నది.

చెయ్యిని చూస్తే చెయ్యి+కాంతి ఉందని చూశాము. అలాగే కంటితో ఈ గడియారాన్ని చూస్తే గడియారం+కాంతి ఉన్నట్టు అర్థం; గోడను చూస్తే గోడ+కాంతి ఉన్నట్టు అర్థం. అలాగే ఇంద్రియాలతో ఏం తెలుసుకున్నా కూడా వాటితో పాటు ఉనికి ఉన్నట్టు అర్థం. చెవితో వింటే శబ్దం **ఉంది** అంటాము; కంటితో చూస్తే రంగు **ఉంది** అంటాము. అంటే శబ్దం పోయింది, రంగు వచ్చింది. కాని రెండింటిలోనూ సమానంగా ఉన్నది ఏమిటి? ఉనికి (ఈజ్‌నెస్ అంటారు). శబ్దః అస్తి; స్పర్శః అస్తి; రూపమ్ అస్తి; రసః అస్తి. అస్తి అంటే ఉనికి లేదా సత్. అందువల్ల కృష్ణపరమాత్మ ఆభాసమ్ పదం వేశాడు. ఆభాసమ్ అంటే ప్రకటితం. ఏమిటి ప్రకటితమయింది? అన్ని ఇంద్రియ వ్యాపారాలద్వారా బ్రహ్మయొక్క సత్ అంశం ప్రకటితమవుతున్నది.

**సర్వేంద్రియవివర్జితమ్** – కాని అదే సమయంలో సత్‌బ్రహ్మ ఇంద్రియాలకు లేదా ఇంద్రియవస్తువులకు భిన్నంగా ఉంది. అంటే ఇంద్రియాలు బ్రహ్మయొక్క స్వస్వరూపం కాదు. కాంతి చెయ్యిని చూపిస్తోంది; చెయ్యివల్లనే కాంతి ప్రకటితమవుతోంది నిజమే కాని చెయ్యి కాంతిలో ఒక భాగం కాదు. చెయ్యి కాంతిలో భాగం కాదు, కాంతి కూడా చేతిలో ఒక భాగం కాదు. చెయ్యి కాంతిలో ఒక భాగం అయితే, కాంతి ఎక్కడ ఉంటే అక్కడ చెయ్యి ఉండి తీరాలి. అదే విధంగా జగత్తుద్వారా బ్రహ్మను అర్థం చేసుకుంటాము కాని జగత్తు బ్రహ్మలో ఒక భాగం కాదు. బ్రహ్మ అసంగం. బ్రహ్మ ఇంద్రియాలకు అతీతం.

**సర్వభృత్ చ** – ఈ సత్ బ్రహ్మ అన్నింటికీ ఆధారం. అంటే సర్వాధారం. ఎలా చెప్పగలము? బ్రహ్మవల్లనే అన్నింటికీ ఉనికి ఉంది. ఎలాగైతే బంగారంవల్లనే ఆభరణాలకు ఉనికి ఉందో, అలాగే బ్రహ్మవల్లనే జగత్తుకు ఉనికి ఉంది. అందువల్ల బ్రహ్మ సర్వాధారం.

**అసక్తమ్** – బ్రహ్మ జగత్తులోని వస్తువులకు భిన్నంగా ఉంది అంటే ఆ వస్తువులు బ్రహ్మయొక్క స్వస్వరూపం కాదు. ఆకాశంలాగా శుద్ధం. ఆకాశం అన్నిటికీ ఆధారం కాని, ఏదీ ఆకాశంలో ఒక భాగం కాదు. సర్వభృత్ అంటే అధ్యారోపం, అసక్తమ్ అంటే అపవాదం.

**సర్వేంద్రియగుణాభాసమ్ – అధ్యారోపం**
**సర్వేంద్రియవివర్జితమ్ – అపవాదం**

గ్లాసుతో నీళ్ళను తీసుకోవటం అధ్యారోపం, గ్లాసుని వదిలి నీళ్ళని మాత్రమే త్రాగటం అపవాదం.

**నిర్గుణం గుణభోక్తృ చ** – గుణభోక్తృ అంటే అన్ని గుణాలతో ఉన్నవాడు. ఎలా చెప్పగలము? గ్రీన్‌కలర్ ఈజ్, ప్రాపర్టీ ఈజ్ పదాలలో ఈజ్‌నెస్ సత్‌ను చూపిస్తుంది. ఆకుపచ్చరంగు ఉంది, ఈ గుణం ఉంది అనే వాక్యాల్లో ఉంది ఉనికిని అంటే సత్‌ను సూచిస్తుంది. మళ్ళీ నిర్గుణం అంటే ఆ సత్‌కు గుణాలు అంటవు. గుణాల మధ్యలో ఉన్నా కూడా బ్రహ్మ నిర్గుణం. బ్రహ్మయొక్క స్వస్వరూపం నిర్గుణం బ్రహ్మ.

దీనికి సినిమా స్క్రీన్ ఉదాహరణగా తీసుకోవచ్చు. సినిమా తెరమీద ఆడే సినిమాలో రక్తం ఏరులై ప్రవహించినా, తెరకు రక్తం అంటదు; అగ్నిజ్వాలలు ఎగసిపడినా తెర కొంచెంకూడా కాలదు; హోరున వర్షం కురిసినా తెర తడవదు. సినిమాలో ఏం జరిగినా తెర చెక్కుచెదరదు. అదే విధంగా ఎన్ని గుణాల మధ్య ఉన్నా అవి బ్రహ్మను మలినం చెయ్యలేవు. గుణాలు బ్రహ్మయొక్క స్వస్వరూపం కాదు. బ్రహ్మ నిర్గుణం బ్రహ్మ.

శ్లో. 16 **బహిరంతశ్చ భూతానామ్ అచరం చరమేవ చ ।**
**సూక్ష్మత్వాత్ తదవిజ్ఞేయం దూరస్థం చాంతికే చ తత్ ॥**
బహిః, అంతః, చ, భూతానామ్, అచరమ్, చరమ్, ఏవ, చ,
సూక్ష్మత్వాత్, తత్, అవిజ్ఞేయమ్, దూరస్థం, చ, అంతికే, చ, తత్ ॥

| | | |
|---|---|---|
| భూతానామ్ | = | చరాచరప్రాణులన్నింటికిని |
| బహిః, అంతః, చ | = | బయట, లోపల, పరిపూర్ణుడై యుండువాడు |
| చరమ్, అచరమ్ | = | చరాచరరూపుడును |
| ఏవ | = | అతడే |
| చ | = | ఇంకా |
| తత్ | = | అతడు |
| సూక్ష్మత్వాత్ | = | అతిసూక్ష్మరూపుడగుటవల్ల |
| అవిజ్ఞేయమ్ | = | తెలిసికొనశక్యము గానివాడు |
| చ | = | అలాగే |
| అంతికే, చ | = | అతిసమీపమునందును |
| దూరస్థమ్ | = | దూరమునందును |
| తత్, చ | = | ఉండువాడు అతడే |

**తత్ భూతానామ్ బహిః అన్తః చ (అస్తి), అచరమ్ చరమ్ చ ఏవ (అస్తి),**
**తత్ సూక్ష్మత్వాత్ అవిజ్ఞేయమ్ (అస్తి), దూరస్థమ్ చ అన్తికే చ (అస్తి) ॥**

తా: చరాచరప్రాణులన్నింటికిని బయట, లోపల, పరిపూర్ణుడై యుండువాడు, చరాచరరూపుడును అతడే ఇంకా అతడు అతిసూక్ష్మరూపుడగుటవల్ల తెలిసికొనశక్యము గానివాడు అలాగే అతి సమీపమునందును, దూరమునందును (ఉండువాడు) అతడే.

ఈ సత్‌బ్రహ్మ శరీరంలోనే కాదు, బయట కూడా ఉన్నాడు. చెయ్యి-కాంతి ఉదాహరణను మర్చిపోకూడదు. కాంతి చేతిమీదనే లేదు, చెయ్యి బయట కూడా ఉంది. మరయితే నాకు ఎందుకు తెలియటం లేదంటే, కాంతిని ప్రకటింపజేసే మాధ్యమం లేదు కాబట్టి తెలియటం లేదు. ఇంకోవిధంగా చెప్పాలంటే చేతిమీద కనిపించే కాంతిని వ్యక్తప్రకాశం అనీ, కనబడని కాంతిని అవ్యక్తప్రకాశం అనీ అంటారు.

అదే విధంగా చైతన్యం ఈ శరీరంలోనూ ఉంది, మీ శరీరంలోనూ ఉంది; రెండు శరీరాల మధ్యా ఉంది. నిజానికి ఇక్కడ ఖాళీగా ఉంది అనే వాక్యంలో ఏమీ లేదనిపించినా ఉంది పదం ఉంది, అంటే ఉనికి ఉంది. అంటే శూన్యంలో కూడా ఉనికి ఉంది.

**బహిరంతశ్చ భూతానామ్** - బహి అంటే శరీరం బయట; అంతః అంటే లోపల. బ్రహ్మ బాహ్యంగానూ, ఆంతరంగానూ కూడా ఉంది.

**అంతర్బహిశ్చ తత్సర్వం వ్యాప్య నారాయణః స్థితః**

నారాయణుడు అంటే శంఖచక్ర గదాధారి. అంటే రూపం ఉన్న భగవంతుడు. ఆయనను అంతర్బహిశ్చ సర్వం అని అన్నప్పుడు నిర్గుణబ్రహ్మ, సర్వవ్యాపకుడు, శుద్ధసత్ బ్రహ్మ అని అర్థం చేసుకోవాలి.

భూతాని అంటే అన్ని జీవుల్లోనూ. బ్రహ్మ అన్ని జీవుల్లోనూ బయటా, లోపలా ఉన్నాడు.

**అచరం చరమేవ చ** - బ్రహ్మ చరాచరరూపం. గీతలో కొన్ని భాగాలు అర్థమయీ కానట్టుగా ఉంటాయి. వాటిని అర్థం చేసుకోడానికి చాలా సూక్ష్మబుద్ధి కావాలి. కదిలే వస్తువు స్థిరంగా ఉండదు; స్థిరంగా ఉంటే వస్తువు కదలలేదు. అలాంటప్పుడు బ్రహ్మ స్థిరమూ, అస్థిరమూ రెండూ ఎలా అవుతుంది? సత్ నిజంగా కదలదు కాని, సత్‌ను ప్రకటింపజేసే మాధ్యమం కదిలినప్పుడు, కదిలినట్టుగా అనిపిస్తుంది.

మనం ఎప్పుడూ చూసే చెయ్యి-కాంతి ఉదాహరణనే తీసుకుందాము. కాంతి సర్వవ్యాపకం. దానికి చలనం లేదు. సర్వవ్యాపకం కాబట్టి కదలలేదు కూడా. కాని చేతిని ఒకచోట పెడితే, అక్కడ కాంతి ప్రకటితం అవుతుంది; ఇంకొకచోటికి మారిస్తే అక్కడకు కాంతి కదిలినట్టుగా కనిపిస్తుంది. అంటే చెయ్యి ఎటు మారితే, అటు కాంతి కదిలినట్టు కనిపిస్తుంది.

దీనికి ఇంకొక ఉదాహరణ కూడా చూశాము అంతకుముందు. మీరు సెలవులకు ఊరువెళ్ళి, మళ్ళీ మద్రాసుకు తిరిగివస్తున్నారు అనుకుందాము. మద్రాసు ముందు స్టేషను బేసిన్‌బ్రిడ్జి. బేసిన్‌బ్రిడ్జి దగ్గరకు రైలు రాగానే మీరేమంటారు? 'మద్రాసు వచ్చింది,' అంటారు. నిజానికి మద్రాసు వస్తుందా, రైలు వెళుతుందా? రైలే కదులుతుంది; కాని మీరేం చేస్తున్నారు? కదిలే రైలు లక్షణాన్ని కదలని ఊరుకు ఆపాదిస్తున్నారు.

కదిలే భూమి లక్షణాన్ని సూర్యునికి ఆపాదిస్తాము. సూర్యోదయం సమయం, సూర్యాస్తమయం సమయాలు ప్రతిరోజూ వార్తాపత్రికల్లో చూస్తాము. నిజానికి వైజ్ఞానశాస్త్రపరంగా మనకు తెలుసు, సూర్యోదయం కాని, సూర్యాస్తమయం కాని లేవని. అంటే కదిలే భూమి లక్షణాన్ని కదలని సూర్యునికి ఆపాదిస్తాము. అలాగే కదిలే చెయ్యి లక్షణాన్ని కదలని కాంతికి ఆపాదిస్తాము.

లైటుహౌస్‌లోని లైటును చూసినా కూడా ఈ విషయం అర్థమవుతుంది. లైటుహౌసునుంచి మూడు లైట్లు వస్తున్నట్టుగా, అది అన్నివైపులా తిరుగుతున్నట్టుగా అనిపిస్తుంది. కాని నిజానికి లైటుహౌసులోకి వెళ్ళి చూస్తే ఆశ్చర్యపోతారు. ఒకటే లైటు ఉంటుంది అక్కడ. అది కూడా కదలకుండా స్థిరంగా ఉంటుంది. ఏకం అనేకంగా కనిపిస్తోంది; అచలం చలంగా అనిపిస్తోంది. దానిముందు పెట్టిన పరికరంద్వారా అది సాధ్యం అవుతోంది. ఇలా ఒక వస్తువుయొక్క లక్షణాన్ని ఇంకొకదానికి ఆపాదించటాన్ని **ధర్మ అధ్యాస** అంటారు. ఆ విధంగా శరీరం ప్రయాణం చేస్తుంది, మనస్సు ప్రయాణం చేస్తుంది, జీవరాశులు ప్రయాణం చేస్తాయి, కాని చైతన్యానికి లేదా ఉనికికి ప్రయాణం లేదు. అందువల్ల అచలం చలంగా కనిపిస్తుంది.

**దూరస్థం చాంతికే చ తత్** – దూరస్థం అంటే చాలా దూరంగా ఉంది. భక్తిమార్గంలో భగవంతుడు ఎక్కడో దూరంగా వైకుంఠంలో ఉన్నాడనీ, మనం ఆయనవైపు రెండు అడుగులు వేస్తే, భగవంతుడు మనవైపు నాలుగు అడుగులు వేస్తాడనీ అంటారు. భగవంతుడు అలా మనవైపు అడుగులు వేస్తాడంటే మనకు ఆనందభాష్పాలు వస్తాయి కాని, భగవంతుడు సర్వవ్యాపకుడు. మనం ఆయనకు పూజ చేసేటప్పుడు అనంతాయనమః అంటాము కూడా. కాని అది ఆలోచించకుండా భగవంతుడు మనవైపు పది అడుగులు వేస్తాడని అపోహ పడతాము. అందువల్ల దూరస్థమ్ అంటాము కాని కృష్ణపరమాత్మ **అంతికే చ తత్** అంటున్నాడు.

భగవంతుడు దూరంగా ఉన్నాడంటే ఏమని అర్థం చేసుకోవాలి? ఎవరైనా భగవంతుడు వైకుంఠంలో ఉన్నాడని అంటే మీరేమనాలి? మీరు ఇంకొక పదం కలిపి, భగవంతుడు వైకుంఠంలో **కూడా** ఉన్నాడు అనాలి. అలాగే ఎవరైనా భగవంతుడు కైలాసంలో ఉన్నాడంటే, కైలాసంలో **కూడా** ఉన్నాడు అనాలి. భగవంతుడు మీ హృదయంలో **కూడా** ఉన్నాడు. ఒక్కముక్కలో చెప్పాలంటే భగవంతుడు అంతటా ఉన్నాడు. దూరస్థం చాంతికే చ తత్ అంటే అర్థం అది.

దీనికి శంకరాచార్యులవారు ఇంకొక వివరణ కూడా ఇస్తారు. జ్ఞానికి బ్రహ్మ చాలా దగ్గరగా ఉన్నాడని తెలుసు; అజ్ఞాని బ్రహ్మ ఎక్కడో దూరంగా ఉన్నాడని అనుకుని, బాహ్యంగా వెతుకుతాడు. జ్ఞానికి బ్రహ్మ చాలా దగ్గరగా ఉన్నాడని కూడా కాదు, తానే బ్రహ్మ అని తెలుసు. బ్రహ్మ అంతటా ఉంటే, నాకెందుకు తెలియటం లేదు?

**సూక్ష్మత్వాత్** – బ్రహ్మ సూక్ష్మంగా ఉండటంవల్ల తెలియటంలేదు అంటున్నాడు కృష్ణపరమాత్మ. అంటే బ్రహ్మకు గుణాలు లేవు కాబట్టి తెలియదు. ఒక వస్తువు శబ్దం చేస్తే, ఆ శబ్దాన్నిబట్టి ఆ వస్తువును గుర్తు పట్టవచ్చు; వస్తువును ముట్టుకోగలిగితే స్పర్శనుబట్టి చెప్పవచ్చు; రంగు, రూపు ఉంటే కంటితో చూసి చెప్పవచ్చు. అంటే ఆ వస్తువుకున్న ఏదో ఒక గుణం మీకు దాని గురించి తెలుసుకోవటానికి తోడ్పడుతుంది.

**అవిజ్ఞేయమ్** – బ్రహ్మకు గుణాలు లేవు కాబట్టి తెలుసుకోవటం చాలా కష్టం. గుణాలు ఎక్కువ ఉంటే తేలికగా తెలుసుకోవచ్చు; తక్కువ ఉంటే తెలుసుకోవటం కష్టం. పృథివికి ఐదుగుణాలు ఉన్నాయి.

| **పంచభూతాలు** | **గుణాలు** |
|---|---|
| పృథివి | శబ్దం, స్పర్శ, రూపం, రసం, గంధం |
| నీరు | శబ్దం, స్పర్శ, రూపం, రసం |
| అగ్ని | శబ్దం, స్పర్శ, రూపం |
| వాయువు | శబ్దం, స్పర్శ |
| ఆకాశం | శబ్దం |

ఆకాశం అన్నింటిలోకి సూక్ష్మం. ఆకాశానికి ఒక గుణమే ఉంది. అందువల్ల ఆకాశాన్ని అర్థం చేసుకోవటం కష్టం. అలాంటిది బ్రహ్మ ఆకాశంకన్నా సూక్ష్మం. సూక్ష్మాతి సూక్ష్మం. బ్రహ్మ నిర్గుణంబ్రహ్మ కాబట్టి నిర్గుణబ్రహ్మను అర్థం చేసుకోవటం ఇంకా కష్టం.

శ్లో. 17 **అవిభక్తం చ భూతేషు విభక్తమివ చ స్థితమ్ ।**
**భూతభర్తృ చ తద్ జ్ఞేయం గ్రసిష్ణు ప్రభవిష్ణు చ ॥**
అవిభక్తమ్, చ, భూతేషు, విభక్తమ్, ఇవ, చ, స్థితమ్,
భూతభర్తృ, చ, తత్, జ్ఞేయమ్, గ్రసిష్ణు, ప్రభవిష్ణు, చ ॥

| | | | |
|---|---|---|---|
| అవిభక్తమ్, చ | = విభాగరహితుడై ఆకాశము వలె పరిపూర్ణరూపుడై యున్నను | ప్రభవిష్ణు, చ | = బ్రహ్మరూపములో సృష్టి చేయువాడును |
| భూతేషు | = చరాచర ప్రాణుల రూపములలో | భూతభర్తృ, చ | = విష్ణురూపములో ప్రాణులను ధరించి, పోషించువాడును |
| విభక్తమ్ | = వేర్వేరుగా | | |
| ఇవ, స్థితమ్ | = ఉన్నట్లు గోచరించువాడును | గ్రసిష్ణు, చ | = రుద్రరూపములో లయమొనర్చువాడును అయియున్నాడు |
| తత్, జ్ఞేయమ్ | = తెలిసికొనదగిన ఆ పరమాత్మ | | |

**తత్ జ్ఞేయమ్ అవిభక్తమ్ చ భూతేషు విభక్తమ్ ఇవ స్థితమ్,**
**భూత-భర్తృ చ గ్రసిష్ణు చ ప్రభవిష్ణు చ (అస్తి) ॥**

తా: విభాగరహితుడై ఆకాశము వలె పరిపూర్ణరూపుడై యున్నను చరాచర ప్రాణుల రూపములలో వేర్వేరుగా ఉన్నట్లు గోచరించువాడును, తెలిసికొనదగిన ఆ పరమాత్మ, బ్రహ్మరూపములో సృష్టి చేయువాడును, విష్ణురూపములో ప్రాణులను ధరించి, పోషించువాడును, రుద్రరూపములో లయమొనర్చువాడును అయియున్నాడు.

**అవిభక్తమ్** – ఆ బ్రహ్మ కూడా ఆకాశంలాగా విభజించ వీలులేనిది. విభక్తం అంటే భాగాలు ఉన్నది; అవిభక్తం అంటే భాగాలు లేనిది.

**భూతేషు విభక్తమివ స్థితమ్** – కాని జీవులలో విభజించబడినట్టుగా ఉన్నాడు. సర్వవ్యాపకుడైన బ్రహ్మకు భాగాలు లేవు, కాని ఆ బ్రహ్మను ప్రతిబింబింపజేసే మాధ్యమం లేక తెలియటంలేదు. కాంతిని చేతిమీద మాత్రమే గమనించినట్టుగా, బ్రహ్మ మాధ్యమం ఉన్నచోటనే తెలుస్తున్నాడు. అంతేకాదు కాంతికి విభాగాలు ఉన్నట్టుగా పొరపాటు పడుతున్నాము. లైటుహౌస్ ఉదాహరణ మర్చిపోకూడదు. అందులో ఉన్నది ఒకటే లైటు కాని అది బయటకు వచ్చేసరికి మూడుగా కనిపిస్తున్నది. అలా ఉన్నది ఒకటే బ్రహ్మ, కాని అనేకంగా కనిపిస్తున్నాడు.

**తద్ జ్ఞేయమ్** – అటువంటి పరమాత్మను తెలుసుకోవాలి.

**భూతభర్తృ చ గ్రసిష్ణు ప్రభవిష్ణు చ** – ఆ బ్రహ్మ సృష్టిస్థితిలయకారణం. ప్రభవః అంటే ఉత్పత్తి, ష్ణు అంటే కారణం. ప్రభవిష్ణు అంటే సృష్టికారణం; గ్రసిష్ణు అంటే లయకారణం; భూతభర్తృ అంటే స్థితికారణం. భర్తృ అంటే భరించేవాడు. కుటుంబబాధ్యతను భరిస్తాడు కాబట్టి పురుషుణ్ణి భర్త అంటారు. భూతభర్తృ అంటే సర్వజీవరాశికి భర్త, అంటే స్థితికారణం.

**యతో వా ఇమాని భూతాని జాయన్తే, యేన జాతాని జీవన్తి**
**యత్ప్రయన్త్యభిసంవిశంతి** – తైత్తిరీయం

ఇప్పటిదాకా బ్రహ్మ గురించిన కొన్ని నిర్వచనాలు చూశాము. నిర్గుణబ్రహ్మ, సర్వగతం, ఏకం, అఖండం, సద్రూపం. ఇలా పంచజ్ఞానేంద్రియాలకు అందని బ్రహ్మ ఉన్నాడా అనే అనుమానం కలుగవచ్చు. అందువల్ల కృష్ణపరమాత్మ తరువాత చెబుతాడు, బ్రహ్మను అర్థం చేసుకోవటానికి మనస్సును సూక్ష్మతరంగా చేసుకోవాలని. శాస్త్రం చెప్పే పద్ధతి ఆకాశఉపాసన. ఆకాశానికి స్పర్శ, రూప, రస, గంధాలు లేవని చూశాము. ఆకాశానికి ఒక్క గుణమే ఉంది. అది శబ్దం. ఆకాశాన్ని మనం చూడలేకపోయినా మనం ఆ పదం వాడుతూ ఉంటాము. ఆకాశం అంటే ప్రదేశం. ఎవరైనా ఈ గదిలోకి వస్తే, 'ఇదుగో ఇక్కడ ప్రదేశం ఉంది, ఇలా వచ్చి కూర్చో,' అంటాము. కాని నిజానికి ఆకాశానికి రూపంలేదు. అది కంటికి కనబడదు, కాని అది సర్వవ్యాపకం. అలాంటి సూక్ష్మమైన ఆకాశంమీద ధ్యానం చెయ్యమంటుంది శాస్త్రం.

**సర్వమిత్యాకాశే। తత్ ప్రతిష్ఠేత్యుపాసీత। ప్రతిష్ఠావాన్ భవతి।**
**తన్మహ ఇత్యుపాసీత। మహాన్ భవతి।** – తైత్తిరీయం

అన్ని భూతాల్లోకి అత్యంత సూక్ష్మమైనది ఆకాశం. ఆకాశంకన్నా సూక్ష్మం బ్రహ్మ. అందువల్ల అత్యంత సూక్ష్మమైన ఆకాశంమీద ధ్యానం చేస్తే మనస్సు కూడా సూక్ష్మమవుతుంది.

**యత్తత్ ప్రవక్ష్యామి యజ్ఞాత్వాఽమృతమశ్నుతే**

ఆ బ్రహ్మజ్ఞానం పొందితే అమృతం పొందుతారు. అందువల్ల అటువంటి బ్రహ్మను వర్ణించటానికి కంకణం కట్టుకున్నాడు కృష్ణపరమాత్మ.

శ్లో. 18 **జ్యోతిషామపి తజ్జ్యోతిః తమసః పరముచ్యతే ।**
**జ్ఞానం జ్ఞేయం జ్ఞానగమ్యం హృది సర్వస్య విష్ఠితమ్ ॥**
జ్యోతిషామ్, అపి, తత్, జ్యోతిః, తమసః, పరమ్, ఉచ్యతే,
జ్ఞానమ్, జ్ఞేయమ్, జ్ఞానగమ్యమ్, హృది, సర్వస్య, విష్ఠితమ్ ॥

| | | | |
|---|---|---|---|
| తత్ | = ఆ పరబ్రహ్మ | జ్ఞానగమ్యమ్ | = తత్త్వజ్ఞానముద్వారా ప్రాప్యుడును ఇంకా |
| జ్యోతిషామ్ అపి | = జ్యోతులకు | | |
| జ్యోతిః | = పరంజ్యోతి | సర్వస్య, హృది | = సకల ప్రాణుల హృదయములందును |
| తమసః, పరమ్ | = చీకటిని కూడా | | |
| ఉచ్యతే | ప్రకాశింపజేయగలదు | విష్ఠితమ్ | = విశేషముగా స్థితమై యుండువాడు |
| జ్ఞానమ్ | = ఆ పరమాత్మ జ్ఞానస్వరూపుడును | | |
| జ్ఞేయమ్ | = తెలిసికొనదగినవాడును | | |

**తత్ జ్యోతిషామ్ అపి జ్యోతిః (అస్తి), తమసః పరమ్ ఉచ్యతే, (తత్)**
**జ్ఞానమ్, జ్ఞేయమ్, జ్ఞానగమ్యమ్ (అస్తి), సర్వస్య హృది విష్ఠితమ్ (అస్తి) ॥**

తా: ఆ పరబ్రహ్మ జ్యోతులకు పరంజ్యోతి, చీకటిని కూడా ప్రకాశింపజేయగలదు. ఆ పరమాత్మ జ్ఞానస్వరూపుడును, తెలిసికొనదగినవాడును, తత్త్వజ్ఞానముద్వారా ప్రాప్యుడును ఇంకా సకల ప్రాణుల హృదయములందును విశేషముగా స్థితమై యుండువాడు.

ఈ శ్లోకంలో సద్రూపబ్రహ్మే చిద్రూపబ్రహ్మ అంటున్నాడు కృష్ణపరమాత్మ. ఇంతవరకూ సత్‌రూపంలో ఉన్న బ్రహ్మ, శుద్ధసత్, నిర్గుణబ్రహ్మ, చిత్‌రూపంలో ఉన్న ఆత్మ ఒక్కటే. చిత్ అంటే చైతన్యం. ఇంతకుముందే చైతన్యంయొక్క ఐదు లక్షణాలను చూశాము. వాటిని మళ్ళీ ఇక్కడ గుర్తు తెచ్చుకోవాలి. ఆ చైతన్యాన్ని వివరించటానికి కృష్ణపరమాత్మ ఉపనిషత్తుల్లో వాడిన పదాన్ని వాడుతున్నాడు. భగవద్గీత ఉపనిషత్తుల సారం అని చూశాము. అందువల్ల ఉపనిషత్తుల్లో వర్ణించిన బ్రహ్మ గురించిన వర్ణన వస్తే ఉపనిషత్తులకు వెళ్ళకుండా కుదరదు.

**హిరణ్మయే పరేకోశే విరజం బ్రహ్మనిష్కలమ్**
**తచ్ఛుభ్రం జ్యోతిషాం జ్యోతిః తద్యదాత్మవిదో విదుః** – ముండకమ్

**న తత్ర సూర్యో భాతి న చంద్రతారకం నేమా విద్యుతో భాన్తి కుతోఽయమగ్నిః**
**తమేవ భాన్తమనుభాతి సర్వం తస్య భాసా సర్వమిదం విభాతి** – ముండకమ్

ఇందులో రెండవ మంత్రాన్ని దీపారాధన చేసేటప్పుడు ఆలయాల్లో పఠిస్తారు. **జ్యోతిషాం జ్యోతిః** – జ్యోతులకు జ్యోతి. కేనోపనిషత్తులో కన్నుకు కన్ను, చెవికి చెవి, మనస్సుకు మనస్సు అని వస్తుంది.

వేదాంతంలో జ్యోతి పదాన్ని ఒక సాంకేతిక అర్థంతో వాడతారు. జ్యోతి అంటే దేని సమక్షంలో అయితే తక్కిన వస్తువులు తెలుస్తాయో దాన్ని జ్యోతి అంటారు. ఆ నిర్వచనం ప్రకారం ఆకాశంలో ఉండే ప్రకాశవంతమైనవన్నీ

జ్యోతులే. అంటే సూర్యుడు, చంద్రుడు, నక్షత్రాలు, మెరుపు – అన్నీ జ్యోతులే. పగలు సూర్యకాంతిలో వస్తువులన్నీ తెలుస్తున్నాయి; రాత్రి చంద్రుని వెన్నెలకాంతిలో వస్తువులన్నీ తెలుస్తున్నాయి; అమావాస్యరాత్రి అగ్ని సమక్షంలో తెలుస్తాయి.

ఈ సూత్రాన్ని ఆధారంగా చేసుకుని, ఉపనిషత్తు ఇంద్రియాలను, మనస్సును కూడా జ్యోతి అంటుంది. ఎందుకంటే, ఇంద్రియాల సమక్షంలోనే వస్తువుల ఉనికి మనకు తెలుస్తోంది; ఇంద్రియాలు వాడకపోతే అవి తెలియటంలేదు. అన్నింటినీ తన సమక్షంలో ప్రకాశింపజేసే సూర్యుడు కూడా గుడ్డివాని ముందు ప్రకాశించలేడు. అంటే కన్ను ఒక జ్యోతి. ముక్కు పనిచెయ్యకపోతే వాసనలు తెలియవు. అంటే ముక్కు ఒక జ్యోతి. ఆ విధంగా ప్రతి ఒక్క ప్రమాణం కూడా జ్యోతే. తర్కం కూడా ఒక జ్యోతే. ఎందుకంటే తర్కంద్వారా కొన్ని విషయాలు తెలుస్తాయి.

బృహదారణ్యకోపనిషత్తులో **స్వయంజ్యోతిర్బ్రాహ్మణము** అని ఒక బ్రాహ్మణము ఉంది. అది జ్యోతుల గురించి చెప్పుకుంటూ వస్తుంది. పగలు సూర్యుని కాంతిలో, రాత్రి చంద్రుని కాంతిలో, చీకటిలో అగ్నికాంతిలో చూస్తామని చెబుతూ, అగ్ని కూడా అందుబాటులో లేనప్పుడు, శబ్దం లేదా వాక్కు ఒక జ్యోతి అంటుంది. ఎవరైనా మీ ఇంటికి వచ్చినప్పుడు కరెంటుపోయి, గదంతా చీకటిగా ఉంటే మీరేం చేస్తారు? 'అదిగో అక్కడ బల్ల ఉంది; కొంచెం పక్కకు జరుగు; రెండడుగులు ముందుకు రా, మళ్ళీ పక్కకు జరుగు,' అంటూ మాటలతో సూచనలను ఇస్తారు. వాచాగ్ని ఒక జ్యోతి ఆ సందర్భంలో.

మళ్ళీ వెనక్కి ఇంద్రియాలకు వెళితే, కన్ను ఒక జ్యోతి అనీ, సూర్యుడు అంతలా ప్రకాశిస్తున్నా కన్ను చూడందే తెలియదనీ చూశాము. కాని కన్ను చూసినా దానివెనుక మనస్సు లేకపోతే, తను చూసిన దాని అందాన్ని కన్ను ఆస్వాదించలేదు. అంటే సూర్యోదయం ఎంత అందంగా కన్నుకు కనబడుతున్నా కూడా మనస్సు స్పందించకపోతే, ఆ అందాన్ని అనుభవించలేము. అందువల్ల మనస్సు ఒక జ్యోతి. కాని ఆ మనస్సును సాక్షిగా చూసేది ఒకటుంది. ఆలోచనలు ఉన్న, ఆలోచనలు లేని మనస్సును సాక్షిగా చూసేది సాక్షిచైతన్యం లేదా ఆత్మ. అందువల్ల సూర్యుడు, ఇంద్రియాలు, మనస్సు జ్యోతులు అయితే ఆత్మ జ్యోతిషాం జ్యోతి. ఆ చైతన్యం కనుక లేకపోతే తక్కిన జ్యోతులను చూడలేము. ఐన్‌స్టీన్ మెదడును మ్యూజియంలో దాస్తే, అంత శక్తివంతమైన మెదడును 2+2 ఎంత అని అడిగితే, అది చెప్పలేదు. ఎందుకు? దానివెనుక చైతన్యం లేదు కాబట్టి. అందువల్ల ఆత్మను జ్యోతిషాం జ్యోతి అంటారు.

**జ్యోతిషామపి తజ్జ్యోతిః** – అదే పదాన్ని కృష్ణపరమాత్మ ఇక్కడ వాడుతున్నాడు. ఆత్మ జ్యోతులకే జ్యోతి. తక్కిన జ్యోతులన్నీ ఆత్మజ్యోతి సమక్షంలోనే ప్రకాశిస్తాయి.

**పరం తమసః ఉచ్యతే** – అంతేకాదు, ఈ జ్యోతి ఎంత ప్రత్యేకమైనదంటే, అది చీకటిని కూడా ప్రకాశింపజేయగలదు.

ఇది చాలా అద్భుతమైన విషయం. మామూలు కాంతిని దేన్నైనా తీసుకోండి. అది ఈ గోడను, ఇక్కడ ఉన్న వ్యక్తులను, మీ తలను, ఈ పుస్తకాన్ని, అందులోని అక్షరాలను, అలా దేన్నైనా ప్రకాశింపజేయగలదు; కాని

ఒక్కదాన్ని మాత్రం చూపించలేదు. అది ఏమిటో తెలుసా? చీకటిని! చీకటిని చూడటానికి టార్చ్‌లైటు వేసిన మరుక్షణం ఏమవుతుంది? చీకటి మటుమాయమవుతుంది.

దీనికి చిన్మయానందస్వామి ఒక అద్భుతమైన కథను చెబుతారు. ఎవరో వెళ్ళి, సూర్యభగవానునికి చెప్పారుట, 'నిశిరాత్రి అని చాలా అందమైన స్త్రీ ఉంది, నువ్వు ఆమెను పెళ్ళి చేసుకో.' సంస్కృతంలో రాత్రిపదం స్త్రీలింగం. మనకు రాత్రిః సూక్తమ్ కూడా ఉంది. సహజంగా సూర్యభగవానునికి ఆసక్తి కలిగింది, ఆమెను వెతుక్కుంటూ బయలుదేరాడు. ఆమె భూగోళానికి అటువైపు ఉంది అన్నారుట. కష్టపడి అక్కడికి వెళితే, ఇటులేదు, అటువైపు ఉంది అన్నారుట. అలా సూర్యభగవానుడు నిశాదేవిని వెతుకుతూనే ఉన్నాడు. అలా వచ్చినవే సూర్యోదయం, సూర్యాస్తమయం. ఎందుకు? సూర్యకాంతి ఉన్నచోట చీకటికి చోటులేదు. అంటే సూర్యకాంతి ఎంత శక్తివంతమైనదైనా కూడా చీకటిని ప్రకాశింపజేయలేదు అంటే చూపించలేదు.

చైతన్యం ఒక్కటే చీకటిని కూడా చూపించగలదు. చీకటంటే ఏమిటో మీకు చూపిస్తున్నది ఏమిటనుకున్నారు? కళ్ళు కావు. కళ్ళు వెలుతురు ఉంటేనే పనిచేస్తాయి. మరి అన్నింటినీ చూపించే కళ్ళు చీకటిని చూపించలేకపోతే, చీకటిని చూపించేది ఏమిటి? చీకటి గురించి తెలుసుకునేలా చేసేది ఏమిటి? అది ప్రత్యేక జ్యోతి. అదే చైతన్యం. తక్కిన జ్యోతులు ఉంటే, చీకటి తొలగిపోతుంది; కాని చైతన్యం ఒక్కటే చీకటితో కూడా కలిసి ఉండగలదు. అందువల్ల దాన్ని తమసః పరముచ్యతే అన్నాడు కృష్ణపరమాత్మ. పరం అంటే ఇంకొకటి లేనిది; అదే ఆత్యంతిక జ్యోతి, అదే చైతన్యం.

**జ్ఞానం జ్ఞేయం జ్ఞానగమ్యం హృది సర్వస్య విష్ఠితమ్** – అంతేకాదు, ఈ సత్, చిత్ బ్రహ్మే అన్నింటిలోనూ ఉన్నాడు. సర్వం బ్రహ్మమయం జగత్. ఈ నిర్వికార చైతన్యమే, సవికారప్రపంచంగా కనిపిస్తుంది. అదెలా సాధ్యం?

విజ్ఞానశాస్త్రం కూడా రూపంలేని శక్తి, రూపం ఉన్న పదార్థంగా మారుతుంది అంటుంది. అదేవిధంగా వేదాంతం రూపంలేని బ్రహ్మ, జగత్కారణం అనీ, ఈ జగత్తు అంతటా ఉపాదానకారణంగా భాసిల్లుతున్నాడనీ అంటుంది. ఆ బ్రహ్మే ప్రమాతా, ప్రమాణం, ప్రమేయం కూడా. సర్వం బ్రహ్మమయం జగత్. జ్ఞానం అంటే తెలుసుకునే ప్రమాణం; జ్ఞేయం అంటే తెలుసుకోబడే బ్రహ్మ; జ్ఞానగమ్యం అంటే ఆ జ్ఞానం పొందితే, చేరుకోవాలనుకునే గమ్యం కూడా బ్రహ్మే.

ఈ బ్రహ్మను ఎక్కడ తెలుసుకోవాలి? బ్రహ్మ సర్వవ్యాపకుడు అయినా, ఒకచోట తెలుసుకోవాలి. విద్యుచ్ఛక్తి అంతటా ఉన్నా, అది తిరుగుతున్న ఫ్యానులో తెలుస్తుంది లేదా వెలుగుతున్న లైటులో తెలుస్తుంది. ఒకవేళ రెండూ లేకపోతే, ప్లగ్‌పాయింట్ దగ్గర టెస్టర్ పెట్టిచూస్తే తెలుస్తుంది.

అదేవిధంగా సత్, చిత్ బ్రహ్మ అంతటా ఉన్నా, బ్రహ్మను తెలుసుకునే ప్లగ్‌పాయింట్ ఏమిటి? మనమే! అంటే మన తలమీద టెస్టర్ పెట్టి చూడాలా అనకండి వెంటనే!

**సర్వస్య హృది విష్ఠితమ్** – చైతన్యం అంతటా ఉన్నా, దాన్ని తెలుసుకునేది మనస్సులోనే. హృది అంటే మనస్సు. శాస్త్రం ప్రకారం మనస్సు హృదయంలో ఉంటుంది. మీకు చైతన్యం ఉందని మీకు తెలుస్తుంది కాని ఎదుటివారికి

తెలియదు. అందువల్ల చైతన్యాన్ని ఎలా అర్థం చేసుకోవాలి? ఒక్కటే మార్గం ఉంది. నేను చైతన్యం ఉన్న జీవిని అని అర్థం చేసుకుంటే చాలు. నువ్వు ఉన్నావా అని అడిగితే ఎవరూ, 'నేను ఉన్నానో లేనో నా భార్యను అడిగి చెబుతాను,' అనరు. నేను ఉన్నాను అంటే నాలో చైతన్యం ఉందని అర్థం.

నా మనస్సులో జరుగుతున్నది నాకు తెలుస్తున్నది. నా మనస్సులో ఏర్పడే ఆలోచనలు నాకు తెలుస్తున్నాయి; బయటనుంచి వినిపిస్తున్న మాటలు నాలో ఆలోచనలను ఏర్పరుస్తున్నాయి. ఆ మాటలు నాకు అర్థమవుతున్నాయో లేదో కూడా నాకు తెలుస్తోంది. తెలుస్తోంది కాబట్టే, నాకు అర్థమయింది అనో, అర్థం కాలేదనో చెబుతున్నాను. ఆ ఆలోచనలు మాయమై, మనస్సు శూన్యంగా ఉన్నా కూడా నాకు తెలుస్తోంది. ఎందుకంటే నా మనస్సు శూన్యంగా ఉందని నేను చెప్పగలుగుతున్నాను. నేను అనుభవించని విషయం గురించి నేను మాట్లాడలేను. నా మనస్సు శూన్యంగా ఉందని చెప్పగలిగానంటేనే నాకు ఆ విషయం తెలుస్తోందని అర్థం.

వృత్తి భావ అభావ సాక్షి

ఈ చైతన్యం ఆలోచనలు ఉన్న, ఆలోచనలు లేని మనస్సును సాక్షిగా చూస్తుంది. ఈ సాక్షి ప్రతి ఒక్కరి మనస్సులోనూ, మనుష్యుల మధ్య ఉన్న ప్రదేశంలోనూ ఉంది. సర్వస్య హృది విష్ఠితమ్ అంటున్నాడు కృష్ణపరమాత్మ. అంటే హృదయంలో అందుబాటులో ఉంది. దీనితో నాలుగవ అంశం అయిన **జ్ఞేయమ్** గురించి కూడా అయిపోయింది.

ఇక్కడ ఒక విషయం గుర్తుంచుకోవాలి. మనం ఈ అధ్యాయం మొదట్లో చర్చించిన క్షేత్రజ్ఞుడు, ఇప్పుడు ముగించిన జ్ఞేయంబ్రహ్మ రెండూ ఒకటే తత్త్వాన్ని సూచిస్తున్నాయి. జీవాత్మ అయిన క్షేత్రజ్ఞుడే పరమాత్మ అయిన జ్ఞేయంబ్రహ్మ.

రెండూ ఒకటే అయితే, రెండు పదాలు వాడి మనను అయోమయంలో పడేయటం ఎందుకు? ఇది వేదాంతంలో చాలా సహజంగా జరుగుతుంది. ఆమాటకొస్తే, మన నిజజీవితంలో కూడా ఒకే మనిషిని అనేక రకాలుగా వ్యవహరిస్తాము. ఒకేవ్యక్తి ఒకరికి తల్లి, ఇంకొకరికి అక్క, ఇంకొకరికి భార్య, మరొకరికి బామ్మ. ఎటువైపునుంచి చూస్తే, అటు స్థానం మారుతుంది. భర్తవైపునుంచి చూస్తే భార్య అవుతుంది; కొడుకు వైపునుంచి చూస్తే ఆమే తల్లి అవుతుంది.

అలాగే చూసే కోణాన్నిబట్టి దేశం కూడా మారుతుంది. ఒకరు ఒక ప్రాంతాన్ని అడయార్ అంటే, ఇంకొకరు చెన్నై అంటారు; మరొకరు తమిళనాడు అంటారు, మరొకరు ఆసియా అంటారు. ఏది కరెక్టు? అన్నీ కరెక్టే. ఏ సందర్భంలో మాట్లాడితే ఆ సందర్భాన్నిబట్టి అది మారుతుంది. చెన్నైలో ఉండి మాట్లాడితే అది అడయార్ అవుతుంది; ఖండాలపరంగా మాట్లాడితే ఆసియా ఖండంలోకి వస్తుంది.

అదే విధంగా చైతన్యం సర్వవ్యాపకం అయినా కూడా, ఆ చైతన్యాన్ని వ్యష్టిపరంగా చూస్తే, వ్యష్టిలో ఉన్న చైతన్యాన్ని క్షేత్రజ్ఞుడు లేదా జీవాత్మ అంటారు. అదే చైతన్యాన్ని సమష్టిపరంగా చూస్తే జ్ఞేయంబ్రహ్మ లేదా పరమాత్మ అంటారు. ఆ విధంగా క్షేత్రజ్ఞుడు అంటే జ్ఞేయంబ్రహ్మ.

శ్లో. 19 **ఇతి క్షేత్రం తథా జ్ఞానం జ్ఞేయం చోక్తం సమాసతః ।**
**మద్భక్త ఏతద్విజ్ఞాయ మద్భావాయోపపద్యతే ॥**
ఇతి, క్షేత్రమ్, తథా, జ్ఞానమ్, జ్ఞేయమ్, చ, ఉక్తమ్, సమాసతః,
మద్భక్తః, ఏతత్, విజ్ఞాయ, మద్భావాయ, ఉపపద్యతే ॥

| | | | |
|---|---|---|---|
| ఇతి | = ఈ విధముగా | సమాసతః | = సంక్షిప్తముగా |
| క్షేత్రమ్ | = క్షేత్రముగురించి | ఉక్తమ్ | = చెప్పబడినది |
| తథా | = అలాగే | మద్భకః | = నా భక్తుడు |
| జ్ఞానమ్ | = జ్ఞానముగురించి | ఏతత్ | = దీనిని |
| చ | = ఇంకా | విజ్ఞాయ | = సమగ్రముగా తెలిసికొని |
| జ్ఞేయమ్ | = తెలిసికొనదగిన పరమాత్మ స్వరూపముగురించి | మద్భావాయ | = నా స్వరూపమునే |
| | | ఉపపద్యతే | = పొందును |

**ఇతి క్షేత్రమ్, తథా జ్ఞానమ్ జ్ఞేయమ్ చ సమాసతః ఉక్తమ్,**
**ఏతత్ విజ్ఞాయ, మత్-భక్తః మత్-భావాయ ఉపపద్యతే ॥**

తా: ఈ విధముగా క్షేత్రముగురించి అలాగే జ్ఞానముగురించి ఇంకా తెలిసికొనదగిన పరమాత్మ స్వరూపము గురించి సంక్షిప్తముగా చెప్పబడినది. నా భక్తుడు దీనిని సమగ్రముగా తెలిసికొని నా స్వరూపమునే పొందును.

ఈ శ్లోకంలో కృష్ణపరమాత్మ తాను ఇంతవరకూ ఏంచెప్పాడో ఒకసారి మళ్ళీ చెబుతున్నాడు. అర్జునుడు ఆరు విషయాల గురించి అడిగాడు. అందులో నాలుగు చెప్పాడు. ఇది బోధనాపద్ధతిలో ఒక ప్రత్యేకత. చాలా కష్టమైన అంశాల గురించి బోధిస్తున్నప్పుడు, శిష్యుడు అర్థం చేసుకుంటున్నాడో లేదో తెలుసుకోవాలి. ఇంతవరకూ చెప్పినదాని గురించి ఒకసారి చెపితే, శిష్యునికి కూడా అర్థమవుతుంది. దీన్ని సింహావలోక న్యాయం అంటారు. అడవికి రాజైన సింహం గంభీరంగా కొన్ని అడుగులు వేసి నడిచాక, మధ్యలో ఒకసారి ఆగి చుట్టూ చూస్తుందిట. ఎవరైనా శత్రువులు పొంచివున్నారా అని అవలోకనం చేస్తుందిట. అలా గురువు కొంత బోధచేశాక, ఒకసారి ఆగి, అంతవరకు చెప్పినదాని సారాంశం చెబుతాడు. అప్పుడు శిష్యునికి కూడా తనకు అర్థమయిందో లేదో బేరీజు వేసుకునేందుకు అవకాశం ఉంటుంది.

**ఇతి క్షేత్రం తథా జ్ఞానం జ్ఞేయం చోక్తమ్** – కృష్ణపరమాత్మ చెబుతున్నాడు. ఓ అర్జునా, ఇంతవరకూ నేను నీకు ఈ అంశాలను బోధించాను. అవి క్షేత్రం, జ్ఞానం, జ్ఞేయం. మనం జ్ఞేయం, క్షేత్రజ్ఞుడు ఒకటేనని ఇందాకే చూశాము. అందువల్ల క్షేత్రజ్ఞుని గురించి కూడా బోధచేసినట్టుగా భావించుకోవాలి. అంటే నాలుగు అంశాలు. చ ఉక్తమ్ అంటే నేను నీకు బోధ చేశాను. ఎలా చేశాడు?

**సమాసతః** – సంక్షిప్తంగా చేశాను అంటున్నాడు కృష్ణపరమాత్మ.

ఏదైనా బోధ సంక్షిప్తంగా చేసినప్పుడు, స్పందన రెండురకాలుగా ఉండవచ్చు. బుద్ధి పదునుగా, సూక్ష్మంగా ఉన్నవారికి కుతూహలం పెరిగి, దాని గురించి ఇంకా లోతుగా తెలుసుకోవాలని ఉంటుంది. ఆ కాస్త బోధే తలమీదనుంచి వెళ్ళిపోయింది అనుకునేవారు వేదాంతం నేర్చుకున్నది చాలు; హాయిగా కృష్ణా, రామా అనుకుంటూ నా పూజలు నేను చేసుకుంటాను అనుకుని వేదాంతబోధకు స్వస్తి చెప్పేస్తారు. కొత్తగా ఉత్సాహం వచ్చిన మొదటిరకంవారు ఉపనిషత్తులు ఇంకా లోతుగా జ్ఞానబోధ చేస్తాయి కాబట్టి వాటిలోకి అడుగుపెడతారు.

ఈ అధ్యాయంలో ఇంతవరకూ జరిగిన జ్ఞానబోధను ట్రైలర్‌గా భావించవచ్చు. ఇప్పటి పరిభాష వాడాలంటే టీజర్ అనవచ్చు. అది నచ్చితే, తక్కినభాగం వివరంగా చూడవచ్చు.

**మద్భక్త ఏతద్విజ్ఞాయ** – నా భక్తుడు దీని గురించి సమగ్రంగా తెలుసుకోగలడు అంటున్నాడు కృష్ణపరమాత్మ. దీన్నిబట్టి ఆత్మజ్ఞానం పొందటానికి భక్తి ఉండితీరాలని కృష్ణపరమాత్మ సూచిస్తున్నట్టు అర్థమవుతున్నది. నిజానికి, ఇంతకుముందే ఈ విషయాన్ని చెప్పాడు కృష్ణపరమాత్మ.

**మయి చానన్యయోగేన భక్తిరవ్యభిచారిణీ** – 13.11

అంటే వేదాంతబోధ చేసే గురువు, నేర్చుకునే శిష్యుడు – ఇద్దరికీ భక్తి ఉండితీరాలి. అందువల్లనే మన సాంప్రదాయంలో దైవభక్తి, ఆత్మజ్ఞానం పరస్పరం కలిసివుంటాయి. ఆధ్యాత్మిక విశ్లేషణకు భక్తి అవసరంలేదని ఒక అపోహ ఉంది. ఆత్మజ్ఞానం బోధించేటప్పుడు కూడా, గురువు భగవంతుని ఫోటో ముందు పెట్టుకుని, శాంతిపాఠంతో మొదలుపెడతాడు. బోధ అయ్యాక కూడా శాంతిపాఠంతో ముగిస్తాడు. భక్తి లేకుండా జ్ఞానం పొందితే, అతనికి జ్ఞానం వస్తుందేమో కాని, అతనిలో మార్పురాదు. దాన్ని ఆర్మ్‌ఛెయిర్ ఫిలాసఫీ అంటారు. అందువల్ల కృష్ణపరమాత్మ, జ్ఞానం పొందటానికి భక్తుడై ఉండాలని గట్టిగా చెబుతున్నాడు. నిజానికి, పద్దెనిమిదవ అధ్యాయం చివర్లో గీతాబోధ చేసే గురువుకు ఒక హెచ్చరిక కూడా చేస్తాడు కృష్ణపరమాత్మ.

**ఇదం తే నాతపస్కాయ నాభక్తాయ కదాచన ।**

**న చాశుశ్రూషవే వాచ్యం న చ మాం యోఽభ్యసూయతి ॥** – 18.67

**నాభక్తాయ కదాచన ఇదం న వాచ్యమ్** – భక్తుడు కానివ్యక్తికి గీతను బోధించవద్దు అంటున్నాడు కృష్ణపరమాత్మ. ఇక్కడ ఈ శ్లోకంలో ఇంకొక అడుగు ముందుకేసి నా భక్తుడు అయివుండాలి అంటున్నాడు. కాకపోతే నా భక్తుడు అంటే కృష్ణుని భక్తుడు కాదు, ఈశ్వరభక్తుడు అని అర్థం. ఏతత్ విజ్ఞాయ అంటే అటువంటి భక్తుడు జ్ఞానం పొంది తీరుతాడు. ఒకవేళ అతనికి ఈ బోధ కష్టంగా అనిపించినా కూడా, అతని భక్తే అతని బుద్ధిని పదునుగా చేస్తుంది.

రెండవసారి వింటే ఇంకా బాగా అర్థమవుతుంది. కాని అతను తనకు బాగా అర్థమవుతోంది అనుకోడు, గురువు అంతకుముందుకన్నా బాగా చెబుతున్నాడు అనుకుంటాడు. గురువు కూడా ఏమీ అనుకోడు, ఎందుకంటే శిష్యునికి బోధ అర్థమవటం కావాలి గురువుకు. అందువల్ల వేదాంతాన్ని పదేపదే వినాలి. ఒక్కొక్కసారి విన్నకొద్దీ, ఒక్కొక్క విషయం సుస్పష్టమవుతూ వస్తుంది.

బ్రహ్మజ్ఞానం పొందటానికి వేదాంతం వింటూ వుండాలని వస్తుంది బ్రహ్మసూత్రాల్లో. దాన్ని శ్రవణం అంటారు. శ్రవణం నిర్వచనమే చెబుతుంది ఎలా వినాలో. క్రమం తప్పకుండా ఒక క్రమపద్ధతిలో, కొన్ని సంవత్సరాలపాటు వేదాంత అధ్యయనం ఒక సమర్థవంతమైన గురువు వద్ద చెయ్యాలి. అలా చేస్తే ఏం ఫలం కలుగుతుంది?

**మద్భావాయ ఉపపద్యతే** – నా స్వరూపాన్నే పొందుతాడు. మద్భావః అంటే బ్రహ్మభావః, ఈశ్వరభావః. భావః అంటే స్వరూపం; మద్భావః అంటే పూర్ణత్వం. ఆత్మజ్ఞానం పొందకముందు తను ఒక పరిమితి ఉన్న జీవిని అనుకుని కృంగిపోతుండేవాడు. ఇప్పుడు ఆ జ్ఞానం పొందితే పూర్ణత్వభావన పొందుతాడు. ఒంటరితనం బాధించదు. అంతకుముందు, చుట్టూ అందరూ ఉన్నా, నలుగురు పిల్లలు ఉన్నా, 'నువ్వు బాగున్నావా, ఆరోగ్యం ఎలా ఉంది?' అని అడిగేనాథుడే లేడని వాపోయేవాడు. దీన్ని సంసారం అంటారు.

ఒంట్లో ఓపిక ఉన్నంతవరకూ ఈ ఒంటరితనం అంతగా బాధించదు. ఎందుకంటే ఏ సినిమాకో, బీచ్‌కో స్నేహితులతో వెళ్ళిపోతాడు. క్షణం తీరిక ఉండదు. వృద్ధాప్యం మీదపడ్డాక, స్వంతంగా పక్కమీదనుంచి లేవటమే కష్టం అవుతుంది. పిల్లలు చెట్టుకొకరు, పుట్టకొకరు అయిపోతారు. వారికి ఆపేక్షలున్నా వారి పరుగుపందెంలో వారికి తీరిక ఉండదు. అందువల్ల ఒంటరితనం, ప్రేమరాహిత్యం మనిషిని పట్టి పీడిస్తాయి, కాని ఆ వ్యక్తి గనుక ఆత్మజ్ఞానం పొందితే, ఈ శూన్యభావం తొలగిపోయి, పూర్ణత్వం ఏర్పడుతుంది.

శ్లో. 20 **ప్రకృతిం పురుషం చైవ విద్ధ్యనాదీ ఉభావపి ।**
**వికారాంశ్చ గుణాంశ్చైవ విద్ధి ప్రకృతిసంభవాన్ ॥**
ప్రకృతిమ్, పురుషమ్, చ, ఏవ, విద్ధి, అనాదీ, ఉభౌ, అపి,
వికారాన్, చ, గుణాన్, చ, ఏవ, విద్ధి, ప్రకృతిసంభవాన్ ॥

| | | | |
|---|---|---|---|
| ప్రకృతిమ్ | = ప్రకృతి | చ | = ఇంకా |
| చ | = ఇంకా | వికారాన్, చ | = రాగద్వేషములు |
| పురుషమ్ | = పురుషుడు | గుణాన్, అపి | = సత్త్వరజస్తమో గుణములు |
| ఉభౌ, ఏవ | = ఈ రెండును | ప్రకృతి | = ప్రకృతినుండియే |
| అనాదీ | = ఆది లేనివని | సంభవాన్, ఏవ | = ఉత్పన్నములైన వానినిగా |
| విద్ధి | = తెలుసుకొనుము | విద్ధి | = తెలుసుకొనుము |

**(త్వం) ప్రకృతిమ్ పురుషమ్ చ ఉభౌ అపి అనాదీ ఏవ విద్ధి ।**
**వికారాన్ చ గుణాన్ చ ప్రకృతి-సమ్భవాన్ ఏవ విద్ధి ॥**

తా: ప్రకృతి ఇంకా పురుషుడు ఈ రెండును ఆది లేనివని తెలుసుకొనుము. ఇంకా రాగద్వేషములు సత్త్వరజస్తమో గుణములు ప్రకృతినుండియే ఉత్పన్నములైన వానినిగా తెలుసుకొనుము.

### 5. ప్రకృతి–పురుషుడు : శ్లోకాలు 20–24

ముందు శ్లోకంతో తను అంతకుముందు చెప్పిన అంశాలకు ముక్తాయింపు పలికాడని చూశాము. ఇప్పుడు మిగిలిన రెండూ చెప్పబోతున్నాడు. అవి పురుషుడు, ప్రకృతి. కృష్ణపరమాత్మ ఈ రెండింటినీ కలిపి చెప్పబోతున్నాడు. ఎందుకంటే ఈ రెండింటికీ అవినాభావ సంబంధం ఉంది. క్షేత్రం–క్షేత్రజ్ఞుడు ఒక జంట ఎలాగో, ప్రకృతి–పురుషుడు మరొక జంట. వీటి గురించి శ్లోకాలు 20–24లో చర్చించబోతున్నాడు కృష్ణపరమాత్మ.

ఈ ప్రకృతి–పురుషుడు జంట కూడా క్షేత్రం–క్షేత్రజ్ఞుడు జంటలాంటిదే. వీటి గురించి ముందే చూశాము. క్షేత్రం అంటే పదార్థం; క్షేత్రజ్ఞుడు అంటే చైతన్యం. చైతన్యానికి స్వతంత్రసత్తా ఉందని అంటుంది శాస్త్రం. అది పదార్థంలో ఒక భాగం గాని, ఒక లక్షణం గాని, దాన్నుంచి ఉత్పత్తి చెందలేదనీ చూశాము. ఫ్యాను ఉదాహరణ గుర్తుంచుకోవాలి. ఫ్యానులో రెండు అంశాలు ఉన్నాయి. అవి కనబడే ఫ్యాను, కనబడని విద్యుచ్ఛక్తి. కనబడని విద్యుచ్ఛక్తి ఫ్యాను తిరగటం ఆగిపోయాక కూడా ఉంటుంది. అలాగే మన శరీరం కూడా రెండు అంశాల మేలుకలయిక. కనబడే పదార్థం, కనబడని చైతన్యాల మేలుకలయిక. వీటిని శాస్త్రంలో అనాత్మ, ఆత్మ అంటాము.

కృష్ణపరమాత్మ ఏడవ అధ్యాయంలో పరాప్రకృతి, అపరాప్రకృతి అన్నాడు. పరాప్రకృతి చైతన్యం; అపరాప్రకృతి పదార్థం. ఇప్పుడు ఆ పరాప్రకృతి, అపరాప్రకృతులనే పురుషుడు, ప్రకృతి పదాలతో వర్ణించబోతున్నాడు. పురుషుడు అంటే చైతన్యతత్త్వం; ప్రకృతి అంటే పదార్థతత్త్వం.

ఉపనిషత్తులు కూడా పురుషుడు, ప్రకృతి పదాలు వాడతాయి కాని, చాలా అరుదుగా వాడతాయి. ఎక్కువగా ఉపనిషత్తులలో బ్రహ్మ, మాయ పదాలను చూస్తాము. బ్రహ్మ అంటే పురుషుడు, మాయ అంటే ప్రకృతి. ప్రకృతి, పురుషుల పదాలు సాంఖ్యదర్శనంలో వస్తాయి ఎక్కువగా. ఇప్పుడు కృష్ణపరమాత్మ తన బోధను ఎలా మొదలుపెడతాడో చూద్దాము.

**ప్రకృతిం పురుషం చైవ విద్ధ్యనాదీ ఉభావపి** – ఓ అర్జునా! ప్రకృతి, పురుషుడు కూడా అనాదిగా వస్తున్నాయి. అనాది అంటే మొదటినుంచీ ఉన్నాయి. శాస్త్రంలో పురుషుణ్ణి బ్రహ్మ అంటారనీ, ప్రకృతిని మాయ అంటారనీ చూశాము. ఈ రెండింటి మేలుకలయికే ఈశ్వరుడు.

**బ్రహ్మ + మాయ = ఈశ్వరుడు / పురుషుడు + ప్రకృతి = ఈశ్వరుడు**

సృష్టికి ముందు నిర్గుణబ్రహ్మ మాత్రమే ఉన్నాడు. నిర్గుణబ్రహ్మ మాయతో కలిసి జగత్తును సృష్టించాడు. జగత్తుకు ఒక ఆది ఉంది, కాని ఈశ్వరుడు అనాది. అంటే సృష్టికి ముందు కూడా ఈశ్వరుడు ఉన్నాడు. ఈ ఈశ్వరుడు పురుషుడు, ప్రకృతిల మేలుకలయిక అని చూశాము.

పురుషుడు, ప్రకృతులకు ఒక సమానధర్మం ఉంది. అది – **అనాదిత్వం**. రెండవ సమానఅంశం – **కారణత్వం**. ప్రకృతి–పురుషుడు రెండూ కలిసి సృష్టిచేశాయి. తల్లిదండ్రులిద్దరూ కారణమే పిల్లల జన్మకు. తండ్రిని మాత్రం లేదా తల్లిని మాత్రం కారణంగా అభివర్ణించలేము.

**జగతః పితరౌ వందే పార్వతీ పరమేశ్వరౌ**

పార్వతీపరమేశ్వరులిద్దరినీ కలిపి తల్లిదండ్రులుగా స్తుతిస్తారు.

ప్రకృతి, పురుషులకు ఉన్న సమాన అంశాలు – అనాదిత్వం, కారణత్వం. కాని వారి మధ్య కొన్ని భేదాలు కూడా ఉన్నాయి. ఆ భేదాలు చాలా ఉన్నా కూడా, ఏడవ అధ్యాయంలో నాలుగు భేదాలను చూశాము. వాటిని అక్కడ పరాప్రకృతి, అపరాప్రకృతుల మధ్య భేదంగా చూస్తే, ఇక్కడ ప్రకృతి, పురుషుడు మధ్య భేదాలుగా చూడబోతున్నాము.

ప్రకృతిని పదార్థం అనీ, పురుషుణ్ణి తత్త్వం అనీ అంటారు. పదార్థం శక్తిగా మారుతుంది; శక్తి పదార్థంగా మారుతుంది. కాని పురుషుడు పదార్థమూ కాదు, శక్తీ కాదు; చేతనతత్త్వం. ప్రకృతి అచేతనతత్త్వం.

ప్రకృతిని ఒకకోణంలో చూస్తే దానికి మూడు గుణాలు ఉన్నాయి అంటాము. అవి సత్త్వరజస్తమస్సులు. ఇంకొక కోణంలో చూస్తే ఐదుగుణాలు ఉన్నాయి అంటాము. అవి శబ్దస్పర్శరూపరసగంధాలు. అలా ప్రకృతి సగుణతత్త్వం; పురుషుడు నిర్గుణతత్త్వం.

పురుషుడు నిర్వికారం, ప్రకృతి సవికారం. పురుషుడు కాలాతీతం. అందువల్ల కాలం పురుషుణ్ణి ప్రభావితం చెయ్యలేదు. కాని ప్రకృతి కాలం కోరల్లో చిక్కుకుంటుంది. ఇంతకుముందు చూసినట్టుగా ప్రకృతి పదార్థం నుంచి శక్తిగా మారుతుంది. అణుబాంబు విస్ఫోటనలో పదార్థం శక్తిగా మారుతుంది. పదార్థంలో అనేక మార్పులు ఉంటాయి. ప్రకృతి సవికారం; పురుషుడు నిర్వికారం.

నాలుగవ భేదం సాంకేతిక భేదం. ఇప్పుడు అది అవసరం లేకపోయినా, ఇప్పుడు తెలుసుకుంటే ముందు ముందు చర్చల్లో ఉపయోగపడుతుంది. అది – పురుషుడు సత్యం, ప్రకృతి మిథ్య. పురుషుడు అంటే చైతన్యం అని చూశాము. చైతన్యానికి విడిగా ఉనికి ఉంది. అందువల్లనే **చిత్ ఏవ సత్** అంటాము. అందువల్ల చైతన్యం సత్యం, కాని పదార్థానికి అంటే ప్రకృతికి విడిగా ఉనికి లేదు. ఒక వస్తువుకు ఉనికి ఉండాలంటేనే, దానికి చైతన్యం తోడవ్వాలి. చైతన్యం లేని వస్తువుయొక్క ఉనికి గురించి మాట్లాడలేము. స్వతంత్ర సత్తా లేని వస్తువును మిథ్య అంటారు. ఆ విధంగా పురుషుడు సత్యం, ప్రకృతి మిథ్య. ఈ నాలుగు ప్రాథమిక భేదాలను మళ్ళీ టూకీగా చూద్దాము.

| **పురుషుడు** | **ప్రకృతి** |
|---|---|
| ఎ) చేతనతత్త్వం | అచేతనతత్త్వం |
| బి) నిర్గుణతత్త్వం | సగుణతత్త్వం |
| సి) నిర్వికారతత్త్వం | సవికారతత్త్వం |
| డి) సత్యం | మిథ్యా |

ఈ ప్రకృతీ, పురుషుల మేలుకలయికే ఈశ్వరుడు అంటారు.ఇది సగుణ ఈశ్వరుడు. శాస్త్రంలో నిర్గుణ ఈశ్వరుణ్ణి బ్రహ్మ అంటారు, సత్ అంటారు.

**సదేవ సోమ్యేదమగ్ర ఆసీదేకమేవాద్వితీయమ్** – ఛాందోగ్యం

సృష్టికి ముందు సత్ మాత్రమే ఉంది. సృష్టికి ముందు సత్ మాత్రమే ఉంది అంటే సత్ ఎక్కడ ఉంది అని ప్రశ్న వస్తుంది. ఎందుకంటే సృష్టికి ముందు దేశం (ఆకాశం) కూడా లేదు. ఆకాశం కూడా సృష్టించబడింది.

**తస్మాద్వా ఏతస్మాదాత్మన ఆకాశస్సంభూతః** – తైత్తిరీయం

అలా దేశ అతీతమైన బ్రహ్మ సృష్టికి ముందు ఉన్నాడు. కృష్ణపరమాత్మ కూడా ఆ విషయం చెబుతున్నాడు.

ప్రకృతిం పురుషమ్ ఉభౌ చైవ అనాదీ – ఉభౌ అంటే రెండూ. అనాదీ అంటే ఆరంభం లేనిది. అంటే ప్రకృతి, పురుషుడూ రెండూ ఆదిలేనివి. దాని తర్వాత ఏమయింది? పురుషుడు నిర్వికారం, దేశకాలాతీతం అని చూశాము. అంటే పురుషుడు సృష్టికి ముందూ, సృష్టి జరిగాకా, ప్రళయంలోనూ ఏ విధమైన వికారాలకూ లోనుగాడు.

**న జాయతే మ్రియతే వా కదాచిత్ నాయం భూత్వా భవితా వా న భూయః ।**
**అజో నిత్యః శాశ్వతోఽయం పురాణో న హన్యతే హన్యమానే శరీరే ॥** – 2.20

ఉన్నవి రెండే – ప్రకృతీ, పురుషుడు. పురుషుడు మార్పుకు లోనుకాడు అంటే జరిగే మార్పులన్నీ దేనికి జరగాలి? ప్రకృతికి.

**వికారాంశ్చ గుణాంశ్చైవ విద్ధి ప్రకృతిసంభవాన్** – ప్రకృతినుంచే ఈ విశ్వం వచ్చింది. విత్తనంనుంచి ముందు చిన్న మొలక వచ్చి, తర్వాత అది పెద్ద వృక్షంగా ఎదిగినట్టుగా; ప్రకృతి అనే కారణ అవస్థనుంచి సూక్ష్మ అవస్థ; సూక్ష్మ అవస్థనుంచి స్థూల అవస్థ వచ్చాయి. దాన్నుంచి ఏం పుట్టింది? వికారాంశ్చ. వికారః అంటే కార్యం; ప్రకృతినుంచి ఈ జగత్తు పుట్టింది. ప్రకృతిని **మాయ** అని కూడా అంటారని చూశాము. అందువల్ల ఈ జగత్తును **మాయికం** అని కూడా అంటారు.

ప్రకృతినుంచి పుట్టినవి ఏమిటి? ముందుగా పంచభూతాలు పుట్టాయి. అవి – ఆకాశం, వాయువు, అగ్ని, నీరు, భూమి. ఈ పంచభూతాలనుంచి పంచభూతాలతో చెయ్యబడిన అనేక వస్తువులు వచ్చాయి. వాటిని పాంచభౌతికాలు అంటారు. అలా పంచభూతాలు, పాంచభౌతికాలు వచ్చాయి.

పాంచభౌతికాలు ఏమిటి? పద్నాలుగు లోకాలు, కొండలు, నక్షత్రాలు, గ్రహాలు. అంతేకాదు, మన స్థూలశరీరం, మన మనస్సు కూడా. మన శరీరం పాంచభౌతికం. కెమిస్ట్రీ పరంగా చూసినా కూడా అల్యూమినియం, బేరియం, కార్బన్ లాంటి అనేక ఎలిమెంట్స్‌వల్ల ఏర్పడింది మన శరీరం. శరీరం పాంచభౌతికం అని చెప్పటానికి ఇంకొక ఆధారం – శరీరం షడ్వికారాలకు లోనవుతుంది. ఆహారం తీసుకున్న రెండు మూడు గంటలకు మళ్ళీ ఆకలి వేస్తుంది. ఉన్నట్టుండి చాలా లావెక్కుతాము; మళ్ళీ శ్రద్ధ పెట్టి కొన్ని నియమాలు పాటిస్తే లావు తగ్గుతాము, మళ్ళీ

కాస్త ఏమరుపాటుగా ఉంటే లావెక్కిపోతాము. దీన్నిబట్టే శరీరం పురుషతత్త్వం కాదు, ప్రకృతితత్త్వం అని తెలుస్తున్నది. ఎందుకంటే పురుషుడు నిర్వికారం అని చూశాము.

మనస్సు విషయం తీసుకుంటే మనస్సు పురుషునినుంచి వచ్చిందా, ప్రకృతినుంచి వచ్చిందా? ప్రకృతినుంచే వచ్చింది! మనస్సు కూడా అనేక వికారాలకు లోనవుతుంది. హార్మోన్ల మార్పువల్ల మనస్సు కూడా ప్రభావితమవుతుంది. పైగా మనస్సులో మన భావాలు నిరంతరం మారుతుంటాయని మనకు ఎవరూ ప్రత్యేకించి చెప్పనవసరం లేదు.

శరీరం, మనస్సులు ప్రకృతినుంచి ఉత్పత్తి చెందితే, రెండూ అచేతనం అవాలి కదా! ప్రకృతి అచేతనం అని చూశాము. అచేతన ప్రకృతినుంచి వచ్చే కార్యం కూడా అచేతనమే అవ్వాలి. కాని శరీరం, మనస్సులు అచేతనంగా లేవు. వాటిలో చైతన్యం ఉంది. అదెలా సాధ్యం అంటే ఈ చేతనతత్త్వం వాటికి స్వతహాగా లేదు; అవి అరువు తెచ్చుకున్నాయి అంటుంది శాస్త్రం. ఒక అద్దం స్వతహాగా ప్రకాశం లేనిదైనా కూడా, దానికి సూర్యుడిని ప్రతిబింబింపజేసే శక్తి ఉంది. అలా మనస్సు జడమైనా, దానికి కూడా చైతన్యాన్ని ప్రతిబింబింపజేసి, శరీరాన్ని చైతన్యవంతం చేసే శక్తి ఉంది.

**ప్రకృతిసంభవాన్** – అందువల్ల ఇవన్నీ ప్రకృతినుంచి పుట్టాయి అంటున్నాడు కృష్ణపరమాత్మ. ఈ వస్తువులన్నీ ప్రకృతినుంచి పుట్టటమే కాదు, ప్రకృతి గుణాలు కూడా వాటికి వస్తాయి. ఎందుకు?

**కారణ గుణాః కార్యే అనువర్తంతే**

కారణంలో ఉన్న గుణాలు కార్యంలోకి వస్తాయి. అందువల్లనే చూడండి, పిల్లలను వారి తల్లిదండ్రుల గుణాలను పుణికి పుచ్చుకున్నారు అంటారు. ఒక్కోసారి తల్లి గుణాలు కొట్టొచినట్టు కనబడితే, ఒక్కోసారి తండ్రి గుణాలు ప్రస్ఫుటంగా కనిపిస్తాయి. రూపురేఖలు, రంగు కూడా అలాగే వస్తాయి. ఒక బాబుకు తల్లి రంగు వస్తే, ఇంకొక బాబుకు తండ్రి రంగు వస్తుంది.

ఆ విధంగా ప్రకృతి గుణాలు ప్రపంచంలో వస్తాయి. ప్రకృతిలో ఉన్న సత్త్వరజస్తమోగుణాలు వ్యక్తిలో కనిపిస్తాయి. అలాగే జగత్తులో శబ్దస్పర్శరూపరసగంధాలు ఉంటాయి. అంతేకాదు, రాగద్వేషాలనే భావోద్రేకాలు కూడా ప్రకృతికి చెందినవే కాని పురుషునికి చెందినవి కావు.

శ్లో. 21 **కార్యకరణకర్తృత్వే హేతుః ప్రకృతిరుచ్యతే ।**
**పురుషః సుఖదుఃఖానాం భోక్తృత్వే హేతురుచ్యతే ॥**
కార్యకరణకర్తృత్వే, హేతుః, ప్రకృతిః, ఉచ్యతే,
పురుషః, సుఖదుఃఖానామ్, భోక్తృత్వే హేతుః, ఉచ్యతే ॥

| | | | |
|---|---|---|---|
| కార్యకరణ | = కార్యములను, కరణములను | భోక్తృత్వే | = అనుభవించుటలో |
| కర్తృత్వే | = ఉత్పన్నము చేయుటలో | పురుషః | = జీవాత్మయే |
| ప్రకృతిః | = ప్రకృతియే | హేతుః | = హేతువుగా |
| హేతుః, ఉచ్యతే | = హేతువుగా చెప్పబడును | ఉచ్యతే | = చెప్పబడుచున్నది |
| సుఖదుఃఖనామ్ | = సుఖదుఃఖములను | | |

**ప్రకృతిః కార్య-కరణ-కర్తృత్వే హేతుః ఉచ్యతే ।**
**పురుషః సుఖ-దుఃఖానామ్ భోక్తృత్వే హేతుః ఉచ్యతే ॥**

తా: కార్యములను, కరణములను ఉత్పన్నము చేయుటలో ప్రకృతియే హేతువుగా చెప్పబడును. సుఖదుఃఖములను అనుభవించుటలో జీవాత్మయే హేతువుగా చెప్పబడుచున్నది.

మొదటి పాదం అర్థం ఇంచుమించుగా ఇంతకుముందు శ్లోకంలో వచ్చినదే. ఈ సృష్టిలో మొత్తం, కార్యకరణ సంఘాతంతో సహా, ప్రకృతినుంచి వచ్చినవే.

**కార్యకరణ కర్తృత్వే** – మామూలుగా కార్యం అంటే ఉత్పత్తి చెందినది; కాని ఇక్కడ కార్యం అంటే స్థూలశరీరం; కరణం అంటే మనస్సు లేదా మొత్తం సూక్ష్మశరీరం; కర్తృత్వే అంటే సృష్టిలో. అంటే ఈ సృష్టిలో స్థూల, సూక్ష్మశరీరాల సృష్టికి కారణం;

**హేతుః ప్రకృతిరుచ్యతే** – ప్రకృతి కారణం అని అంటారు. స్థూల, సూక్ష్మశరీరాలు అంటే మనుష్యులే కాదు, అన్ని జీవరాశులు. అన్ని జీవరాశులు ప్రకృతినుంచే వచ్చాయని ఒక అర్థం. ఇంకొక అర్థం కూడా చెప్పవచ్చు.

కార్యకరణే కర్తృత్వే అంటే కారణమూ, కార్యమూ – రెండూ కూడా ప్రకృతినుంచే వచ్చాయి. జగత్తును కార్యకారణాలుగా విభజిస్తే, కారణం పంచభూతాలు; కార్యం పాంచభౌతిక వస్తువులూ అవుతాయి. కార్యకారణాలకు కూడా కారణం ప్రకృతి. అంటే కార్యకరణసంఘాతమైన ఈ వ్యష్టి సృష్టికీ ప్రకృతే కారణం; కార్యకారణాలున్న ఈ జగత్తుకు కూడా ప్రకృతే కారణం.

ఇప్పుడొక ప్రాథమిక సందేహం వస్తుంది. ఈ జగత్తు మొత్తాన్ని ప్రకృతే సృష్టిస్తే, పురుషుడు ఏం చేస్తాడు? పంచభూతాలు ప్రకృతినుంచి వస్తే, పాంచభౌతిక వస్తువులు ప్రకృతినుంచి వస్తే, కార్యకరణసంఘాతం అయిన వ్యష్టి ప్రకృతినుంచి వస్తే పురుషుడు ఏం చేస్తాడు? మనం అనుభవిస్తున్న జగత్తు మారుతోంది; అనుభవిస్తున్న శరీరం మారుతోంది; అనుభవిస్తున్న మనస్సు మారుతోంది. మారే లక్షణం ప్రకృతికి అని తెలుసు మనకు.

ఈ పురుషుడు ఎక్కడ ఉన్నాడు? ఈ పురుషునికోసం వెతికే ప్రయత్నం చేస్తారు కొందరు. బాహ్యప్రపంచంలో చూద్దామా అంటే బాహ్యప్రపంచం అనేక మార్పులకు లోనవుతుంది. అంతఃప్రపంచంలో చూద్దామా అంటే మనస్సు అనేక రాగద్వేషాలకు లోనవుతుంది. మారే వస్తువు ప్రకృతి అనే సూత్రం మనకు తెలుసు. మరి పురుషుడు ఎక్కడ ఉన్నాడు? ఆ పురుషునికోసం వెతకవద్దు అంటున్నాడు కృష్ణపరమాత్మ. మారే జగత్తును చూస్తున్న నువ్వే పురుషుడివి అంటున్నాడు కృష్ణపరమాత్మ.

జగత్తును అనుభవిస్తున్న నేను జడమా, చైతన్యమా? అర్థం లేని ప్రశ్న. అనుభవిస్తున్న నేను చైతన్యతత్త్వం అయితేనే అనుభవించగలను. జగత్తును, శరీరాన్ని, మనస్సును సాక్షిగా చూస్తున్న నేనే పురుషుణ్ణి. జగత్తును, శరీరాన్ని, మనస్సును సాక్షిగా చూస్తున్న నన్ను నేను చూసుకోవటమెలా? దాన్ని చూశానంటే అది ఆబ్జెక్టు అవుతుంది. అది కూడా మనశ్శరీరాల్లాంటిదే అవుతుంది.

**ఎవ్వర్ ది ఎక్స్‌పీరియన్సర్, నెవ్వర్ ది ఎక్స్‌పీరియన్స్‌డ్**

**అనుభవించే నేనే అది ఎప్పటికీ, అనుభవించబడే వస్తువు కాదు ఎన్నటికీ**. అనుభవించే వస్తువులను చూసే నేను పురుషుణ్ణి– **అహం బ్రహ్మ అస్మి.** ఎవరంటున్నారు ఈ మాట? సాక్షాత్తూ కృష్ణపరమాత్మే.

**పురుషః సుఖదుఃఖానాం భోక్తృత్వే హేతురుచ్యతే** – పురుషుడు ఎక్కడో బాహ్యంగా లేడు. చేతనం, నిర్వికారం, నిర్గుణం, సత్యం అయిన పురుషుడు అచేతనం, సవికారం, సగుణం, మిథ్య అయిన శరీరాలలో ఉన్నాడు. శరీరం ప్రకృతి, శరీరీ పురుషుడు.

పురుషుణ్ణి భోక్త అంటున్నాడు కృష్ణపరమాత్మ. ఇక్కడ భోక్త అంటే సాక్షిచైతన్యం. దేన్ని సాక్షిగా చూస్తాడు? పురుషునికి భిన్నంగా ఉన్నదాన్ని సాక్షిగా చూస్తాడు. పురుషునికి భిన్నంగా ఉన్నది ఏమిటి? ప్రకృతి. ప్రకృతి అంటే కార్యకరణసంఘాతం అని చూశాము. అంటే మనశ్శరీరాల మేలుకలయిక. మనశ్శరీరాలకు కలిగే సుఖదుఃఖాలను సాక్షిగా చూస్తాడు పురుషుడు. శరీరానికి వచ్చిపోయే ఆరోగ్యసమస్యలను సాక్షిగా చూస్తాడు; మనస్సులో కలిగే రాగద్వేషాలను, కామక్రోధాలను, లోభమోహాలను కూడా సాక్షిగా చూస్తాడు. ఆ లక్షణాలన్నీ చూడబడుతున్న ప్రకృతికి చెందుతాయి కాని పురుషునికి చెందవని చూశాము.

ఇది వేదాంతశాస్త్రంలో నేర్చుకునే ఒక అతిముఖ్యమైన సూత్రం. ఏమిటది? చూడబడుతున్న లక్షణాలు చూడబడుతున్న వస్తువుకు చెందుతాయి కాని చూసే వ్యక్తికి చెందవు. అంటే లక్షణాలు ఆబ్జెక్టుకు చెందుతాయి కాని, సబ్జెక్టుకు చెందవు. అందువల్ల పురుషః సుఖదుఃఖానాం భోక్తృత్వే హేతురుచ్యతే అన్నాడు. ప్రకృతి ఆబ్జెక్టు, పురుషుడు సబ్జెక్టు. పురుషుణ్ణి ఎన్నడూ ఆబ్జెక్టుగా చూడలేము.

ఈ విషయం అర్థం చేసుకోవటానికి అంతకుముందు కూడా కొన్ని ఉదాహరణలు చూశాము. విశాలప్రపంచాన్ని కళ్ళారా చూసే మీ విశాలనేత్రాలు తమను తాము చూసుకోలేవు. మహా అయితే అద్దంలో చూసుకోగలవు కాని, అప్పుడు కూడా అవి ప్రతిబింబాలు అవుతాయే కాని, అసలు కళ్ళు కాలేవు. అందరినీ చూసే మీ కళ్ళు తమను తాము చూసుకోలేవు. ఎంత విచారకరమైన విషయం!

నా కళ్ళను నేను చూసుకోలేకపోతే, అసలు నాకు కళ్ళు ఉన్నాయా? అర్థంలేని ప్రశ్న. కళ్ళు లేకపోతే, మీరు వేరే దేన్నీ చూడలేరు. మీరు జగత్తును చూస్తున్నారంటేనే, మీ కళ్ళు బాగా పనిచేస్తున్నాయని అర్థం. మళ్ళీ దానికి వేరే నిదర్శనం అవసరం లేదు. ఒక వస్తువు చూడబడింది అంటేనే దాన్ని ఒకరు చూస్తున్నారు అని అర్థం. అలా కన్ను ఒక ఉదాహరణ.

రెండవ ఉదాహరణ కెమెరా. ఏ ఫోటోలోనూ కెమెరా కనబడదు; కాని ఒక ఫోటో వచ్చిందంటే, కెమెరా ఉందని అర్థం. ఎందుకంటే కెమెరా లేకుండా ఫోటో తియ్యలేరు.

అలాగే నేను ఒక వస్తువును చూస్తున్నాను అంటే నేను ఉన్నట్టు అర్థం. అందువల్ల నేను ఉన్నానా లేదా అని నిరూపించనవసరం లేదు. నేను ఒకటి వెతుకుతున్నాను అంటే నేను ఉంటేనే కదా, ఇంకొక దాన్ని వెతకగలను. ఒకదాన్ని నిరూపించే నన్ను ఇంకొకరు నిరూపించనవసరం లేదు.

ఇంకొక ఉదాహరణ, పరమానందశిష్యుల కథ. ఒకసారి పదిమంది శిష్యులు నది దాటాక, అందరూ ఉన్నారో లేదోనని అనుమానం వచ్చింది వారికి. ఒక శిష్యుడు అందరినీ వరుసగా నిలుచోమని వారిని లెక్కపెట్టటం మొదలుపెట్టాడు. ఎన్నిసార్లు లెక్కపెట్టినా తొమ్మిదిమందే వస్తున్నారు. పదవ శిష్యుడు నదిలో మునిగిపోయాడని ఏడుపు లంకించుకున్నారు అందరూ. ఆ దారిన వెళుతున్న ఒక పెద్దమనిషి వచ్చి, వారి గోడును విని, వారిని లెక్కపెట్టి, ఆ లెక్కపెడుతున్న శిష్యుడే పదవ వ్యక్తి అని చెప్పాడు. తత్త్వమసి వచ్చేసింది. 'నువ్వే ఆ పదవ వ్యక్తివి,' అన్నాడు.

ఈ ఉదాహరణలను మర్చిపోకూడదు. పురుషుడెవరు? అందరినీ చూస్తున్న నేనే పురుషుణ్ణి. ఎంత అద్భుతమైన జ్ఞానం! ఈ సాక్షినే అహం అంటారు. అహం పదమే జడాన్ని కాకుండా, చైతన్యాన్ని సూచిస్తుంది. చూస్తున్న నేను పురుషుణ్ణి; చూడబడుతున్న జగత్తు ప్రకృతి. మనశ్శరీరాల మేలుకలయికను కూడా కలపాలి. ఎందులో కలుపుతాము? దాన్ని కూడా ప్రకృతిలోనే కలపాలి. జగత్తును ఆబ్జెక్టుగా తేలిగ్గా అర్థం చేసుకుంటాము కాని మనస్సును, శరీరాన్ని ఆబ్జెక్టుగా అంత త్వరగా స్వీకరించలేము. ఎందుకంటే అవి మనకు చాలా సన్నిహితంగా ఉన్నాయి. అంతేకాకుండా వాటిద్వారా మనం వ్యవహారం నడుపుతాము. అందువల్ల అవి నేనే అని పొరపాటుపడే అవకాశం ఉంది.

కళ్ళజోడు ఉదాహరణను కూడా అంతకుముందు చూశాము. కళ్ళజోడు బల్లమీద ఉన్నప్పుడు, బల్లమీద ఏం ఉన్నాయి అంటే ఎవరైనా పుస్తకాలు, పెన్ను, కళ్ళజోడు అంటూ చెబుతారు. ఇప్పుడు కళ్ళజోడు పెట్టుకో అని చెప్పాక, 'నీ ఎదురుగా ఏం ఉన్నాయి?' అని మళ్ళీ అడిగితే, అతను కళ్ళజోడు విషయం చెప్పడు. ఎందుకు? కళ్ళజోడు అతని శరీరంలో ఒకభాగం అయిపోతుంది. దానిద్వారా చూస్తున్నాడు కాబట్టి అది ఆబ్జెక్టు కాదు, సబ్జెక్టు అనుకుంటాడు.

పొరపాటు ఎక్కడ జరుగుతున్నది? ఏ వస్తువునైతే ప్రమాణంగా వాడుతున్నానో అది సబ్జెక్టులో ఒక అంతర్గతభాగం అయిపోతుంది. 'నేను ఉత్తరం రాస్తున్నాను,' అని నేను చెబితే, నాకు తెలియకుండానే అందులో కలం కూడా వస్తుంది. కలం లేకుండా రాయలేను కదా. అలాగే నేను చూస్తున్నాను, నేను వింటున్నాను అంటే వాటికి కూడా నేను నా మనశ్శరీరాలను వాడుతున్నాను. వ్యవహారం నడపటానికి మనశ్శరీరాలను వాడవచ్చు కాని, అవి ప్రకృతి, నాకు భిన్నంగా ఉన్నాయనే విషయం మర్చిపోకూడదు. శరీరంలో జరిగే మార్పులు నాకు తెలుస్తున్నాయి; మనస్సులో వచ్చే ఆలోచనలు నాకు తెలుస్తున్నాయి అంటే వాటికి నేను భిన్నంగా ఉన్నాను. నేను ఆబ్జెక్టుగా చూస్తున్నదేదీ నేను కాదు అనే సూత్రాన్ని మర్చిపోకూడదు. వాటిని నేను చూస్తున్నాను కాని అవి నేను కాదు. అంటే చూస్తున్న నేను పురుషుణ్ణి, చూడబడేది ప్రకృతి.

కాని సృష్టి జరగకముందు ఈ సబ్జెక్టు ఆబ్జెక్టు భేదం లేదు; ప్రకృతి-పురుషుడు భేదం లేదు. సృష్టికి ముందు సత్ మాత్రమే ఉందని చూశాము. పురుషునికి సబ్జెక్టు హోదా ఎప్పుడు వచ్చింది? ఆబ్జెక్టు వచ్చాక వచ్చింది. అంటే జగత్తు, శరీరం, మనస్సులు వచ్చాక వచ్చింది. సర్వవ్యాపకమైన పురుషుడు శరీరంలోపల ఉన్నట్టు అయింది. ఆకాశపరంగా చూస్తే ఈ విషయం అర్థమవుతుంది. కొన్ని ఎకరాల స్థలం ఖాళీగా ఉంది అనుకుందాం. తర్వాత అక్కడ ఎవరో ఇళ్ళు కట్టారు. అంటే ఆ ఖాళీప్రదేశంలో గోడలు లేపి, ఖాళీప్రదేశాన్ని మూసేశారు. గోడలతో మూయబడిన ఆ ప్రదేశాన్ని (ఆకాశాన్ని) ఇల్లు అంటున్నారు. ఖాళీగా ఉన్న ప్రదేశం ఇల్లుగా రూపుదిద్దుకునేసరికి నివాసయోగ్యంగా మారింది. అలాగే సృష్టి జరగకముందు సర్వవ్యాపకంగా ఉన్న చైతన్యం, శరీరమనే గోడలు వచ్చేసరికి సబ్జెక్టు అయింది; దాని బయట ఉన్న జగత్తు ఆబ్జెక్టు అయింది. ఆ విధంగా పురుషుడు సబ్జెక్టు, ప్రకృతి ఆబ్జెక్టు అయ్యారు. ఈ నేపథ్యంతో తర్వాత వచ్చే శ్లోకం చూద్దాము.

శ్లో. 22 **పురుషః ప్రకృతిస్థో హి భుంక్తే ప్రకృతిజాన్ గుణాన్ ।**
**కారణం గుణసంగోఽస్య సదసద్యోనిజన్మసు ॥**
పురుషః, ప్రకృతిస్థః, హి, భుంక్తే, ప్రకృతిజాన్, గుణాన్,
కారణమ్, గుణసంగః, అస్య, సదసద్యోనిజన్మసు ॥

| | | | |
|---|---|---|---|
| ప్రకృతిస్థః | = ప్రకృతియందు స్థితుడైన | గుణసంగః | = గుణముల సాంగత్యమే |
| పురుషః, హి | = పురుషుడే | అస్య | = ఈ జీవాత్మయొక్క |
| ప్రకృతిజాన్ | = ప్రకృతినుంచి ఉత్పన్నములైన | సదసద్యోని | = ఉత్తమ అధమ |
| గుణాన్ | = త్రిగుణాత్మకములైన పదార్థములను | జన్మసు | = జన్మలకు |
| | | కారణమ్ | = కారణము |
| భుంక్తే | = అనుభవించును | | |

**పురుషః ప్రకృతిస్థః (సన్) ప్రకృతిజాన్ గుణాన్ భుంక్తే హి ।**
**గుణ-సఙ్గః అస్య సత్-అసత్-యోని-జన్మసు కారణమ్ (అస్తి) ॥**

తా: ప్రకృతియందు స్థితుడైన పురుషుడే ప్రకృతినుంచి ఉత్పన్నములైన త్రిగుణాత్మకములైన పదార్థములను అనుభవించును. గుణముల సాంగత్యమే ఈ జీవాత్మయొక్క ఉత్తమ,అధమ జన్మలకు కారణము.

**పురుషః ప్రకృతిస్థో హి భుంక్తే ప్రకృతిజాన్ గుణాన్** – పురుషుడు ప్రకృతిలో వచ్చే అనేక భావాలను సాక్షిచైతన్యంగా చూస్తున్నాడు. భుంక్తే అంటే అసలు అర్థం అనుభవిస్తున్నాడు అని, కాని ఇక్కడ సాక్షిగా చూస్తున్నాడు. మనశ్శరీరాలకు జరిగేవాటిని సాక్షిగా చూస్తున్నాడు లేదా వాటిని ప్రకాశింపజేస్తున్నాడు. ఎవరు? పురుషుడు. మనశ్శరీరాలను సాక్షిగా చూడటం లేదా ప్రకాశింపజేయటం పురుషునియొక్క కార్యక్రమం కాదు, కాని పురుషుని సమక్షంలో, వాటి పనులు అవుతాయి.

ఉదాహరణకు అగ్ని చెక్కను కాల్చింది అంటాము. అంటే కాల్చింది అనే క్రియాపదాన్ని వాడతాము. ఈ పదాన్ని శంకరాచార్యులవారు విశ్లేషిస్తారు – అగ్ని కాల్చింది అంటే, అగ్ని నిజంగా కావాలని కాల్చిందా? అలా చేస్తే అగ్ని చేసిన ఆ పనికి ఒక ఆరంభకాలం, మరొక అంత్యకాలం ఉండాలి. కాని నిజం చెప్పాలంటే, అగ్ని పనిగట్టుకుని దేన్నీ కాల్చదు. ఆ వేడితత్త్వం దానికి ఉంది. మీరు అగ్నిలో మీ వేలును పెట్టారనుకుందాము. అప్పుడు కూడా అగ్ని ప్రత్యేకించి, శ్రమ తీసుకుని మీ వేలును కాల్చదు. మీరు మీ వేలును పెట్టకముందూ అగ్ని వేడిగానే ఉంది; మీ వేలు పెట్టాకకూడా వేడిగానే ఉంది. అగ్నిలో ఏ మార్పూ లేదు. అగ్ని ఏమీ చెయ్యాలనుకోలేదు, ఏమీ చెయ్యలేదు కూడా. అగ్నియొక్క వేడికి మీ వేలు కాలింది అంతే. కాని మీరేం అంటున్నారు? 'అగ్ని నా వేలుని **కాల్చింది**.' అంటే ఇక్కడ వాడిన **క్రియకు** క్రియకు చెందే ముఖ్య అర్థం కుదరదు.

సూర్యుడు భూమిని ప్రకాశింపజేస్తున్నాడు కూడా ఇదే అర్థం. సూర్యుడు భూమిని ప్రకాశింపజేయాలి అని సంకల్పించుకోడు, ప్రణాళికలు వెయ్యడు, దానికి సంబంధించిన క్రియ చెయ్యడు. సూర్యుడు ఉన్నాడు అంతే. ఆయన సమక్షంలో, ఆయన పరిధిలోకి వచ్చిన వస్తువులు ప్రకాశింపబడతాయి. ఆయన ముందుకు వస్తువులు రాకముందూ ఆయన కాంతి ఉంది; సమక్షంలోకి వస్తువులు వచ్చాకా కాంతి ఉంది; కాని మీరేమంటారు, 'సూర్యుడు భూమిని ప్రకాశింపజేస్తున్నాడు.'

ఇక్కడ కూడా ప్రకాశింపజేస్తున్నాడు అనే క్రియాపదం ఏమీ క్రియను సూచించదు. సాన్నిధ్యాన్ని సూచిస్తుంది అంతే. ఇదే సూత్రం సాక్షికి కూడా వర్తిస్తుంది. సాక్షి మనశ్శరీరాలను ప్రకాశింపజేయాలని సంకల్పించదు, ప్రణాళికలు వెయ్యదు, దానికి సంబంధించిన క్రియలు ఏమీ చెయ్యదు. అగ్ని సాన్నిధ్యంలో వేలు కాలినట్టుగా, సూర్యుని సాన్నిధ్యంలో భూమి ప్రకాశింపబడినట్టుగా, సాక్షి సాన్నిధ్యంలో మనశ్శరీరాలు ప్రకాశింపబడతాయి, చూపబడతాయి.

పురుషః భుంక్తే అంటే సాక్షి అనుభవిస్తోంది, అంటే సాక్షి మారని చైతన్యంగా, సాక్షిగా చూస్తోంది; కర్మ చెయ్యకుండా చూస్తోంది; ప్రయత్నం చెయ్యాల్సిన అవసరం లేకుండా చూస్తోంది. మనశ్శరీరాలకు ఏమైనా చూస్తోంది; ఏమీ కాకపోయినా చూస్తోంది; మనస్సులో ఆలోచనలు ఉన్నా చూస్తోంది; ఆలోచనలు లేకుండా శూన్యమయినా కూడా చూస్తోంది. ఆ సాక్షిని నేనే అని మర్చిపోకూడదు.

ప్రకృతిస్థః – ప్రకృతి అంటే ఇక్కడ ప్రకృతినుంచి వచ్చిన కార్యం! ఇక్కడ కార్యం ఏమిటి? కార్యకరణ సంఘాతం, అంటే దేహేంద్రియ మనోబుద్ధులు. ప్రకృతిస్థః అంటే ఈ మనశ్శరీరాల్లో ఉన్న పురుషుడు. ఇంతకుముందు చూశాము, సర్వవ్యాపకంగా ఉన్న ప్రదేశంలో నాలుగు గోడలు కడితే అది ఒక ఇల్లు అవుతుంది. అలాగే సర్వవ్యాపకంగా ఉన్న చైతన్యం మనశ్శరీరాలలో ఉన్నప్పుడు సాక్షిచైతన్యం అవుతుంది.

ఈ పురుషుడు సంకల్పం చెయ్యకుండా, ప్రయత్నం చెయ్యకుండా, క్రియ చెయ్యకుండా సాక్షిగా చూస్తున్నాడు అన్నాము. దేనిని సాక్షిగా చూస్తున్నాడు?

ప్రకృతిజాన్ గుణాన్ – ఆలోచనల్లో కలిగే మార్పులను చూస్తోంది సాక్షి; దీన్ని వృత్తిపరిణామం అంటారు. ఆనందం కలిగించే ఆలోచన, దుఃఖం కలిగించే ఆలోచన, రాగం కలిగించే ఆలోచన, ద్వేషం కలిగించే ఆలోచన,

కోరిక రేపే ఆలోచన – ఇలాంటివన్నీ ప్రకృతినుంచి ఉత్పన్నమైన గుణాలు. ఈ గుణాలు సత్త్వరజస్తమోగుణాల్లో ఏదో ఒకటి అవుతాయి. ఉదాహరణకు సుఖం సాత్త్వికవృత్తి, దుఃఖం రాజసవృత్తి, మోహం తామసవృత్తి. వీటన్నిటినీ సాక్షి చూస్తుంది.

సాక్షికి ఏ గుణం ఉంది? శరీరానికి గుణాలు ఉన్నాయి; మనస్సుకు గుణాలు ఉన్నాయి కాని వాటిని సాక్షిగా చూసే సాక్షిచైతన్యానికి ఏ గుణాలూ అంటవు. అంటే సాక్షిచైతన్యమైన నాకు ఏ గుణాలు అంటవు. కాని సమస్య ఎక్కడ ఉంది? శరీరానికి, మనస్సుకు ఉన్న గుణాలను నాకు ఆపాదించుకుంటున్నాను. దీన్ని అన్యోన్య అధ్యాస అంటారు. అధ్యాస అంటే పొరపాటు. దగ్గరగా ఉన్న ఒకదాని లక్షణాలను ఇంకొకదానికి ఆరోపించి, పొరపాటు పడటాన్ని అన్యోన్య అధ్యాస అంటారు. అలా దేహేంద్రియమనోబుద్ధులకు ఉన్న గుణాలను నాకు ఆపాదించుకోవటంవల్ల వస్తోంది సమస్య.

ఒక సినిమా చూడటానికి వెళ్ళినప్పుడు సినిమా మొదలవకముందు సినిమాలో హీరో వేరూ, నేను వేరూ అని ఖచ్చితంగా తెలుసు. అంటే సినిమా ప్రారంభమయ్యేముందు, ఒక మహాజ్ఞానిలాగా కూర్చుంటాను, పాప్‌కార్న్ తింటూ. కాని సినిమా మొదలయ్యి, సన్నివేశాలు బరువెక్కాక, తర్వాత ఏమవుతుందో అనే ఉత్కంఠత ఆపుకోలేక, అంతవరకూ నిశ్చింతగా వెనక్కి ఆనుకుని కూర్చున్న నేను, ముందుకు వంగి, సీటు చివరలో కూర్చుంటాను. హీరో, హీరోయిన్ల పెళ్ళి కుదిరి, ఏదైనా సమస్య మధ్యలో వస్తే, హీరోతో పాటు నేను కూడా మధనపడిపోతాను. హీరోయిన్ ఏ కారణంవల్లనైనా మరణించి, హీరో భోరున ఏడుస్తుంటే, నేను కూడా అతనితో మమేకం చెంది, ఏదో నా భార్యే మరణించినట్టు ఏడుస్తాను. అంటే నాకు తెలియకుండానే నేను చూస్తున్న హీరో సమస్యలు చూస్తున్న నాకు పొరపాటుగా ఆపాదించబడ్డాయి. ఇలా ఆపాదించబడటాన్ని అన్యోన్య అధ్యాస అంటారు.

సినిమాపరంగా ఈ అన్యోన్య అధ్యాస ఉన్నా ఫర్వాలేదు. ఎందుకంటే ఈ తాదాత్మ్యం మహా అయితే మూడు గంటలు ఉంటుంది. దాని తర్వాత నేనెవరో, అతనెవరో. అతను ఎంత బాగా నటించాడు, ఎంత బాగా అందులో జీవించాడు అనుకుంటాను కాని, నేను దానిలో ఇంక జీవించను, బయటకు వచ్చేస్తాను. అంటే మళ్ళీ జీవన్ముక్తుడను అవుతాను. కాని అదే సూత్రం నా జీవితానికి అన్వయించుకోలేక పోతున్నాను. నేను సాక్షిగా చూస్తున్న దేహేంద్రియ మనోబుద్ధులతో ఎంతగా మమేకం చెందుతున్నానంటే, ఆ సంసారం నిరంతరం కొనసాగుతుంది. ఆ సంసారం ఈ జన్మలోనే కాదు, వచ్చే జన్మలో కూడా కొనసాగుతుంది అంటున్నాడు కృష్ణపరమాత్మ.

**సదసద్యోనిజన్మసు కారణమ్** – సదసద్యోనిజన్మ అంటే సంసారచక్రం. యోని పదాన్ని రెండుసార్లు ఉపయోగించాలి. సద్యోని, అసద్యోని అని చదువుకోవాలి అంటే మంచి శరీరం, తక్కువ శరీరం. మంచి శరీరం అంటే ఉన్నతమైన జన్మ, తక్కువ శరీరం అంటే నీచమైన జన్మ. అంటే పునరపి జననం, పునరపి మరణం అనే సంసారచక్రంలో పడి కొట్టుమిట్టాడుతూ, దేవతలగానో, పశుపక్ష్యాదులుగానో పుడుతూ, మరణిస్తూ ఉంటాను. ఈ సంసారచక్రానికి కారణం ఏమిటి?

**గుణసంగోఽస్య** – ప్రకృతికి చెందిన గుణాలతో తాదాత్మ్యం చెందటంవల్ల ఏర్పడుతుంది ఈ సంసారచక్రం.

**గుణసంగః ఏవ అస్య సంసారస్య కారణమ్**

అందువల్ల ప్రకృతితో తాదాత్మ్యం చెందటం లేదా ప్రకృతిమీద అభిమానం చూపటమే సంసారానికి కారణం. కానీ ఆత్మతత్త్వంలో నెలకొని ఉన్న పురుషునికి జన్మ ఉండదు.

**న జాయతే మ్రియతే వా కదాచిత్** – 2.20

ఖాళీగా ఉన్న ప్రదేశంలో గోడలు కట్టినా, కట్టిన గోడలను పడగొట్టినా ప్రదేశం ఏమీ చెక్కుచెదరదు. అలాగే ఈ శరీరం ఉన్నా, ఈ శరీరం రాలిపోయినా, ఈ శరీరంలో ఉన్న పురుషునికి ఏమీ అవదు. చావు, పుట్టుకలులేని పురుషుణ్ణి నేను అని తెలియక, వచ్చిపోయే మనశ్శరీరాలను నేను అనుకుని సంసారంలో పడి కొట్టుమిట్టాడుతున్నాను.

శ్లో. 23 **ఉపద్రష్టానుమంతా చ భర్తా భోక్తా మహేశ్వరః ।**
**పరమాత్మేతి చాప్యుక్తో దేహేఽస్మిన్ పురుషః పరః ॥**
ఉపద్రష్టా, అనుమంతా, చ, భర్తా, భోక్తా, మహేశ్వరః,
పరమాత్మా, ఇతి, చ, అపి ఉక్తః, దేహే, అస్మిన్, పురుషః, పరః ॥

| | | | |
|---|---|---|---|
| అస్మిన్, దేహే | = ఈ దేహమందు | భర్తా | = అన్నింటిని ధరించి, పోషించు వాడగుటవల్ల 'భర్త' అని |
| (స్థితః) అపి | = స్థితుడైయున్నను | భోక్తా | = జీవరూపములో 'భోక్త'యని |
| పురుషః | = ఆత్మ | మహేశ్వరః, చ | = బ్రహ్మాదులకును ప్రభువగుటవల్ల 'మహేశ్వరుడు' అని |
| పరః, ఏవ | = వాస్తవముగా పరమాత్మయే | పరమాత్మా | = శుద్ధసచ్చిదానంద కాబట్టి |
| ఉపద్రష్టా, చ | = (అతడే) సాక్షియగుటచే 'ఉపద్రష్ట' అని | ఇతి | = 'పరమాత్మ' అని |
| అనుమంతా | = యదార్థముగా సమ్మతిని ఇచ్చువాడు అగుటవల్ల 'అనుమంత' అనియు | ఉక్తః | = పేర్కొనబడెను |

**ఉపద్రష్టా, అనుమన్తా, భర్తా, చ భోక్తా, మహేశ్వరః, అపి ।**
**చ పరమాత్మా ఇతి ఉక్తః పరః పురుషః అస్మిన్ దేహే (అస్తి) ॥**

తా: ఈ దేహమందు స్థితుడైయున్నను ఆత్మ వాస్తవముగా పరమాత్మయే (అతడే) సాక్షియగుటచే 'ఉపద్రష్ట' అని, యదార్థముగా సమ్మతిని ఇచ్చువాడు అగుటవల్ల 'అనుమంత' అని, అన్నింటిని ధరించి, పోషించు వాడగుటవల్ల 'భర్త' అని, జీవరూపములో 'భోక్త'యని, బ్రహ్మాదులకును ప్రభువగుటవల్ల 'మహేశ్వరుడు' అని, శుద్ధసచ్చిదానంద బ్రహ్మకాబట్టి 'పరమాత్మ' అని పేర్కొనబడెను.

కృష్ణపరమాత్మ మనకు శిక్షణ ఇస్తున్నాడు. ఏ విషయంలో? దేహేంద్రియమనోబుద్ధులనుంచి విడివడి, పురుషునితో మమేకం చెందటం ఎలాగో నేర్పిస్తున్నాడు. ఇంకోవిధంగా చెప్పాలంటే నేను ప్రకృతిని కాదు, పురుషుణ్ణి అని తెలుసుకోమంటున్నాడు.

**అస్మిన్ దేహే పురుషః** – నా శరీరంలో ఉన్న పురుషుణ్ణి నేను. ఎటువంటి పురుషుణ్ణి? నిర్గుణ, నిర్వికార, సత్య, చేతనత్వాన్ని. ఈ పురుషుడు ఎక్కడ ఉన్నాడు? అస్మిన్ దేహే – నా శరీరంలో ఉన్నాడు. ఆకాశం ఎలాగైతే అన్ని వస్తువుల్లోనూ ఉందో, అలాగే ఈ శరీరంలో కూడా పురుషుడు ఉన్నాడు. ఎలా ఉన్నాడు? సాక్షిచైతన్యంగా ఉన్నాడు. సాక్షిచైతన్యం ఎవరు అనకూడదు వెంటనే. ఆ సాక్షిచైతన్యాన్ని నేనే. ఈ పురుషుని స్వభావం ఏమిటి? అది ప్రకృతి గుణాలకు పూర్తి భిన్నంగా ఉంటుంది. ఆ భిన్నస్వభావాలను నాలుగు చూశాము అంతకుముందు. ఇప్పుడు కృష్ణపరమాత్మ చాలా చెబుతున్నాడు.

**పరః** – ఈ పురుషుడు శరీరంలోనే లేడు. శరీరం బయట కూడా ఉన్నాడు. ఇది మూడు దశల్లో అర్థం చేసుకోవాలని అంతకుముందు కూడా చూశాము. ముందు ఆకాశపరంగా చూద్దాము.

ఆకాశాన్ని అర్థం చేసుకునే మూడు దశలు –

1. ఆకాశం ఈ గదిలో ఉంది.
2. ఆకాశం ఈ గదిలోనే కాదు, బయట కూడా ఉంది.
3. నిజానికి ఆకాశంలోనే అన్ని గదులూ ఉన్నాయి.

చైతన్యాన్ని అర్థం చేసుకునే మూడు దశలు –

1. చైతన్యం ఈ శరీరంలో ఉంది.
2. చైతన్యం ఈ శరీరంలోనే కాదు, బయట కూడా ఉంది.
3. నిజానికి చైతన్యంలోనే అన్ని శరీరాలూ ఉన్నాయి.

అందువల్ల ఎవరైనా చైతన్యం ఎక్కడ ఉందని ప్రశ్నిస్తే, దానికి మీరు జవాబు చెప్పకూడదు. తిరిగి ప్రశ్నించాలి. 'చైతన్యం ఎక్కడ లేదు?' పరః అంటే సర్వవ్యాపకం.

**ఉపద్రష్టా** – ఈ చైతన్యమే, సాక్షిగా నీ లోపల ఉండి, జరుగుతున్నదంతా సాక్షీభూతంగా చూస్తోంది. ఉపద్రష్టా పదం చాలా అద్భుతమైన పదం. చైతన్యం సూర్యునిలాగా, బల్బులాగా ప్రకాశింపజేస్తోందని చెబుతూ వస్తున్నాము. ఈ ఉదాహరణలలో అవి ప్రకాశింపజేసే వస్తువులకు అవి దూరంగా ఉన్నాయి. సూర్యుడు కొన్ని కోట్ల మైళ్ళ దూరంలో ఉన్నాడు. అలా ఆత్మసాక్షి అంటే, ఆత్మ ఎక్కడో దూరంగా ఉండి చూస్తోందేమోనని పొరపాటుపడే అవకాశం ఉంది.

ఆ పొరపాటు పడటానికి వీల్లేకుండా ఉపద్రష్టా అన్న పదం వేశాడు కృష్ణపరమాత్మ. ఉపద్రష్టా అంటే చాలా దగ్గరగా ఉండి చూస్తున్నట్టు అర్థం. కాంతి–చెయ్యి ఉదాహరణలో చూసాము, కాంతి చెయ్యిని ప్రకాశింపజేస్తోంది అంటే చెయ్యి అంతటా వ్యాపించి, దాన్ని ప్రకాశింపజేస్తోంది. బల్బు దూరంగా ఉంది, కాని దాని ప్రకాశం

చేతిమీద పడుతోంది. కాని ఈ సాక్షిచైతన్యం దగ్గరగా ఉండి, శరీరం అంతటా వ్యాపించి, అణువు అణువునూ ప్రకాశింపజేస్తోంది. అందువల్లనే శరీరం, మనస్సులు జడమైనా కూడా చైతన్యం పుంజుకున్నాయి.

**అనుమంతా చ** – జాగ్రత్తగా చూడండి, హనుమంతా చ కాదు, అనుమంతా చ. అనుమంతా అంటే ప్రకృతియొక్క కార్యకలాపాలను ప్రకాశింపజేసేది. ఇందాకే చూశాము – శరీరం, మనస్సులు జడం కాని, చైతన్యంయొక్క దీవెనలవల్లనే అవి చైతన్యాన్ని సంతరించుకున్నాయి. విద్యుచ్ఛక్తి తనంతట తాను ఏమీ చెయ్యదు; కాని ఫ్యాను తన ధర్మాన్ని తాను నిర్వర్తించగలుగుతోంది. ఫ్యాను ధర్మం గుండ్రంగా తిరగటం; బల్బు ధర్మం వెలగటం. విద్యుచ్ఛక్తి ఉండటంవల్ల వాటి ధర్మాలని అవి సక్రమంగా నిర్వర్తించగలుగుతున్నాయి.

అదే విధంగా, మన శరీరంలో అనేక అంగాలు ఉన్నాయి; వాటి ధర్మాలు వాటికి ఉన్నాయి. చైతన్యంయొక్క అనుగ్రహంవల్లనే అవి వాటివాటి ధర్మాలను నిర్వర్తించగలుగుతున్నాయి. చైతన్యం తన సన్నిధి మాత్రంచేతనే వాటిని దీవిస్తున్నది.

**కేనేషితం పతతి ప్రేషితం మనః కేన ప్రాణః ప్రథమః ప్రైతి యుక్తః**
**కేనేషితాం వాచమిమాం వదంతి చక్షుశ్శ్రోత్రం క ఉ దేవో యునక్తి** – **కేన 1.1**

**శ్రోత్రస్య శ్రోత్రం మనసో మనో యద్వాచో హ వాచం స ఉ ప్రాణస్య ప్రాణః** – **కేన 1.2**

మనస్సు, ప్రాణం, వాక్కు, కన్ను, చెవులు – ఇవన్నీ దేనివల్ల పనిచేస్తున్నాయి అని ప్రశ్న. చెవికి చెవి, మనస్సుకు మనస్సు, వాక్కుకు వాక్కు, ప్రాణానికి ప్రాణంవల్ల పనిచేస్తున్నాయనేది జవాబు. ఉదాహరణకు శ్రోత్రస్య శ్రోత్రం అంటే అర్థం –

1. ఆత్మ వేరు, చెవి వేరు
2. ఆత్మ చెవి అంతటా వ్యాపించి ఉంది
3. ఆత్మ ఉండటంవల్లే చెవిని చెవి అనగలుగుతున్నాము. అంటే చెవితో వినగలుగుతున్నాము.

**భర్తా** – భర్తా అర్థం అక్షరాలా తీసుకుంటే భార్య ఉన్న భర్త అని అర్థం. కాని భర్తా అంటే భరించేవాడు, స్థితికర్త అని అర్థం. పురుషుడు సత్యం, ప్రకృతి మిథ్య అని చూశాము కాబట్టి, పురుషుడే ప్రకృతికి స్థితికారణం.

**భోక్తా** – సాక్షిచైతన్యాన్ని అజ్ఞాని, భోక్తా అంటాడు. నిజానికి అతనే సాక్షిచైతన్యం అని అజ్ఞానికి తెలియదు. సుఖదుఃఖాలు, కోపతాపాలు అన్నీ మనస్సు లక్షణాలు. అవన్నీ సాక్షి అయిన నాకు తెలుస్తున్నాయి. కాని మనస్సుకు కోపం వస్తే నేనేమంటాను? 'నాకు కోపం వచ్చింది,' అంటాను. అంటే మనస్సు గుణాలను సాక్షికి ఆపాదిస్తున్నాను. ఆ విధంగా సాక్షి భోక్తా అయింది. అంటే నిజంగా భోక్తా కాదు, భోక్తా అయినట్టుగా ఉంది. అయితే సాక్షి అసలు స్వరూపం ఏమిటి?

**మహేశ్వరః** – మహేశ్వరుడు. మహేశ్వరుడు అంటే స్వతంత్రుడు. జ్ఞాని సాక్షికి స్వతంత్ర సత్తా ఉందని తెలుసుకుంటాడు. శరీరానికి మాత్రమే సంగత్వం ఉంటుంది. ఎందుకంటే శరీరం ప్రకృతి కాబట్టి శరీరంమీద ఇంకొక వస్తువు ప్రభావం ఉంటుంది.

**గుణాః గుణేషు వర్తంతే**

ప్రపంచం పదార్థం; శరీరం పదార్థం; అందువల్ల శరీరం ప్రపంచంవల్ల ప్రభావితమవుతుంది; దాన్ని ఎవరూ ఆపలేరు. ఎండాకాలంలో శరీరం చెమటలు కక్కుతుంది; చలికాలంలో గజగజా వణికిపోతుంది; ఎక్కడైనా ఎవరైనా బాధపడుతున్నారని చదివితే, సున్నితమైన మనస్సు చలిస్తుంది. కాని పురుషుడు మహేశ్వరుడు అంటే స్వామి. పురుషుడు ఎప్పుడూ ముక్తపురుషుడు; ప్రకృతి ఎప్పటికీ ముక్తి పొందలేదు.

నేను ప్రకృతినుంచి, దాని గుణాలనుంచి విడివడటం నేర్చుకుంటే, నేను పరమాత్మను అవుతాను. ప్రకృతితోనూ, దాని గుణాలతోనూ నేను మమేకం చెందితే నేను జీవాత్మను అవుతాను. నా పుట్టినరోజు, నా వయస్సు, నా శారీరక పరిస్థితి, నా భావాలు గురించి మాట్లాడతాను. కాని ఈ గుణాలన్నీ నాకు చెందవు; అవి ప్రకృతికి చెందుతాయి, నాకు గుణాలు లేవని తెలుసుకుంటే పరమాత్మను అవుతాను. గుణాలు ఉన్న నేను జీవాత్మను; గుణాలు లేని నేను పరమాత్మను. నాకు గుణాలు ఉన్నదీ, లేనిదీ నేను అర్థం చేసుకున్న విధానంమీద ఆధారపడివుంది. నేను అజ్ఞానిని అయితే నేను జీవాత్మను; నేను జ్ఞానిని అయితే నేను పరమాత్మను. ఎవరంటున్నారు ఈ మాట? సాక్షాత్తూ కృష్ణపరమాత్మే చెబుతున్నాడు.

**పరమాత్మా ఇతి ఉక్తః** - గుణాలు లేని నన్ను పరమాత్మ అంటారు. గుణాలు ఉన్న జీవాత్మను గుణాలు లేని పరమాత్మగా అర్థం చేసుకోవాలి అంటున్నాడు.

జీవాత్మ=పరమాత్మ - మహావాక్యం

జీవాత్మ, పరమాత్మల ఐక్యాన్ని బోధించే ఏ వాక్యాన్నైనా మహావాక్యం అంటారు. మూడవ శ్లోకంలో కూడా ఒక మహావాక్యం వచ్చింది.

**క్షేత్రజ్ఞం చాపి మాం విద్ధి సర్వక్షేత్రేషు భారత ।**
**క్షేత్రక్షేత్రజ్ఞయోః జ్ఞానం యత్తద్ జ్ఞానం మతం మమ ॥** - 13.3

శ్లో. 24 **య ఏవం వేత్తి పురుషం ప్రకృతిం చ గుణైస్సహ ।**
**సర్వథా వర్తమానోఽపి న స భూయోఽభిజాయతే ॥**

యః, ఏవమ్, వేత్తి, పురుషమ్, ప్రకృతిమ్, చ, గుణైః, సహ,
సర్వథా, వర్తమానః, అపి, న, సః, భూయః, అభిజాయతే ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| ఏవమ్ | = ఈ విధముగా | సః | = | అతడు |
| పురుషమ్ | = పురుషుని | సర్వథా | = | అన్ని విధములుగా |
| చ | = ఇంకా | వర్తమానః | = | కర్తవ్యకర్మలను |
| గుణైః, సహ | = త్రిగుణసహితముగా | అపి | = | చేయుచున్నను |
| ప్రకృతిమ్ | = ప్రకృతిని | భూయః | = | మళ్ళీ |
| యః | = ఏ మనుష్యుడు | న, అభిజాయతే | = | జన్మింపడు |
| వేత్తి | = యదార్థముగా తెలిసికొనునో | | | |

**యః ఏవమ్ పురుషమ్ గుణైః సహ ప్రకృతిమ్ చ వేత్తి ।**

**సః సర్వథా వర్తమానః అపి భూయః న అభిజాయతే ॥**

తా: ఈ విధముగా పురుషుని ఇంకా త్రిగుణ సహితముగా ప్రకృతిని ఏ మనుష్యుడు యదార్థముగా తెలిసికొనునో అతడు అన్ని విధములుగా కర్తవ్యకర్మలను చేయుచున్నను మళ్ళీ జన్మింపడు.

ఈ శ్లోకంతో ప్రకృతి-పురుషుల గురించిన వర్ణన ముగిస్తున్నాడు కృష్ణపరమాత్మ. ఇక్కడ ఈ ఐక్యజ్ఞానం పొందిన వ్యక్తి పొందే ఫలమేమిటో వివరిస్తున్నాడు.

**పురుష ప్రకృతి వివేకజ్ఞానేన మోక్షః**

ప్రకృతి, పురుషుల గురించిన స్పష్టమైన జ్ఞానం పొంది, తను పురుషుడు అని అర్థం చేసుకున్న వ్యక్తి సంసారచక్రంనుంచి విడివడతాడు. ఇంతవరకూ భారంగా తోచిన జీవితం; ఇంతవరకూ కష్టాలకడలిగా అనిపించిన జీవితం; ఇంతవరకూ ఆందోళనలతో నిండిన జీవితం, ఇప్పుడు చాలా హాయిగా అనిపిస్తుంది. నేను నిర్గుణబ్రహ్మను, గుణాలు నాకు చెందవు, అవి ప్రకృతికి చెందుతాయని తెలుసుకుంటే, వేదాంత పరిభాషలో చెప్పాలంటే జీవన్ముక్తి పొందుతాడు. అంటే ఇక్కడే ఇప్పుడే మోక్షం పొందుతాడు.

**య ఏవం వేత్తి** - ఎవరైనా ఈ జ్ఞానం పొందితే. ఇంతకు ముందు కూడా కాంతి-చెయ్యి ఉదాహరణతో చూశాము. ఇక్కడేముంది అని అడిగితే ముందు చెయ్యి అంటాము. తర్వాత చెయ్యి+కాంతి ఉన్నాయి అంటాము. తర్వాత కాంతి ఉంది అంటాము. ఈ సూత్రాన్ని ఉపయోగించి ఆత్మ, అనాత్మల వివేకం చెయ్యాలి. ఆత్మ అంటే పురుషుడు, అనాత్మ అంటే ప్రకృతి.

1. నేను మనశ్శరీరాలను
2. నేను ఆత్మ+అనాత్మల మేలుకలయికను
3. నేను ఆత్మను.

ముందు మనం మనస్సుతోనూ, శరీరంతోనూ మమేకం చెందుతాము. అంటే ప్రకృతిలో మమేకం చెందుతాము. తర్వాత ప్రకృతి, పురుషుడు రెండు పదాలు తెలుసుకుంటాము. పురుషుడు అంటే నిర్గుణ, నిర్వికార, సత్య, చేతనతత్త్వం అని చూశాము. ప్రకృతి అంటే సగుణ, సవికార, మిథ్య, అచేతనతత్త్వం. ఈ రెండింటి మధ్య భేదాన్ని స్పష్టంగా తెలుసుకోవాలి. ఆ భేదం బుద్ధిలో తెలియాలి. ఇక్కడేముంది అంటే చెయ్యి+కాంతి ఉంది అని చెప్పినప్పుడు చేతిని విడిగా, కాంతిని విడిగా చూడలేము, విడదీయలేము కూడా. దాన్ని అర్థం చేసుకోవాలి అంతే. అలాగే ఆత్మ, అనాత్మలను కూడా విడదీయలేము, వాటిని అర్థం చేసుకోవాలి.

**గుణైస్సహ** - అంతేకాదు, గుణాలు కూడా ఉన్నాయని తెలుసుకుంటాడు. లావు, సన్నం, బట్టతల, నొక్కుల జుట్టు, వృద్ధాప్యం, యౌవనంవంటి లక్షణాలన్నీ స్థూలశరీరానికి చెందినవి. రాగం ద్వేషం, కామం క్రోధం, లాంటి భావోద్రేకాలు అన్నీ సూక్ష్మశరీరానికి చెందినవి. అంటే ఇవన్నీ ప్రకృతికి చెందినవి. ఈ విషయం ఆత్మజ్ఞానం పొందకముందు తెలియదు. ఆత్మజ్ఞానం పొందాక, ఈ గుణాలన్నీ ప్రకృతికి చెందినవి, నేను ప్రకృతి

కాదు, నేను పురుషుణ్ణి అని తెలుసుకుంటారు. అంటే ఇన్నాళ్ళూ ఉన్న అజ్ఞానం తొలగుతుంది. అంతకుముందు నేను లావుగా ఉన్నాను అనుకునేవారు కాస్తా, నా శరీరం లావుగా ఉంది అంటారు. ఎంత నిశ్చింత! లేకపోతే నేను లావుగా ఉన్నానని బాధపడతారు; దానికి అనేకమంది అనేక సలహాలు ఇస్తారు. వాకింగ్ చెయ్యి అంటారు ఒకరు, యోగా చెయ్యమంటారు ఇంకొకరు. ఇప్పుడు మీరు శరీరం కాదు అని తెలుసుకున్నాక వాకింగ్‌లు, యోగాలు మాననవసరం లేదు. శాస్త్రం నేర్చుకోవటానికి కూడా శరీరం ఆరోగ్యకరంగా ఉండాలి. అందువల్ల శారీరక వ్యాయామం మంచిదే. అది శరీర అభిమానం ఉంటేనే చెయ్యనవసరం లేదు. అలాగే రాగద్వేషాలు నాకు చెందవు, అవి ప్రకృతికి చెందుతాయని తెలుసుకోవాలి.

**న మే ద్వేషరాగౌ న మే లోభమోహౌ**
**మదో నైవ మే నైవ మాత్సర్యభావః**
**న ధర్మో న చార్థో న కామో న మోక్షః**
**చిదానందరూపః శివోఽహం శివోఽహమ్** – నిర్వాణషట్కమ్

రాగద్వేషాలు, లోభమోహాలు, మదమాత్సర్యాలు నాకు అంటవు. నేను సచ్చిదానంద ఆత్మను అంటే పురుషుడిని అని తెలుసుకుని, దానిలో నిలబడగలగాలి. దానిలో నిలబడటానికి కావాల్సిన శిక్షణను నిదిధ్యాసనం అంటారు. లౌకిక విషయాల్లో ప్రకృతిపరంగానే వ్యవహరించాలి. ఏదైనా అప్లికేషన్ ఫార్మ్ నింపాల్సివచ్చినప్పుడు –

పుట్టినరోజు – న జాయతే మ్రియతే వా కదాచిత్
చిరునామా – సర్వవ్యాపకం

ఇలా నింపకూడదు. వ్యవహారం వ్యవహారమే. ప్రకృతిపరంగా వ్యవహారం నడపాలి. తర్వాత దానికి ప్రాయశ్చిత్తం చేసుకోవాలి. అంటే ప్రతిరోజూ కొంత నిదిధ్యాసనం చేయాలి. ఒక నటుడు, ఎంత గొప్ప ధనవంతుడైనా కూడా, తను ఒక సినిమాలో బిచ్చగాని వేషం వేస్తే, ఆ పాత్రలో జీవించాలి. లేకపోతే ఆ పాత్ర రాణించదు. అలాగే మనమూ మన జీవితంలో అనేక పాత్రలను పోషించాలి – తండ్రిగా, తనయునిగా, భర్తగా, స్నేహితునిగా. ఆ పాత్రలకు పూర్తి న్యాయం చేకూర్చాలి. ఆ పాత్రకు తగ్గట్టుగా ఆనందం, దుఃఖం, కోపంలాంటి భావాలను ప్రదర్శించాలి కాని అవకాశం దొరికినప్పుడు గ్రీన్‌రూమ్‌కు వెళ్ళి అసలు స్వరూపాన్ని గుర్తు తెచ్చుకోవాలి.

**మనోబుద్ధ్యహంకారచిత్తాని నాఽహమ్**
**నచ శ్రోత్ర జిహ్వే న చ ఘ్రాణనేత్రే**

ఈ విధంగా జీవితం ఒక నాటకరంగం. అందులో మనకు ఇష్టం ఉన్నా, లేకపోయినా మనం పాత్రధారులం. మనం ఈ భూమ్మీదకు రాగానే బంధం ఏర్పడుతుంది; మన తల్లిదండ్రులకు కుమారుడు, అన్నదమ్ములకు సోదరుడు అవుతాము. అన్నదమ్ముల పెళ్ళిళ్ళు అయ్యాక మరికొన్ని కొత్త అనుబంధాలు ఏర్పడతాయి. అన్ని పాత్రలు వేస్తున్నా, అవి పాత్రలు మాత్రమే అని తెలుసుకుంటే అవి మనను బాధించవు. బిచ్చగాని పాత్ర వేసినప్పుడు బిచ్చమెత్తుకుంటే తప్పులేదు; కాని ఆ పాత్రనుంచి బయటకు వచ్చాక కూడా అందులోనే జీవిస్తాను అంటేనే సమస్య వస్తుంది.

**సర్వథా వర్తమానోఽపి** – నువ్వు ఏ పాత్ర ధరిస్తున్నా కూడా దాన్ని మాననవసరం లేదు అంటున్నాడు కృష్ణపరమాత్మ. బ్రహ్మచారిగా ఉంటే, అందులో కొనసాగు; గృహస్థు అయితే ఆశ్రమధర్మాన్ని మార్చనవసరం లేదు. ఒక్కముక్కలో చెప్పాలంటే బాహ్యంగా ఏమీ మార్పులు అవసరం లేదు; అంతర్గత మార్పు వస్తే చాలు. అలా ఈ జీవితమే ఒక నాటకరంగం అని తెలుసుకుంటే కలిగే ప్రయోజనమేమిటి?

**స భూయః న అభిజాయతే** – అటువంటి జ్ఞానికి పునర్జన్మ ఉండదు.

'ఓ జ్ఞానీ, నీకు పునర్జన్మ ఉండదని నువ్వు అంత ఖచ్చితంగా ఎలా చెప్పగలవు?' అని ఎవరైనా జ్ఞానిని అడిగారనుకోండి. జ్ఞాని ఒక పెద్ద దరహాసం చేస్తాడు. 'నేను ఆత్మను, నాకు జన్మంటూ ఉంటేనే గదా, పునర్జన్మ ప్రసక్తి వచ్చేది,' అంటాడు

జన్మ నిర్వచనం – స్థూలసూక్ష్మశరీర సంయోగః జన్మ.
మరణ నిర్వచనం – స్థూలసూక్ష్మశరీర వియోగః మరణమ్.

స్థూలశరీరంలోకి సూక్ష్మశరీరం వచ్చిచేరటం జన్మ; స్థూలశరీరంనుంచి సూక్ష్మశరీరం వెళ్ళిపోవటం మరణం. సూక్ష్మశరీరంలో మనస్సు ప్రధానంగా ఉంటుంది. పునర్జన్మ అంటే ఏమిటి? ఈ ప్రయాణం చేస్తున్న సూక్ష్మశరీరం ఇంకొక కొత్త స్థూలశరీరంలో చేరటం పునర్జన్మ. ఇప్పుడు చెప్పండి, స్థూలశరీరం ప్రకృతా, పురుషుడా? సూక్ష్మశరీరం ప్రకృతా, పురుషుడా? రెండూ ప్రకృతే. స్థూలశరీరం ఒక రకమైన ప్రకృతి అయితే, సూక్ష్మశరీరం ఇంకొక రకమైన ప్రకృతి. ఈ రెండు ప్రకృతులూ కలుస్తుంటాయి, విడిపోతుంటాయి. నేను ఎవరు? ప్రకృతి ఒకటా, ప్రకృతి రెండా? రెండూ కాదు. నేను పురుషుణ్ణి. నాకు మొదటి జన్మే లేదు, నాకు చావు, పుట్టుకలు లేవు – అలాంటప్పుడు మళ్ళీ పుట్టే ప్రసక్తి ఎక్కడ ఉంది?

ఈ జ్ఞానాన్ని మోక్షం అంటారు. అంటే ఈ జ్ఞానం పొంది, దాన్ని జీర్ణించుకుంటే మోక్షం పొందుతాను. నిజానికి మోక్షం కొత్తగా పొందను. నేను అంతకుముందూ ముక్తపురుషుణ్ణే, ఇప్పుడూ ముక్తపురుషుణ్ణే, తర్వాతా ముక్తపురుషుణ్ణే అని అర్థం చేసుకుంటాను. ఈ జ్ఞానంతో రమిస్తే, సంసారిని కావాలనుకున్నా కూడా కాలేను.

దీనితో అర్జునుడు తెలుసుకోవాలనుకున్న ఆరు అంశాల గురించిన చర్చ ముగిసింది. ఆ అంశాలు క్షేత్రం, క్షేత్రజ్ఞుడు; జ్ఞానం, జ్ఞేయం; ప్రకృతి, పురుషుడు. రాబోయే శ్లోకాల్లో జ్ఞానసాధనలు, జ్ఞానఫలం గురించి చెప్పబోతున్నాడు, కృష్ణపరమాత్మ.

శ్లో. 25 **ధ్యానేనాత్మని పశ్యంతి కేచిదాత్మానమాత్మనా ।**
**అన్యే సాంఖ్యేన యోగేన కర్మయోగేన చాపరే ॥**
ధ్యానేన, ఆత్మని, పశ్యంతి, కేచిత్, ఆత్మానమ్, ఆత్మనా,
అన్యే, సాంఖ్యేన, యోగేన, కర్మయోగేన, చ, అపరే ॥

| | | | |
|---|---|---|---|
| ఆత్మానమ్ | = సచ్చిదానంద పరమాత్మను | సాంఖ్యే, న | = జ్ఞాన |
| కేచిత్ | = కొందరు పురుషులు | యోగేన, చ | = యోగముద్వారాను |
| ఆత్మనా | = శుద్ధమైన సూక్ష్మబుద్ధితో | అపరే | = మరికొందరు |
| ధ్యానేన | = ధ్యానయోగముద్వారా | కర్మయోగేన | = కర్మయోగముద్వారాను |
| ఆత్మని | = హృదయమందు | పశ్యంతి | = చూచెదరు |
| పశ్యంతి | = చూచెదరు | | |
| అన్యే | = మరికొందరు | | |

**కేచిత్ ధ్యానేన ఆత్మనా ఆత్మని ఆత్మానం పశ్యన్తి। అన్యే సాఙ్ఖ్యేన యోగేన (ఆత్మానం) పశ్యన్తి। అపరే చ కర్మ-యోగేన (ఆత్మానం పశ్యన్తి) ॥**

తా: సచ్చిదానందపరమాత్మను కొందరు పురుషులు శుద్ధమైన సూక్ష్మబుద్ధితో ధ్యానయోగముద్వారా హృదయమందు చూచెదరు. మరికొందరు జ్ఞానయోగముద్వారాను, మరికొందరు కర్మయోగముద్వారాను చూచెదరు

**6. జ్ఞానసాధనలు - జ్ఞానఫలం: శ్లోకాలు 25-35**

ఆత్మజ్ఞానం పొందటానికి కావాల్సిన సాధనలేమిటో, ఆత్మజ్ఞానం పొందితే కలిగే ఫలమేమిటో చర్చించబోతున్నాడు కృష్ణపరమాత్మ. ఏ సాధకునికైనా ఉండాల్సిన అంతిమలక్ష్యం ఆత్మజ్ఞానం. అందువల్ల ముందు ఆత్మజ్ఞానంతో మొదలుపెడుతున్నాడు కృష్ణపరమాత్మ.

**ఆత్మని ఆత్మనా ఆత్మానం పశ్యంతి** - ఆత్మని అంటే హృదయంలో. సర్వవ్యాపకమైన ఆత్మ నా హృదయంలో కూడా ఉంది. అందువల్ల దాన్ని తెలుసుకోవటానికి నేను ఎక్కడికో వెళ్ళనవసరం లేదు. నాలో తెలుసుకుంటే చాలు.

**యో వేదనిహితం గుహాయాం పరమే వ్యోమన్** - తైత్తిరీయమ్

**ఆత్మానం పశ్యంతి** - ఆత్మానం అంటే సచ్చిదానంద ఆత్మను. మొదటి ఆత్మ అర్థం హృదయ ఆకాశంలో; ఇప్పుడు ఆత్మానం అంటే సచ్చిదానంద ఆత్మ. అంటే ఒక సాధకుడు, సచ్చిదానంద ఆత్మ గురించి తన హృదయాకాశంలో తెలుసుకోవాలి. ఏ ప్రమాణంద్వారా తెలుసుకోవాలి?

**ఆత్మనా** - బుద్ధిద్వారా తెలుసుకోవాలి. నిజానికి ఏ జ్ఞానం పొందాలన్నా కూడా బుద్ధిద్వారానే పొందగలము. శరీరంద్వారా పొందలేము; ఆత్మ తనంతట తాను జ్ఞానం పొందలేదు. బుద్ధి ఒక్కటే ఆత్మజ్ఞానానికి కూడా ప్రమాణం.

ఇక్కడ ఆత్మ పదాన్ని మూడుసార్లు మూడు భిన్న అర్థాలతో చూశాము. చిన్నప్పుడు నేర్చుకున్న విభక్తి ప్రత్యయాలు గుర్తుకు తెచ్చుకుంటే ఈ విషయం అర్థమవుతుంది. పదాలు ఇవి - ఆత్మని ఆత్మానాం ఆత్మనా పశ్యంతి.

1. ఆత్మని – సప్తమీ విభక్తి – అందున్, నన్
 – హృదయాకాశంలో (హృదయాకాశమందు)
2. ఆత్మానమ్ – ద్వితీయా విభక్తి – నిన్, నున్, లన్, గూర్చి, గురించి
 – సచ్చిదానంద ఆత్మ గురించి
3. ఆత్మనా – తృతీయా విభక్తి – చేతన్, చేన్, తోడన్, తోన్
 – బుద్ధితో

మూడూ కలిపితే హృదయాకాశంలో ఉన్న సచ్చిదానంద ఆత్మ గురించి బుద్ధితో తెలుసుకోవాలి. బుద్ధి ఒక్కటే ఆత్మజ్ఞానానికి కూడా ప్రమాణం అన్నాము. కాకపోతే ఈ బుద్ధి ఎలా ఉండాలి? సంస్కరించబడి ఉండాలి. గురుశాస్త్ర ఉపదేశంద్వారా సంస్కరించబడి ఉండాలి.

**శాస్త్ర ఆచార్య సంస్కృత అంతఃకరణేన** – శంకరాచార్యులు

గురువుద్వారా శాస్త్రాన్ని అధ్యయనం చేసి మనస్సును సంస్కరించుకోవాలి. అటువంటి మనస్సుతో ఆత్మజ్ఞానాన్ని పొందాలి. ఆత్మజ్ఞానం అంతిమలక్ష్యం అవ్వాలి. ఆత్మజ్ఞానం అంతిమలక్ష్యం అయితే, అది పొందటానికి ముందు ఎన్ని దశలు దాటిరావాలి? ఈ సాధనలను అనేక సందర్భాలలో అనేక దశలుగా వర్ణిస్తారు. ఇక్కడ ఐదు దశలు సూచించబడతాయి. ఆత్మజ్ఞానం పొందాలంటే ఒక వ్యక్తి ఐదు దశలను దాటుకుంటూ రావాలి. ఒక్కొక్క దశలో ఒక్కొక్క ఆటంకాన్ని దాటుకుంటూ వస్తాడు. ఆ ఆటంకాలను ప్రతిబంధకాలు అంటారు; ఆ ప్రతిబంధనివృత్తి జరుగుతుంది. ఆ ఐదు సాధనలనూ అంతకుముందు కూడా చూశాము. అవి కర్మయోగం, ఉపాసనయోగం, శ్రవణం, మననం, నిదిధ్యాసనం.

ఎ) **కర్మయోగం** – కర్మయోగసాధనలో మనస్సులో ఉన్న మలినాలను శుద్ధి చేసుకువస్తాము. దాన్ని మలనివృత్తి అంటారు. ఏమిటా మలినాలు? రాగద్వేషాలు, కామక్రోధలోభమోహమదమాత్సర్యాలు అనే భావోద్రేకాలు. కర్మయోగం ఇలాంటి మలినాలను పారద్రోలి చిత్తశుద్ధి కలుగజేస్తుంది.

బి) **ఉపాసనయోగం** – ఉపాసన అంటే సగుణ ఈశ్వరధ్యానం. ఇది విక్షేపనివృత్తి చేస్తుంది. అంటే బహిర్ముఖంగా ఉన్న మనస్సును, అంతర్ముఖం చేస్తుంది. ఉపాసన చిత్త ఏకాగ్రత కలుగజేస్తుంది.

సి) **శ్రవణం** – శ్రవణం అంటే క్రమం తప్పకుండా, ఒక క్రమపద్ధతిలో, కొన్ని సంవత్సరాలపాటు, ఒక సమర్థవంతమైన గురువు వద్ద శాస్త్ర అధ్యయనం చెయ్యటం. ఇది అజ్ఞాననివృత్తి చేస్తుంది. అంటే అజ్ఞానాన్ని పోగొడుతుంది.

డి) **మననం** – మననం అంటే పొందిన జ్ఞానాన్ని నిశ్చయజ్ఞానంగా మలుచుకోవటం. పొందిన జ్ఞానంలో సందేహాలుంటే ఆ జ్ఞానం పొందినా పొందనట్టే లెక్క. సందేహాలుంటే అవి ముందుకు వెళ్ళకుండా అడ్డుపడతాయి. మననం గురువును ప్రశ్నలు అడగటంద్వారా చెయ్యవచ్చు, మనం నేర్చుకున్నదాన్ని మళ్ళీ ఒకసారి చూసుకోవచ్చు. అలా చెయ్యటంవల్ల సంశయనివృత్తి అవుతుంది. ఇది బుద్ధిలో కలిగే ఆటంకాలను తొలగించి, జ్ఞానాన్ని నిస్సంశయజ్ఞానంగా మారుస్తుంది.

ఇ) **నిదిధ్యాసనం** – నిదిధ్యాసనం అంటే మనస్సులో ఉండే విపరీతభావనలను పారద్రోలటం. బుద్ధి నిస్సంశయజ్ఞానాన్ని పొందినా, మనస్సులో ఉన్న రాగద్వేషాలు అంత తొందరగా పోవు. అవి మనలో అలవాటుగా మారిపోయాయి. వాసనలుగా మన చిత్తంలో నిలిచివున్నాయి.

కొన్ని సంవత్సరాలుగా అలవాటు అయినవి పోవటానికి కూడా కొన్ని సంవత్సరాలు పడుతుంది. ఉదాహరణకు ఆందోళన, నిరాశానిస్పృహలు, ఆత్మన్యూనతాభావన, అభద్రతాభావన,అనుబంధం అన్నీ అనారోగ్యకరమైన వాసనలు. నిదిధ్యాసనలో ఈ వాసనలు లేదా ఈ విపరీతభావనలు పోతాయి. అంటే దీన్ని వాసనానివృత్తి అంటారు.

మళ్ళీ ఐదు దశలూ టూకీగా చూస్తే – **కర్మేన మలనివృత్తి; ఉపాసనేన విక్షేపనివృత్తి; శ్రవణేన అజ్ఞాననివృత్తి; మననేన సంశయనివృత్తి; నిదిధ్యాసనేన వాసనానివృత్తి.**

ప్రతిఒక్కరూ ఈ ఐదుదశలూ దాటాల్సిందే. వీటిలో ఏదో ఒకటి ఎన్నుకోలేము; అన్నీ చెయ్యాలి. ఒకవేళ ఎవరైనా ఈ జన్మలో మొదటి రెండు మూడు దశలవరకే సాధన చేసి, ఈ ప్రయాణాన్ని కొనసాగించలేకుండా, ఈ జీవితాన్ని చాలించవలసి వచ్చిందనుకోండి. అతని పరిస్థితి ఏమిటి?

అతను వచ్చే జన్మలో మళ్ళీ మొదటి సాధననుంచి మొదలుపెట్టనవసరం లేదు. తండ్రికి ఈ ఊరినుంచి ఇంకొక ఊరికి బదిలీ అయినప్పుడు, ఇక్కడ ఐదవ తరగతి చదువుతున్న పుత్రుడు కొత్త ఊరిలో మళ్ళీ మొదటినుంచి మొదలుపెట్టడు. అతను ఇక్కడనుంచి ట్రాన్స్‌ఫర్ సర్టిఫికేట్ తెచ్చుకుని, దానిద్వారా కొత్త స్కూల్లో ఆరవ తరగతిలో చేరతాడు. అలాగే ఈ జన్మలో మూడు సాధనలు దాటి మరణించిన వ్యక్తి, కొత్తజన్మలో నాలుగవదశనుంచి అందుకుంటాడు. మూడంటే అక్షరాలా మూడు దశలే ముగించాడని కాదు, ఏ దశలో ముగిస్తే, ఆ తర్వాత దశనుంచీ అందుకుంటాడు. అది ఐదవదశ కూడా కావచ్చు. ఆ దశలు కర్మయోగం, ఉపాసనయోగం, శ్రవణం, మననం, నిదిధ్యాసనం అని మర్చిపోకూడదు.

ఈ ఐదు దశల్లో నాలుగుదశలూ ముగించుకుని వచ్చినవారు, ఈ జన్మలో ఐదునుంచీ అందుకోగలుగుతారు. అంటే గతజన్మలో సంస్కారాలు ఈ జన్మలో పునరావృతం అవటం చూస్తాము. అందువల్లనే కొంతమంది చిన్న వయస్సులోనే సంగీతవిద్వాంసులు అయితే, మరికొంతమంది చిన్నవయస్సులో విజ్ఞానఘనులు అవుతారు. అలా ఆధ్యాత్మసాధనలో పూర్వజన్మ వాసనలవల్ల ఈ జన్మలో గురువు అవసరం ఉండదు కొందరికి. శ్రవణ, మననాలు అవసరం లేదు.

ఇటువంటివారిని చూసి నాకు కూడా ఈ నాలుగు దశలు అవసరం లేదు అనకూడదు. అందరూ పూర్వజన్మ సుకృతంతో పుట్టరు. కొంతమంది ఓం ప్రథమంగా కర్మయోగంనుంచి మొదలుపెట్టక తప్పదు.

**కర్మయోగేన చాపరే (పశ్యంతి)** – కొంతమంది కర్మయోగంతో మొదలుపెట్టక తప్పదు అంటున్నాడు కృష్ణపరమాత్మ. అంటే వీరు ఐదుదశలూ దాటుకుంటూ రావాలి. ఎందుకంటే వీరికి రాగద్వేషాలలాంటి భావోద్రేకాలు చాలా తీవ్రస్థాయిలో ఉంటాయి.

ఇక్కడ కర్మయోగం అంటే ఉపాసనయోగం కూడా కలుపుకోవాలి. కృష్ణపరమాత్మ ప్రత్యేకించి చెప్పలేదు కాని, కర్మతో ఉపాసన తోడుగా ఉంటుంది. కొంతమంది కర్మయోగంతో కాకుండా ఉపాసనయోగంతో మొదలుపెట్టవచ్చు. అందువల్ల కర్మయోగేన అంటే మొదటి రెండుదశలూ వస్తాయి అందులో.

**అన్యే సాంఖ్యేన యోగేన** – కొంతమంది మూడు, నాలుగు దశల్లో మొదలుపెడతారు. అంటే వారు పూర్వజన్మలో కర్మ, ఉపాసనలు చేసేసి ఉండివుంటారు. అందువల్ల వారికి చిన్నవయస్సులోనే ఆధ్యాత్మిక చింతన మొదలవుతుంది; వారు ప్రాపంచిక సుఖాల వైపు మొగ్గుచూపరు. అందువల్ల వారు సరాసరి మూడవదశకో, నాలుగవదశకో వచ్చేస్తారు. మూడవదశ శ్రవణం, నాలుగవదశ మననం అనీ చూశాము.

మరికొంతమంది పుణ్యజీవులు ఉంటారు. వారు పూర్వజన్మలో నాలుగుదశలూ దాటేసి ఉండివుంటారు.

**తత్ర తం బుద్ధిసంయోగం లభతే పౌర్వదేహికమ్** – 6.43

పూర్వజన్మ జ్ఞానంతో వారికి సంబంధం ఉంటుంది. ఆ జ్ఞానం ఎలా పొందారో వారికి తెలియదు. అటువంటివారు ఐదవదశ సాధన చేస్తే చాలు. ఏమిటది?

**ధ్యానేన ఆత్మని పశ్యంతి** – ధ్యానం అంటే ఇక్కడ నిదిధ్యాసనం. చివరిదశ. నిదిధ్యాసనంలో జ్ఞానం కొత్తగా పొందడు సాధకుడు. శ్రవణంలో పొందిన జ్ఞానాన్ని, మననంలోనే నిశ్చయజ్ఞానంగా మలుచుకుంటాడు. ఆ జ్ఞాననిష్ఠలో నిలబడటానికి నిదిధ్యాసనం తోడ్పడుతుంది. జ్ఞాని స్థితప్రజ్ఞుడు అవుతాడు.

**తదుక్తమృషిణా । గర్భే ను సన్నన్వేషామవేదమహం దేవానాం జనిమాని విశ్వా**
**శతం మా పుర ఆయసీరరక్షన్నధః శ్యేనో జవసా నిరదీయమితి।**
**గర్భ ఏవైతచ్ఛయానో వామదేవ ఏవమువాచ ॥** – ఐతరీయోపనిషత్ 2.5

తల్లిగర్భంలో ఉండగానే వామదేవుడనే ఋషి అహం బ్రహ్మ అస్మి అని ప్రకటించాడుట. తల్లికే అహం బ్రహ్మ అస్మి అని తెలియదు, ఆయనకెలా తెలుసు అంటే దానికి జవాబు ఇంతవరకూ చూస్తూ వస్తున్నదే. వామదేవ ఋషి పూర్వజన్మలోనే చెయ్యాల్సిన కృషి చేశారు. మొదటి నాలుగుదశలూ దాటేశారు ఆయన. కేవలం నిదిధ్యాసనం చేస్తే చాలు. దీన్నిబట్టి ఈ ఐదుదశల్లో ఏ దశలో మనం ఇప్పుడు ఉంటే, ఆ దశనుంచీ సాధన చెయ్యాలి.

శ్లో. 26 **అన్యే త్వేవమజానంతః శ్రుత్వాన్యేభ్య ఉపాసతే ।**
**తేపి చాతితరంత్యేవ మృత్యుం శ్రుతిపరాయణాః ॥**
అన్యే తు, ఏవమ్, అజానంతః, శ్రుత్వా, అన్యేభ్యః, ఉపాసతే,
తే, అపి, చ, అతితరంతి, ఏవ, మృత్యుమ్, శ్రుతిపరాయణాః ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| అన్యే తు | = | మరికొందరు | చ | = | ఇంకా |
| ఏవమ్ | = | ఈ విధంగా ఉపనిషత్తులు | శ్రుతిపరాయణాః | = | శ్రవణపరాయణులైన |
| అజానంతః | = | నేర్చుకుని ఉండరు | తే, అపి | = | వీరును |
| శ్రుత్వా అన్యేభ్యః | = | తత్త్వజ్ఞులనుంచి వేదాంతబోధను విని | మృత్యుమ్ | = | మృత్యురూపసంసారమును |
| | | | అతితరంతి, ఏవ | = | నిస్సందేహముగా దాటుదురు |
| ఉపాసతే | = | నేర్చుకుని, జీర్ణించుకుంటారు; | | | |

**అన్యే తు ఏవమ్ అజానన్తః అన్యేభ్యః శ్రుత్వా ఉపాసతే, తే**
**శ్రుతి-పరాయణాః చ అపి మృత్యుమ్ అతితరన్తి ఏవ ॥**

తా: మరికొందరు ఈ విధంగా ఉపనిషత్తులు నేర్చుకుని ఉండరు, కాని తత్త్వజ్ఞులనుంచి వేదాంతబోధను విని నేర్చుకుని, జీర్ణించుకుంటారు; శ్రవణపరాయణులైన వీరు సంసారమును నిస్సందేహముగా దాటుదురు.

శ్రవణం అంటే వేదాంతశాస్త్రాన్ని అధ్యయనం చెయ్యటం అని చూశాము. మన శాస్త్రాన్ని ప్రస్థానత్రయం అంటారు. అవి -

శ్రుతిప్రస్థానం - ఉపనిషత్తులు
స్మృతిప్రస్థానం - భగవద్గీత
న్యాయప్రస్థానం - బ్రహ్మసూత్రాలు

అహం బ్రహ్మ అస్మి జ్ఞానాన్ని ఈ ప్రస్థానత్రయం బోధిస్తుంది. దాన్ని శ్రోత్రియబ్రహ్మనిష్ఠ అయిన గురువు సమర్థవంతంగా ఒక క్రమపద్ధతిలో, క్రమం తప్పకుండా బోధిస్తాడు. అద్వైత వేదాంతాన్ని మామూలుగా తరగతిలో లౌకికవిద్య బోధించినట్టుగానే గురువు బోధిస్తాడు.

ఇక్కడ ఈ శ్లోకం సారాంశం ఈ ఆత్మజ్ఞానాన్ని గురువు ఏ భాషలో బోధించినా, దేనినుంచి బోధించినా కూడా ఆత్మతత్త్వాన్ని అందించగలిగితే చాలు; శిష్యుడు దానిని పట్టుకోగలుగుతాడు అని వస్తుంది. అంటే ముందు చెప్పినట్టుగా ప్రస్థానత్రయాన్ని అధ్యయనం చెయ్యాలంటే చాలా సుదీర్ఘమైన ప్రయాణం అది. అందువల్ల గురువు ఒక్కొక్క ఉపనిషత్తునూ ఒక్కొక్క మంత్రం పరంగా బోధ చెయ్యకపోయినా, తను ఈ ప్రస్థానత్రయాన్ని జీర్ణించుకుని, తన బోధలో వాటి సారాంశాన్ని రంగరించి చెప్పినా మంచిదే. ఎందుకంటే వేదాంతం భాషకు మాత్రమే పరిమితమవలేదు, వేదాంతం బోధకు ప్రాముఖ్యతను ఇస్తుంది.

**పూర్ణమదః పూర్ణమిదం పూర్ణాత్ పూర్ణముదచ్యతే**
**పూర్ణస్య పూర్ణమాదాయ పూర్ణమేవావశిష్యతే** - శాంతిపాఠం

ఈ శాంతిపాఠం జీవ-ఈశ్వర ఐక్యం బోధిస్తుంది. జీవుడు పూర్ణం, ఈశ్వరుడు పూర్ణం అంటుంది. అంటే చైతన్యపరంగా జీవాత్మ పరమాత్మల ఐక్యం చూపిస్తుంది. దీని సారం గురువు చెపితే, శిష్యునికి బాగా అర్థమవుతుంది. అది ఏ భాష అయినా కావచ్చు. అతనికి కూడా మోక్షం వస్తుంది. ఆ భావాన్ని ఈ శ్లోకంలో చూపిస్తున్నాడు కృష్ణపరమాత్మ.

**అన్యే తు** – మరికొంతమంది ఉంటారు.

**ఏవమజానంతః** – వారు మన ప్రాథమిక గ్రంథాలైన ఉపనిషత్తులను అధ్యయనం చేసివుండరు; లేదా ప్రస్థానత్రయం నేర్చుకుని ఉండరు. ఏవం అంటే ఈ ప్రాథమిక గ్రంథాలను; అజానంత – నేర్చుకుని ఉండరు. కాని దాని బదులు ఏం చేస్తారు?

**అన్యేభ్యః శ్రుత్వా** – ప్రాథమిక గ్రంథాలను నేర్చుకుని, వాటిలో ఉన్న తత్వాన్ని జీర్ణించుకుని, ఆ తత్వాన్ని తనదైన శైలిలో, ఒక క్రమపద్ధతిలో చెప్పగలిగిన ఆచార్యుని దగ్గరకు వారు వెళతారు. ఆ ఆచార్యుడు ఏ భాషలో చెబుతాడు? ఏ భాషలో కావాలంటే ఆ భాషలో చెప్పే ఆచార్యులు ఉన్నారు. మన భారతదేశంలో, ఏ మూలకు వెళ్ళినా, ఆ రాష్ట్రభాషలో శాస్త్రాన్ని బోధించగల దిట్టలు ఉంటారు. ఆ మాటకొస్తే మన జానపద గీతాల్లో వేదాంతసారం ఉంటుంది. చివరకి చిన్నపిల్లలకు పాడే జోలపాటల్లో కూడా అవస్థాత్రయ సాక్షిచైతన్యం గురించి వస్తుంది. కాకపోతే వాటిల్లో అంతలోతైన అర్థం ఉందని వాటిని పాడే తల్లికి తెలియదు; వింటూ నిద్రపోయే పసికందుకూ తెలియదు. తుకారం, నామదేవ్, అన్నమయ్యలు పాడే భక్తిపాటలు తీసుకోండి. వాటిలో ఎంత లోతైన వేదాంతసారం నిండివుంది! అలా వేదాంతసారం నేర్చుకోవటం ముఖ్యం; ఎక్కడ నేర్చుకున్నారన్నది ముఖ్యం కాదు.

మన శ్రవణం నిర్వచనం ప్రకారం ఉపనిషత్తులు కొన్ని సంవత్సరాలపాటు నేర్చుకోకపోయినా, వాటి సారాన్ని జీర్ణించుకుంటే అతను మోక్షం పొందుతాడు. దానికి భిన్నంగా కొన్ని సంవత్సరాలు ఉపనిషత్తులను ఒక క్రమపద్ధతిలో నేర్చుకుని కూడా వాటిని జీర్ణించుకోలేకపోతే అతను మోక్షం పొందలేడు. అందువల్ల చిన్మయానంద స్వామీజీ అంటారు, 'నువ్వు ఎన్ని ఉపనిషత్తులు నేర్చుకున్నావన్నది కాదు ముఖ్యం; ఎన్ని జీర్ణించుకున్నావన్నది ముఖ్యం.'

**(అన్యేభ్యః శ్రుత్వా) ఉపాసతే** – కొంతమంది వారి భాషలో నేర్చుకుంటారు; ఉపాసతే అంటే నేర్చుకుని, జీర్ణించుకుంటారు; ఇక్కడ శ్రుతి అంటే వేదాలు కాదు; ఇక్కడ శ్రుతి అంటే గురువాక్య శ్రవణం. అంటే వారు శ్రుతిని ప్రత్యక్షంగా వినకపోయినా, గురువుమీద అంత శ్రద్ధ పెట్టుకుని, గురువు చేసిన బోధను జీర్ణించుకుంటారు.

**తే అపి మృత్యుం తరంత్యేవ** – అటువంటివారు కూడా మృత్యువును జయిస్తారు. అంటే సంసారంనుంచి విముక్తిని పొందుతారు. ఎంత విశాల దృక్పథమో చూడండి.

పూర్వకాలంలో వేదాలు జనబాహుళ్యానికి అందుబాటులో లేకపోయినా, వాటి సారాంశం అన్నివేళలా అందరికీ అందుబాటులో ఉండేది. ఉపనిషత్తును ప్రత్యక్షంగా నేర్చుకోకపోయినా, దాని సారాన్ని ఏ భాషలో నేర్చుకున్నా, దాన్ని జీర్ణించుకుంటే, సాధకుడు మోక్షం పొందుతాడు. ఆ సాధకుడు ఏ వర్ణానికైనా చెందవచ్చు; అంటే బ్రాహ్మణుడు, క్షత్రియుడు, వైశ్యుడు, శూద్రులలో ఎవరైనా కావచ్చు; ఏ ఆశ్రమానికైనా చెందవచ్చు. అంటే బ్రహ్మచారి, గృహస్థు, వానప్రస్థుడు, సన్న్యాసులలో ఎవరైనా కావచ్చు. స్త్రీ పురుషులలో ఎవరైనా కావచ్చు; ఏ వయస్సువారైనా కావచ్చు. అతను శ్రద్ధగా గురువాక్య శ్రవణం చేసి వేదాంతసారాన్ని వంటబట్టించుకుంటే మోక్షం పొందుతాడు.

శ్లో. 27 **యావత్సంజాయతే కించిత్ సత్త్వం స్థావరజంగమమ్ ।**
**క్షేత్రక్షేత్రజ్ఞసంయోగాత్ తద్విద్ధి భరతర్షభ ॥**
యావత్, సంజాయతే, కించిత్, సత్త్వమ్, స్థావరజంగమమ్,
క్షేత్రక్షేత్రజ్ఞసంయోగాత్, తత్, విద్ధి, భరతర్షభ ॥

| | | | |
|---|---|---|---|
| భరతర్షభ | = ఓ అర్జునా! | తత్ | = ఆ ప్రాణి సముదాయము |
| స్థావరజంగమమ్ | = చరాచరాత్మకమైన | క్షేత్ర, క్షేత్రజ్ఞ | = క్షేత్రక్షేత్రజ్ఞ |
| సత్త్వమ్ | = ప్రాణి | సంయోగాత్ | = సంయోగమువల్లే |
| యావత్, కించిత్ | = ఏదేది | విద్ధి | = కలుగునని తెలుసుకొనుము |
| సంజాయతే | = పుట్టుచున్నదో | | |

**హే భరతర్షభ! యావత్ కిఞ్చిత్ స్థావర-జఙ్గమమ్ సత్త్వమ్**
**సఞ్జాయతే, తత్ క్షేత్ర-క్షేత్రజ్ఞ-సంయోగాత్ (సఞ్జాయతే ఇతి త్వం) విద్ధి ॥**

తా: ఓ అర్జునా! చరాచరాత్మకమైన ప్రాణి ఏదేది పుట్టుచున్నదో, ఆ ప్రాణి సముదాయము క్షేత్రక్షేత్రజ్ఞ సంయోగమువల్లే కలుగునని తెలుసుకొనుము.

ముందు రెండు శ్లోకాల్లో ప్రతి ఒక్కరూ సాధనల్లోని ఐదుదశలనూ దాటితీరాలనీ, అన్ని సాధనలూ చివరికి ఆత్మజ్ఞానంలో ముగియాలనీ చెప్పాడు కృష్ణపరమాత్మ.

**ఆత్మని ఆత్మనా ఆత్మానం పశ్యంతి**

ఆత్మజ్ఞానానికి అందరూ వచ్చితీరాలి.

కర్మయోగంద్వారా చిత్తశుద్ధి పొందుతారని చూశాము. ఆ చిత్తశుద్ధికోసం మనకు ఇష్టమైన ఏ కర్మనైనా చెయ్యవచ్చు. జపం చెయ్యవచ్చు, పూజ చెయ్యవచ్చు, సమాజసేవ చెయ్యవచ్చు, వేరే ఏదైనా చెయ్యవచ్చు; కాని జ్ఞానయోగంలో అన్ని మార్గాలు లేవు. ఉన్నదొక్కటే మార్గం. దయానంద సరస్వతి స్వామీజీ చెబుతారు, 'ఒక ఆలయానికి నాలుగు ద్వారాల్లో ఏ ద్వారంనుంచి అయినా వెళ్ళవచ్చు కాని గర్భగుడికి వెళ్ళటానికి మాత్రం ఒకటే మార్గం ఉంది.' అంటే ఆలయప్రవేశానికి అనేక ద్వారాలు ఉన్నాయి; కాని భగవంతుని దగ్గరకు వెళ్ళటానికి మాత్రం ఒకటే ద్వారం ఉంది.

అదే విధంగా, సాధన చెయ్యటానికి అనేక మార్గాలు ఉన్నాయి; కాని మోక్షం పొందటానికి ఒకటే మార్గం ఉంది. ఆ విషయమే చెప్పాడు కృష్ణపరమాత్మ ఇంతకుముందు రెండు శ్లోకాల్లోనూ. జ్ఞానం పొందటానికి ఒక్కటే మార్గం ఉందని మనం పదేపదే ఎందుకు గట్టిగా చెబుతున్నాము? అది మతోన్మాదం కాదా? మంకుపట్టు

పట్టినట్టు కాదా? అది మతోన్మాదమూ కాదు, మంకుపట్టు పట్టటమూ కాదు అంటున్నాడు కృష్ణపరమాత్మ. అది సత్యం, సత్యం, పునః సత్యం.

చీకటి కాంతివల్ల మాత్రమే తొలగిపోతుందని చెపితే అది వెర్రి అభిమానం అవుతుందా? దానికి వేరే మార్గం లేదు; రాజీపడే అవకాశం అంతకన్నా లేదు. ఆ గదిలో చీపురుతో ఊడిస్తే చీకటి తొలగిపోదు. అందువల్ల చీకటిని పారద్రోలటానికి అనేక మార్గాలు లేవు; అలా చెపితే మనది సంకుచిత స్వభావం అవదు. సత్యం ఏమిటంటే చీకటి, వెలుతురువల్లనే పోతుంది. అజ్ఞానమనే చీకటి జ్ఞానజ్యోతివల్లనే పోతుంది. 'అయినా మమ్మల్ని మతోన్మాది అన్నా నాకు అభ్యంతరం లేదు, వెర్రివాడు అనుకునే దానికన్నా మతోన్మాది అనిపించుకోవటం మంచిదే,' అంటారు దయానంద స్వామీజీ.

జ్ఞానమార్గమే సత్యం అని ఎందుకంటాము? కృష్ణపరమాత్మ దానికి కారణం కూడా చెప్పాడు. సంసారం ఎందుకు ఏర్పడుతుంది? అజ్ఞానంవల్ల, పొరపాటువల్ల. అజ్ఞానం దేనివల్ల ఏర్పడుతోంది? పొరపాటు దేనివల్ల ఏర్పడుతోంది? నేను పురుషుణ్ణి అనే జ్ఞానం లేదు నాకు. పురుషుడు అంటే నిర్గుణ, నిర్వికార, సత్య చేతనతత్త్వం పురుషుడు.

**పూర్ణపురుషః అహమస్మి**

ఈ జ్ఞానం లేదు నాకు. ఇది అజ్ఞానం సమస్య. ఈ అజ్ఞానం, పొరపాటుకు దారితీసింది. ఏమిటా పొరపాటు? నేను పూర్ణపురుషుణ్ణి అనే జ్ఞానం పొందక, నేను ప్రకృతితో మమేకం చెందుతున్నాను. అంటే నేను ఆత్మను అని తెలియక, నేను అనాత్మగా పొరపాటు పడుతున్నాను. నిద్రలో జరుగుతున్నది అదే. నిద్రలో ఈ శరీరాన్ని మర్చిపోయి, స్వప్నశరీరాన్ని ధరిస్తాను. స్వప్నశరీరంతో ఎందుకు మమేకం చెందుతాను? మంచంమీద పడుకుని కలలు కంటున్నది నేనే అనే జ్ఞానం లేకపోవటంవల్ల. అందువల్లనే స్వప్నంనుంచి లేచాక, సహజంగానే స్వప్నశరీరంనుంచి విడివడతాను.

అదేవిధంగా పురుష అజ్ఞానం ప్రకృతి అభిమానానికి దారితీసింది. ఈ అధ్యాయంలోని వేరే పదాలు వాడాలంటే క్షేత్రజ్ఞ అజ్ఞానం, క్షేత్ర అభిమానానికి దారితీసింది. వేదాంతపరిభాషలో చెప్పాలంటే ఆత్మ అజ్ఞానం అనాత్మ అభిమానానికి దారితీసింది.

**క్షేత్రక్షేత్రజ్ఞసంయోగాత్** – సంయోగం అంటే అభిమానంవల్ల, పొరపాటు పడటంవల్ల. పొరపాటు పదంలోనే ఉంది అర్థం – నా కళ్ళకు పొరలు కప్పటంవల్ల నేను పాట్లు పడుతున్నాను. నేను క్షేత్రజ్ఞుణ్ణి అనే విషయంలో అజ్ఞానం ఉండటంవల్ల నేను క్షేత్రం అనుకుని దానిమీద అభిమానం పెంచుకుంటున్నాను. దీన్ని ఆత్మ–అనాత్మ అధ్యాస అంటారు. అధ్యాస అన్నా కూడా పొరపాటే.

శంకరాచార్యులు తన బ్రహ్మసూత్రభాష్యంలో ఉపోద్ఘాతంలో అధ్యాసభాష్యం వ్రాశారు. ఆయన రచించింది ఒకటిన్నర పేజీలు మాత్రమే; కాని దానికి పుంఖానుపుంఖాలుగా భాష్యాలు, ఉపభాష్యాలు వచ్చాయి. దాని సారం నేను ఆత్మను అని తెలియక ఎలా అనాత్మగా పొరపాటుపడతామో వస్తుంది. ఎంత వెర్రితనమో చూడండి!

నేను చేతనతత్త్వం అని తెలియక నేను జడమైన శరీరం అనుకుంటాను. అనుకోవటమే కాదు, దాన్ని విజయవంతంగా పెంచి పోషిస్తాను.

ఈ దేహాభిమానం పెంచుకోవటంవల్ల రెండు సమస్యలు వస్తాయి. నేను నిత్యపురుషుణ్ణి అయితే, అది తెలియక నేను అనిత్యమైన శరీరాన్ని అని పొరపాటుపడతాను. అశాశ్వతాన్ని, అపూర్ణత్వాన్ని నామీద ఆపాదించుకుంటాను. ఆ అపూర్ణత్వం తొలగించుకోవటానికి అనేక కోరికలు కోరతాను. దాన్ని కామం అంటారు. ఆ కోరికలు తీర్చుకోవటానికి అనేక కర్మలు చేస్తాను. కర్మలు నాకు పుణ్యపాపాలను కలుగజేస్తాయి; పుణ్యపాపాలు సుఖదుఃఖాలకు దారితీస్తాయి; సుఖదుఃఖాలు పునర్జన్మకు కారణమవుతాయి. ఇదంతా కలిపి సంసారం అవుతుంది. అంటే ఏడు తప్పటడుగులు వేసి సంసారంలోకి అడుగుపెడతాము.

అజ్ఞానం → దేహాభిమానం → కామం → కర్మ → పుణ్యపాపాలు → సుఖదుఃఖాలు → పునరపి జననం పునరపి మరణం = సంసారం.

అంటే సంసారానికి మూలకారణం అజ్ఞానం. అజ్ఞానం తొలిగితే, మొత్తం అన్ని దశలూ తొలిగిపోతాయి.

**యావత్ సత్త్వమ్ సంజాయతే** – సత్త్వమ్ అంటే ప్రాణి. పుట్టిన ప్రతిప్రాణి జననమరణాల వృత్తంలో పడి కొట్టుమిట్టాడాల్సిందే.

**స్థావరజంగమమ్** – చరాచరాత్మకమైన ప్రతి ప్రాణి కూడా. స్థావరం అంటే కదలని చెట్లు; జంగమం అంటే కదిలే జంతువులు, మనుష్యులు.

యావత్ సంజాయతే – యావత్ అంటే మొత్తం ఈ చరాచర ప్రాణులన్నీ కూడా; జాయతే అంటే జననమరణ వృత్తంలో పడి తిరగాల్సిందే. దానికి కారణం నేను శరీరం అని పొరపాటు పడటంవల్లనే.

**తత్ విద్ధి భరతర్షభ** – ఓ అర్జునా, ఈ దేహాభిమానం అనేది పొరపాటు అనీ, అది అజ్ఞానంవల్ల ఏర్పడిన పొరపాటు అనీ తెలుసుకో అంటున్నాడు కృష్ణపరమాత్మ. ఒక పొరపాటు ఏర్పడాలంటే దానికి ముందు అజ్ఞానం ఉండాలి. అంటే అజ్ఞానం కారణం, పొరపాటు కార్యం అవుతాయి.

పొరపాటు అజ్ఞానజనితం కాబట్టి, పొరపాటును పారద్రోలాలంటే, దాన్ని ప్రత్యక్షంగా పారద్రోలలేము; దానికి కారణమైన అజ్ఞానాన్ని పారద్రోలాలి. ఒక చెట్టును నాశనం చెయ్యాలంటే కేవలం దాని కొమ్మలను కొడితే చాలదు. కొత్తకొమ్మలు మళ్ళీ పుట్టుకొస్తూనే ఉంటాయి. ఆ చెట్టును కూకటివేళ్ళతో సహా పెకళించివేస్తే గాని పూర్తిగా నాశనమవదు. అదే విధంగా ఒక రోగాన్ని నయం చెయ్యాలంటే, దాని లక్షణాలకు మందు ఇస్తే చాలదు. అది మళ్ళీ తిరగబెడుతుంది; ఆ రోగంయొక్క మూలకారణానికి మందు వెయ్యాలి. ఈ విషయం రావణవధలో చూశాము.

రావణాసురునికి ఉన్న పదితలలను శ్రీరాముడు ఎన్నిసార్లు వధించినా, మళ్ళీ కొత్త తలలు పుట్టుకొస్తూనే ఉన్నాయి. అప్పుడు అగస్త్యమహాముని వచ్చి, శ్రీరామునికి ఆదిత్యహృదయాన్ని బోధించాడు. ఆదిత్యహృదయం

వేదాంతసారం. విభీషణుడు హృదయంలో ఉన్న అమృతభాండాన్ని కొల్లగొడితే, దాన్నుంచి పుట్టుకొస్తున్న తలలు రావు అని చెప్పాడు. బ్రహ్మాస్త్రంతో హృదయాన్ని నాశనం చేస్తే తలలు రావు.

ఇదే సూత్రాన్ని మనకు అన్వయిస్తే, తత్త్వమసి అనే బ్రహ్మాస్త్రంతో హృదయంలో ఉన్న అజ్ఞానాన్ని నాశనం చేస్తే, తలలు అనే పొరపాట్లు పుట్టుకురావు. శాస్త్రం ప్రకారం మనస్సు హృదయంలో ఉంటుందని చూశాము. అందువల్ల బుద్ధిలో మార్పు వస్తే, పొరపాటు తొలగిపోతుంది. ఇంకో విధంగా చెప్పాలంటే, జ్ఞానం అజ్ఞానాన్ని తొలగిస్తే, అజ్ఞానం పొరపాటును తొలగిస్తుంది. పొరపాటు నాశనమయితే సంసారం నాశనమవుతుంది.

**జ్ఞానాదేవ తు కైవల్యమ్**

జ్ఞానంవల్లనే మోక్షం కలుగుతుంది. ఏ యుగంలో? ఇది ఒక అయోమయం మళ్ళీ. దీనికి ఎదురుప్రశ్న వెయ్యాలి. కాంతివల్ల చీకటి ఏ యుగంలో తొలగుతుంది? కలియుగంలో భక్తితోనే మోక్షం వస్తుంది అనేది అపోహ. కృత, త్రేతా, ద్వాపరయుగాలతో పాటు కలియుగంలో కూడా జ్ఞానంవల్లనే మోక్షం కలుగుతుంది. అజ్ఞానం తొలగటానికి అనేక మార్గాలు లేవు. ఉన్నదొక్కటే మార్గం. అది జ్ఞానమార్గం. ఈ విధంగా ఈ సాధనల గురించి కృష్ణపరమాత్మ ఈ మూడు శ్లోకాల్లో – 25, 26, 27లలో చెప్పాడు.

శ్లో. 28 **సమం సర్వేషు భూతేషు తిష్ఠంతం పరమేశ్వరమ్ ।**
**వినశ్యత్స్వవినశ్యంతం యః పశ్యతి స పశ్యతి ॥**
సమమ్, సర్వేషు, భూతేషు, తిష్ఠంతమ్, పరమేశ్వరమ్,
వినశ్యత్సు, అవినశ్యంతమ్, యః, పశ్యతి, సః, పశ్యతి ॥

| | | | |
|---|---|---|---|
| యః | = ఎవడు | సమమ్ | = సమభావముతో |
| వినశ్యత్సు | = నశించుచున్నట్టి | తిష్ఠంతమ్ | = ఉన్నవానినిగా |
| సర్వేషు | = సమస్త చరాచర | పశ్యతి | = చూచునో |
| భూతేషు | = భూతములందు | సః | = అతడే |
| అవినశ్యంతమ్ | = నాశరహితుడైన | పశ్యతి | = నిజముగా చూచువాడు |
| పరమేశ్వరమ్ | = పరమేశ్వరుని | | |

**యః వినశ్యత్సు సర్వేషు భూతేషు సమమ్ తిష్ఠన్తమ్ అవినశ్యన్తమ్**
**పరమేశ్వరమ్ పశ్యతి, సః పశ్యతి ॥**

తా: ఎవడు నశించుచున్నట్టి సమస్త చరాచర భూతములందు నాశరహితుడైన పరమేశ్వరుని సమభావముతో ఉన్నవానినిగా చూచునో అతడే నిజముగా చూచువాడు.

ఈ శ్లోకంనుంచి కృష్ణపరమాత్మ జ్ఞానఫలం గురించి చెప్పబోతున్నాడు. నిజానికి చాలా ఫలాలు ఉన్నాయి గాని, వాటిల్లోంచి కొన్ని చెప్పబోతున్నాడు కృష్ణపరమాత్మ.

ఎ) **సర్వత్ర సమదర్శనం** – అంతటా ఒకటే ఆత్మను చూడటం. చూడటం అంటే అక్షరాలా కళ్ళతో చూడటం అనికాదు అర్థం; జ్ఞానచక్షువుద్వారా మారుతున్న అనాత్మ అంతటా మారని ఆత్మ ఉందని అర్థం చేసుకోగలగటం. శరీరం మారుతుంది; మనస్సు మారుతుంది; ఆలోచనలు మారతాయి; కాని ఈ మారే మనశ్శరీరాలలో అంతటా ఉన్న మారని చైతన్యం ఒకటి ఉంది. కదులుతున్న సముద్రంలోనూ, ఎగసిపడే అలల్లోనూ, వాటిపైన వచ్చిపోతున్న బుడగల్లోనూ కదలని శాశ్వతమైన నీరు ఒకటే ఉంది. అలాగే మారుతున్న మనశ్శరీరాలలో, మారని ఆత్మ ఉంది. జ్ఞాని ఈ సమదర్శనం చేస్తాడు.

**వినశ్యత్సు సర్వేషు భూతేషు** – ఇక్కడ భూతః అంటే అనేక కార్యకరణసంఘాతాలు. అనేక అలలు ఉన్నట్టుగా అనేక మనశ్శరీరాలు ఉన్నాయి. అవి ఎటువంటివి? వినశ్యత్సు – చావు, పుట్టుకలు ఉన్నవి.

**సమం పరమేశ్వరమ్** – ఈ జీవుల్లో శరీరం భిన్నంగా ఉంటుంది; మనస్సు భిన్నంగా ఉంటుంది; బుద్ధి భిన్నంగా ఉంటుంది కాని ఈ మారే శరీరం, మనస్సు, బుద్ధుల వెనక మారనిది ఒకటి ఉంది. దాన్నే సత్ అని అనవచ్చు లేదా చిత్ అని అనవచ్చు లేదా సత్ చిత్ ఆనంద పరమాత్మ అనవచ్చు. ఇక్కడ పరమేశ్వరమ్ అంటున్నాడు కృష్ణపరమాత్మ. ఈశ్వరుడు ఎక్కడో దూరంగా లేడు.

> **ఈశ్వరః సర్వభూతానాం హృద్దేశేఽర్జున తిష్ఠతి ।** – 18.61
> **యో వేద నిహితం గుహాయం పరమే వ్యోమన్ ।** – తైత్తిరీయం
> **దేహో దేవాలయ ప్రోక్తః , జీవో దేవః సనాతనః॥**

దేహమే దేవాలయం; ఆత్మ భగవంతుడు; జ్ఞాని తను వ్యవహారంలో మునిగి ఉన్నా కూడా భగవంతుణ్ణి మర్చిపోడు.

వ్యవహారాలు నడుపుతున్నప్పుడు మారుతున్న మనశ్శరీరాలను గ్రహిస్తాడు జ్ఞాని, కాని వాటి వెనకనున్న మారని ఆత్మను మర్చిపోడు. అందువల్లనే మన సాంప్రదాయంలో నమస్తే అంటారు. నమస్కారం పెట్టటంలోని ఉద్దేశ్యం – నీలో ఉన్న ఆత్మ, నాలో ఉన్న ఆత్మ ఒక్కటే. అలాగే నుదుటిమీద చందనమో, కుంకుమో, విభూతో లేదా నామమో పెట్టుకునే కారణం కూడా మనలో దైవం ఉన్నాడని గుర్తుంచుకోవటానికి. మనలో శాశ్వతమైన, మారని పరమాత్మ ఉన్నాడని తెలిస్తే, మారే మనుష్యులమీద, వస్తువులమీద ఆధారపడము. నదిలో మునిగిపోతున్న వ్యక్తి గడ్డిపోచను ఆధారంగా పట్టుకుంటే లాభం లేనట్టుగా, మనం అశాశ్వతమైన వస్తువులను ఆధారంగా పట్టుకుంటే లాభంలేదు.

**సమం సర్వేషు భూతేషు తిష్ఠంతం పరమేశ్వరమ్ ఆత్మానం యః పశ్యతి** – ఎవరైతే ఈ ఆత్మను మర్చిపోరో, ఎవరైతే ఈ సమదర్శనం లేదా అద్వైత దర్శనం లేదా అభేద దర్శనం చేస్తారో,

**స పశ్యతి** – అతనొక్కడే సరియైన దార్శనికుడు. మనం అనేక విషయాలను చూస్తాము కాని సరియైన దాన్ని చూడము; దార్శనికుడు సరియైనదాన్ని చూస్తాడు. మనమంతా అలాంటి దార్శనికులం అవాలి.

ఏమిటా సరియైన దర్శనం? ఇది ఆత్మజ్ఞానం పొందితే కలుగుతుంది. ఈ జగత్తు మొత్తం ప్రకృతి, పురుషుల మేలుకలయిక. ప్రకృతి, పురుషులనుంచి జగత్తు పుట్టింది కాబట్టి జగత్తులో ఈ రెండింటి మిశ్రమం ఉంటుంది. తల్లిదండ్రులనుంచి పుట్టిన పిల్లలు ఇద్దరి లక్షణాలను పుణికిపుచ్చుకుంటారు చూడండి. అలాగే జగత్తులో కూడా ప్రకృతి, పురుషుల రెండు లక్షణాలూ ఉంటాయి. కాని మనం ప్రకృతితో తాదాత్మ్యం చెంది, పురుషుని విషయం పట్టించుకోము. అలాగని పూర్తిగా పురుషుడే ఉన్నాడని, ప్రకృతినీ నిర్లక్ష్యం చెయ్యకూడదు. సరియైన దర్శనం ఏమిటంటే మొత్తం జగత్తు, ప్రతిప్రాణి, ప్రతిజీవి కూడా ఈ ప్రకృతి, పురుషుల మేలుకలయిక అని గ్రహించటం. ప్రకృతి లక్షణాలు – సగుణ, సవికార, మిథ్య, అచేతనతత్త్వం అని చూశాము. ఇవి కంటికి కనబడతాయి. కాని పురుషుడు నిర్గుణ, నిర్వికార, సత్య, చేతనతత్త్వం కాబట్టి ప్రత్యక్ష ప్రమాణానికి అందదు. ఆ తత్త్వాన్ని మన బుద్ధితో అర్థం చేసుకోవాలి.

ఫ్యానును చూస్తే, కంటికి కనబడే ఫ్యాను తెలుస్తుంది కాని దాని వెనకనుండి, కంటికి కనబడకుండా నడిపిస్తున్న విద్యుచ్ఛక్తి తెలియదు. అంటే చూసేది ఒకటే వస్తువును; కాని దానిలో కనబడే పదార్థం ఉంది, కనబడని తత్త్వం ఉంది. అదే విధంగా మనం తోటి మనిషిని లేదా ఒక ప్రాణిని చూస్తుంటే అతనిలో కూడా కనబడే శరీరం వెనక కనబడని ఆత్మ ఉంది. శరీరాన్ని ఈ చక్షువులతో చూస్తే, ఆత్మను జ్ఞానచక్షువుతో చూడాలి. శివునికి మూడు నేత్రాలు ఉన్నాయి. త్రినేత్రుడు అంటారు. మనకు కూడా అలా మూడు నేత్రాలు ఉండాలి. రెండు నేత్రాలతో లౌకికప్రపంచాన్ని చూస్తాము. మూడవకన్నును శాస్త్రజ్ఞానచక్షువు అంటారు. ఆ కంటితో చూస్తాము. ఆ మూడవకంటికి సూచనగా నుదుట బొట్టు పెడతాము.

తంత్రశాస్త్రంలో అనేక చక్రాల గురించి చెబుతారు; అందులో ఆజ్ఞాచక్రం అని ఒక చక్రం ఉంటుంది. ఆజ్ఞాలో ఆ అంటే పూర్ణం; జ్ఞా అంటే జ్ఞానం. అందువల్ల ఆజ్ఞాచక్రం అంటే పూర్ణజ్ఞానాన్ని సూచిస్తుంది. ఆజ్ఞాచక్రం మూడవకన్నుకు సంకేతం. దానికి సంకేతంగా అక్కడ తిలకం పెడతారు. ఇది 'పురుషుని గురించిన జ్ఞానం కూడా నాకు ఉంది సుమా,' అని సూచిస్తుంది.

ప్రకృతి, పురుషులలో ప్రకృతి సవికారం అనీ, పురుషుడు నిర్వికారం అనీ చూశాము. ప్రకృతి మనిషి, మనిషికీ మారుతుంది. వర్ణభేదాలు ఉంటాయి, ఆశ్రమభేదాలు ఉంటాయి, లింగభేదాలు ఉంటాయి. అందువల్ల మామూలు కళ్ళు ప్రకృతిలోని భేదాలను చూస్తాయి. ఈ భేదాలను చూడటానికి గురువు లేదా శాస్త్రం లేదా వేదాంతం అవసరం లేదు. మామూలు కళ్ళు అనిత్య ప్రకృతిని చూస్తే, శాస్త్రచక్షువు నిత్య ఆత్మదర్శనం చేయిస్తుంది. దర్శనం అంటే మామూలు కళ్ళతో కాదు, దివ్యచక్షువులతో చేస్తాము.

పరమేశ్వరుడు అంటే ఇక్కడ పురుషుడు. పరమేశ్వరుడు అంటే ఒక్కొక్కరి హృదయంలో ఒక ఇష్టదైవం కూర్చున్నాడని ఊహించుకోకూడదు. పరమేశ్వరుడు అంటే నిర్గుణనిర్వికారసత్యచేతనతత్త్వం.

యః పశ్యతి అంటే పురుషదర్శనం చేసిన జ్ఞాని ప్రకృతిని మర్చిపోతాడని అర్థం చేసుకోకూడదు. పురుషుణ్ణి, ప్రకృతినీ కూడా చూస్తాడు. ఫ్యాను చూసినప్పుడు ఫ్యానునూ, విద్యుచ్ఛక్తినీ – రెండింటినీ చూసినట్టుగా సందర్భాన్నిబట్టి ప్రకృతికి లేదా పురుషునికి ప్రాముఖ్యతను ఇస్తాడు జ్ఞాని.

ఇంతకుముందు చూసినట్టుగా నీ పేరేమిటి అని ఎవరైనా అడిగితే నేను నిర్గుణ, నిర్వికార, సత్య, చేతనతత్త్వాన్ని అని చెప్పకూడదు. అప్పుడు ప్రకృతిపరంగా జవాబు చెప్పాలి. అదే ప్రకృతి సమస్యలను సృష్టిస్తున్నప్పుడు, జీవితం భారంగా అనిపిస్తుంది; సమస్యలమయంగా ఉంటుంది జీవితం; ఆందోళనలు చుట్టుముట్టుతాయి. అప్పుడేం చెయ్యాలి? ఛానెల్ మార్చాలి. ప్రకృతి శాశ్వతత్వాన్ని, పూర్ణత్వాన్ని, శాంతి భద్రతలను ఇవ్వదు. నిజానికి ప్రకృతి మనిషియొక్క ఉన్నతమైన అవసరాలను తీర్చలేదు.

కొంతమంది అంటారు, 'నాకు జీవితంలో అన్నీ సమృద్ధిగా ఉన్నాయి. నా మాటకు విలువనిచ్చే భర్త ఉన్నాడు; నా కనుసన్నల్లో మెదిలే పిల్లలు ఉన్నారు; విశాలమైన ఇల్లు ఉంది; ఇంటినిండా నౌకర్లు ఉన్నారు; నా భర్త వ్యాపారం మూడుపువ్వులూ, ఆరుకాయలుగా వృద్ధి చెందుతోంది; నేను కోరుకుంటే కొండమీది కోతినైనా తీసుకువస్తారు మావారు. అయినా ఏదో కొరత, ఏదో వెలితి నన్ను బాధిస్తోంది.' ఆ కొరత, ఆ వెలితి, ఆధ్యాత్మిక కొరత. ఇలాంటి పరిస్థితి వచ్చినప్పుడు ప్రకృతి ఛానెల్ నుంచి పురుషుని ఛానెల్ వైపుకు మారగలగి ఉండాలి. నేను ప్రకృతిని కాను, నేను పురుషతత్త్వాన్ని అని చెప్పుకోగలగాలి. అదే పూర్ణత్వాన్ని, శాంతిభద్రతలను, శాశ్వతత్వాన్ని ఇస్తుంది. ఈ పూర్ణత్వంలో నెలకొన్నాక, అవసరమైతే మళ్ళీ ప్రకృతిలోకి మారవచ్చు. మంచి గాఢనిద్ర పోయాక, మర్నాటి కార్యక్రమాలు చేపట్టటానికి ఎలా శక్తి పుంజుకుంటారో, అలా పురుషునిలో స్వాంతన పొందాక, ప్రకృతి కార్యక్రమాలను చేపట్టవచ్చు. ఇలా ప్రకృతి, పురుషుల మేలుకలయికను అర్థం చేసుకుని, మారే వ్యవహారాలన్నిటి వెనకనున్న మారని పురుషుని విషయం మర్చిపోకుండా ఉండగలిగితే దాన్ని ఆత్మనిష్ఠ అంటారు. దాన్ని సహజసమాధి అంటారు.

ఈ శ్లోకం ఆ విధంగా జ్ఞానికి కలిగే మొదటి ఫలాన్ని వివరించింది. అతను సమ్యక్ దర్శనం చేస్తాడు కాబట్టి అది మనోవ్యాధికి మందులా పనిచేస్తుంది. ప్రతిమనిషికీ ఏదో ఒక సమయంలో ఏదో ఒక నిరాశానిస్పృహలకు లోనవుతాడు. మనోవ్యాధికి మందు లేదంటారు. ఏ మందైనా వేసుకున్నా వాటివల్ల వేరే కొత్త సమస్యలు పుట్టుకొస్తాయి. కాని ఈ సమదర్శనం దానికి శాశ్వతమైన పరిష్కారం.

**మొదటి ఫలం – సర్వత్రసమదర్శనం.**

శ్లో. 29 **సమం పశ్యన్ హి సర్వత్ర సమవస్థితమీశ్వరమ్ ।**
**న హినస్త్యాత్మనాత్మానం తతో యాతి పరాం గతిమ్ ॥**
సమమ్, పశ్యన్, హి, సర్వత్ర, సమవస్థితమ్, ఈశ్వరమ్,
న, హినస్తి, ఆత్మనా, ఆత్మానమ్, తతః, యాతి, పరామ్, గతిమ్ ॥

| | | | |
|---|---|---|---|
| హి | = ఎందుకంటే | ఆత్మనా | = తనద్వారా |
| సర్వత్ర | = అతడు అన్నింటియందును | ఆత్మానమ్ | = తనను |
| సమవస్థితమ్ | = సమభావముతో స్థితుడైన | న, హినస్తి | = నాశనమొందించుకొనడు |
| ఈశ్వరమ్ | = పరమేశ్వరుని | తతః | = అందువలన అతడు |
| సమమ్ | = సమానముగా | పరామ్, గతిమ్ | = పరమగతిని |
| పశ్యన్ | = చూచుచు | యాతి | = పొందును |

**(యః) సర్వత్ర సమవస్థితమ్ ఈశ్వరమ్ సమం పశ్యన్ హి ఆత్మనా**
**ఆత్మానమ్ న హినస్తి, (సః) తతః పరామ్ గతిమ్ యాతి ॥**

తా: ఎందుకంటే అతడు అన్నింటియందును సమభావముతో స్థితుడైన పరమేశ్వరుని సమానముగా చూచుచు తనద్వారా తనను నాశనమొందించుకొనడు. అందువలన అతడు పరమగతిని పొందును.

బి) **అమృతత్వప్రాప్తి** – జ్ఞాని శాశ్వతత్వాన్ని పొందుతాడు.

**అసతో మా సద్గమయ తమసో మా జ్యోతిర్గమయ మృత్యోర్మా అమృతం గమయ**

'మా' అంటే నన్ను. నన్ను అసత్యంనుంచి సత్యానికి తీసుకువెళ్ళు; చీకటినుంచి వెలుగులోకి తీసుకువెళ్ళు; అశాశ్వతత్వమునుంచి శాశ్వతత్వానికి తీసుకువెళ్ళు. 'మా' అంటే వద్దు అని కూడా అర్థం వస్తుంది. అందువల్ల సందర్భాన్నిబట్టి అర్థం తీసుకోవాలి. ఇక్కడ వద్దు అంటే నన్ను చీకటిలోనే ఉండనియ్యి, వెలుగులోకి, శాశ్వతత్వానికి తీసుకువెళ్ళవద్దు అని అర్థం వస్తుంది. అందువల్ల ఇక్కడ చెబుతున్న ఫలం అమృతత్వప్రాప్తి.

**సమం పశ్యన్** – విషమదర్శనం అంతటా సమదర్శనం చేస్తాడు జ్ఞాని. వ్యవహారం నడపటానికి విషమదర్శనం కావాలి. గీతాబోధలో సర్వత్ర సమదర్శనం గురించి విని బయటకు వచ్చాక, సమదర్శనం పాటించమన్నారని చెప్పి, వేరే ఎవరివో చెప్పులు వేసుకుని వచ్చేయకూడదు. వ్యవహారం వ్యవహారమే. కాని అది చేస్తున్నంతసేపూ కూడా పురుషదర్శనాన్ని మర్చిపోకూడదు.

**పశ్యన్ శృణ్వన్ స్పృశన్ జిఘ్రన్నశ్నన్ గచ్ఛన్ స్వపన్ శ్వసన్ ॥** – 5.8

ఏది చూస్తున్నా, ఏది వింటున్నా, ఏది తలుచుకుంటున్నా, ఏది స్మరిస్తున్నా, దేన్ని రుచి చూస్తున్నా, జ్ఞాని అందులో మమేకం చెందడు. ఈ సమదర్శనం లేకపోతే స్వప్నప్రపంచం భయపెట్టినట్టుగా ప్రకృతి మనను భయపెట్టేస్తుంది. కల సృష్టించగానే, అది మనం సృష్టించిన కలే అని మర్చిపోయి, అందులో జరిగిన సంఘటనలకు భయపడతాము. అలాగే సినిమాకి వెళ్ళినప్పుడు, సినిమా వెనకనున్న తెరను మర్చిపోయి, సినిమాలో మమేకం చెందితే, అందులోని సంఘటనలు మనను బాధపెడతాయి లేదా భయపెడతాయి. ఒక్కమాటలో చెప్పాలంటే, పురుషుని విషయం మర్చిపోతే చాలు, ప్రకృతి భయపెట్టేస్తుంది.

**సర్వత్ర** – అన్నింటిలోనూ చూస్తాడు జ్ఞాని. దేన్ని చూస్తాడు?

**సమవస్థితమీశ్వరమ్** – ఇక్కడ కూడా ఈశ్వరుడు అంటే ఏకరూప ఈశ్వరుడు కాదు; అనేకరూప ఈశ్వరుడు కూడా కాదు. ఈశ్వరుడు అంటే పురుషుడు లేదా ఆత్మ. అంటే నిర్గుణబ్రహ్మ; గుణాలులేని బ్రహ్మ. అటువంటి పురుషుడు అంతటా ఉన్నాడు.

సమవస్థితమ్ అంటే అధిష్ఠానంగా ఉన్నాడు. ప్రకృతి మిథ్య, పురుషుడు సత్యం అని చూశాము. మిథ్యాప్రకృతికి సత్య అధిష్ఠానపురుషుని ఆధారం లేకపోతే విడిగా ఉనికి లేదు. ఎలాగైతే తెర లేకపోతే సినిమా ఆడలేదో, అలా పురుషుడు లేకపోతే ప్రకృతికి ఉనికి లేదు. తెర ఉన్నట్టు మనకు తెలిసినా తెలియకపోయినా అదే ఆధారం;

అలాగే పురుషుడు ఉన్నట్టు తెలిసినా తెలియకపోయినా పురుషుడే ఆధారం. అందువల్ల జ్ఞాని అన్ని సమయాల్లోనూ అన్నిచోట్లా పురుషుడినే చూస్తాడు. చూస్తాడు అంటే అక్షరాలా చూస్తాడు అని కాదు అర్థం; జ్ఞానచక్షువుతో అర్థం చేసుకుంటాడు. దానివల్ల అతను పొందే ఫలమేమిటి?

**పరాం గతిమ్ యాతి** – అత్యంత గొప్ప లక్ష్యాన్ని పొందుతాడు. అంటే అమృతత్వాన్ని పొందుతాడు. దాని తర్వాత అతన్ని మృత్యుభయం వెంటాడదు.

దాన్ని ఇక్కడ కృష్ణపరమాత్మ అద్భుతంగా వర్ణిస్తున్నాడు. దాని తర్వాత జ్ఞాని తనను తాను నాశనం చేసుకోడు అంటున్నాడు. అంటే దాని అర్థం ఏమిటి? ప్రతి అజ్ఞానీ సంసారి తనను తాను నాశనం చేసుకుంటున్నాడని కృష్ణపరమాత్మ మాటలకర్థం. మామూలుగా అజ్ఞాని తన సమస్యలకు ప్రపంచాన్నో, అందులో ఉన్న మనుష్యులనో నిందిస్తాడు కాని వేదాంతం ప్రకారం, ప్రపంచం ఏమీ సమస్యలను సృష్టించదు; మన అజ్ఞానంవల్ల మనమే మనను నాశనం చేసుకుంటున్నాము. ఈ భావన ఈశావాస్యోపనిషత్తులో వస్తుంది. మనం ఆత్మహత్య చేసుకుంటున్నాము అంటుంది ఆ ఉపనిషత్తు. శంకరాచార్యులవారు ఈ మంత్రాన్ని రెండురకాలుగా విశ్లేషిస్తారు. రెండూ అద్భుతమైన విశ్లేషణలు. వాటిని ఇప్పుడు మనం చూద్దాము.

1) **ఆత్మ అజ్ఞానంవల్ల అజ్ఞాని శరీరాన్ని చంపుతాడు** – అజ్ఞాని ఆత్మ అజ్ఞానంవల్ల అనాత్మ అయిన శరీరంతో మమేకం చెందుతాడు. అంటే ఆత్మ అజ్ఞానం, దేహాభిమానాన్ని పెంచుతుంది. ఎప్పుడైతే దేహాభిమానం పెరుగుతుందో, అప్పుడే అజ్ఞాని కర్తా అవుతాడు. ఆత్మ అకర్త కాని దేహాభిమానం, అజ్ఞానిని కర్త చేస్తుంది. కర్తగా అతను అనేక కర్మలు చేస్తాడు; ఆ కర్మలు అనేక పుణ్యపాపాలను ప్రోగేస్తాయి. లౌకికపరంగా బ్యాంకు ఎక్కౌంటులో ధనాన్ని ప్రోగేసాడో లేదో కాని ఆధ్యాత్మికపరంగా పుణ్యపాపాలు ప్రోగేస్తాడు. వేదాంతశాస్త్రం, ఈ పుణ్యపాపాలే నీ వచ్చే జన్మకి కారణం అంటుంది.

వచ్చే జన్మలో మనకు మానవజన్మ వస్తే దానికి కారకులు ఎవరు? తల్లిదండ్రులా, భగవంతుడా? ఎవరూ కాదు. మనం చేసుకున్న కర్మలే కారణం. ఆ కొత్త జన్మ, ఆ కొత్త శరీరం కొన్ని సంవత్సరాలు ఉంటుంది. తర్వాతెప్పుడో అది కూడా రాలిపోతుంది. ఎందుకు? వ్యావహారిక జీవితంలో, డాక్టర్ల పరిభాషలో చెప్పాలంటే గుండెనొప్పి వచ్చో, క్యాన్సర్ అనే మహమ్మారి వచ్చో, రోడ్డుప్రమాదంలో హఠాత్తుగానో, మరేదో రోగం వచ్చో మరణిస్తాడు కాని వేదాంతపరిభాషలో చెప్పాలంటే అతని ప్రారబ్ధకర్మ ముగిసింది. అంటే ఒక జన్మ రావటానికీ, ఆ జన్మ ముగియటానికీ కూడా ఆ వ్యక్తి చేసుకున్న పుణ్యపాపాలే కారణం. ఈ జన్మతో అతని పుణ్యపాపాలు ముగుస్తాయా? లేదు. ఇది అంతులేని కథ. ఈ కథకు ముగింపులేదు. పునరపి జననం, పునరపి మరణం అనే వృత్తంలో కొనసాగుతూనే ఉంటాడు అజ్ఞాని. అందువల్ల అజ్ఞాని తనను తాను చంపుకుంటాడు అంటాడు. ఆత్మహంతః అంటే ఆత్మహత్యకు కారణం అవుతాడు అంటే శరీరం మరణించటానికి కారణం అవుతాడు.

2) **ఆత్మ అజ్ఞానంవల్ల అజ్ఞాని ఆత్మను చంపుతాడు** – ఆత్మ అజ్ఞానంవల్ల ఆత్మను చంపుతాడు అంటున్నారు శంకరాచార్యులవారు. ఆత్మహత్య చేసుకుంటున్నాడు అంటే ఆత్మను హత్య చేస్తున్నాడు. అజ్ఞాని ఆత్మను ఎలా హత్య చెయ్యగలడు అని శంకరాచార్యులవారే సందేహాన్ని వెలిబుచ్చి దానికి జవాబును కూడా చెబుతున్నారు.

ఆత్మ శాశ్వతం, దానికి నాశనం లేదని ఒకపక్క చెబుతూ, అజ్ఞాని ఆత్మను చంపుతాడని ఎలా చెప్పగలము? అజ్ఞాని ఆత్మని **చంపినట్టుగా** అర్థం చేసుకోవాలి.

అజ్ఞాని ఆత్మని చంపినట్టుగా చేస్తున్నాడు అంటే అర్థం ఏమిటి? అజ్ఞానికి ఆత్మయొక్క ఉన్నతస్థాయి తెలియకపోవటంవల్ల. తన ఉన్నతస్థాయిని స్వీకరించటం లేదు. తన ఇంటిలోనే లంకెబిందెలు ఉన్నాయని తెలియని వ్యక్తి వాటిని తవ్వి తీసుకోలేడు. అంటే అతని అజ్ఞానంవల్ల వాటిని పొందలేక పోతున్నాడు. అలాగే, అజ్ఞాని తను ఆత్మను అని తెలియక, తన ఉన్నతస్వరూపంవల్ల పొందే ఫలాన్ని పొందలేకపోతున్నాడు. ఉన్నతస్వరూపం ఉండికూడా దాని గురించి తెలియటం లేదు అంటే అది ఉన్నా లేనట్టే. ఎందుకు? ఉన్నత స్వరూపంవల్ల పొందగలిగే ఫలాన్ని పొందలేకపోతున్నాడు కాబట్టి. శంకరాచార్యులవారు దాన్ని అతను నాశనం చేసినట్టే అంటున్నారు. ఏదైనా నాశనం అయితే, దానివల్ల ప్రయోజనం పొందలేనట్టే, ఆత్మనుంచి ఫలితం పొందటం లేదు కాబట్టి ఆత్మను నాశనం చేసినట్టే అర్థం. అతని ఉన్నత స్వరూపం ఏమిటి? పూర్ణత్వం, అభయత్వం, అమృతత్వం. అవి తెలియక అతను అవస్థ పడుతున్నాడు. ఆ విధంగా ఆత్మపరంగా చూస్తే, అతను ఆత్మహత్య చేసుకున్నట్టే అర్థం.

అజ్ఞాని ఆ విధంగా తను ఆత్మను అని తెలియక శరీరాన్ని చంపుతాడు; తను ఆత్మను అని తెలియక ఆత్మను చంపుతాడు. అజ్ఞాని తనను తాను నాశనం చేసుకుంటాడు అంటే జ్ఞాని మాటేమిటి? జ్ఞాని తనను తాను నాశనం చేసుకోడు.

**న హినస్త్యాత్మనాత్మానామ్** – అజ్ఞానిలాగా, జ్ఞాని తనను తాను నాశనం చేసుకోడు. తనను శరీరపరంగానూ నాశనం చేసుకోడు; ఆత్మపరంగానూ నాశనం చేసుకోడు. అతను అమృతత్వాన్ని పొందుతాడు. పరాంగతి యాతి– అతను పరమగతిని పొందుతాడు అంటే అమృతత్వాన్ని పొందుతాడు.

**రెండవఫలం – అమృతత్వప్రాప్తి.**

శ్లో. 30 **ప్రకృత్యైవ చ కర్మాణి క్రియమాణాని సర్వశః ।**
**యః పశ్యతి తథాత్మానమ్ అకర్తారం స పశ్యతి ॥**
ప్రకృత్యా, ఏవ, చ, కర్మాణి, క్రియమాణాని, సర్వశః,
యః, పశ్యతి, తథా, ఆత్మానమ్, అకర్తారమ్, సః, పశ్యతి ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| చ | = | ఇంకా | తథా | = | అలాగే |
| యః | = | ఏ పురుషుడు | ఆత్మానమ్ | = | ఆత్మను |
| కర్మాణి | = | సర్వకర్మలు | అకర్తారమ్ | = | అకర్తగా |
| సర్వశః | = | అన్ని విధముల | పశ్యతి | = | భావించునో |
| ప్రకృత్యా, ఏవ | = | ప్రకృతిచేతనే | సః | = | అతడు |
| క్రియామాణాని | = | చేయబడుచున్నట్లు | (పశ్యతి) | = | (నిజముగా చూచువాడు) |
| పశ్యతి | = | చూచునో | | | |

**యః చ ప్రకృత్యా ఏవ కర్మాణి సర్వశః క్రియమాణాని (సన్తి ఇతి పశ్యతి),**

**తథా ఆత్మానమ్ అకర్తారమ్ పశ్యతి, సః పశ్యతి ॥**

తా: ఇంకా ఏ పురుషుడు సర్వకర్మలు అన్ని విధముల ప్రకృతిచేతనే చేయబడుచున్నట్లు చూచునో, అలాగే ఆత్మను అకర్తగా భావించునో, అతడు నిజముగా చూచువాడు.

సి) **అకర్తృత్వం** – జ్ఞాని, ఆత్మగా తను ఏ కర్మలూ చేయటం లేదని తెలుసుకుంటాడు. అంటే అకర్తృత్వప్రాప్తి కలుగుతుంది అతనికి. జ్ఞాని తను అకర్త అని తెలుసుకుంటే అతను సంసారంనుంచి విడివడినట్టే. ఎందుకంటే కర్తృత్వభావనే అన్ని సమస్యలకూ మూలకారణం.

– నేను **కర్తను** అనుకుంటే అనేక **కర్మలు** మనము చేస్తాము.

– ఆ కర్మలు మనకు ఇష్టం ఉన్నా, లేకపోయినా **కర్మఫలాలను** తెస్తాయి. ఆ కర్మఫలాలు సుఖదుఃఖాల రూపంలో ఉంటాయి. ప్రపంచంలోకి కర్మరూపంలో వెళ్ళినది, తిరిగి మనకు కర్మఫలరూపంలో వస్తుంది. అందులో ఏ పొరపాటూ ఉండదు; చిరునామా మార్పూ ఉండదు. కర్మఫలాలను స్వీకరించకా తప్పదు. అంటే అప్పుడు మనం **భోక్తా** అవుతాము. ఈ భోక్త హోదానుంచి మనం తప్పించుకోలేము.

శనిదశనుంచి తప్పించుకోలేము. ఒకవ్యక్తి తనకు శనిదశ ఉందని తెలుసుకుని, ఎక్కడో పోయి దాక్కున్నాడు. ఆ సమయంలో దాక్కుని బయటకు వచ్చాక, శనితో సవాలు విసిరాడు, 'చూశావా, నిన్ను నేను తప్పించుకున్నాను.' శని చిరునవ్వు నవ్వి, 'రాజభోగాలు అనుభవించాల్సిన నువ్వు ఎక్కడో అజ్ఞాతవాసం చేసి, కనీస అవసరాలకు కూడా కష్టపడటం ఎందుకనుకున్నావు? నా ప్రభావంవల్లనే,' అన్నాడు.

కర్తగా మనం ఉంటే భోక్తగా కర్మఫలాలను అనుభవించకతప్పదు. భోక్తృత్వం తప్పించుకోవాలి అనుకుంటే, దానికి ఒకటే మార్గం ఉంది. కర్తృత్వంనుంచి తప్పించుకోవటమే దానికి మార్గం. కర్తృత్వంనుంచి తప్పించుకోవాలంటే దేహాభిమానంనుంచి ఎదగాలి. దేహాభిమానం ఉన్నంతవరకూ కర్మలు నేను చేస్తున్నాను అనుకోక తప్పదు. దేహాభిమానం ప్రకృతి అభిమానంవల్ల వస్తుంది. ప్రకృతి అభిమానం మనను కర్తను చేస్తుంది. ఎప్పుడైతే ఈ దేహాభిమానం వదిలి, నేను ప్రకృతిని కాదు, నేను పురుషుణ్ణి అని అర్థం చేసుకుంటామో అప్పుడే కర్తృత్వ, భోక్తృత్వ భావనలనుంచి ఎదుగుతాము.

**కర్మాణి** – మంచి, చెడు కర్మలన్నీ;

**ప్రకృత్యా ఏవ క్రియమాణాని సర్వశః** – ప్రకృతిచేతనే చెయ్యబడుతున్నాయి. ప్రకృతే కర్మలను చెయ్యగలదు. ఎందుకంటే, ఒక కర్మ చెయ్యాలంటే, కొన్ని మార్పులు సహజం. మనం మాట్లాడాలంటే నోటిని తిప్పుతాము. ఏదైనా ఆలోచించాలంటే ఆలోచనలు మారతాయి. అందువల్ల కర్మ అంటే వికారం చెందటం. ప్రకృతి వికారం చెందుతుంది కాబట్టి కర్మ చెయ్యగలదు.

పురుషుని విషయానికి వస్తే పురుషుడు నిర్గుణ, నిర్వికార, సత్య, చేతనతత్త్వం అని చూశాము. పురుషుడు నిర్వికారం కాబట్టి కర్మలు చెయ్యలేడు. కాయిక, వాచిక, మానసికకర్మలు చెయ్యలేడు; ధార్మిక, అధార్మిక కర్మలు

కూడా చెయ్యలేదు. ప్రకృతే చెయ్యగలదు. ప్రకృతి అంటే కార్యకరణ సంఘాతం అంటే మనశ్శరీరాలు. ఇంకో విధంగా చూస్తే శరీరత్రయం లేదా పంచకోశం. కాని పురుషుడు శరీరత్రయం విలక్షణం; పంచకోశాతీతుడు.

జ్ఞాని, తను ఆత్మ అని అర్థం చేసుకుంటాడు. అతని సమక్షంలో ప్రకృతే అంతా చేస్తోంది అని గ్రహిస్తాడు. అయితే అతను ఎవరు?

**ఆత్మానమ్ అకర్తారం స పశ్యతి** – జ్ఞాని తను అకర్తను అని తెలుసుకుంటాడు. జ్ఞానికి జ్ఞానంవల్ల సంచితకర్మలు దగ్ధమయిపోతాయి; ఆగామికర్మలు కొత్తగా వచ్చి చేరవు; ప్రారబ్ధకర్మ ఉంటుంది కాని దానికి చలించడు. అజ్ఞానికి కర్మలు అంత త్వరగా క్షయమవవు. ఎందుకంటే అవి **అనంతకోటి జన్మార్జితాని కర్మాణి** – అనేక జన్మలనుంచీ ప్రోగుచేసుకు వచ్చినవి. వాటిని ఒక్క జన్మలో క్షయం చేసుకోవటం కష్టం. అదికాక పాతకర్మలు ఉండగా, ఇంకా ఈ జన్మలో చేసిన కొత్త కర్మలవల్ల కలిగే ఆగామికర్మలు కూడా వచ్చి చేరతాయి. ఉదాహరణకు 2,783 కర్మలు (అర్థమవటానికి ఒక సంఖ్య ఇవ్వబడింది, ఇది నిజం కాదు) అజ్ఞాని ఈ జన్మలో క్షయం చేసుకున్నాడనుకుంటే, ఈ జన్మలో కొత్తగా వచ్చి చేరేవి 27000 ఉండవచ్చు. అందువల్ల కర్మల వృత్తాన్ని ఆపటం అసాధ్యం.

కర్మల వృత్తంవల్ల జననమరణ వృత్తం ఏర్పడుతుంది. ఈ వృత్తాన్ని ఆపటం కష్టం. దానికి ఒకటే మార్గం ఉంది. దాన్నించి బయటకు రావటమే. జాతరలో రంగులరాట్నం ఎక్కుతారు. అది కొన్ని నిముషాలసేపు తిరుగుతుంది. అందులో కూర్చుని, ఆకాశంలోకి వెళుతూ అక్కడనుంచి ప్రపంచాన్ని చూస్తే రంగురంగులుగా కనిపించి, ఆనందదాయకంగా ఉంటుంది. కాని ఏదో కారణంవల్ల దాన్ని ఆపే వ్యక్తి అక్కడనుంచి వెళ్ళిపోయాడనుకోండి; మీరు ఆ రంగులరాట్నంలోనే తిరుగుతూనే ఉండాలని తెలిసేసరికి అంత రంగులమయంగా ఉన్న ప్రపంచం అంతా చీకటి కప్పేసినట్టు అవుతుంది. రంగులు పోయి, నల్లరంగు మిగులుతుంది. ఆ రంగులరాట్నాన్ని ఆపేదెలా? అది ఆగదు, దాన్ని ఆపే వ్యక్తి లేడు, దాన్నుంచి దూకేయటమే మార్గం. అదే విధంగా ప్రకృతి వృత్తంలో తిరుగుతూనే ఉంటుంది. దాన్ని మీరు ఆపలేరు. దాన్నుంచి మీరే బయటకు దూకేయాలి. ఆత్మానం అకర్తారం స పశ్యతి.

**తత్త్వవిత్తు మహాబాహో గుణకర్మవిభాగయోః ।**
**గుణా గుణేషు వర్తంతే ఇతి మత్వా న సజ్జతే ॥** – 3.28

ప్రకృతే కర్మలు చేస్తోంది; ఆత్మనైన నేను చెయ్యటం లేదని జ్ఞాని తెలుసుకుంటాడు. కాని ఈ విషయాన్ని సరిగ్గా అర్థం చేసుకోవాలి. కొంతమంది అద్వైతబోధను వారికి కావాల్సినట్టుగా మలచుకుంటారు. చేసే అక్రమాలన్నీ చేసేసి, నేనేం చెయ్యటం లేదు, ప్రకృతే చేస్తోంది అంటారు.

**ప్రకృత్యైవ చ కర్మాణి క్రియమాణాని సర్వశః**

పైగా గొప్పగా ఈ శ్లోకాన్ని ఉటంకిస్తారు.

ఇంతకుముందు కూడా ఈ ఉదాహరణను చూశాము. ఒక నేరస్థుడు ఒక నేరం చేసి కోర్టుకెళతాడు. 'నేనేం నేరం చెయ్యలేదు. నేను ఆత్మను, ప్రకృతే అంతా చేస్తోంది,' అంటాడు. ఆ న్యాయాధికారి ఇతనికన్నా రెండాకులు ఎక్కువే చదివాడు. 'నేను కూడా నిన్నేం శిక్షించటం లేదు. ఆత్మ సర్వవ్యాపకం కాబట్టి దాన్ని నేను జైలులో బంధించలేను. పైగా ఆత్మ అకర్తా, అభోక్తా. ప్రకృతే అంతా చేస్తోందని తెలుసు. అందువల్ల ప్రకృతికే నేను శిక్ష వేస్తున్నాను,' అంటాడు. చెల్లుకు చెల్లు. దానికీ దీనికీ సరిపోయింది.

అందువల్ల వేదాంతాన్ని అధర్మం చెయ్యటానికి వాడకూడదు. వేదాంతాన్ని అధర్మానికి వాడటానికి ప్రయత్నిస్తున్నామంటేనే, మనం వేదాంతాన్ని సరిగ్గా అర్థం చేసుకోలేదని అర్థం. ఎందుకంటే, వేదాంతాన్ని సరిగ్గా అర్థం చేసుకుంటే, మనం ధర్మాన్నే పాటిస్తాము. వేదాంతాన్ని సరిగ్గా అర్థం చేసుకున్నామో లేదో తెలుసుకోవాలంటే దానికి ఒకటే మార్గముంది. మనం జీవితాన్ని ధర్మపరంగా జీవిస్తుంటే, సరిగ్గానే వెళుతున్నట్టు, అధర్మంలోకి అడుగుపెడితే మాత్రం, కొన్నాళ్ళు వేదాంతాన్ని పక్కన పెడితే మంచిది. మళ్ళీ ధర్మశాస్త్రానికి వెళ్ళి, ధర్మం గురించి నేర్చుకోవాలి. వేదాంతాన్ని తప్పుగా వాడకూడదు; తప్పుగా అర్థం చేసుకోకూడదు.

**మూడవ ఫలం – అకర్తృత్వం.**

శ్లో. 31 **యదా భూతపృథగ్భావమ్ ఏకస్థమనుపశ్యతి ।**
**తత ఏవ చ విస్తారం బ్రహ్మ సంపద్యతే తదా ॥**
యదా, భూతపృథగ్భావమ్, ఏకస్థమ్, అనుపశ్యతి,
తతః, ఏవ, చ, విస్తారమ్, బ్రహ్మ, సంపద్యతే, తదా ॥

| | | | |
|---|---|---|---|
| యదా | = ఎప్పుడైతే | తతః, ఏవ | = ఆ పరమాత్మనుంచే |
| భూత పృథగ్భావమ్ | = వేర్వేరుగా కనిపిస్తున్న ప్రాణులన్నీ | విస్తారమ్ | = విస్తరించుచున్నవానినిగా |
| | | అనుపశ్యతి | = చూచునో |
| ఏకస్థమ్ | = ఒకే పరమాత్మయందు స్థితమైనవానినిగా | తదా | = ఆ క్షణమునందే అతడు |
| | | బ్రహ్మ | = సచ్చిదానందబ్రహ్మను |
| చ | = ఇంకా | సంపద్యతే | = పొందును |

**యదా భూత-పృథక్-భావమ్ ఏకస్థమ్ చ తతః ఏవ**
**విస్తారమ్ అనుపశ్యతి, తదా బ్రహ్మ సమ్పద్యతే ॥**

తా: ఎప్పుడైతే వేర్వేరుగా కనిపిస్తున్న ప్రాణులన్నీ ఒకే పరమాత్మయందు స్థితమైనవానినిగా ఇంకా ఆ పరమాత్మనుంచే విస్తరించుచున్నవానినిగా చూచునో ఆ క్షణమునందే అతడు సచ్చిదానందబ్రహ్మను పొందును.

డి) **బ్రహ్మత్వం** – ఇది చాలా లోతైన, గంభీరమైన శ్లోకం. వేదాంతంలోని అనేక దశలు ఈ ఒక్క శ్లోకంలో పొందుపరచబడ్డాయి. ఈ దశలను అర్థం చేసుకోవాలంటే, ముందు దానికి ఒక ఉదాహరణను చూడాలి.

వేదాంతంలో చెప్పే ఉదాహరణ ఆకాశం. ఆకాశాన్ని స్పేస్ అంటారు ఇంగ్లీషులో. స్పేస్ అంటే ప్రదేశం అనుకోవచ్చు. ఇప్పుడు ఆకాశంగానే వ్యవహరిద్దాము. మామూలుగా మనం ఆకాశాన్ని అంతగా పట్టించుకోము. ఇప్పుడు దీని గురించి దశలవారీగా చూద్దాము.

1. ఈ గదిలో, అంటే ఈ గదిలోని నాలుగుగోడల మధ్యన ఆకాశం ఉంది. కేవలం ఆకాశమే ఉంటే, మనం దాన్ని పట్టించుకోకుండా, ఈ గదిలో ఏమీ లేదు అనేస్తాము. ఆకాశం అంటే ఏమీ లేకపోవటం కాదు. అది ఒక సూక్ష్మ అంశం. అందువల్ల గదిలో ఆకాశం ఉంది.

2. ఆకాశం ఈ గదిలోనే కాదు, అన్ని గదుల్లోనూ ఉంది.

3. ఆకాశం అనేక గదుల్లో ఉన్నా, అనేక ఆకారాల్లో ఉన్నా కూడా, ఆకాశం ఏకం. గదులు అనేకం, ఆకాశం ఏకం.

4. ఆకాశం గదుల్లోనే కాదు, గదుల బయట కూడా ఉంది.

5. ఆకాశం గదిలోపల, గది బయట ఉండటం కాదు, నిజానికి ఆకాశంలోనే అన్ని గదులూ ఉన్నాయి. గదిలో ఆకాశం ఉంది అనే దశనుంచీ ఆకాశంలోనే గదులన్నీ ఉన్నాయనే దశకు రావాలి. ఆకాశాల్లో గదులు అనకూడదు. ఉన్నది ఒకటే ఆకాశం.
   ఉదాహరణకు ముందు కొన్ని ఎకరాల ఖాళీస్థలాన్ని చూస్తాము. కొన్ని సంవత్సరాలయ్యాక అందులో పెద్ద భవంతులు వస్తాయి. ఆ భవంతుల్లో మనం ఒక ఇల్లు కొనుక్కున్నాము అనుకుందాము. ఖాళీస్థలంనుంచి చూసుకుంటూవస్తే, ఆ ఖాళీస్థలంలో (ఆకాశంలో) భవంతులు వచ్చాయి; భవంతి బయటా, లోపలా ఆకాశం ఉంది; భవంతుల్లోని ఇళ్ళలో, ఇళ్ళబయటా, ఇళ్ళలోని గదుల్లో కూడా ఆకాశం ఉంది. అదంతా ఒకటే ఆకాశం. అంటే ఆ ఆకాశమే ఈ భవంతులకు, ఇళ్ళకు, గదులకు **స్థితికారణం**. అంటే వాటికి ఆధారం.

6. ఆకాశం స్థితికారణమే కాదు, సృష్టికారణం కూడా.

**ఆకాశాద్వాయుః వాయోరగ్నిః అగ్నేరాపః అద్భ్యః పృథివీ పృథివ్యా ఓషధయః** – తైత్తిరీయం

ఆకాశంనుంచే వాయువు వచ్చింది, వాయువునుంచి అగ్ని వచ్చింది, అగ్నినుంచి నీరు వచ్చింది, నీటినుంచి పృథివి వచ్చింది, పృథివినుంచి చెట్లు వచ్చాయి అని వస్తుంది తైత్తిరీయోపనిషత్తులో.

7. ఏదైతే సృష్టిస్థితి కారణమో, అదే లయకారణం కూడా అవుతుంది. ఆ విధంగా ఆకాశం సృష్టిస్థితిలయ కారణం అవుతుంది.

ఆ విధంగా ఈ గదిలో ఆకాశం ఉందని మొదలుపెట్టి అసలు ఆకాశంలోనే అన్ని గదులూ ఉన్నాయని చెప్పి, అందువల్ల ఆకాశమే అన్నిటికీ సృష్టిస్థితిలయ కారణం అని ముగించాము.

ఇప్పుడు ఇదే సూత్రాన్ని చైతన్యానికి అన్వయిద్దాము. ఆకాశం బదులు చైతన్యం, గది బదులు శరీరం పదాలు వాడి వాటిని ఒక్కొక్క దశకూ అన్వయించుకుంటూ రావాలి.

1. ఈ శరీరంలో చైతన్యం ఉంది.
2. చైతన్యం ఈ శరీరంలోనే కాదు, అన్ని శరీరాల్లోనూ ఉంది.
3. చైతన్యం అనేక శరీరాల్లో, అనేక ప్రాణుల్లో ఉన్నా కూడా చైతన్యం ఏకం. శరీరాలు అనేకం, చైతన్యం ఏకం.
4. చైతన్యం శరీరాల్లోనే కాదు, శరీరాల బయట కూడా ఉంది.
5. చైతన్యం శరీరం బయట, లోపల ఉండటం కాదు; నిజానికి చైతన్యంలోనే అన్ని శరీరాలూ ఉన్నాయి. అంటే చైతన్యమే అన్ని శరీరాలకూ స్థితికారణం.
6. చైతన్యం స్థితికారణమే కాదు, సృష్టికారణం కూడా.
7. ఏదైతే సృష్టిస్థితి కారణమో, అదే లయకారణం కూడా అవుతుంది. ఆ విధంగా చైతన్యం సృష్టిస్థితిలయ కారణం.

ఆ విధంగా ఈ శరీరంలో చైతన్యం ఉందని మొదలుపెట్టి, అసలు చైతన్యంలోనే అన్ని శరీరాలూ ఉన్నాయని చెప్పి, అందువల్ల చైతన్యమే అన్నిటికీ సృష్టిస్థితిలయ కారణం అని ముగించాము. కాకపోతే ఇక్కడ ఇంకొక దశ ముందుకు వెళతాము. అది ఆకాశం విషయంలో చెప్పము. చైతన్యానికే చెబుతాము.

8. ఆ చైతన్యాన్ని నేనే.

ఈ దశలన్నీ అర్థమయితే అహం బ్రహ్మ అస్మి అని స్పష్టంగా చెప్పగలుగుతారు. దీన్ని బ్రహ్మాత్వప్రాప్తి అంటారు. నేను బ్రహ్మను, నేను జగత్కారణాన్ని, నేనే జగత్తుకు అధిష్ఠానాన్ని అని అర్థం చేసుకుంటాడు జ్ఞాని.

నేనే జగత్కారణం బ్రహ్మ అని అర్థం చేసుకోవటానికి శాస్త్రం ఇచ్చే ఇంకొక ఉదాహరణ – స్వప్నప్రపంచం.

స్వప్నప్రపంచంలో నేను ఉన్నంతవరకూ నాకు స్వప్నం ఒక స్వప్నం అని తెలియదు. అది నిజమేననుకుంటాను. నేను స్వప్నశరీరంతో స్వప్నప్రపంచంలో మమేకం అవుతాను. అక్కడ చూసే కాలం, ప్రదేశం వేరుగా ఉంటాయి. అక్కడ నేను చూసే వస్తువులు నాకు రాగద్వేషాలను కలుగజేస్తాయి. అందువల్ల కొన్ని వస్తువులను చూసి నేను పారిపోతాను; కొన్ని వస్తువుల వైపు పరుగులు తీస్తాను. వస్తువువైపు వెళితే దాన్ని ప్రవృత్తి అంటారు; వస్తువునుంచి పారిపోతే దాన్ని నివృత్తి అంటారు. ఆ విధంగా నేను నా స్వప్నప్రపంచంలో ఒక చిన్న జీవిగా అల్లాడిపోతాను.

కాని ఆ స్వప్నప్రపంచంనుంచి నేను లేచిన మరుక్షణం, ఆ స్వప్నప్రపంచం మటుమాయమవుతుంది. అంతేకాదు, నేను కనుగొనే గొప్ప సత్యం ఏమిటి? నేను భావించినట్టుగా ఆ స్వప్నప్రపంచంలో అల్లాడిపోతున్న ఒక చిన్న జీవిని కాను నేను; మొత్తం ఆ ప్రపంచానికే సృష్టికర్తను నేను. అందులోని కాలం, ప్రదేశం, అందులో నేను చూసిన కొండలు, నదులు, వస్తువులు, చివరికి నా ప్రవృత్తి, నా నివృత్తి అన్నీ నేను సృష్టించినవే. అన్నీ నాలో, ఇంకా స్పష్టంగా చెప్పాలంటే నా చిత్తంలో, వాసనల రూపంలో నిక్షిప్తమై ఉన్నాయి. వాటినుంచి తీసుకుని, నా మనస్సు వాసనామయ ప్రపంచాన్ని సృష్టించింది. అది సృష్టించాక నేనే అందులోకి ప్రవేశించాను.

నా నిద్రాశక్తికి రెండు శక్తులు ఉన్నాయి. విక్షేపశక్తి, ఆవరణశక్తి. నా విక్షేపశక్తివల్ల నేను స్వప్నప్రపంచాన్ని సృష్టిస్తాను; అందులోకి అడుగుపెడతాను. కాని నా ఆవరణశక్తివల్ల నేనే అందులోకి అడుగుపెట్టానని మర్చిపోతాను. నేను అందులో అవస్థపడుతున్న పరిమితి ఉన్న జీవిని అనుకుంటాను. స్వప్నంలో ఉన్నంతవరకూ అదే నా పరిస్థితి.

స్వప్నంనుంచి లేచాక, మొత్తం పరిస్థితి తారుమారు అవుతుంది. సృష్టింపబడ్డ నేను సృష్టికర్తను అవుతాను. సృష్టించబడ్డ జీవినుంచి సృష్టికర్తగా ఎలా మారాను? దానికేమీ శ్రమపడనవసరం లేదు. నిద్రనుంచి లేస్తే చాలు. నిద్రనుంచి లేచిన మరుక్షణం స్వప్నపురుషుడినైన నేను జాగ్రద్‌పురుషుణ్ణి అవుతాను. అంటే స్వప్నశరీరాన్ని వదుల్చుకుని జాగ్రద్‌శరీరాన్ని ధరిస్తాను. అందువల్ల ఇలా మారటం అసాధ్యం కాదు. ఎలా మారటం? స్వప్నంలో బాధపడే జీవినుంచి, స్వప్నంయొక్క సృష్టికర్తగా మారటం. నేను స్వప్నంయొక్క సృష్టికర్తనే కాదు, స్థితికర్తా, లయకర్తా కూడా. నేను నిద్రలేస్తే స్వప్నంలోని కాలం, సమయం, వస్తువులు, అనుభవాలు అన్నీ నాలో లయమయిపోతాయి. నా మనస్సులోకి వెళ్ళిపోతాయి.

అంటే ముందేమన్నాం? నేను స్వప్నంలో ఉన్నాను. స్వప్నకాలంలో, స్వప్నదేశంలో ఉండి, స్వప్నవస్తువులతో వ్యవహారం నడుపుతున్నాను. కాని ఇప్పుడేమంటున్నాం? స్వప్నంనుంచి లేస్తే స్వప్నం, స్వప్నకాలం, దేశం, వస్తువులు అన్నీ నానుంచే వచ్చాయి అంటున్నాము. అంటే నేనే స్వప్నంయొక్క సృష్టి, స్థితి, లయకారణం అంటున్నాము. స్వప్నప్రపంచంలోని కార్యం కాదు నేను; స్వప్నప్రపంచమనే కార్యానికి నేను కారణాన్ని. ఇంతవరకూ బాగానే ఉంది.

ఈ జాగ్రద్‌ప్రపంచం కూడా ఇంకొక స్వప్నప్రపంచమే, స్వప్నప్రపంచంనుంచి లేస్తే నువ్వు సృష్టింపబడ్డ జీవివి కాదు, ఆ జీవియొక్క సృష్టికర్త అని ఎలా తెలుసుకుంటావో, అలాగే ఈ జాగ్రద్‌ప్రపంచంనుంచి నువ్వు లేస్తే, నువ్వు సృష్టింపబడ్డ జీవివి కాదు, ఆ జీవియొక్క సృష్టికర్తవు అని తెలుసుకుంటావు అంటుంది వేదాంతం.

స్వప్నప్రపంచం – స్వప్నం 1, దాన్నించి లేస్తే జాగ్రద్‌పురుషుడు అవుతాడు. ఇప్పుడు వేదాంతం ప్రకారం జాగ్రద్‌ప్రపంచం – స్వప్నం 2, దాన్నించి లేస్తే శుద్ధచైతన్యం అవుతాడు. స్వప్నప్రపంచంనుంచి లేస్తే జాగ్రద్‌పురుషుడు అయితే, జాగ్రద్‌ప్రపంచంనుంచి లేస్తే ఆత్మలో నెలకొని ఉంటాడు. జాగ్రద్‌ప్రపంచంనుంచి లేస్తే అంటే అక్షరాలా నిద్రలేవటం కాదు, ఆత్మ అజ్ఞానం తొలగి, తాను ప్రకృతి కాదు, పురుషుడు అని తెలుసుకోవటం. ఎప్పుడైతే తనే పురుషుడు అని తెలుసుకుంటాడో ఈ ప్రపంచం, కాలం, ప్రదేశం, వస్తువులు, ఈ శరీరం అన్నీ తననుంచే వచ్చాయని తెలుసుకుంటాడు. స్వప్నప్రపంచంలో వ్యవహారం నడపటానికి స్వప్నశరీరాన్ని ధరించినట్టుగా, జాగ్రద్‌ప్రపంచంలో వ్యవహారం నడపటానికి ఈ జాగ్రద్‌శరీరం ధరిస్తాడు.

**మయ్యేవ సకలం జాతం మయి సర్వం ప్రతిష్ఠితమ్।**
**మయి సర్వం లయం యాతి తద్బ్రహ్మాద్వయమస్మ్యహమ్॥** – కైవల్యమ్ 1.19

జ్ఞానం పొందిన జ్ఞాని నానుంచే సృష్టి వచ్చింది, నేనే స్థితికారకుణ్ణి, నాలోనే జగత్తు లయమవుతుందని ప్రకటిస్తాడు. మనమే స్వప్నప్రపంచ సృష్టిస్థితిలయకారకులమని మనకు తెలుసు. అదే విధంగా జ్ఞాని తనే ఈ జాగ్రద్‌ప్రపంచంయొక్క సృష్టిస్థితిలయ కారకుడినని చెబుతాడు. కాకపోతే ఆ నేను ఎవరనేది మర్చిపోకూడదు. నేను అంటే ఆత్మ లేదా ఈ సందర్భంలో పురుషుడు. ఈ జ్ఞానం పొందితే, మన ఉన్నతస్థాయిని అర్థం చేసుకోగలుగుతాము. ఏమిటది? నేను కార్యం కాదు, నేను కారణం; నేను జీవిని కాదు, నేను సృష్టికర్తను అనే జ్ఞానం. అది పొందితే అహం బ్రహ్మ అస్మి అని నిశ్చయంగా చెప్పగలుగుతాము. ఇవన్నీ అద్భుతమైన శ్లోకాలు. ఎందుకంటే ఇవి ఉపనిషత్తుల సారాన్ని బోధిస్తున్నాయి. ఇప్పుడు శ్లోకంలోకి అడుగుపెడదాము.

**భూతపృథగ్భావమ్ ఏకస్థమనుపశ్యతి** – అనుపశ్యతి అంటే గురుశాస్త్ర ఉపదేశంద్వారా సత్యం తెలుసుకుంటాడు. నిద్రనుంచి ఒక్కోసారి ఎవరో లేపినట్టుగా, జాగ్రద్‌ప్రపంచంనుంచి గురువు శాస్త్రఉపదేశంద్వారా సత్యానికి లేపుతాడు. ఏమిటా సత్యం? భూతపృథగ్భావమ్‌లో భూత అంటే అనేక వస్తువులు, ప్రాణులు; భావ అంటే ఉనికి అంటే అనేక వస్తువుల, ప్రాణుల ఉనికి ఉందని తెలుసుకుంటాడు. ఎవరిలో? ఏకస్థమ్ – ఒకే ఆత్మలో. ఆ ఆత్మ అతనే అని కూడా తెలుసుకుంటాడు. ఈ విభిన్న వస్తువులు, ప్రాణులు, అద్వైత ఆత్మ అయిన నాలో నెలకొనివున్నాయి అంటే దాని అర్థం – నేను స్థితికారణాన్ని.

**తత ఏవ చ విస్తారమ్** – విస్తారమ్ అంటే సృష్టికారణం. దేని సృష్టి? విభిన్న వస్తువులు, ప్రాణులయొక్క సృష్టి. దేన్నించి వచ్చాయి ఇవన్నీ? తత ఏవ – అదే ఆత్మనుంచి వచ్చాయి. అంటే నేనే స్థితికారణం, నేనే సృష్టి కారణం కూడా. స్వప్నప్రపంచం నానుంచే వచ్చి, నాలోనే స్థితి పొందుతుంది. కాని విచారకరమైన విషయం ఏమిటంటే నానుంచే వచ్చిన స్వప్నం పీడకలగా మారి నన్ను భయపెడుతుంది. నా సృష్టి నాకు భయహేతువు అవుతుంది. ఒక్కోసారి మన పిల్లలే మనకు సమస్యలు సృష్టిస్తుంటారు. అలా ఈ స్వప్నప్రపంచం, జాగ్రద్ ప్రపంచం నన్ను ఒక్కోసారి భయపెడతాయి.

ఏకస్థమ్ అంటే స్థితికారణం; విస్తారమ్ అంటే సృష్టికారణం. ఇంక మిగిలింది ఏమిటి? లయకారణం. దాన్ని మనం కలుపుకోవాలి. ఇతి యదా అనుపశ్యతి. ఈ వాక్యాన్ని నేను నోటిమాటగా కాకుండా, హృదయ లోతుల్లోంచి చెప్పగలిగితే అప్పుడు అహం బ్రహ్మ అస్మి అనే నిస్సంశయజ్ఞానం పొందుతాను.

**తదా** – అప్పుడు, అప్పుడు మాత్రమే;

**బ్రహ్మ సంపద్యతే** – జ్ఞాని బ్రహ్మను పొందుతాడు. ఎలాగైతే స్వప్నపురుషుడు నిద్రనుంచి లేస్తే తన ఉన్నతస్థాయి అయిన జాగ్రద్‌పురుషుడు అవుతాడో, అలా జ్ఞాని జాగ్రద్‌ప్రపంచంనుంచి లేస్తే అంటే జ్ఞానం పొందితే తన ఉన్నతస్థాయి అయిన ఆత్మ అవుతాడు. **అదృశ్యే అనాత్మ్యే అనిరుద్ధ్యే అనిలయే అభయం ప్రతిష్ఠాం విందతి**

స్వప్నంలో ఉన్నంతసేపూ స్వప్నం భయపెడుతుంది. దాన్నించి లేస్తే భయం మటుమాయమవుతుంది. అలాగే జాగ్రద్‌ప్రపంచంనుంచి ఆత్మస్థాయికి లేస్తే సంసారభయం మటుమాయమవుతుంది.

**నాలుగవ ఫలం – బ్రహ్మత్వం.**

శ్లో. 32 **అనాదిత్వాన్నిర్గుణత్వాత్ పరమాత్మాయమవ్యయః ।**
**శరీరస్థోఽపి కౌంతేయ న కరోతి న లిప్యతే ॥**
అనాదిత్వాత్, నిర్గుణత్వాత్, పరమాత్మా, అయమ్, అవ్యయః,
శరీరస్థః, అపి, కౌంతేయ, న, కరోతి, న, లిప్యతే ॥

| | | | |
|---|---|---|---|
| కౌంతేయ! | = అర్జునా! | అయమ్ పరమాత్మా | = ఈ పరమాత్మ |
| అనాదిత్వాత్ | = అనాదియగుటవల్ల | శరీరస్థః, అపి | = శరీరమందున్నప్పటికిని |
| నిర్గుణత్వాత్ | = నిర్గుణుడగుటవల్ల | న, కరోతి | = వాస్తవముగా ఏమియు చేయదు |
| అవ్యయః | = నాశరహితుడైన | న, లిప్యతే | = కర్మలు పరమాత్మను బంధించవు |

**హే కౌన్తేయ! అయమ్ పరమాత్మా అనాదిత్వాత్, నిర్గుణత్వాత్, అవ్యయః**
**(అస్తి, అతః సః) శరీరస్థః (సన్) అపి న కరోతి, న (చ) లిప్యతే ॥**

తా: అర్జునా! అనాదియగుటవల్ల, నిర్గుణుడగుటవల్ల, నాశరహితుడైన ఈ పరమాత్మ శరీరమందున్నప్పటికిని వాస్తవముగా ఏమియు చేయదు, కర్మలు పరమాత్మను బంధించవు.

ఇ) **అభోక్తృత్వం–** ఆత్మజ్ఞానం పొందటాన్ని స్వప్నంనుంచి లేవటంతో పోల్చారు. ఆత్మజ్ఞానం పొందటానికీ, స్వప్నంనుంచి లేవటానికీ మధ్య అనేక పోలికలు ఉన్నా, వాటిమధ్య కొన్ని భేదాలు కూడా ఉన్నాయి. అవి మర్చిపోకూడదు. ఈ విషయం ప్రతి ఉదాహరణకూ వర్తిస్తుంది. ఉదాహరణకూ, అసలు విషయానికీ మధ్య అనేక పోలికలు ఉంటాయి కాని కొన్ని భేదాలు కూడా ఉంటాయి. అసలేమీ భేదాలు లేకపోతే అది ఉదాహరణ అవదు, అది అసలు విషయమే అవుతుంది.

ఇక్కడ జ్ఞానానికీ, జాగ్రద్ప్రపంచానికీ మధ్య ముఖ్యమైన భేదం ఒకటుంది. నేను స్వప్నప్రపంచంనుంచి లేస్తే, స్వప్నం కరిగిపోతుంది; అంటే నా కంటి ముందునుంచి మాయమవుతుంది కాని నేను పారమార్థికస్థాయికి ఎదిగాక కూడా నా కంటి ముందునుంచి వ్యావహారిక ప్రపంచం మాయమవదు. దానికి ఉదాహరణ – ఆకాశం నీలంగా ఉండదని తెలిసాక కూడా, ఆకాశం నీలంగానే ఉంటుంది. సూర్యోదయం, సూర్యాస్తమయం లేవని తెలిశాక కూడా, వాటి ప్రకారం పనులు చేస్తూనే ఉంటాము.

అందువల్ల రెండు రకాల మిథ్యలు ఉన్నాయి. ఒకటి మనం జ్ఞానం పొందగానే మన కళ్ళముందునుంచి మాయమవుతుంది. రెండోది జ్ఞానం పొందాక కూడా మన ఎదుటే ఉంటుంది. ప్రపంచం మిథ్య అని తెలిశాక కూడా ఇంద్రియాలు వాటి పని అవి చేసుకుపోతూనే ఉంటాయి. కాకపోతే మనం అర్థం చేసుకోవటంలో మార్పు వస్తుంది. జ్ఞాని–జీవుడు, వ్యావహారిక జగత్తు కూడా మిథ్యే అని తెలుసుకుంటాడు. స్వప్నపురుషుణ్ణి ప్రాతిభాసిక జీవుడనీ, జాగ్రద్పురుషుణ్ణి వ్యావహారిక జీవుడనీ అంటారు. వారి మధ్య కొన్ని భేదాలను చూద్దాము.

| ప్రాతిభాసిక జీవుడు | వ్యావహారిక జీవుడు |
|---|---|
| 1. ఇతను ప్రతిబింబచైతన్యం 2 | ఇతను ప్రతిబింబచైతన్యం 1 |
| 2. ఇతను స్వప్నం 1లో ఉన్నాడు | ఇతను స్వప్నం 2లో ఉన్నాడు |
| 3. ఇతను లేస్తే వ్యావహారిక జీవుడు అవుతాడు | ఇతను లేస్తే పారమార్థిక జీవుడు అవుతాడు |
| 4. ఇతను స్వప్నప్రపంచం సత్యం అనుకుంటాడు | స్వప్నప్రపంచం మిథ్య అని తెలుసుకుంటాడు |
| 5. ఇతను నిద్ర లేస్తే చాలు | ఇతను జ్ఞానం పొందాలి |
| 6. ఇతను నిద్ర లేస్తే స్వప్నప్రపంచం మాయమవుతుంది | ఇతను జ్ఞానం పొందాక కూడా జాగ్రద్ ప్రపంచం కళ్ళముందే ఉంటుంది. అనుభవం కొనసాగుతూనే ఉంటుంది. |

(దృగ్దృశ్య వివేకమునుంచి)

జ్ఞానికి తను సృష్టికారణం అని, ఈ ప్రపంచం తననుంచే వచ్చిందనీ తెలుస్తుంది కాని ప్రపంచం కళ్ళ ముందునుంచి మాయమవదని చూశాము. అంటే అతని దృక్పథంలో మార్పు వస్తుంది. దీన్ని జీవన్ముక్తి అంటారు. కలలో ఉన్న వ్యక్తికి అది కల అని తెలిసిందనుకోండి, నిజంగా అలా జరగదు కాని విషయం అర్థం చేసుకోవటానికి అలా ఊహించుకోండి. అలా కలలో ఉండగానే అది కల అని తెలిస్తే ఏమవుతుంది? అప్పుడావ్యక్తి ఆ కలకు చలించకుండా, దాన్ని తన మహిమగా ఆనందిస్తాడు. ఎందుకంటే ఆ కలయొక్క ఉనికికి తనే కారణమని తెలుసుకుంటాడు కాబట్టి.

అదే విధంగా, జ్ఞాని ఇదే జాగ్రద్ప్రపంచంలో కొనసాగుతాడు, ఇదే శరీరంతో వ్యవహారాలు నడుపుతాడు కాని ఈ శరీరం మిథ్య అనీ, అందులో కలిగే సుఖదుఃఖాలు తనకు అంటవనీ, అందులో కలిగే లాభనష్టాలు తనకు చెందవనీ తెలుసుకుంటాడు. ఎందుకంటే అతను జాగ్రద్ప్రపంచానికి చెందడు కాబట్టి.

**అయం పరమాత్మా అవ్యయః** – నేను ఆత్మను; నేను అవ్యయమైనవాణ్ణి. అవ్యయం అంటే మార్పులేనిది, నిర్వికారం. ఎలాగైతే జాగ్రద్పురుషుడు స్వప్నంలో వాన కురిస్తే తడవడో, స్వప్నంలో అగ్నిజ్వాలల్లో దహింపబడడో, స్వప్నంలో పులిపంజా దెబ్బ తినడో; అలాగే పరమాత్మ మార్పుకు లోనవడు, అటువంటి పరమాత్మనైన నేను జాగ్రద్ప్రపంచంలో కష్టనష్టాలకు చలించను. ఎందుకు?

**అనాదిత్వాత్** – నాకు ఆది లేదు. అంటే జన్మలేదు. జన్మరహితత్వాత్. జన్మ ఉంటే అది షడ్వికారాల్లో ఒకటి అవుతుంది. అస్తి, జాయతే, వర్ధతే, విపరిణమతే, అపక్షీయతే, వినశ్యతి. అందులో జాయతే అంటే పుట్టుక. పుట్టుక లేకపోతే పుట్టుకతో పాటు ఉన్న మిగిలిన వికారాలు ఉండవు. ఇంతకుముందే చూశాము ఆత్మ అవ్యయం అంటే నిర్వికారం అని.

**నిర్గుణత్వాత్** – ఆత్మకు గుణాలు లేవు. ఆత్మ అవ్యయం కాబట్టి గుణాలు కూడా లేవు. మార్పులు రెండు రకాలుగా ఉంటాయి. పాలను తోడిపెడితే అది పెరుగు అవుతుంది. అంటే అక్కడ పాలు ఇంక పాలుగా ఉండదు.

పరిణామం చెందుతుంది. దీన్ని పదార్థపరిణామం అంటారు. బంగారంనుంచి ఆభరణాలు చేయించుకుంటే బంగారం ఏమీ అవదు. ఆభరణాల్లో బంగారం ఉంటుంది. అలా బంగారం మారితే ఎవరూ ఆభరణాలు చేయించుకోరు. అంటే ఇక్కడ పదార్థం మారలేదు, ఆకారం మాత్రం మారింది అంతే. ముద్ద బంగారం ఆభరణంగా రూపుదిద్దుకుంది.

ఈ విధంగా మార్పులు రెండురకాలు – పదార్థమార్పు, గుణాలమార్పు; కాని ఆత్మకు పుట్టుక లేదు కాబట్టి పదార్థమార్పు లేదు; గుణాలు లేవు కాబట్టి గుణాల మార్పు కూడా లేదు. అనాదిత్వాత్, నిర్గుణత్వాత్ అవ్యయః.

**శరీరస్థః** – ఈ ఆత్మ శరీరంలో నెలకొని ఉంది. నేను ఆత్మను, శరీరాన్ని కానని తెలుసుకున్నాక కూడా నేను శరీరంతోనే ఉంటాను. కాకపోతే ఇప్పుడు వచ్చిన మార్పు ఏమిటి?

**న కరోతి న లిప్యతే** – ఆత్మ అకర్తా, అభోక్తా. న కరోతి అంటే కర్మలు చెయ్యదు; న లిప్యతే అంటే కర్మఫలాలు అంటవు. శరీరం కర్మలు చేస్తుంది, ఫలితాన్ని పొందుతుంది; మనస్సు కర్మలు చేస్తుంది, ఫలితాన్ని పొందుతుంది; కాని ఆత్మ కర్మ చెయ్యదు, కర్మఫలాన్ని పొందదు.

జ్ఞాని పొందే ఇంకొక ఫలం అభోక్తృత్వం. ఇంతకుముందు అకర్తృత్వం చూశాము. జ్ఞానికి కర్మలు అంటవని చూశాము. ఇప్పుడు దానికి కర్మఫలాలు కూడా అంటవని కలుపుకోవాలి. అంటే జ్ఞానికి కర్తృత్వ, భోక్తృత్వాలు లేవు.

సంసారానికి అనేక నిర్వచనాలు ఉన్నాయి. అందులో ఒకటి సంసారం అంటే కర్తృత్వ, భోక్తృత్వాలు. నేను చేస్తున్నాను అనే భావన; నాకే ఎందుకు వచ్చింది అనే బెంగ – ఈ రెండే మనిషిని సంసారంలో పడేస్తాయి. జ్ఞానికి కర్తృత్వ, భోక్తృత్వాలు లేవు కాబట్టి నేను చేస్తున్నాను అనుకోడు; నాకే ఎందుకు వచ్చిందని బాధపడడు.

**ఐదవ ఫలం – అభోక్తృత్వం.**

శ్లో. 33 **యథా సర్వగతం సౌక్ష్మ్యాత్ ఆకాశం నోపలిప్యతే ।**
**సర్వత్రావస్థితో దేహే తథాత్మా నోపలిప్యతే ॥**
యథా, సర్వగతమ్, సౌక్ష్మ్యాత్, ఆకాశమ్, న, ఉపలిప్యతే,
సర్వత్ర, అవస్థితః, దేహే, తథా, ఆత్మా, న ఉపలిప్యతే ॥

| | |
|---|---|
| యథా | = ఏ విధముగా |
| సర్వగతమ్ | = సర్వత్ర వ్యాపించిన |
| ఆకాశమ్ | = ఆకాశము |
| సౌక్ష్మ్యాత్ | = సూక్ష్మమగుటవల్ల |
| న, ఉపలిప్యతే | = గుణదోషములచే అంటబడదో |
| తథా | = అలాగే |
| దేహే | = దేహమునందు |
| సర్వత్ర | = అంతటను |
| అవస్థితః | = వ్యాపించియున్నను |
| ఆత్మా | = ఆత్మ నిర్గుణమగుటచే |
| న, ఉపలిప్యతే | = దేహముయొక్క గుణములు, ఆత్మ గుణములు కావు |

**యథా సర్వగతమ్ ఆకాశమ్ సౌక్ష్మ్యాత్ న ఉపలిప్యతే, తథా**
**సర్వత్ర దేహే అవస్థితః ఆత్మా న ఉపలిప్యతే ॥**

తా: ఏ విధముగా సర్వత్ర వ్యాపించిన ఆకాశము సూక్ష్మమగుటవల్ల గుణదోషములచే అంటబడదో, అలాగే దేహమునందు అంతటను వ్యాపించియున్నను ఆత్మ నిర్గుణమగుటచే దేహముయొక్క గుణములు ఆత్మకు అంటవు. అవి ఆత్మ గుణములు కావు.

ముందు శ్లోకంలో కృష్ణపరమాత్మ ఆత్మ అన్నింటిలోనూ ఉంది కాని ఆత్మకు ఏదీ అంటదు అన్నాడు.

అంతర్యామి అంటే ఆత్మ అన్ని జీవులలో, అన్ని వస్తువులలో అంతటా ఉంది. అసంగం అంటే వాటి లక్షణాలు ఆత్మకు అంటవు. శరీరానికి షడ్వికారాలు ఉన్నాయి కాని ఆత్మ నిర్వికారం అని చూశాము. అలాగే మనస్సుకు రాగద్వేషాలు ఉన్నాయి కాని ఆత్మకు ఆ భావాలు అంటవని చూశాము.

దీనికి గొప్ప ఉదాహరణ సినిమాతెర. సినిమాలో లక్కగృహం తగలబడిపోతున్నా తెర కొంచెం కూడా కాలదు; సినిమాలో టైటానిక్ ఓడలోకి నీళ్ళు వచ్చి, ఓడను ముంచేసినా, తెర కొంచం కూడా తడవదు. అంటే తెర సినిమా అంతటా అంతర్యామిగా ఉంది; కాని సినిమాకు భిన్నంగా అసంగంగా ఉంది.

ఆత్మ అంతటా ఉండి, అసంగంగా ఉంది అనే భావనను అర్థం చేసుకోవటానికి కృష్ణపరమాత్మ రెండు ఉదాహరణలను ఇస్తున్నాడు. అవి ఆకాశం, సూర్యప్రకాశం. ఈ రెండూ, ఉపనిషత్తుల్లో తరచూ చూస్తాము. ఉపనిషత్తుల్లోని భావాన్ని ఇక్కడ తీసుకువస్తున్నాడు కృష్ణపరమాత్మ.

ఆకాశం ఉదాహరణలో ఆత్మను ఇంతకుముందు కూడా అర్థం చేసుకున్నాము. అక్కడ ఆకాశం అంటే ప్రదేశం అంటే స్పేస్ అని చూశాము. ఆకాశం అంటే శూన్యం అనుకోకూడదు. పంచభూతాలన్నింటిలోకి సూక్ష్మాతిసూక్ష్మమైనది ఆకాశం.

## ఆత్మకూ, ఆకాశానికీ మధ్య ఉన్న పోలికలు

1. **ఏకత్వం** – ఆత్మ ఏకః, ఆకాశః ఏకః – ఆత్మ ఒకటే ఉంది, ఆకాశం కూడా ఒకటే ఉంది.
2. **సర్వవ్యాపకత్వం** – ఆత్మ సర్వవ్యాపకం, ఆకాశం కూడా సర్వవ్యాపకం.
3. **అచలత్వం** – ఆత్మ సర్వవ్యాపకం కాబట్టి, దానికి కదలిక లేదు, శరీరం వెళుతుంది కాని ఆత్మ ఎక్కడికీ వెళ్ళదు. ఆకాశం కూడా సర్వవ్యాపకం కాబట్టి దానికీ కదలిక లేదు.
4. **నిర్వికారత్వం** – ఆత్మ ఆకారం మారదు; వయస్సు పెరగదు; ఆకాశం కూడా మారదు. ఆకాశంలో ఉన్న వస్తువులు మారతాయి కాని, ఆకాశం మారదు.
5. **అఖండత్వం** – ఖండం అంటే భాగాలు. ఆత్మకు భాగాలు లేవు. ఆకాశానికి కూడా భాగాలు లేవు.
6. **అసంగత్వం** – ఆత్మ అన్నింటిలోనూ ఉన్నా అసంగం. అలాగే ఆకాశం అంతటా ఉన్నా అది కూడా అసంగం.

ఆకాశంలో ఉన్న వస్తువుల మలినాలు ఆకాశానికి అంటవు. ఆకాశానికి సుగంధమూ లేదు, దుర్గంధమూ లేదు. కృష్ణపరమాత్మ ముఖ్యంగా ఈ లక్షణం గురించి చెప్పబోతున్నాడు.

7. **సర్వాధారత్వం** – ఆత్మ అన్నిటికీ ఆధారం; ఆత్మ అధిష్ఠానం. అలాగే ఆకాశం కూడా అన్నిటికీ ఆధారం.

   విశ్వాధారం గగన సదృశం – విష్ణుసహస్రనామం

   ఆత్మ విశ్వానికి ఆధారం అని మొదటిపదం చెపితే, అది ఆకాశంతో సమానం అని రెండవపదం చెబుతుంది.

8. **సూక్ష్మత్వం** – ఆత్మ అణువుకన్నా సూక్ష్మమైనది. ఆకాశం సూక్ష్మాతిసూక్ష్మం. పంచజ్ఞానేంద్రియాల్లో శబ్దానికి మాత్రమే అందుతుంది ఆకాశం. ఆకాశం పంచభూతాలన్నిటిలోకి సూక్ష్మం. దానికన్నా సూక్ష్మమైనది ఆత్మ. అందువల్ల ఆత్మ పంచజ్ఞానేంద్రియాలకు అందదు.

**ఇన్ని పోలికలు ఆత్మకూ, ఆకాశానికీ మధ్య ఉన్నా ఆకాశం జడం, ఆత్మ చైతన్యం. ఇందాక చూసినట్టుగా పోలికలను ఎంతమేరకు తీసుకోవాలో అంతమేరకే తీసుకోవాలి.**

ఈ నేపథ్యంతో ఈ శ్లోకాన్ని చూద్దాము.

**యథా సర్వగతమ్ ఆకాశం న ఉపలిప్యతే** – సర్వవ్యాపకమైన ఆకాశం అసంగం. దానికి ఏదీ అంటదు. ఎందుకు? సూక్ష్మత్వాత్. అది సూక్ష్మాతిసూక్ష్మం కాబట్టి, దానికి ఏదీ అంటదు.

**తథా ఆత్మా న ఉపలిప్యతే** – అదే విధంగా ఆత్మకు కూడా ఏదీ అంటదు.

**సర్వత్ర దేహే అవస్థితః** – అది అన్ని శరీరాల్లో ఉన్నా కూడా దానికి ఏదీ అంటదు. అంటే శరీరం లావుగా ఉన్నా కూడా ఆత్మకు అది అంటదు. ఆత్మ సన్నబడనవసరం లేదు. మనస్సుకు రాగద్వేషాలు ఉన్నా, కామక్రోధాలు ఉన్నా ఆత్మకు అంటవు. అంటే శరీరగుణాలు, మనస్సులోని భావాలు, ఆత్మవి కావు.

**న మే ద్వేషరాగౌ న మే లోభమోహౌ** – నిర్వాణషట్కమ్

ఆ విధంగా ఆత్మ, ఆకాశం రెండూ కూడా అసంగం.

శ్లో. 34 **యథా ప్రకాశయత్యేకః కృత్స్నం లోకమిమం రవిః ।**
**క్షేత్రం క్షేత్రీ తథా కృత్స్నం ప్రకాశయతి భారత ॥**
యథా, ప్రకాశయతి, ఏకః, కృత్స్నమ్, లోకమ్, ఇమమ్, రవిః,
క్షేత్రమ్, క్షేత్రీ, తథా, కృత్స్నమ్, ప్రకాశయతి, భారత ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| భారత! | = | ఓ అర్జునా! | లోకమ్ | = | బ్రహ్మాండమును |
| యథా | = | ఏ విధముగా | ప్రకాశయతి | = | ప్రకాశింపజేయునో |
| ఏకః, రవిః | = | ఒకే సూర్యకాంతి | తథా | = | అలాగే |
| ఇమమ్, కృత్స్నమ్ | = | ఈ సమస్త | క్షేత్రీ | = | ఒకే ఆత్మ |

| | | | |
|---|---|---|---|
| కృత్స్నమ్ | = సర్వప్రాణులలో | ప్రకాశయతి | = వాటిని ప్రకాశింపజేయును |
| క్షేత్రమ్ | = స్థితమైయుండి | | |

**హే భారత! యథా ఏకః రవిః ఇమమ్ కృత్స్నమ్ లోకమ్ ప్రకాశయతి,**
**తథా క్షేత్రీ కృత్స్నమ్ క్షేత్రమ్ ప్రకాశయతి ॥**

తా: ఓ అర్జునా! ఏ విధముగా ఒకే సూర్యకాంతి ఈ సమస్త బ్రహ్మాండమును ప్రకాశింపజేయునో, అలాగే ఒకే ఆత్మ సర్వప్రాణులలో స్థితమైయుండి వాటిని ప్రకాశింపజేయును.

ఈ శ్లోకంలో రెండవ ఉదాహరణ చూస్తాము. అది సూర్యప్రకాశం. సూర్యుడు కాదు, సూర్యకాంతి ఇక్కడ ఉదాహరణ. ఎక్కడో ఉన్న సూర్యుడు కాదు, భూమండలమంతటా ప్రసరిస్తున్న సూర్యకాంతి ఇక్కడ ఉదాహరణ. సూర్యకాంతికి, ఆత్మకు కూడా అనేక పోలికలు ఉన్నాయి. వాటిలో కొన్ని ఆకాశానికి, ఆత్మకూ చూసిన పోలికలు కూడా ఉన్నాయి. అవి –

1. **ఏకత్వం** – సూర్యుడు ఒకడే కాబట్టి సూర్యకాంతి కూడా ఒకటే. నక్షత్రకాంతిని తీసుకోము ఇక్కడ.
2. **సర్వగతత్వం** – సూర్యకాంతి భూమి అంతటా వ్యాపిస్తుంది.
3. **అచలత్వం** – సూర్యకాంతి కూడా సర్వవ్యాపకం కాబట్టి, దానికి చలనం లేదు.
4. **నిర్వికారత్వం** – సూర్యకాంతికి వికారాలు లేవు. నా చెయ్యి కదిపితే చెయ్యి కదులుతుంది కాని కాంతి కదలదు, మార్పు చెందదు.
5. **అఖండత్వం** – కాంతిని భాగాలుగా కొయ్యలేము. అలా సూర్యకాంతిని విభజించగలిగితే, కొంత భాగాన్ని తీసుకెళ్ళి మన ఇంటిలో పెట్టుకోవాలని చూస్తాము. కాని సూర్యకాంతిని భాగాలుగా విడగొట్టలేము. అచ్ఛేద్యః, అదాహ్యః, అక్లేద్యః, అశోషస్యః.
6. **అసంగత్వం** – కాంతి దేన్ని ప్రకాశింపజేసినా, దానికి ఉన్న మలినాలు కాంతికి అంటవు. నా చేతికి మట్టి ఉన్నా, నా చేతిని ప్రకాశింపజేస్తున్న సూర్యకాంతికి ఆ మట్టి అంటదు.
7. **సూక్ష్మత్వం** – కాంతి చాలా సూక్ష్మంగా ఉంటుంది. అది కూడా పంచజ్ఞానేంద్రియాలకు అందదు. కాంతిని ముట్టుకోలేము, రుచి చూడలేము, వాసన చూడలేము, వినలేము, చూడలేము కూడా. నిజానికి దాన్ని ప్రకటింపజేసే మాధ్యమం లేకపోతే కాంతి ఉందని కూడా తెలియదు. అందువల్ల కాంతి సూక్ష్మం. అలాగే ఆత్మ కూడా పంచజ్ఞానేంద్రియాలకు అందదు. జ్ఞానేంద్రియాలకు అందనంత మాత్రాన ఆత్మ లేదు అనకూడదు.

**అశబ్దమస్పర్శమరూపమవ్యయం తథాஉరసం నిత్యమగన్ధవచ్చ యత్ ।**
**అనాద్యనన్తం మహతః పరం ధ్రువం నిచాయ్య తం మృత్యుముఖాత్ప్రముచ్యతే ॥** – కఠోపనిషత్ 1.3.15

ఆత్మ శబ్దస్పర్శరూపరసగంధాలకు అందదు అంటుంది కఠోపనిషత్తు.

8. **ప్రకాశత్వం** – కాంతి అన్నింటినీ ప్రకాశింపజేస్తుంది. కాంతిలాగా ఆత్మ అన్నింటినీ ప్రకాశింపజేస్తుంది. ప్రకాశింపజేస్తుంది అంటే, ఆత్మచైతన్యంవల్లనే అన్నింటినీ తెలుసుకోగలుగుతున్నాము. జగత్తులో జడపదార్థం మాత్రమే ఉంటే, ఎవరూ దాని గురించి తెలుసుకోలేరు. మనం లేకుండా ఈ గదిలో లైటు, ఫ్యానులాంటి వస్తువులు ఉన్నాయనుకోండి. వాటిని చూసేదెవరు? చూడబడే వస్తువును ప్రమేయం అంటారు, చూసే నన్ను ప్రమాత అంటారు. ఈ చైతన్యం లేకపోతే ప్రమాత–ప్రమేయం సంబంధమే ఉండదు. ఆ విధంగా చైతన్యం అన్నింటినీ ప్రకాశింపజేస్తుంది.

**యథా ఏకః రవిః** – ఎలాగైతే ఒకే సూర్యకాంతి;

**ఇమం కృత్స్నం లోకం ప్రకాశయతి** – ఈ సమస్త లోకాన్ని ప్రకాశింపజేస్తుందో,

**తథా క్షేత్రం క్షేత్రీ కృత్స్నం ప్రకాశయతి భారత** – ఓ అర్జునా, అదే విధంగా ఒకే ఆత్మ అన్ని ప్రాణులలోనూ ఉండి, వాటిని ప్రకాశింపజేస్తుంది.

అటువంటి ఆత్మను నేను. ఈ ఆత్మను ఈ రెండు శ్లోకాల్లోనూ ఆకాశంతోను, ప్రకాశంతోను పోల్చాడు కృష్ణపరమాత్మ. ఇవి కృష్ణపరమాత్మ ఉపనిషత్తుల్లోంచి స్వీకరింఆత్మ అనే వివరణ ఆత్మ అనే వివరణ చాడని చూశాము. ఇంతకు ముందు జ్ఞానేంద్రియాలకు అందదని కఠోపనిషత్తు మంత్రం సహాయంతో చూశాము. సూర్యకాంతికి ఆత్మకు పోలిక కఠోపనిషత్తులో వస్తుంది.

**సూర్యో యథా సర్వలోకస్య చక్షుర్న లిప్యతే చాక్షుషైర్బాహ్యదోషైః ।**
**ఏకస్తథా సర్వభూతాన్తరాత్మా న లిప్యతే లోకదుఃఖేన బాహ్యః ॥** – కఠోపనిషత్ 2.2.11

శ్లో. 35 **క్షేత్రక్షేత్రజ్ఞయోరేవమ్ అంతరం జ్ఞానచక్షుషా ।**
**భూతప్రకృతిమోక్షం చ యే విదుర్యాంతి తే పరమ్ ॥**
క్షేత్రక్షేత్రజ్ఞయోః, ఏవమ్, అంతరమ్, జ్ఞానచక్షుషా,
భూతప్రకృతిమోక్షమ్, చ, యే, విదుః, యాంతి, తే, పరమ్ ॥

| | | | |
|---|---|---|---|
| ఏవమ్ | = ఈ విధముగా | యే | = ఏ పురుషులయితే |
| క్షేత్ర, క్షేత్రజ్ఞయోః | = క్షేత్రక్షేత్రజ్ఞుల మధ్యగల | జ్ఞానచక్షుషా | = జ్ఞాననేత్రములద్వారా |
| అంతరమ్ | = భేదమును | విదుః | = తెలుసుకుంటారో |
| చ | = ఇంకా | తే | = అట్టి మహాత్ములు |
| భూతప్రకృతి | = ప్రకృతి, తక్కిన జడపదార్థాలకు | పరమ్ | = పరబ్రహ్మ పరమాత్మను |
| మోక్షమ్ | = స్వతంత్రంగా ఉనికి లేదని | యాంతి | = పొందుదురు |

**ఏవమ్ యే జ్ఞాన-చక్షుషా క్షేత్ర-క్షేత్రజ్ఞయోః అన్తరమ్ (జ్ఞానం)**
**భూత-ప్రకృతి-మోక్షమ్ చ విదుః, తే పరమ్ యాన్తి ॥**

తా: ఈ విధముగా క్షేత్రక్షేత్రజ్ఞుల మధ్యగల భేదమును ఇంకా ప్రకృతి, తక్కిన జడపదార్థాలకు స్వతంత్రంగా ఉనికి లేదని ఏ పురుషులయితే జ్ఞాననేత్రములద్వారా తెలుసుకుంటారో అట్టి మహాత్ములు పరబ్రహ్మ పరమాత్మను పొందుదురు.

ఎఫ్) **జీవన్ముక్తి** – ఈ శ్లోకంతో జ్ఞాని పొందే ఫలాలను ముగిస్తున్నాడు. ఇందులో జీవన్ముక్తి ఫలాన్ని వర్ణిస్తున్నాడు కృష్ణపరమాత్మ.

**క్షేత్రక్షేత్రజ్ఞయోః అంతరమ్ ఏవం విదుః** – ఈ విధంగా జ్ఞాని క్షేత్ర-క్షేత్రజ్ఞుల మధ్య ఉన్న భేదాన్ని తెలుసుకుంటాడు; ఇంకో విధంగా చెప్పాలంటే ప్రకృతి-పురుషుల మధ్య ఉన్న భేదాన్ని తెలుసుకుంటాడు. ఎలా తెలుసుకుంటాడు?

**జ్ఞానచక్షుషా** – జ్ఞాననేత్రంద్వారా. ఆత్మ పంచజ్ఞానేంద్రియాలకు అందదని చూశాము. మామూలు కంటితో విద్యుచ్ఛక్తిని, ఫ్యానును విడదీసి చూడలేము కాని, అందులో రెండు అంశాలు ఉన్నాయని తెలుసుకోగలము; అలాగే చెయ్యి-కాంతులను ప్రత్యక్షంగా విడదీయలేము కాని బుద్ధిలో విడదీయగలము; అదే విధంగా మనస్సు-ఆత్మలను ప్రత్యక్షంగా విడదీయలేము కాని బుద్ధిలో విడదీయగలము. జ్ఞాని ప్రకృతికి-పురుషునికి మధ్య ఉన్న నాలుగు భేదాలను తెలుసుకుంటాడని చూశాము. అవి – అచేతనం-చేతనం; సగుణం-నిర్గుణం; సవికారం-నిర్వికారం; మిథ్యా-సత్యం.

ఈ నాలుగింటిలో కృష్ణపరమాత్మ ఈ శ్లోకంలో చివరి భేదాన్ని నొక్కివక్కాణించదలచుకున్నాడు. ఇది సాంకేతికమైన భేదం కాబట్టి చాలా ముఖ్యమైన భేదం. పురుషునికి విడిగా ఉనికి ఉంది కాని ప్రకృతికి విడిగా ఉనికి లేదని చూశాము. సినిమా చూపే తెరకి విడిగా ఉనికి ఉంది. దానిమీద సినిమా ఆడినా, ఆడకపోయినా తెర ఉంటుంది; కాని తెర లేకపోతే సినిమా ఆడలేదు. అదే విధంగా చైతన్యం అయిన నేను ఈ జగత్తు ఉన్నా, లేకపోయినా ఉంటాను. అంతేకాదు, తెరమీద అగ్ని తెరను కాల్చలేదు; నీరు తెరను తడపలేదు; తెర అసంగం అని చూశాము. అలాగే మిథ్యాప్రపంచం సత్యపురుషుడినైన నన్ను ఏమీ ప్రభావితం చెయ్యలేదు.

**భూతప్రకృతిమోక్షం చ** – ఇక్కడ మోక్షం అంటే మిథ్య అని అర్థం. చాలా జాగ్రత్తగా చూడాలి. ఇక్కడ మోక్షం అంటే ముక్తి కాదు; స్వతంత్ర ఉనికి లేకపోవటం. అంటే పరతంత్ర ఉనికి ఉంది. కల లేదా సినిమాకు ఎలా స్వతంత్రంగా ఉనికి లేదో, అలా ఇక్కడ స్వతంత్రంగా ఉనికి లేదు. దేనియొక్క మిథ్యాత్వం చెప్పబడింది – పురుషునిదా, ప్రకృతిదా? భూతప్రకృతి – ప్రకృతి, తక్కిన జడపదార్థాలు, జీవులయొక్క మిథ్యాత్వం. జగత్తు మిథ్య అని చెపితే, బ్రహ్మ (ఆత్మ) సత్యం అని చెప్పకనే చెప్పినట్టయింది.

**తే యే విదుః** – ఎవరైతే ఆత్మ (అహం) సత్యం జగన్మిథ్యా అని తెలుసుకుంటారో; ఎవరైతే జగత్తు మిథ్య కాబట్టి ఆత్మనైన నన్ను ఏమీ బాధించలేదని తెలుసుకుంటారో;

**తే పరం యాంతి** – అతను మోక్షం పొందుతాడు. పరం అంటే మోక్షం. అతను జగత్తు కలుగజేసే భయంనుంచి ముక్తి పొందుతాడు. దీన్ని జీవన్ముక్తి అంటారు.

**ఆరవఫలం – జీవన్ముక్తి.**

ఇక్కడితో జ్ఞానఫలం అంశం కూడా ముగిసింది. ఈ విధంగా క్షేత్ర–క్షేత్రజ్ఞుల గురించిన వివరణ లేదా ప్రకృతి–పురుషుల గురించిన వివరణ చేశాడు కృష్ణపరమాత్మ.

**ఓం తత్సదితి శ్రీమద్భగవద్గీతాసూపనిషత్సు బ్రహ్మవిద్యాయాం యోగశాస్త్రే**
**శ్రీకృష్ణార్జునసంవాదే క్షేత్ర క్షేత్రజ్ఞవిభాగయోగో నామ త్రయోదశోఽధ్యాయః**

హరి ఓం తత్సత్

ఇది శ్రీమద్భగవద్గీతయందు, ఉపనిషత్తులయందు, బ్రహ్మవిద్యయందు, యోగశాస్త్రమునందు, శ్రీకృష్ణార్జున సంవాదమునందు క్షేత్రక్షేత్రజ్ఞవిభాగయోగము అనే పదమూడవ అధ్యాయము.

## స్వామీజీ ఆణిముత్యాలు

**ఆచార్యోపాసనమ్** – వేదాంత విద్యనభ్యసించే విద్యార్థికి ఈ విలువ చాలా విలువైనది. ఆచార్య ఉపాసనను అక్షరాలా చూస్తే గురువును గౌరవించి, పూజించటం. మనం ఒక విషయం గుర్తుంచుకోవాలి. మనం గురువును పూజిస్తున్నామంటే, ఆ పూజ గురువుకు మాత్రమే చెందదు. ఒక వ్యక్తిగా చూస్తే గురువు కూడా తక్కిన మనుష్యులలాగా పరిమితి ఉన్న జీవే. అయితే, గురువును ఎందుకు ఆరాధించాలి? గురువు తనకున్న శాస్త్రజ్ఞానానికి ప్రతీక. అందువల్ల మీరు గురువుకు నమస్కారం చేసినా, మీరు వేదాలకు నమస్కారం చేసినట్టు అవుతుంది. శాస్త్రం ఈశ్వరునికి ప్రతీక; ఆ శాస్త్రాన్ని అధ్యయనం చేసిన గురువు అటువంటి ఈశ్వరుడు నెలకొనివున్న ఆలయం. అందువల్ల గురువుద్వారా శాస్త్రాన్ని, శాస్త్రంద్వారా ఈ శాస్త్రాన్ని మనకందజేసిన ఈశ్వరుణ్ణి కొలుస్తున్నారు మీరు. శాస్త్రాన్ని ఎందుకు కొలవాలి? ఇది ఇంకొక ప్రశ్న. దీనికి జవాబు తెలుసుకుని తీరాలి. మీరు శాస్త్రంద్వారా పొందగలిగే జ్ఞానాన్ని శాస్త్రంద్వారానే పొందగలరు. వేరే ఏ ప్రమాణంద్వారా కూడా ఈ జ్ఞానాన్ని పొందలేరు. మీకు పంచజ్ఞానేంద్రియాలు ఉన్నాయి కదా. శాస్త్రాన్ని ఆరవ జ్ఞానేంద్రియంగా అర్థం చేసుకోవాలి.

# అధ్యాయము 13 - క్షేత్ర-క్షేత్రజ్ఞవిభాగయోగము సారాంశము

భగవద్గీతను ప్రధానంగా మూడు షట్కాలుగా విభజించవచ్చు.

1. **మొదటి షట్కము - అధ్యాయాలు 01-06 - కర్మయోగసాధన**
2. **రెండవ షట్కము - అధ్యాయాలు 07-12 - ఉపాసనయోగసాధన**
3. **మూడవ షట్కము - అధ్యాయాలు 13-18 - జ్ఞానయోగము**

మూడవ షట్కము జ్ఞానయోగం గురించి వివరిస్తుంది. అందులోనూ ముఖ్యంగా 13,14,15 అధ్యాయాల్లో అన్ని ఉపనిషత్తుల సారాన్ని చూస్తాము. అందువల్ల ఈ అధ్యాయాలు అన్నీ ముఖ్యమైనవి, అందులోనూ పదమూడవ అధ్యాయం ఇంకా ముఖ్యమైనది. వేదాంతసారం ఇందులో ఇంకా ఎక్కువగా ఉంది.

పదమూడవ అధ్యాయాన్ని ప్రధానంగా ఆరు భాగాలుగా విభజించవచ్చు. అవి -

| | |
|---|---|
| **1. ఉపోద్ఘాతం:** | **శ్లోకం 1** |
| **2. క్షేత్రం - క్షేత్రజ్ఞుల వివరణ:** | **శ్లోకాలు 2-7** |
| **3. జ్ఞానం:** | **శ్లోకాలు 8-12** |
| **4. జ్ఞేయం వివరణ:** | **శ్లోకాలు 13-19** |
| **5. ప్రకృతి - పురుషుల వివరణ:** | **శ్లోకాలు 20-24** |
| **6. జ్ఞానసాధనలు - జ్ఞానఫలం:** | **శ్లోకాలు 25-35** |

**ఉపోద్ఘాతం: శ్లోకం 1**

చాలా అధ్యాయాల్లో వచ్చినట్టుగా ఈ అధ్యాయం కూడా అర్జునుని ప్రశ్నతో మొదలవుతుంది. కాకపోతే ఈ ప్రశ్న అన్ని భగవద్గీత పుస్తకాల్లోనూ రాదు. కాని మనం ఆ ప్రశ్నను కూడా చూశాము. ఎందుకంటే అర్జునుడు మొదలుపెట్టిన ఈ శ్లోకంలో ఆరు సాంకేతిక పదాలను వివరించమని కోరాడు. ఆ పదాలను శాస్త్రంలో చూస్తాము.

**ప్రకృతిం పురుషం చైవ క్షేత్రం క్షేత్రజ్ఞమేవ చ ।**
**ఏతద్వేదితుమిచ్ఛామి జ్ఞానం జ్ఞేయం చ కేశవ ॥** - 13.1

ఓ కృష్ణా! ప్రకృతి, పురుషుడు, క్షేత్రము, క్షేత్రజ్ఞుడు, జ్ఞానము, జ్ఞేయముల గురించి చెప్పమని కోరుతున్నాను అన్నాడు అర్జునుడు. నిజానికి అర్జునుడు ఆరు అంశాలను అడిగినా, వాటిని మూడు అంశాలుగా విభజించవచ్చని చూశాము. ఎందుకంటే కొన్ని పదాలకు ఒకటే అర్థాలు ఉన్నాయి.

| | |
|---|---|
| క్షేత్రజ్ఞుడు, పురుషుడు, జ్ఞేయమ్ | = ఆత్మ |
| క్షేత్రమ్, ప్రకృతి | = అనాత్మ |
| జ్ఞానమ్ | = విలువలు |

క్షేత్రజ్ఞుడు, పురుషుడు, జ్ఞేయం పదాలను పర్యాయపదాలుగా అర్థం చేసుకోవచ్చు. వీటినే వేదాంతశాస్త్రంలో ఆత్మ అంటారు. అలాగే క్షేత్రం, ప్రకృతి పర్యాయపదాలు. వీటిని వేదాంతశాస్త్రంలో అనాత్మ అంటారు. దీనివల్ల ఐదు పదాలు రెండు పదాలు అయ్యాయి. అవి ఆత్మ, అనాత్మ. ఇక మిగిలిన పదం జ్ఞానం. దీన్ని విడిగా చూడాలి. ఇది ఆత్మలోకీ రాదు, అనాత్మలోకీ రాదు. ఇక్కడ జ్ఞానం అంటే విలువలు అని అర్థం.

ఈ విధంగా మనం మూడు అంశాలను ఈ అధ్యాయంలో చూశాము. అవి ఆత్మ, అనాత్మ, విలువలు.

**2. క్షేత్రం, క్షేత్రజ్ఞుల వివరణ: శ్లోకాలు 2-7**
**3. జ్ఞేయం వివరణ: శ్లోకాలు 13-19**
**4. ప్రకృతి, పురుషుల వివరణ: శ్లోకాలు 20-24**

క్షేత్రం, క్షేత్రజ్ఞుల వివరణ కొన్ని శ్లోకాల్లో; జ్ఞేయం వివరణ కొన్నింటిలో; ప్రకృతి పురుషుల వివరణ మరి కొన్నింటిలో వచ్చింది. క్షేత్రజ్ఞుడు, పురుషుడు, జ్ఞేయం అంటే ఆత్మ అనీ; క్షేత్రం, ప్రకృతి అంటే అనాత్మ అనీ చూశాము. ఈ అధ్యాయం ఉపనిషత్తుల సారం అని కూడా చూశాము. అందువల్ల ఈ అధ్యాయంయొక్క సారాంశాన్ని శ్లోకాల వరుసక్రమంలో కాకుండా ఆత్మ, అనాత్మల పరంగా చూద్దాము. ముందుగా అనాత్మ గురించి చూద్దాము.

**అనాత్మ** – అనాత్మ అంటే ఇక్కడ క్షేత్రం, ప్రకృతి. కృష్ణపరమాత్మ అనాత్మ గురించి చెప్పిన మొట్టమొదటి లక్షణం– అనాత్మ దృశ్యపదార్థం. మనం అనుభవించే ప్రతిదీ అనాత్మ. అనాత్మ కిందకు ఏవేవి వస్తాయి?

**జగత్తు** – జగత్తు మన అనుభవంలోకి వచ్చే ఆబ్జెక్టు. వర్తమానంలో మాత్రమే కాదు, ముందు కూడా అనుభవించవచ్చు. అంటే ఆబ్జెక్టుగా చూడగలిగిన ఏ వస్తువైనా కూడా అనాత్మ కిందికి వస్తుంది. ఆ సూత్రం ప్రకారం స్వర్గలోకాలు కూడా అనాత్మ కిందికే వస్తాయి. ఎందుకంటే, స్వర్గాన్ని మనం ఇప్పుడు అనుభవించకపోయినా, స్వర్గానికి వెళ్ళగలిగినంత పుణ్యం సంపాదించుకుని, మరణించాక ఆ లోకాలకు వెళితే, అప్పుడు అవి ఆబ్జెక్టు అవుతాయి; మన అనుభవంలోకి వస్తాయి. అనాత్మ అంటే ఆబ్జెక్టుగా చూడగలిగినది, మన అనుభవంలోకి వచ్చేది. ఆ సూత్రం ప్రకారం విశ్వం అనాత్మ.

**శరీరం** – ఈ సూత్రం ప్రకారం శరీరం కూడా అనాత్మలోకి వస్తుంది. శరీరాన్ని మనకు భిన్నంగా చూస్తాము, శరీరం మన అనుభవంలోకి వస్తుంది.

**మనస్సు** – ఈ సూత్రం ప్రకారం మనస్సు కూడా అనాత్మలోకి వస్తుంది. మనస్సు కూడా ఆబ్జెక్టు అవుతుంది. ఎందుకంటే మనస్సులో కలిగే రాగద్వేషాలు, బుద్ధిలో కలిగే జ్ఞానం – అన్నీ మనకు తెలుస్తున్నాయి.

అంటే జగత్తు, శరీరం, మనస్సు కూడా అనాత్మలోకి వస్తాయి. ఇప్పుడు ఈ అనాత్మ స్వరూపం ఏమిటి?

**అనాత్మ లక్షణాలు – ఎ) అచేతన స్వరూపం** – అనాత్మ జడం. మొత్తం దృశ్యప్రపంచం జడం, అది పంచభూతాలతో చేయబడింది. శరీరం చేతనంగా ఉన్నట్టు కనిపించినా, అది దాని స్వస్వరూపం కాదు. అది ఆత్మనుంచి అరువు

తెచ్చుకున్న చైతన్యం అని శాస్త్రం చెబుతుంది. శరీరమే కాదు, మనస్సు కూడా జడమే, కాకపోతే మనస్సుకు చైతన్యాన్ని ప్రతిబింబింపజేసే శక్తి ఉంది. అందువల్ల జగత్తు, శరీరం, మనస్సు అన్నీ జడం.

బి) **సగుణం** – అనాత్మకు అనేక గుణాలు ఉంటాయి.

సి) **సవికారం** – అనాత్మ మార్పు చెందుతుంది. ఇప్పుడు ఉన్నట్టుగా తర్వాత ఉండదు.

డి) **కార్యకారణ అవస్థ** – అనాత్మ మారుతూ ఉంటుంది కాబట్టి అది ఎప్పుడూ వ్యక్తంగా ఉండదు. దాని మారే స్వభావంవల్ల రెండు అవస్థల్లో ఏదో ఒకదానిలో ఉంటూ ఉంటుంది. వాటిని కార్య అవస్థ – కారణ అవస్థ అంటారు. లేదా వ్యక్త అవస్థ – అవ్యక్త అవస్థ అంటారు. సృష్టి జరిగి, కార్యంగా ప్రకటితమైనప్పుడు దాన్ని వ్యక్త అవస్థ అంటారు; ప్రళయంలో జగత్తు లయమయిపోయినప్పుడు, అది కారణంలోకి వెళ్ళిపోతుంది. దాన్ని అవ్యక్త అవస్థ అంటారు.

నీరు విషయం తీసుకుంటే, నీరు కంటికి కనబడుతుంది. కాని దాన్ని వేడిచేస్తే నీరు నాశనమవదు కాని ఆవిరిగా మారుతుంది. అంటే వ్యక్త నీరు అవ్యక్త ఆవిరిగా మారుతుంది. అదే విధంగా వ్యక్త అవస్థను ప్రపంచం అంటే, అవ్యక్త అవస్థను మాయ అంటాము. మాయ అంటే అవ్యక్తప్రపంచం. వ్యక్తప్రపంచం జగత్తు; అవ్యక్త పదార్థం మాయ. ఈ జగత్తు అనాత్మ. జగత్తుతోపాటు శరీరం, మనస్సులను కూడా అనాత్మగా అర్థం చేసుకోవాలని చూశాము.

**ఆత్మ** – ఇక్కడ ఆత్మకు వాడిన మూడు పదాలు – క్షేత్రజ్ఞుడు, పురుషుడు, జ్ఞేయం. వేదాంతశాస్త్రంలో వీటికి ఆత్మపదం వాడతారని చూశాము.

**ఆత్మ లక్షణాలు**

జగత్తంతా దృశ్యప్రపంచంలోకి వస్తుందని అన్నాము ఇంతకుముందు. జగత్తు అంతా దృశ్యప్రపంచం అయితే, దానికి సంబంధించనిది ఒకటి ఉండాలి. ఏమిటది? దృశ్యాన్ని చూసే దృక్ ఒకటి ఉండాలి. అనుభవించబడే ప్రపంచాన్ని అనుభవించేందుకు ఒకరు ఉండాలి. చూసేవారు లేకపోతే వస్తువు ఎవరిచేత చూడబడుతుంది?

ప్రతి ఆబ్జెక్టును చూసే ఒక సబ్జెక్టు ఉండితీరాలి. అంటే దృశ్యాన్ని చూసే దృక్ ఉండాలి. కాని ఆ దృక్ ఎన్నటికీ దృశ్యం కాలేదు.

**దృగేవ న తు దృశ్యతే** – దృగ్దృశ్య వివేకము

దృక్ అన్నింటినీ చూస్తుంది కాని దృక్‌ను ఇంకొకటి చూడలేదు. ఇంకొకటి దానిని చూసిందంటే అది దృశ్యం అవుతుంది, దృక్ అవదు. దీనికి ఉదాహరణ కళ్ళు. అనేక రంగులను, రూపాలను విప్పార్చుకుని చూసే కళ్ళు, తమను తాము చూసుకోలేవు. కాని కళ్ళు పని చేస్తున్నాయో లేదో మనకు ఎలా తెలుస్తుంది? మనం అనేక రంగులను, రూపాలను చూడగలుగుతున్నామంటేనే మన కళ్ళు బ్రహ్మాండంగా పనిచేస్తున్నాయని అర్థం. చూసే

కళ్ళను చూడలేకపోవచ్చు కాని కళ్ళవల్లనే చూస్తున్నాము. ఇది అర్థమయితే ఆత్మను అర్థం చేసుకోవచ్చు. ఆత్మను అనుభవించలేము కాని ఆత్మవల్లనే అన్ని అనుభవాలూ అవుతున్నాయి.

**ఎవర్ ది ఎక్స్‌పీరియన్సర్ నెవ్వర్ ది ఎక్స్‌పీరియన్స్‌డ్**

**అనుభవించే నేనే అది ఎప్పటికీ, అనుభవించబడే వస్తువు కాదు ఎన్నటికీ.** అందువల్ల ఆత్మను ఆబ్జెక్టుగా అనుభవించలేము. ఆత్మ దృశ్యం కాదు.

ఎ) **చేతనం** – ఆత్మ చేతనమా, అచేతనమా? ఈ ప్రశ్నకు జవాబు చెప్పటానికి పి. హెచ్. డి. డిగ్రీ అవసరం లేదు. అనుభవించే దానికి చేతనతత్త్వం ఉండి తీరాలి. దృశ్యం అచేతనమయితే, దాన్ని చూసే దృక్ చేతనం అయివుండాలి. ఎవరా చేతనం? జగత్తును ఎవరు అనుభవిస్తున్నారు? నేనే ఆ జగత్తును అనుభవిస్తున్నాను కాబట్టి నేనే ఆ చైతన్యాన్ని. నేను అంటే సాక్షిచైతన్యాన్ని. జగత్తును, శరీరాన్ని, మనస్సును సాక్షిగా చూస్తున్న నేను. సాక్షిగా చూస్తున్న నన్ను, ఇంకొకటి చూడలేదు. నేను స్వయంప్రకాశక ఆత్మను.

అనాత్మకు అచేతన, సగుణ, సవికార లక్షణాలను వర్ణించాము. ఆత్మ లక్షణాలు ఏమిటి? చైతన్యానికి ఐదు లక్షణాలని పదేపదే చూశాము. కాని ఇప్పుడు కూడా మళ్ళీ ఒకసారి గుర్తు తెచ్చుకుందాము.

**చైతన్యం లక్షణాలు:** చైతన్యాన్ని కాంతితో పోల్చవచ్చు. ఇప్పుడు అవే సూత్రాలను చైతన్యానికి అన్వయిస్తూ తిరిగి చెప్పవచ్చు.

- చైతన్యం శరీరంలో ఒక భాగం కాని, లక్షణం కాని, దాన్నుంచి ఉత్పత్తి అయిన వస్తువు కాని కాదు.
- చైతన్యం స్వతంత్ర వస్తువు. అది శరీరం అంతటా వ్యాపించి, శరీరాన్ని ప్రకాశింపచేస్తుంది.
- చైతన్యం శరీరం సరిహద్దులకే పరిమితమవలేదు.
- శరీరం నాశనమయితే చైతన్యం నాశనమవదు. శరీరపతనానంతరం కూడా చైతన్యం ఉంటుంది.
- చైతన్యం శరీరం లేకపోయినా ఉంటుంది కాని తెలియదు.

  చైతన్యాన్ని ప్రతిబింబింపచేసే మాధ్యమం లేదు కాబట్టి చైతన్యం తెలియదు. అంతమాత్రాన చైతన్యం లేనట్టు కాదు.

ఆ చైతన్యాన్ని నేను. ఈ చైతన్యతత్త్వాన్ని అర్థం చేసుకోవటానికి చివర్లో కృష్ణపరమాత్మ రెండు అద్భుతమైన ఉదాహరణలను ఇచ్చాడు. అవి ఆకాశం, సూర్యకాంతి. ఇవి ఎందుకు ఇచ్చాడు? ఆ చైతన్యాన్ని చూడాలంటే ఈ రెండు ఉదాహరణలకూ ఉన్న లక్షణాలను గుర్తు తెచ్చుకుని వాటిని ఆత్మకు అన్వయించుకోవాలి. వాటిలో కొన్ని లక్షణాలను చూద్దాము.

1. **ఏకత్వం** – ఉన్నదొకటే ఆకాశం. సూర్యకాంతి కూడా ఒకటే ఉంది. ఆత్మ కూడా ఒకటే ఉంది.
2. **అచలత్వం** – ఆకాశంలో అన్నీ కదులుతాయి కాని, ఆకాశం కదలదు. ఒకవేళ ఆకాశం కదిలితే ఏమవుతుంది? మనం కూడా కదులుతాము. కాంతి విషయం కూడా అంతే. కాంతి సమక్షంలో నా చేతిని కదుపుతాను కాని, కాంతి కదలదు. అలాగే ఆత్మ కూడా అచలం.

**నిత్యః సర్వగతః స్థాణుః అచలోయం సనాతనమ్**

3. **అఖండత్వం** – ఆకాశానికి భాగాలు లేవు. భూమిని విభజించవచ్చు, నీటిని విభజించవచ్చు; కాని ఆకాశాన్ని విభజించలేము. అలాగే సూర్యకాంతిని విభజించలేము. అందువల్ల రెండూ అఖండం. అలాగే ఆత్మ కూడా అఖండం.

4. **అసంగత్వం** – ఆకాశం సర్వవ్యాపకమైనా కూడా, దానికి మలినాలు అంటవు. నేల కలుషితమవుతుంది, నీరు కలుషితమవుతుంది, గాలి కలుషితమవుతుంది కాని ఆకాశం కలుషితమవదు. అలాగే సూర్యకాంతి. సూర్యకాంతి మురికి కాలవమీద పడినా, పవిత్రమైన గంగానదిమీద పడినా దానికేమీ అంటదు. అందువల్ల ఆకాశం, కాంతి – రెండూ అసంగం. ఆత్మ కూడా అంతే. శరీరం కలుషితమవుతుంది, మనస్సు కలుషితమవుతుంది కాని శరీరమనే క్షేత్రంలో ఉన్న క్షేత్రజ్ఞునికేమీ ఈ కాలుష్యం అంటదు.

5. **సర్వాధారత్వం** – ఆకాశం అన్నిటికీ ఆధారం. ఆత్మ అనాత్మకు ఆధారం. చైతన్యం మనస్సులో ఉందనుకుంటారు కాని నిజానికి చైతన్యంలోనే మనస్సులన్నీ నెలకొనివున్నాయి. ఫ్యూజ్ పోయిన బల్బులో విద్యుచ్ఛక్తి ఉంటుంది కాని బల్బు వెలగదు. అలాగే చైతన్యాన్ని ప్రకటించే మాధ్యమం లేకపోతే చైతన్యం ఉన్నట్టు తెలియదు అంతే.

అలాగే సూర్యకాంతి అన్నింటినీ ప్రకాశింపజేసినట్టుగా, ఆత్మ అన్నిటినీ ప్రకాశింపజేస్తుంది. అంటే ఆత్మవల్లనే జడశరీరంలో చేతనత్వం ఏర్పడుతుంది.

ఏకం, అచలం, అఖండం, అసంగం, సర్వాధారం అయిన ఆత్మను నేను. నేను దృక్‌ను; ఈ జగత్తు, శరీరం, మనస్సు – దృశ్యాలు. ఈ జ్ఞానాన్ని ఆత్మానాత్మ వివేకం అంటారు. నేను శరీరంద్వారా పనిచేస్తున్నాను కాని నేను శరీరాన్ని కాను. శరీరం వస్తుంది, పోతుంది; కాని నాకు రాకపోకలు లేవు. నేను నిత్యశుద్ధముక్త ఆత్మను.

దీనితో అనాత్మ, ఆత్మల గురించిన చర్చ అయిపోయింది. అంటే అర్జునుడు అడిగిన ఆరు అంశాల్లో ఐదు అంశాలను, రెండు అంశాలుగా చూసేశాము. ఇక మిగిలింది ఒక్కటే. అది జ్ఞానం.

### 3. జ్ఞానం: శ్లోకాలు 8–12

ఈ అధ్యాయంలో జ్ఞానానికి ప్రత్యేకమైన అర్థం ఉందని చూశాము. అది **విలువలు**. ఆత్మజ్ఞానం పొందటానికి మనకు కొన్ని సద్గుణాలు ఉండాలి. అవి పాటిస్తే జ్ఞానయోగ్యతా ప్రాప్తి కలుగుతుంది. అంటే ధార్మికజీవనం పాటించాలి. వేదాంతశాస్త్రంలో ధార్మికజీవనానికి చోటు ఉందా అనే ధర్మసందేహం కలుగుతుంది కొందరికి. నిజానికి విలువలను పాటించి, ధార్మికజీవనం గడిపే వ్యక్తే ఆత్మజ్ఞానాన్ని పొందగలడు అంటుంది శాస్త్రం. నైతిక విలువలు పాటించకుండా, అధార్మిక జీవనం గడిపే వ్యక్తి ఆత్మజ్ఞానాన్ని పొందవచ్చేమో కాని, దాన్ని జీర్ణించుకోలేడు. అది కేవలం జ్ఞానంగా మిగులుతుంది కాని అతని ప్రవర్తనలో మార్పు రాదు. విలువలు లేని అధ్యయనం జ్ఞానం అవదు; కేవలం సమాచారం పొందినట్టు అవుతుంది.

ఇప్పుడు నిర్ణయం మీ చేతిలో ఉంది. మీకు కేవలం సమాచారం కావాలా, మీలో పరివర్తన కావాలా? పరివర్తన కావాలంటే విలువలను పాటించాలి. ఈ విలువలను వేదాంతశాస్త్రంలో సాధనచతుష్టయసంపత్తిగా చూస్తాము. అవి వివేకం, వైరాగ్యం, ముముక్షుత్వం, శమాదిషట్కసంపత్తి. వీటినే కృష్ణపరమాత్మ ఇరవై విలువలుగా వివరించాడు. ఇక్కడ మనము ఈ సాధనచతుష్టయసంపత్తిని చూద్దాము.

1. **వివేకం** – వివేకమంటే నిత్యానిత్యవస్తువివేకం. భగవంతుడు మాత్రమే పూర్ణత్వాన్ని, భద్రతను ఇవ్వగలడని తెలుసుకోవాలి. అశాశ్వతమైన వస్తువులు శాశ్వతమైన శాంతి, భద్రత, ఆనందాలను ఇవ్వలేవు. ఈ శాంతిభద్రతలను ఒక్కటే ఇవ్వగలదు. అది నిత్యవస్తువు అయివుండాలి. ఆ నిత్యవస్తువే ఈశ్వరతత్త్వం. ప్రపంచం అద్భుతంగా ఉంది; అందంగా ఉంది; దానిని అనుభవించవచ్చు, దానితో తాత్కాలికంగా ఆనందం పొందవచ్చు, దానితో వ్యవహారం నడపవచ్చు కాని దానివల్ల శాంతి, భద్రత, పూర్ణత్వం రాదు. ఈ విచక్షణాశక్తిని వివేకం అంటారు.

2. **వైరాగ్యం** – ఎప్పుడైతే ఆత్మానాత్మవివేకం కలుగుతుందో, అప్పుడే అనాత్మమీద, అశాశ్వతమైన వస్తువులమీద వైరాగ్యం కలుగుతుంది.

3. **ముముక్షుత్వం** – ఇంతవరకూ ప్రపంచంమీద ఆధారపడ్డాము. ఇప్పుడు ప్రపంచంమీద ఆధారపడే స్థాయినుంచి భగవంతునిమీద ఆధారపడే స్థాయికి ఎదుగుతాము. అంటే దేనికి ప్రాముఖ్యతనివ్వాలో, దేనికి ఇవ్వకూడదో వివేకంద్వారా తెలుసుకుని, ప్రాపంచిక విషయాలమీద వైరాగ్యం పెంచుకున్నాక, తర్వాత దశ తీవ్రముముక్షుత్వం. ప్రపంచంనుంచి దృష్టి మరల్చి, భగవంతునిమీద తీవ్రముముక్షుత్వం పెంచుకోవాలి. ప్రపంచాన్ని ద్వేషించనవసరం లేదు; దానిమీద బంధాన్ని తగ్గించుకోవాలి.

4. **శమాదిషట్క సంపత్తి** – నాలుగో అర్హత శమాదిషట్కసంపత్తి. షట్క అంటే ఆరు విధాలు. షట్కసంపత్తి అంటే ఆరువిధాల అంతర్గత నియంత్రణ. కుటుంబాన్ని, సంస్థని లేదా దేశాన్ని మార్చేముందు, మనని మనం మార్చుకోవటం.

i) **శమం** – శమం అంటే శాంతి. తేలికగా చెప్పాలంటే మనస్సును నియంత్రణ చేసుకోవటం.

ii) **దమం** – దమం అంటే ఇంద్రియనిగ్రహం.

iii) **ఉపరమ** – బాహ్యంగా చేసే పనులను తగ్గించుకోవటం. ఆత్మవిచారణ చేసుకోవటానికి సమయం ఏర్పరచుకోవటం. విశ్రాంతిగా, ఒత్తిడి లేకుండా సాధన చేయటం.

iv) **తితిక్ష** – జీవితంలో ఎదురయ్యే సవాళ్ళను ఎదుర్కొనే మానసిక ధైర్యం. జీవితంలోని అన్నిరకాల అనుభవాలని నిర్వికారంగా భరించటం. దీన్నే స్థితప్రజ్ఞత అని కూడా అంటారు.

v) **శ్రద్ధ** – శ్రద్ధ అంటే శాస్త్రంమీద, శాస్త్రాన్ని అధ్యయనం చేయటానికి తోడ్పడే గురువుమీద నమ్మకం కలిగివుండటం. నమ్మకం అంటే గుడ్డి నమ్మకం కాదు, మనకు విషయం సరిగ్గా అర్థమయ్యేదాకా శాస్త్రం చెప్పింది అంగీకరించటానికి సిద్ధపడే మనస్సు. ముందే శంకలు పెట్టుకోకుండా, చెప్పింది చెప్పినట్టుగా స్వీకరించటం. ఇటువంటి అణకువ ఉంటే, నాకే అన్నీ తెలుసనే గర్వం ఉండదు. శాస్త్ర అధ్యయానికి జ్ఞానమదం పెద్ద అడ్డంకి.

vi) **సమాధానం** – సమాధానం అంటే ఏకాగ్రత. మీరు నిర్ణయించుకున్న లక్ష్యంమీద ఏకాగ్రత చూపటం. ఒక గంటసేపు ప్రసంగం వినాలంటే, మనసు ఆ గంటా చలించకుండా ఉండాలి.

చతుష్టయ అంటే నాలుగు. వీటినే కృష్ణపరమాత్మ ఇరవయిగా పేర్కొన్నాడు. అంటే వివరంగా చెపితే ఇరవై; కుదించి చెపితే నాలుగు. అంతే. ఇక్కడ వాటికి వాడిన పదం జ్ఞానం. ఇక్కడితో ఈ అధ్యాయంలో ప్రవేశపెట్టిన ఆరు సాంకేతిక పదాల వివరణ ముగిసింది. ఆ పదాలను మళ్ళీ ఒకసారి చూస్తే, అవి – క్షేత్రం–కేత్రజ్ఞుడు; జ్ఞానం–జ్ఞేయం; ప్రకృతి–పురుషుడు.

**6. జ్ఞాన సాధనలు, జ్ఞానఫలం: శ్లోకాలు 25–35**

కృష్ణపరమాత్మ జ్ఞానసాధనల కింద ఐదు దశలను వర్ణించాడు. అవి కర్మయోగం, ఉపాసనయోగం, శ్రవణం, మననం, నిదిధ్యాసనం.

**కర్మయోగం** – కర్మయోగం అంటే ఏమిటో వివరంగా అంతకుముందు అధ్యాయాల్లో చూశాము.

| | | |
|---|---|---|
| కర్మయోగం | = సరియైన కర్మ | + సరియైన దృక్పథం |
| సరియైన కర్మ | = సాత్త్విక కర్మలు | + పంచమహాయజ్ఞాలు |
| సరియైన దృక్పథం | = ఈశ్వరార్పణబుద్ధి | + ఈశ్వరప్రసాదబుద్ధి |

ఈ విధంగా కర్మ చేస్తే, అది మనస్సులో ఉన్న అశుద్ధాలను నిర్మూలించి చిత్తశుద్ధి కలుగజేస్తుంది. చిత్తశుద్ధినే ఇంకో విధంగా చెప్పాలంటే **మలనివృత్తి** అంటారు.

**ఉపాసనయోగం** – ఉపాసనను సగుణ ఈశ్వరధ్యానం అంటారు. ఉపాసన చెయ్యటంవల్ల బాహ్యప్రపంచంనుంచి దృష్టిని మరల్చి అంతర్ముఖులము అవుతాము. దానివల్ల చిత్త ఏకాగ్రత, చిత్తవైశాల్యత పెరుగుతుంది. ఇంకో విధంగా చెప్పాలంటే **విక్షేపనివృత్తి** అంటారు.

**శ్రవణం** – ఒక క్రమపద్ధతిలో, క్రమం తప్పకుండా, కొన్ని సంవత్సరాలపాటు, ఒక సమర్థవంతమైన గురువు వద్ద వేదాంత అధ్యయనం చెయ్యటం. ఇందులో ప్రతి అక్షరమూ ముఖ్యమే. వినగా వినగా విషయం బాగా కొరుకుడు పడుతుంది. అందువల్ల కొంతమంది కొన్ని సంవత్సరాలు విన్నాక, ఇప్పుడు మీరు బాగా బోధిస్తున్నారు అంటారు గురువును. అంటే దానర్థం, వారికి ఇప్పుడు ఆత్మజ్ఞానం బాగా అర్థమవుతున్నది అన్నమాట. మామిడిముక్క ఆవకాయలో బాగా ఊరినట్టుగా, వీరు విషయాన్ని బాగా జీర్ణించుకుంటారు. దీన్ని శ్రవణం అంటారు. దీన్నే ఇంకో విధంగా చెప్పాలంటే **అజ్ఞాననివృత్తి** అంటారు.

**మననం** – శ్రవణం చేస్తున్నంతసేపూ సందేహాలను అడగకుండా, వాటిని ఎక్కడన్నా రాసిపెట్టుకుని, వింటూ పోవాలి. కొన్ని సంవత్సరాలపాటు క్రమం తప్పకుండా వింటూవుంటే, సాధారణంగా మీకు కలిగే సందేహాలు వాటంతట అవే సమసిపోతాయి. ఉపనిషత్తే అనేక సందేహాలకు జవాబులను ఇస్తుంది. అయినా శ్రవణం అయ్యాక, ఇంకేమైనా సందేహాలు కలిగితే, ఆ సందేహాలను మననం దశలో తీర్చుకోవాలి. ఆ సందేహాలను

గురువును అడిగో, తోటి విద్యార్థిని అడిగో, మళ్ళీ శ్రవణం చేసో, మీరు రాసుకున్న నోట్సునే మళ్ళీ ఒకసారి చూసో తీర్చుకోవాలి. అలా ఏదో విధంగా సందేహాలను పారద్రోలి నిశ్చయజ్ఞానం పొందాలి. దీన్నే ఇంకో విధంగా చెప్పాలంటే **సంశయనివృత్తి** అంటారు.

**నిదిధ్యాసనం** – నిదిధ్యాసనం జ్ఞాననిష్ఠలో నిలబడటానికి తోడ్పడుతుంది. ఇన్నాళ్ళూ మీరు అజ్ఞానంలో కూరుకుపోయి ఉన్నారు. అన్నింటికన్నా పెద్ద అజ్ఞానం – నేను శరీరం అని భావించటం. దేహాభిమానం మీకు పెద్ద ఆటంకం. శరీరానికి ఏం జరిగినా, అది 'నాకే ఎందుకు జరిగింది?' అని ఒకటే బాధపడిపోతారు. దీన్నే సంసారం అంటారు.

ఈ సంసారబంధంనుంచి బయటపడాలి ముందు. 'నేను శరీరాన్ని కాదు; శరీరంద్వారా వ్యవహారం నడుపుతున్నాను అంతే అనుకోవాలి. నిద్రలో శరీరం పడుకున్నా నేను ఉన్నాను; మరణంలో నా శరీరం రాలిపోయినా, నేను ఉంటాను. అంటే నేను వచ్చిపోయే శరీరాన్ని కాదు; నేను చావుపుట్టుకలు లేని శాశ్వతమైన ఆత్మను. శరీరానికే కాదు, ఈ జగత్తుకు కూడా రాకపోకలు ఉన్నాయి. అది శాశ్వతం కాదు.' ఈ జ్ఞానం కలగటం త్వరగానే కలుగుతుంది కాని ఈ జ్ఞానంలో నిలబడటానికి సమయం పడుతుంది. అంటే బుద్ధిలో కలిగిన జ్ఞానం మనస్సులోకి దిగాలి. అంటే మీలో ఉన్న విపరీత భావనలు పోవాలి. దీన్నే ఇంకోవిధంగా చెప్పాలంటే విపర్యయ నివృత్తి అంటారు.

ఈ ఐదు సాధనలు – కర్మయోగం, ఉపాసనయోగం, శ్రవణం, మననం, నిదిధ్యాసనం – చేస్తే మీకు జ్ఞానయోగ్యతా ప్రాప్తి కలిగి, నిశ్చయజ్ఞానం కలిగి, జ్ఞాననిష్ఠగా మార్చుకోగలగుతారు.

**అహం నిత్య చైతన్యరూప ఆత్మా అస్మి**

నేను నిత్యచైతన్య ఆత్మను అనే జ్ఞాననిష్ఠలో మీరు నిలబడతారు.

**జ్ఞానఫలం** – ఇటువంటి జ్ఞాననిష్ఠలో నిలబడితే కలిగే కొన్ని ఫలాలను కూడా కృష్ణపరమాత్మ వివరించాడు.

1. **సర్వత్ర సమదర్శనం** – జ్ఞాని తన దృష్టిని అనాత్మనుంచి ఆత్మ వైపు మరలిస్తాడు. అంటే అనేక అలలను చూసే బదులు, వాటన్నిటిలోనూ సమానంగా ఉన్న నీటిని చూస్తాడు. అనేక ఆభరణాలను చూసే బదులు వాటన్నిటిలోనూ సమానంగా ఉన్న బంగారాన్ని దర్శిస్తాడు. గాజును చూసినా, గొలుసును చూసినా, ఉంగరాన్ని చూసినా అతను చూసేది ఒక్క బంగారాన్నే. అంటే స్వర్ణదర్శనం చేసుకుంటాడు. అదే విధంగా ఎవరిని చూసినా, ఏ వస్తువును చూసినా, జ్ఞాని వాటన్నిటిలోనూ సమానంగా ఉన్న ఆత్మనే గ్రహిస్తాడు. అంటే ఆత్మదర్శనం అవుతుంది అతనికి. అంటే సర్వత్ర సమదర్శనం చేస్తాడు.

2. **అమృతత్వప్రాప్తి** – అజ్ఞాని శరీరంతో మమేకం చెందుతాడు కాబట్టి మృత్యుభయం ఉంటుంది అతనికి. తను అశాశ్వతం అనుకుంటాడు. కాని జ్ఞాని తను వచ్చిపోయే శరీరం కాదు, చావుపుట్టుకలు లేని శాశ్వతమైన ఆత్మ అని అర్థం చేసుకుంటాడు కాబట్టి అతనికి మృత్యుభయం ఉండదు. అల తనను ఒక చిన్న అలగా భావిస్తే

ఏ క్షణంలో తన జీవితం అయిపోతుందో అని కృంగిపోతుంది. కాని అదే అల నేను చిన్న అలను కాను, నేను అన్ని అలలకూ, సముద్రానికీ కూడా అధిష్ఠానంగా ఉన్న నీరును అని అర్థం చేసుకుంటే, మృత్యుభయం ఉండదు. ఆ విధంగా అమృతత్వప్రాప్తి రెండవ ఫలం.

3. **అకర్తృత్వ అభోక్తృత్వం** – జ్ఞాని ఎప్పుడైతే తను ఆత్మను, శరీరం, మనస్సు కాదని తెలుసుకుంటాడో, అప్పుడే జ్ఞాని తను కర్త కాదు, భోక్త కాదు అని తెలుసుకుంటాడు. జరిగే మార్పులన్నీ శరీరానికి చెందుతాయి కాని ఆత్మయైన తనకు అంటవని తెలుసుకుంటాడు. సూర్యకాంతి అంతటా ప్రసరిస్తున్నా, ఆ కాంతికి ఏ కాలుష్యమూ అంటనట్టుగా, ఆత్మ అయిన తనకు కర్తృత్వ భోక్తృత్వాలు లేవు అని అర్థం చేసుకుంటాడు.

4. **బ్రహ్మత్వం** – అహం బ్రహ్మ అస్మి జ్ఞానం పొందిన జ్ఞాని తనే బ్రహ్మ అవుతాడు. బ్రహ్మత్వం అంటే పూర్ణత్వం పొందుతాడు. అలకు పరిమితి ఉంది కాని, నీరుగా చూస్తే అది పూర్ణం.

5. **జీవన్ముక్తి** – ఆత్మజ్ఞానం పొందిన వ్యక్తి పొందే అంతిమఫలం ఇక్కడే, ఇప్పుడే మోక్షం పొందటం. దీన్నే జీవన్ముక్తి అంటారు. తక్కిన జ్ఞానాలు పొందిన దానికన్నా, ఆత్మజ్ఞానం పొందితే జీవితం అనూహ్యంగా మారిపోతుంది. నేను పరిమితి ఉన్న జీవిని అనే బాధనుంచి బయటపడి నేను బ్రహ్మను, పూర్ణుణ్ణి, ఆనందస్వరూపుణ్ణి అని తెలుసుకుంటాడు. తెలుసుకోవటమే కాదు, ఆ నిష్ఠలో నిలబడతాడు జ్ఞాని అని బోధించాడు కృష్ణపరమాత్మ.

**క్షేత్రక్షేత్రజ్ఞయోరేవమ్ అంతరం జ్ఞానచక్షుషా ।**
**భూతప్రకృతిమోక్షం చ యే విదుర్యాంతి తే పరమ్ ॥** – 13.35

దీనితో కృష్ణపరమాత్మ ఈ అధ్యాయాన్ని ముగించాడు. ఈ అధ్యాయాన్ని క్షేత్రక్షేత్రజ్ఞవిభాగయోగము అంటారు. ఎందుకంటే కృష్ణపరమాత్మ ఇందులో క్షేత్రం అంటే ఏమిటో, క్షేత్రజ్ఞుడు అంటే ఏమిటో వివరంగా చర్చించాడు.